

ఆణిముత్యాలు
2002
కస్తూరి బెహన్


ఆణిముత్యాలు
2002
కస్తూరి బెహన్

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

K. రామదాస్ - **9440652774**

K. సుదర్శన్ - **9247805058**

సంప్రదించగలరు.

# ఆణిముత్యాలు

## 2002

కస్తూరి బెహెన్

బాబూజీ నిర్మించిన 'సహజమార్గ' అభ్యాసులు ఎందరెందరో బాబూజీ ప్రియపుత్రిక కస్తూరిజీని ఈ మధ్య దర్శించుకున్నారు. అప్పుడు అభ్యాసీల నుద్దేశించి "బాబూజీ హృదయాన్ని సహజమార్గం దృష్ట్యా" కస్తూరిజీ ఆవిష్కరిస్తూ ప్రసంగించిన వాటిలో ఆణిముత్యాలను ఏర్చికూర్చిన 'మణిహారమే' ఇది. ధరించి ధన్యులుకండి!

ఇట్లు

22.12.2002 దైవప్రేమికుల సేవాభిలాషులు

కస్తూరీ బెహెన్‌జీ ప్రసాదించిన ఈ 'ఆణిముత్యాలు' గబగబా చదివేస్తే ఆ సౌందర్యం కనపడదు. ఆ ఆనందమూ జీర్ణం కాదు. ధ్యానానికి ముందు రెండు పేజీలు, ధ్యానం చేసుకున్నాక మరో రెండు పేజీలు చదివి, మెల్లగా మననం చేసుకుంటూ, బాబూజీని హృదయంలో నిలుపుకుంటే, పూర్తి అర్థం తెలుస్తుంది. ఆనందంతో 'వారి'లో మునగడమూ జరుగుతుంది.

# అభ్యాసీగా ఎలా అవ్వవచ్చు!!!

సనాతనం, మూలం అయినట్టి రాజయోగమునే ఆధునిక మానవ సమాజానికి అనుగుణంగా మార్పుచేసి, దివ్యంగా తీర్చిదిద్దగా రూపొందినదే **సహజమార్గం.**

సహజమార్గ యోగ శిక్షణను, ప్రిసెప్టర్స్‌గా (ప్రశిక్షకులుగా) తర్ఫీదునందిన సాధకుల నుండి పొందవచ్చు. ఎవరైనా ఈ శిక్షణను పొందవచ్చు. విధి నిషేధాలు ఏమీ లేవు. ఏ రుసుము లేదు. 18 సంవత్సరాల వయస్సు ఉన్న వారెవరైనా సాధన ప్రారంభించవచ్చు. ఆధ్యాత్మికంగా ఉన్నతి పొందాలనే ఇచ్ఛ, భగవత్ సాక్షాత్కార సిద్ధి చెందాలనే గాఢవాంఛ, ఆర్తి, తపన ఉన్నటువంటి వారెవరైనా ఇందులో ప్రవేశించి సాధనకు ఉపక్రమించే ఇష్టతే – ప్రవేశార్హత.

సాధన మొదలుపెట్టడానికి మొదటగా ప్రిసెప్టర్ వద్ద నుండి వరుసగా మూడు పరిచయ సిట్టింగ్స్ (అంటే మూడుసార్లు ధ్యాన ప్రక్రియకు నాందీ దీక్ష) తీసుకోవాలి. ఇది ధ్యానానికి ప్రారంభం అవుతుంది. ఇంక రోజూ సోదర అభ్యాసులతోపాటు ధ్యాన సాధనను ప్రిసెప్టర్ ఇచ్చిన సూచనలను అనుసరిస్తూ సాగించవచ్చు.

'బాబూజీ' అని ప్రేమగా పిలుచుకునే శ్రీ రామచంద్రజీ మహరాజ్, షాజహాన్‌పూర్ వాస్తవ్యులు. తమ గురుదేవులు శ్రీ రామచంద్రజీ (ఫతేఘర్) దివ్యస్మృతిగా శ్రీరామచంద్ర మిషన్ 1945వ సంవత్సరంలో స్థాపించారు.

శ్రీ బాబూజీ మహరాజ్ దివ్య ప్రాణాహుతి (డివైన్ ట్రాన్స్‌మిషన్)తో ఆత్మోన్నతి సాధించాలనే సకల జనావళికి 'వారి' ఆ దివ్య ప్రయత్నంలో సహకరించటానికి బాబూజీ కృపతో ప్రిసెప్టర్లు అందరూ సర్వదా సద్ధంగా ఉంటారు.

**మీ తపనే ఇందుకు ప్రవేశద్వారం**

**దైవప్రేమికుల నందరినీ 'సహజమార్గం' ఆహ్వానిస్తోంది.**

# ఆణిముత్యాలు - 2002

## సోదరి కస్తూరిగారి ప్రవచనాలు

ఏదైనా పని ప్రారంభించేటప్పుడు బాబూజీ మహరాజ్‌ని జ్ఞాపకం చేసుకోవటమనేది ఒక ఆలోచన, ఒక తలంపులాగా కలిగినట్లయితే, మరో ఆలోచన వచ్చినప్పుడు ఈ ఆలోచన తొలగిపోతుంది. అందుచేత జ్ఞాపకం చేసుకోవటమనేటట్లుగా కాకుండా స్మరణ (రిమెంబరెన్స్)లో ఉంచుకొన్నట్లుగానే అనుభూతి చెందాలి. వారిని స్మరించుకుంటున్న సందర్భంలో హృదయంలో 'వారి'పట్ల ప్రేమ పెల్లుబకాలి (ఉప్పొంగాలి). ఆ విధంగా స్మరణ కలిగి ఉంటే దివ్యశక్తి (డివైన్ పవర్)తో మనకు ఉన్న సంబంధం తెగిపోదు, డిస్‌కనెక్ట్ కాదు. మీరు బాబూజీ మహరాజ్‌కు సమర్పితమైపోతే అనుబంధం ఎన్నటికీ తెగిపోవటమనేది జరగదు. అలా కాకుండా మనం బాబూజీని మర్చిపోయామని అనుకున్నట్లయితే సంబంధం త్రెంచుకున్నవారమే అవుతాం. అలా ఇంకా ఎక్కువ కాలం 'వారి' స్మరణలో లేనట్లయితే, మనం వారికి, సంస్థకు కూడా దూరంగా జరిగిపోతున్నట్లవుతుంది. మీరు ఒకసారి బాబూజీ మహరాజ్‌కు సమర్పితమైపోవటమంటూ జరిగితే మీరు వెనుదిరిగిపోలేరు. 'వారు' ఇచ్చేది మీరు స్వీకరించగలుగుతారు. సహజమార్గ సిస్టమ్‌లోగాని, బాబూజీ ద్వారాగాని ఎవ్వరినీ తొలగించటమంటూ ఉండదు. అలా వైదొలగటమంటే అది అభ్యాసీ స్వయంకృతమే. అందుకు అతని (నెగెటివ్ థింకింగ్) ప్రతికూల భావనయే కారణం కావచ్చు. బాబూజీ ఒక దివ్యత్వానికి సంబంధించిన మిషన్‌కు అధ్యక్షులు. 'వారు' ఇస్తారేకాని తిరస్కరించరు. మన మిషన్ దివ్యత్వానికి సంబంధించినది కనుక దైవ కృప, శక్తి ఎప్పుడూ ప్రసారమవుతూనే ఉంటాయి. అందుచేత తానేమీ పొందటంలేదు అని ఎవ్వరూ అనలేరు. ఏ ప్రిసెప్టరైనా తాను ప్రిసెప్టర్ కాదు అని అనుమానించినా, అసంతృప్తి చెందినా ఆ దివ్యశక్తితో బంధం తెగిపోతుంది. మనం ఎవరికైనా బహుమతిని ఇస్తే, దాన్ని ఎవరైనా తీసుకోవచ్చు. కాని దైవం ఒకరికి ఇచ్చిన బహుమతిని మరొకరు తీసుకోలేరు. ఆధ్యాత్మిక బోధకుడు ఏ ఒక్కరినైనా దైవంతో సంబంధం కలిగించవచ్చునుగాని ఆ దివ్య శక్తిని పొందకుండా అడ్డుపడటం అతనికి సాధ్యం కాదు. ఇంకా చెప్పాలంటే, నేను కూడా ఆ దైవంతో కలపగలనే కాని విడదేయలేను. ఆ దివ్యత్వ విధానం ఇలాగే కొనసాగుతోంది.

నేను సోదరుడు చారిగారి వద్దకు వెళ్ళినప్పుడు, ప్రిసెప్టర్స్ యొక్క శక్తిని తాను తీసివేశాను అనటం జరిగింది. అప్పుడు నేను "ఆ శక్తి అనే దాన్ని ఇతరులకు పంచటానికే ఇవ్వబడింది మీకు. అది ఒక సంస్థకు చెందినది, అనగా శ్రీరామచంద్ర మిషన్‌కు సంబంధించినది. దానిని తొలగించటం ఎవ్వరికీ సాధ్యంకాని పని" అని చెప్పటం జరిగింది. ఇది ఒక ఆధ్యాత్మిక సంస్థ, ఇది సహజమార్గ విధానం కనుక ఇందులో ఏ బోధకుడు (Teacher) కూడా మీకు వచ్చే శక్తిని అడ్డుకోలేడు. ఒకసారి ఇవ్వబడిన దివ్యకానుకను వెనక్కు తీసుకోవటం జరగదు. సృజనాత్మకమైనదే భగవంతుని బహుమానం. బాబూజీ మహరాజ్ మీద, దివ్యశక్తి మీద, ఆధ్యాత్మిక సంస్థ మీద విశ్వాసం ఉండాలేకాని ఇంక ఎటువంటి వాటికి వెరవకూడదు. కనుక ఎవరైనా మిషన్ నుంచి తొలగింపబడ్డారని చెప్పటం సరియైనది కాదు. బాబూజీ మహరాజ్ దివి నుంచి భువికి (అనంతం నుండి అవని తలం మీదకు) దిగి వచ్చింది మనందరికీ దివ్యశక్తి నిచ్చి పైకి తీసుకువెళ్ళటానికే గాని ఆ శక్తి నుంచి తప్పించటానికి కాదు.

దివ్యత్వం పొందాలంటే భక్తి, విశ్వాసాలు అనేవి రెండు ముఖ్యమైన విషయాలు. వీటి ప్రతిఫలం విజయవాడ సెంటర్‌కు దక్కిందని నేను ప్రతిసారి చెప్తూ ఉంటాను. దీనిని బాబూజీ నుంచి ఎవ్వరైనా పొందవచ్చు. కాని ఆ దివ్యఫలాన్ని పొందటానికి మీరు కృషి చేయాలి. నిజంగా మీరు స్వచ్ఛమైన అభ్యాసీగా నిశ్చయించుకోగలిగితే మన మిషన్ నుంచి మిమ్మల్ని ఎవరూ వెలివేయలేరు. మన మిషన్‌లో ఉన్న మరొక విశేషం ఏమిటంటే, మీరెవరైనా ఉన్నత స్థాయికి వెళ్ళినట్లుగాని, మంచి స్థితిని పొందినట్లుగాని అనుభూతి చెందినప్పుడు, అటువంటి మంచి స్థితిని తోటిఅభ్యాసులకు కూడా కల్పించమని బాబూజీని వేడుకున్నట్లయితే ఆ సంకల్పం దివ్యతలాన్ని తాకి అనగా బాబూజీని స్పందింపజేసి అందరికీ అటువంటి ఉన్నతి ప్రసాదించబడుతుంది. ఇటువంటిది ఏ మిషన్‌లోనైనా జరుగుతుందా అంటే, అది శ్రీరామచంద్ర మిషన్‌లో మాత్రమే.

అమెరికాలో సిస్టర్ లూసీ అనే ఆమె ఉంది. ఆమె దివ్యప్రేమకు ప్రతిరూపమని అనిపిస్తుంది. ప్రతి సంవత్సరం ఆమె ఇక్కడకు వస్తూ ఉంటుంది. అలాగే డెన్మార్క్ నుండి కూడా అభ్యాసులు వస్తూ ఉంటారు. వారంతా బాబూజీపట్ల భక్తి, విశ్వాసాలు కలిగి ఉంటున్నారు. కనుక వారికి బాబూజీ పురోగతి కలిగిస్తున్నారు. ఎవరైనా అమెరికాలో ఉన్నారా, ఇండియాలో ఉన్నరా అనేది ప్రశ్నకాదు. ప్రాంతం వేరు కావచ్చునేమో కాని ఆ దివ్య వాతావరణం అంతటా ఒక్కటే. మీకు ఎప్పుడు కోరిక కలిగితే అపుడు, మీరు సిట్టింగ్‌లో కూర్చున్న ప్రతిరోజు, ప్రతిసారీ కూడా, మీకు బాబూజీ మహరాజ్ నుంచి శక్తి వస్తూనే ఉంటుంది.

**ప్రశ్న: బెహెన్‌జీ! బాబూజీ మీ తల్లిగార్కి “మీ కస్తూరీ చనిపోయింది, నా కస్తూరీ మాత్రమే ఇక్కడ మిగిలి ఉంది” అని వ్రాశారు కదా! దానిని వివరించండి.**

**జవాబు:** బాబూజీ మహరాజ్ చెప్పారు –ఆత్మ ప్రవేశించినపుడే శరీర రూపంలో ఉంటుంది. ఈ జీవితం జీవించటమంటే ఏమిటో కాదు. అది స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలకు చెందినది. స్థూల శరీరం విడిచిపెట్టాక సూక్ష్మ మరియు కారణ శరీరాలు కరిగి తేలికైపోతాయి. ఆ రెండింటి రూపమే ఆత్మ. అప్పుడు ఆత్మ వెళ్ళి పరమాత్మలో లయమవుతుంది. అప్పుడు నీవు ఆత్మను కనుగొనాలనుకున్నా, అది పరమాత్మలో లయమైపోయింది కనుక దానిని కనుగొనలేవు. స్థూల శరీరం మాత్రమే ఇక్కడ ఉంటుంది.

ఒకసారి బాబూజీ మహరాజ్ మా తల్లిగార్కి ఒక వాక్యం వ్రాశారు. అది ఏమిటంటే –“మీ కస్తూరీ చనిపోయింది, నా కస్తూరీ మాత్రమే ఇక్కడ మిగిలి ఉంది” అని. ఆ వాక్యానికి అర్థం ఏమిటో నాకు అప్పుడు తెలియలేదు. దాని అర్థం నాకు తరువాత తెలిసింది. ఆత్మ పరమాత్మలో లయమైపోయాక ఇక్కడ స్థూల శరీరం మాత్రమే ఉంటుంది. ఆత్మ అనగా సూక్ష్మ మరియు కారణ శరీరాలు మాత్రమే. అవి దశలవారిగా కరిగిపోయి చివరికి ఆత్మ పరమాత్మలో లయమైపోతుంది. అనగా స్థూల శరీరం ఉంటుంది కనుక, బ్రతికి ఉండి కూడా చనిపోయినట్లు అనుకోవాలి. కస్తూరీ ఇక్కడ ఉందనుకున్నా అది శరీరమే కాని ఆత్మ కాదు. నా తల్లిదండ్రులు ఎప్పుడైనా గుర్తుకువస్తే వాళ్ళు ఇక్కడ ఉన్నారా అని అనిపించేది. నా ఆత్మ లయమైపోవటం వలన అలా అనిపించేది. ఇటువంటి అనుభవం నాకు చాలాసార్లు కలిగింది.

నేను ఏ విషయమైనా, ఎవరికైనా వ్రాస్తున్నప్పుడు నేను బాబూజీ మహరాజ్‌కు వ్రాస్తున్నట్లుగా అనిపించేది. డాక్టర్ గార్కి వ్రాస్తున్నప్పుడు కూడా అలాగే అనిపించేది. నేను వ్రాయబూను కున్నప్పుడు

బాబూజీయే అందులో ఉన్నట్లుగా అనిపించేది. అంతా వారికే కనెక్ట్ అయి ఉన్నట్లుగా ఉండేది. నీవు విదేశంలో ఉన్నా, ఇండియాలో ఉన్నా బాబూజీ మహరాజ్ నీతోనే ఉన్నట్లు అనిపించటం లేదా! కనుక నీవు ఎక్కడ ఉన్నా బాబూజీ మహరాజ్ నీతోనే ఉంటారు. మీరు బాబూజీ మహరాజ్ ఎదుట సిట్టింగ్‌లో కూర్చున్నట్లుగా భావించుకొని 'వారి'ని మీ స్మరణలో నిలుపుకోండి.

ఒకసారి ఒక అభ్యాసీ నన్ను –"మీరు బాబూజీని దైవం అని ఎలా చెప్పగలరు?" అని అడిగాడు. దానికి సమాధానంగా నేను, "దైవం అని తలచుకొన్నప్పుడు బాబూజీ కనిపిస్తారు కనుక" అని అన్నాను.

ధ్యానంలో కూర్చున్నప్పుడు (డివైన్) దైవం హృదయంలో ఉన్నాడని భావించి నీ దృష్టి (ధ్యాస) నిలుపుకుంటే అదే మనల్ని దైవానికి అనుసంధానం చేస్తుంది. అప్పుడు బాబూజీ యొక్క ఉనికి అనుభవానికి వస్తుంది.

**ప్రశ్న: పార్షద్, మహాపార్షద్ అంటే ఏమిటి?**

**జవాబు:** పార్షద్ అనగా తురీయావస్థ. ఆత్మ సత్యపద్ చేరబోయే ముందు వేచి ఉన్న స్థితి, ఈ పార్షద్. మహాపార్షద్ అంటే సప్తవలయాల ద్వారం ముందు వేచి ఉన్న స్థితి, తురీయాతీత స్థితి. సెంట్రల్ రీజియన్ అనేది భూమా యొక్క వైభవ ప్రాంతం; అనగా అది భూమా యొక్క ద్వారం.

ధ్యానం (మెడిటేషన్) అనగా వేచి ఉండటం. ధ్యానంలో ఉండబోయే ముందు మీరు ధ్యానంలో ఉండబోతున్నట్లుగాను, అక్కడ బాబూజీ ఉన్నట్లుగాను భావించుకోవాలి. ఏవైనా ఆలోచనలు వచ్చినప్పుడు, నేను బాబూజీ మహరాజ్‌తో ఉన్నాను, 'వారు' నా ఎదుటనే ఉన్నారు అని అనుకోవాలేగాని, మీ మనస్సుతో ఆ ఆలోచనల్ని అణచివేయటానికి (కంట్రోల్‌కు) పూనుకోకూడదు. నీవు 'వారి' ఎదుటనే ఉన్నట్లు అనుకుంటూ దృష్టిని ధ్యానం మీదనే నిలిపి ఉంచాలి. అంతేకాని నేను ధ్యానంలో కూర్చున్నాను లేదా చేస్తున్నానని మళ్ళీ మళ్ళీ తలచుకోకూడదు. సూటిగా చెప్పాలంటే, నీవు బాబూజీతో ఉన్నట్లుగా అనుభూతి చెందుతూ, దృఢ సంకల్పంతో ఉండాలి. ఆలోచనల్ని అణచిపెట్టటం కూడా అసహజమే అవుతుంది. వాటివలన ఇబ్బందికరంగా అనిపించినట్లయితే, నీ హృదయం (శరీరం) పూర్తిగా బాబూజీ కొరకే తెరచి ఉంచబడింది అని భావించుకోవాలి. అది సహజంగా హృదయమే అయినా సంపూర్ణ శరీరమే అవుతుంది. నీవు 'వారి'ని జ్ఞాపకం చేసుకుని కూర్చుంటే, సిస్టమ్ (శరీర వ్యవస్థ) అంతా దైవంతో సంధానం చేయబడుతుంది. అపుడు హృదయం అనిగాని, దివ్య ప్రకాశం అనిగాని అనుకోకుండా అది అంతా బాబూజీ మహరాజ్ మాత్రమే అని తలంచాలి.

మెడిటేషన్ (ధ్యానం) అనగా 'Waiting' అనగా దేనికోసమో వేచి ఉండటం. బాబూజీ చెప్పారు– నేను ఒకసారి (డివైన్) దైవం అక్కడ ఉన్నాడని అనుకొనమని చెప్పాను. కనుక (డివైన్) దైవం అక్కడ ఉన్నాడు. నీ దృష్టి దాని మీదనే లగ్నమైనప్పుడు మనస్సును కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉండదు. నీవు ఏదో చేస్తున్నావు అని అనుకుంటే ఆ ఆలోచనలు వస్తాయి. బాబూజీ మహరాజ్ అక్కడ ఉన్నారని తలిస్తే నీవు దైవంతో కనక్ట్ (సంధానం) అవుతావు. దినచర్యలో ఏ పని చేస్తున్నప్పటికీ బాబూజీ పనే చేస్తున్నాను అని అనుకుంటే నీవు 'వారి'తో వేరుగావు. బాబూజీ యొక్క కాంతిలోనే కాంతి ఉంది. నీవు ఇక్కడ ఉన్నావు అనుకుంటే, ఇక్కడే ఉంటావు. కాని నీవు బాబూజీ వద్ద ఉన్నాను అనుకుంటే 'వారి'వద్ద ఉంటావు. ఇలా చేయటం చాలా తేలిక. ఆ విధంగా ధ్యానంలో లోతుగా ఉండటం జరిగితే ఏదో పొందుతూనే ఉన్నావన్నమాట.

చాలామంది ప్రిసెప్టర్లు ఎందుకో బాగా భయపడుతూ ఉంటారు. వారు అలా ఎందుకు భయపడాలి. నా దగ్గరకు వచ్చినప్పుడు– మీరు మా సిస్టర్ అని అంటూ ఉంటారు. కాని గేటు దాటుతూనే మరొకర్ని (చారీజీని) తలుస్తూ ఉంటారు. రావణాసురుణ్ని తలిస్తే భయపడినట్లుగా భీతితో ఉంటారు. అతడు రామచంద్ర మిషన్ యొక్క మేనేజర్ మాత్రమే కాని ఆయన మాస్టర్ కాదు. మాస్టర్ అనగా శక్తి (పవర్)ని ఇచ్చేవారే మాస్టర్. బాబూజీతో సంబంధం కలిగి ఉండటం అభ్యాసీ కర్తవ్యం కూడా. కనుక భగవంతుని చేరటానికి మన ప్రయత్నం కూడా ఉండాలి. వారితో సహకరిస్తే ఉన్నత దశలు పొందుతాము. బాబూజీ మహరాజ్ ఈ శకంలో అవతరించిన శక్తి సంపూర్ణుడు. వారివలన మనం ఎంతైనా పొందవచ్చు. బాబూజీ నన్ను ప్రిసెప్టర్‌గా చేశారు. వారిదే శక్తి. ఒకసారి బాబూజీతో సందర్భవశాత్తు –"మీ అనుగ్రహంతో మీరిచ్చిన శక్తిపై ఆధిపత్యం పొందానని నేను చెప్పగలను" అని అన్నాను. కనుక పవర్‌ని, శక్తిని ఇస్తున్నది వారే. మరెవరూ కాదు. ఒకసారి నన్ను మద్రాసు వచ్చి బాబూజీ యొక్క స్మారక భవనాన్ని చూసి వారిని స్మరించవచ్చునని ఆయన నాకు లేఖ వ్రాశారు. అందుకు సమాధానంగా నేను –బాబూజీ నాతోనే ఉండగా మరి అక్కడకు రావలసిన పనేముంది– అని చెప్పాను. నేను మద్రాస్ వెళ్ళినప్పుడు వారితో ఇలా అన్నాను –"బాబూజీ ఈ ఉన్నతమైన స్మారక మందిరంలోనే లేరు. వారు అంతటా ఉన్నారు. మీకు పెద్ద భవంతి మీద ఉన్న అభిలాష బాబూజీ కనెక్షన్‌తో లేదు. మిషన్ యొక్క ఆదర్శాలు లేకపోతే ఈ భవనం ఎందుకు? దైవంతో సంబంధం కలిగించే ఆశయమే ఉండాలి. పవర్ ఇస్తున్నది వారే కాని మీరు కాదు" అని అన్నాను. బాబూజీ మహరాజ్‌ను మళ్ళీ మీ ముఖవర్చస్సులో చూసే రోజుకొరకు నేను నిరీక్షిస్తూ ఉంటాను అని చెప్పాను. భయమనేది ఉండకూడదు. భయపడితే ఎవరకి వారు బాధపడాల్సి ఉంటుంది. బాబూజీతో వేరుపడిపోయిన వారు భయపడతారు.

బాబూజీ ఒకసారి నేను అభ్యాసీకి ప్రాణాహుతి ఇవ్వటం గమనించారు. నేను ఆ సందర్భంలో అత్యంత శక్తికి నిలయమైన బాబూజీ ఆత్మ ఉన్నంత స్థాయి వరకు చేరటానికి ప్రయత్నించాను. "ఆ స్థితిలో నా ముఖం చూశావా!" అని బాబూజీ అడిగారు. వారి కన్నుల ద్వారా చూడగల్గానని చెప్పాను. అప్పుడు బాబూజీ అన్నారు– "దాని అర్థం నీవు 'సహజమార్గం' చూడగల్గావని, ఆధ్యాత్మికంగా నీవు పురోగమిస్తున్నావని భావం" అన్నారు. ఇదే సహజమార్గం. ఇందులో ప్రతిదానికీ ప్రయోగాత్మకమైన అర్థం ఉంటుంది. ఎవరైనా ఏకాంతంగా కూర్చుని తదేకంగా ధ్యానం చేసినట్లయితే ఆ స్థితిని తాకుతారు. వారు బాబూజీ కళ్ళు తమవైపు ఉన్నట్లు అనుభూతి చెందటమే కాకుండా ఎటువంటి ఆలోచనా లేనివారై ఎక్కడికో దూరతీరాలకు పోతున్నట్లు అనుభూతి చెందుతారు. అలా ఎందుకు అంటే, దివ్యశక్తికి వారే మాస్టర్ కనుక –ఆ స్థితి యొక్క అనుభూతి కలుగుతుంది.

**కోరిక: బెహెన్‌జీ! మీ ఆశీర్వాదంతో మేము కూడా మంచి అభ్యాసులుగా తయారుకావాలని కోరుకుంటున్నాము.**

మీరు ఎప్పుడు తలచుకుంటే అప్పుడు 'వారు' మీతోనే ఉంటారు. మీకు ప్రాణాహుతి వస్తుంది. బాబూజీ చెప్పారు– దైవంతో ఉన్నట్లుగానే భావించుకోండి. 24 గంటలూ ట్రాన్స్‌మిషన్ వస్తూనే ఉంటుంది. దాన్ని మీరు గ్రహించగల్గినా, గ్రహించలేకపోయినా ట్రాన్స్‌మిషన్ వస్తూనే ఉంటుంది. అందుచేత మీరు బాబూజీ మహరాజ్‌తో ఉండటానికి తయారుకావాలి. "నేను సమస్త మానవాళికి సమర్పితమై ఉన్నాను"

అని బాబూజీ చెప్పారు. అనగా మీరు 'వారి'ని స్మరించినంతనే 'వారి' నుంచి శక్తిని పొందుతారు. 'వారు' అటువంటి మహాపురుషులు. మన ఈ విధానం చాలా అందుబాటులో ఉన్నది, ప్రియమైనది, ప్రేమైకమైనది. ఇప్పుడు మనం ఆధ్యాత్మికతలో సంపన్నులంగానే ఉన్నాం. అత్యంత ఆధ్యాత్మిక సంపన్నులైన వారిని ఆశ్రయించిన వారెవ్వరైనా దీనులుగా ఉండబోరు.

ఒక అభ్యాసీ తాను బాబూజీకి దూరంగా ఉండిపోయాను అనుకుంటే ఫలితం ఏమిటి? అలా కాకుండా వారిని స్మరణలో ఉంచుకుంటే ఎలా ఉంటుంది! ఒక అభ్యాసీ తనకు ట్రాన్స్‌మిషన్ రావటంలేదు అన్నప్పుడు, "బహుశా నీవు మర్చిపోయి ఉంటావు (జ్ఞాపకం ఉంచుకోకుండా ఉంటావు) కాని నేను నిన్ను జ్ఞాపకం ఉంచుకున్నాను" అన్నారు బాబూజీ.

**ప్రశ్న: మనం దివ్యస్థితిని పొందాలంటే బాబూజీని స్మరిస్తే సరిపోతుందా లేక మనం ఆ స్థితి కొరకు ఎందురుచూస్తూ ఉండాలా?**

**జవాబు:** బాబూజీని (రిమెంబ్రన్స్) స్మరణలో నిలుపుకోవాలి. నీ దృష్టిని అటువైపే నిలపాలి. నీవు నిన్ను మరచిపోయి 'వారి'నే జ్ఞాపకంలో ఉంచుకుంటే పొందవలసింది పొందుతావు. ఆధ్యాత్మిక గ్రంథాల్లో –నిన్ను నీవు మరచిపో అని వ్రాసి ఉంది. కాని అలా జరగనందువలన ఋషులు కూడా ఆ స్థితిని పొందలేకపోయారు. అలా 'నేను' గురించి మరచిపోయి వారిపైనే ధ్యాస నిలిపి వారిలోనే జీవించినట్లయితే నీవు బాబూజీ యొక్క పవిత్ర పాదపద్మాలవద్ద ఉన్నట్లుగా భావించినట్లయితే నీకు దివ్యస్థితి ఇక్కడ ఉన్నా, విదేశంలో ఉన్నా వస్తుంది. బాబూజీ యొక్క దివ్యశక్తి ప్రపంచమంతటి వాతావరణంలో వ్యాపించి ఉంది. కన్నులు మూసుకొని నిన్ను నీవు మరచిపోయి, నీ శరీరం యొక్క ఆలోచన (తలంపు) లేకుండా ఉంటే నీవు బాబూజీతో సంబంధం కలిగి 'వారి'లో లయమైపోతావు.

సామీప్యత, సారూప్యత, సాలోక్యత మరియు సాయుజ్యత అనే స్థితులను ఎలా పొందాలో ఎవరికీ తెలియదు. నీవు నీ హృదయాన్ని పూర్తిగా తెరచి ఉంచి, 'వారి' రూపాన్ని కాకుండా 'వారి'ని మాత్రమే స్మరణలో ఉంచుకోవాలి. భక్త మీరా యొక్క స్థితి ఇటువంటిదే. ఆమె శ్రీకృష్ణుని మదిలో నిలుపుకొని, నిన్నుతప్ప మరెవ్వరినీ చూడలేకపోతున్నాను అని చెప్పింది. అదే విధంగా కబీర్ స్థితి కూడా. బాహ్యేంద్రియాల స్మృతిని వదిలేసి అదే కండిషన్ (స్థితి)లో ఉంటూ, నేను నీవాడను, నీవు ఇక్కడే ఉన్నావు అనుకున్నట్లయితే నీవు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి, అలాగే ఆత్మ సాక్షాత్కార స్థితికి చేరటం జరుగుతుంది. ఆ స్థితిలోనే మునిగి ఉండాలి. అక్కడ ఉండేది ఇద్దరే అనగా నీవు, బాబూజీ మాత్రమే.

**ప్రశ్న: నేను కొన్ని ఇతర ప్రదేశాలకు వెళ్ళినప్పుడు, వాతావరణం అంతా పవిత్రంగా ఉన్నట్లు తోస్తుంది. అందుకు కారణం ఏమిటి?**

**జవాబు:** నీలో పవిత్రత నెలకొని ఉన్నప్పుడు నీవు ఉన్న వాతావరణం పవిత్రంగా, నీకు మాత్రమే కాకుండా, అక్కడ ఉన్న వారికి కూడా అటువంటి అనుభూతియే కలుగుతుంది.

మీరు బాబూజీ మహరాజ్‌లో కలిసి జీవించటానికి మాత్రమే ప్రయత్నించండి. ఆలోచనలు వస్తే వాటివైపు మీ దృష్టి మరల్చవద్దు. అప్పుడు ఉన్నదల్లా ఇద్దరే, అనగా బాబూజీ మరియు మీరు. అటువంటప్పుడు

మీకేమీ తెలియకపోయినా ఆత్మ ప్రయాణిస్తూ బాబూజీని చేరుతుంది. 'నేను' అనే తలంపు వచ్చినట్లయితే, వెంటనే 'నేనే' అనుకొని క్రిందికి దిగి రాకుండా, "నేను బాబూజీ మహరాజ్‌లో ఉన్నాను" అని అనుకోవాలి.

**అభ్యాసీ: నాకు ఆరోగ్యలోపం ఉన్నందువలన అలసిపోయినట్లు ఫీల్ అవుతున్నాను.**

**బెహెన్‌జీ:** ఆ విధంగా ఫీల్ అయినపుడు కొంతసేపు సాఫీగా పండుకొని ఉంటే అశక్తత తగ్గి మళ్ళీ శక్తి వస్తుంది. అప్పుడు మళ్ళీ పని చేయగలగటం జరుగుతుంది. అలసటతగ్గి ఉపశమనం కలుగుతుంది. నేను కూడా గంటల తరబడి సిట్టింగ్స్ ఇచ్చినప్పుడు అలసట ఫీలవుతాను. అప్పుడు కొంతసేపు విశ్రాంతి తీసుకొని మళ్ళీ పని ప్రారంభిస్తాను. ఏదైనా సమస్యను గురించి ఎక్కువగా ఆలోచించినప్పుడు అలసట కలుగుతుంది. అలాంటి సందర్భంలో ధ్యానంలో కూర్చుని బాబూజీని ప్రార్థించటం జరిగితే అలసట / బాధ ఉపశమింపబడినట్లు అనిపిస్తుంది. భౌతిక ప్రపంచంలో జీవిస్తున్నాం కనుక సమస్యలంటూ ఉంటాయి. ఆలోచనలు భంగపరుస్తాయి. వాటిని నివారించటానికి ప్రయత్నించాలి. అపుడు బాబూజీతోనే నీవు ఉన్నావని, బాబూజీ నీతోనే ఉన్నారనే భావనలో ఉంటే ఆ మానసిక ఒత్తిడి ఉండదు.

**ప్రశ్న: నేను మిషన్‌లో చేరినపుడు, చాలా గాఢంగా స్పృహలేనట్లుగాను, తేలికగాను అనుభూతి చెందేవాడను. కొన్నిసార్లు కాంతివంతంగాను, కొన్నిసార్లు ఏవో కొన్ని అనుభూతులు వచ్చేవి. ప్రస్తుతం అటువంటి అనుభూతులు అంతగా రావటంలేదు. కనుక కండిషన్ ఆగిపోయినట్లా?**

**జవాబు:** అటువంటిదేమీ కాదు. ఒకసారి శక్తి అంటూ ఇవ్వబడిన తరువాత, నీకు తెలిసినా, తెలియకపోయినా ఆగటమంటూ జరగదు. నీకు ఇవ్వబడిన ఆ దివ్యశక్తి మీద ఆధారపడకుండా, నీకు నీవు 'స్వయం'గా సాధనచేస్తే అది ఆగిపోవచ్చు. కాని దివ్యశక్తి ఇవ్వబడిన తర్వాత నిలిచిపోవటమంటూ జరగదు. దైవంలో లోతుగా మునిగి పోవటానికి ప్రయత్నించాలి. అలా జరిగితే ఆత్మ లయమై, లీనమైపోవటం జరుగుతుంది. ప్రతిసారీ ప్రాణాహుతి లభిస్తూనే ఉంటుంది.

**ప్రశ్న: సిట్టింగ్‌లో ఉండగా ఒక్కొక్కసారి మెదడును కుదుపివేసినట్లు ఉంటుంది. అది శారీరిక లోపమా?**

**జవాబు:** అది శారీరక లోపం కాదు. అది డివైన్ పవర్. అలా ఎక్కువగా ఉన్నప్పుడు ఒక నిమిషంసేపు కళ్ళు తెరచి ఉంచి మళ్ళీ ధ్యానంలో కూర్చోవచ్చు.

**ప్రశ్న: ధ్యాన సమయంలో అపుడపుడు వెన్నుపూసల్లోను, మెదడులోను ఏదో స్పందించినట్లు ఉంటుంది. అది ఏమంటారు.**

**జవాబు:** పాయింట్లు తెరవబడినపుడు అలాంటి అనుభవం కలుగుతంది.

డెన్మార్క్ నుంచి వచ్చిన ఒక సీనియర్ మరియు స్వచ్ఛమైన నిజమైన అభ్యాసీ, బాబూజీతోపాటు భోజనం చేస్తున్న సమయంలో తనకు ఆగ్రాలోని తాజమహల్ చూడాలని కోరికగా ఉంది –అన్నాడు. దానికి బాబూజీ స్పందించి –నీవు ధ్యానం కొరకు వచ్చావా లేక తాజ్‌మహల్ చూడ్డానికి వచ్చావా, అని ప్రశ్నించారు. ఆ అభ్యాసీ అపుడేమీ మాట్లాడలేదు. సిట్టింగ్స్ అయిపోయిన తర్వాత మూడు రోజులు గడిచాక ఆ అభ్యాసీని నీకింకా తాజ్‌మహల్ చూడాలని ఉందా, అని బాబూజీ అడిగారు. దానికి అతడు, కోరికలేదని చెప్పాడు. అతడు ఎక్కడికి వెళ్ళినా దివ్యశక్తిని ప్రసరించేటటువంటి మంచి అభ్యాసీ కూడా.

కొన్ని సందర్భాలలో మీరు నివసిస్తున్న వాతావరణంలో దివ్యత్వం వ్యాపించి ఉన్నట్లు మీరు తెలుసుకోగలుగుతారు. "నేను ఈ యుగాన్ని మార్చటానికి దిగివచ్చాను" అన్నారు బాబూజీ. అనగా సత్యయుగంగా మార్చటం 'వారి' ఉద్దేశ్యం. సత్ అనగా దైవం, యుగం అనగా కాలం, అనగా అది దివ్య యుగం. అందరూ దైవాన్ని ఆరాధించేవారు. అందరూ దివ్యశక్తితో సంధానం కాబడి ఉండేవారు. కనుక తప్పు చేయరు. దైవ చింతనతో మసలుకునే కాలం కనుక, సత్‌యుగం అనగా సత్యయుగం అవుతుంది. అనగా వాతావరణమంతటా దివ్యత్వం పెరిగి ఒక రోజున అందరూ దివ్యభావనలతో దివ్యమైన తలంపుతో ఉండటం జరుగుతుంది. కనుక ఎప్పుడో ఒకప్పుడు అలా సత్యయుగంగా అవ్వడం జరుగుతుంది. బాబూజీ అందుకే అవతరించారు కనుక అలా జరిగి తీరుతుంది.

"లివింగ్ మాస్టర్" ఉండాలి అనుకుంటే అది సరైనది కాదు. బాబూజీ వ్రాసిన మాటలన్నీ ఆచరణాత్మకమైనవి. మనం బాబూజీ (మాస్టర్)లో జీవిస్తున్నట్లు ఫీలయితే అది "లివ్ ఇన్ మాస్టర్" అనగా మాస్టర్‌లో జీవించటమవుతుంది. దానినే "లివింగ్ మాస్టర్" అనగా జీవించి ఉన్న మాస్టర్‌గా భావిస్తున్నారు. బాబూజీ ఇటువంటి విషయాలు స్పష్టంగా చెప్పారు. వీరు అర్థం చేసుకోవటంలేదు.

స్థూలత్వం అనగా 'అహం' అనగా 'నేను' (Ego) అనే దానిని కలిగి ఉండటం. సూక్ష్మత్వం (Lightness) అనగా అహంను తొలగించుకోవటం. ఎప్పుడైతే అహం కరిగిపోతుందో అపుడు సూక్ష్మత్వం యొక్క అనుభూతి కలుగుతుంది. ఎప్పుడైతే కాంతిని కాంచగల్గుతామో అపుడు (Lightness) సూక్ష్మత్వం పొందినట్లుగా భావించవచ్చు.

శరీరంలో (Jerks) కుదుపులు అనుభవమవ్వటమంటే దివ్యశక్తి పాయింట్లను తెరుస్తుందన్నమాట. ఆ విధంగా పాయింట్లన్నీ తెరచుకున్నప్పుడు నీవు దివ్యతలంలో, దివ్యదేశంలో (దివ్య వాతావరణంలో) వ్యాపించటం జరుగుతుంది.

నీవు దైవాన్ని సమీపించినపుడు, చేరినపుడు ఒక విధమైన (Fomentation) వెచ్చదనం కలుగుతుంది. ఒక విధంగా కరిగిపోయినట్లుగా కూడా ఉండవచ్చు. అది ఎలాంటిదంటే, బిడ్డ తల్లి ఒడిలో ఒదిగి ఉన్నప్పుడు కలిగే వెచ్చదనం వంటిది. ఇంకా చెప్పాలంటే, రెండు అరచేతులు కలిపినప్పుడు కూడా అదే అనుభూతి కలుగుతుంది. దైవంతో కలిసినపుడు కలిగేది (Divine fomentation) దివ్యానంద స్పర్శతో కూడిన వెచ్చదనం. ఆ బిడ్డను ఎవరైనా కదిలించాలంటే రియాక్షన్ ఉంటుంది.

"నీవు (Divine Source) దివ్యశక్తికి చెందిన దానితో అనుసంధానమైనపుడు నీలో దివ్యజ్ఞానం కలిగి ఆ జ్ఞానంతో దానిని గురించి వ్రాయటం జరుగుతుంది" అని బాబాజీ నాతో అన్నారు. బాబూజీ శక్తి ప్రవహిస్తోంది. దానిని సంతరించుకోవటం మన వంతు. రావణుడు శంకరుడ్ని తన గురువుగా ఆరాధించాడు. శంకరుడు ఒక వ్యక్తి మాత్రమే. ఆ గురువు అయిన శంకరుడు కూడా బంధానాల నుంచి విముక్తుడు కాడు. అటువంటి వాడు ఏమి ఇవ్వగలడు?

కొంతమంది సీనియర్ ప్రిసెప్టర్స్ తాము సెంట్రల్ రీజియన్‌లో ఉన్నామని, ఏమైనా చేయగలం అని అంటూ ఉంటారు. అటువంటి సీనియర్ ప్రిసెప్టర్ ఒకరితో బాబూజీ ఒకసారి ఇలా అన్నారు: "నీవు సెంట్రల్ రీజియన్‌లో ఉండటానికి ముందుగా నీవు సరిగా తయారు కావలసి ఉంది. బాండేజి (బంధనం)

ఉన్నంతవరకు నీవు దానికి అర్హుడవు కావు. నీవు మళ్ళీ జన్మ తీసుకోవచ్చు. నీవు ఇక్కడ నివసిస్తూనే సెంట్రల్ రీజియన్‌లో ఉన్నావనుకుంటున్నావు. అలాంటి బంధనాలు ఏమీ లేకుండా అన్నీ పోగొట్టుకొని నీవు అర్హత పొందితే మరణించాక వెళ్ళగలుగుతావు" అన్నారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! సెంట్రల్ రీజియన్ ఎవ్వరైనా దాటవచ్చునా?**

**జవాబు:** "నీకై నీవు వెళ్ళటానికి అది సాధ్యం కాదు" అని బాబూజీ చెప్పారు. దివ్యశక్తితో అనుసంధానం జరిగినపుడు తేలికదనం (సూక్ష్మత్వం) కలుగుతుంది. దివ్యశోభ దర్శనమవుతుంది. 'వారే' వచ్చి మనల్ని తీసుకువెళ్తారు. అప్పుడు మనకు అక్కడకు చేరుతున్న అనుభవం, కరుగుతున్న అనుభవం కలుగుతాయి.

**ప్రశ్న: ధ్యానంలో లోతుగా ఉండటమంటే ఏమిటి?**

**జవాబు:** దీనినే బాబూజీ 'నేను' అనే భావం లేకపోవటమే అన్నారు. (డివైన్ పవర్) దైవశక్తిలో నీవు మునిగి ఉన్నప్పుడు ఆలోచనలు నిన్ను భంగపెట్టలేవు. సహజమార్గ విధానం మీద బాబూజీ చాలా కృషి చేశారు. అది దైవీయ విధానం. ఆ దైవీయ విధానమే మనల్ని అంతిమానికి తీసుకువెళ్తోంది. దివ్యజ్ఞానమే ఆ దివ్య కేంద్రాలను అర్థం చేసుకోగలిగినట్లుగా చేస్తుంది. బాబూజీ మహరాజ్ దైవసాక్షాత్కారం ఎలా పొందాలో బోధించారు. 'వారు' తమ ప్రేమ ద్వారా ఆ సాక్షాత్కారం కలిగిస్తారు. 'వారి' ప్రేమ – తల్లి ఒడిలోని వెచ్చదనం, తల్లి ప్రేమను పోలి ఉంటాయి.

**ప్రశ్న: 'వారి'తో అనుబంధాన్ని పెంచుకోవటం ఎలా?**

**జవాబు:** నీవు వారిని ప్రార్థించి, దృష్టి నిలిపినప్పుడు, నీవు వారికే స్వాధీనమైపోయినట్లవుతుంది. చాలామంది సిట్టింగ్‌కు వస్తారు, కూర్చుంటారు. కాని పొందవలసిన దానిని పొందరు. పిల్లలలోని చాంచల్యం వంటిదే వారిని భంగపరుస్తూ ఉంటుంది. సామాన్యంగా చాలా మంది ఆధ్యాత్మిక సాహిత్యం చదువుతారు. అది పురాణ శ్రవణం వంటిదేగాని అందులో పొందటమంటూ ఏమీ ఉండదు. అలా కాకుండా బాబూజీ మహరాజ్ యొక్క సాహిత్యం చదువుతూ ఉన్నా, వింటూ ఉన్నా కూడా ప్రాణాహుతి వస్తూ ఉన్న అనుభవం కలుగుతుంది. ఈ రెండింటికీ ఉన్న భేదం ఇదే.

ఒకసారి కాలేజీలోనో మరి స్కూల్లోనో విద్యార్థులకు ఒకాయన ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇస్తున్న సందర్భంలో కొన్ని నిమిషాలు వేచి ఉండి బాబూజీ ఆ ఉపన్యాసకునితో ఇలా అన్నారు: "ఉపన్యాసం ద్వారా నీవు వారికి చెప్పేదానిని అర్థం చేసుకునేటట్లు నీవు చేయలేవు. ఒక ప్రిసెప్టర్‌ను నియోగించి వారికి ట్రాన్స్‌మిషన్ ఇప్పించినట్లయితే దాని ప్రభావం వారు తెలుసుకోగలుగుతారు." నేరుగా హృదయానికే బోధను వినిపించమన్నారు.

**ప్రశ్న: ఆమెరికాలో చిన్మయ మిషన్ వంటి వాళ్ళు మన హిందూయిజమ్ గురించి తెలియజెప్పుతూ ఉంటున్నారు. మరి మన మిషన్ గురించి మన పిల్లలకు తెలియజేయాలంటే ప్రార్థన సరిపోతుందా?**

**జవాబు:** పిల్లలు ప్రార్థన మాత్రంతో అర్థం చేసుకోలేరు. వారికి ఆ వయస్సులో చదువు ముఖ్యం కనుక దాని మీద శ్రద్ధ కలుగజేయండి. అలా ప్రార్థన వారికి చెప్పటం కాకుండా, పిల్లలనెవ్వరినైనా ఆధ్యాత్మికతవైపు మరల్చాలంటే, మీరు మామూలుగా ప్రార్థన చేసుకొని దైవానికి సమర్పితమైపోయి, వారికి దివ్యత్వం

ప్రసాదించమని దైవాన్ని కోరండి. పిల్లలు ఆధ్యాత్మికతను అంతగా అర్థం చేసుకోలేరు. మీ ఆత్మ సమర్పణ మూలంగాను, వారి కోసం మీలో సంకల్పం మూలంగాను, ఆ ఆధ్యాత్మికత మరియు దైవం వారికి ఆశ్రయంగాను, గొడుగులాగాను ఉంటాయి. వారి ప్రవర్తనలో మంచితనం, మంచి స్వభావం, మంచి శీలం ఏర్పడతాయి.

విదేశీయులు మన హిందూయిజమ్ అనగా మన తత్త్వాన్నిగాని, ఆధ్యాత్మికతనుగాని అర్థం చేసుకోలేరు. 'ఓమ్' అన్న దానికి అర్థం కూడా తెలియదు. సత్యత్వం (రియాలిటీ) అన్న దానిని కూడా వారు గ్రహించలేరు. ఆధ్యాత్మిక సాహిత్యం చదివినా, విన్నా కూడా అంతగా అర్థం కాదు. అది కేవలం ఆచరణ అనగా సాధన ద్వారానే సాధ్యమవుతుంది. అలాగే ఇతరుల వేదాంత గ్రంథాలు చదువుతూ ఉంటే మనకు ఏమీ దక్కదు. కాని మన ఆధ్యాత్మిక గ్రంథాలు అనగా **మన సంస్థ అయిన శ్రీరామచంద్ర మిషన్ గ్రంథాలు చదువుతూ ఉంటే దివ్యశక్తి ధార యొక్క అనుభవం కలుగుతుంది. వీటిలో ఉన్న తేడా ఇదే. అలా ఎందుకంటే, అన్ని మిషన్ గ్రంథాలు శక్తితో ఛార్జ్ చేయబడ్డాయని బాబూజీ మహరాజ్ చెప్పారు.**

మన సంస్థ చిహ్నాన్ని బాబూజీ ప్రప్రథమంగా విజయవాడ సెంటర్ డాక్టర్‌గార్కి పంపించారు. ఇతర సెంటర్ల వారు తమకు పంపలేదేమని అడిగారు. అందుకు సమాధానంగా బాబూజీ ఏమని బదులిచ్చారంటే– మీరు కూడా ఆ స్థాయికి రావాలి అన్నారు.

బాబూజీని విశ్వసించిన వారికి 'వారి' నుంచి రక్షణ ఎప్పుడూ ఉంటుంది.

ఎవరైనా తమ సమస్యను గురించి మీతో బాధగా చర్చించినట్లయితే ఆ సమస్యను బాబూజీ దృష్టికి మళ్ళించండి. అంతేగాని ప్రార్థన చేయవద్దు. మీరు సమర్పితభావంతో నివేదించండి. వారే ఆ సమస్యను పరిష్కరిస్తారు. బాబూజీ ఒక సందర్భంలో, "నేను ఆధ్యాత్మిక సమస్యలను పరిష్కరిస్తానేగాని ఆరోగ్య సమస్యలను, తదితర సమస్యలను కాదు" అని అన్నారు. చాలామంది స్వామీజీలు తాము దేనినైనా పరిష్కరించగలమని ప్రగల్భాలు పలుకుతూ ఉంటారు. అది తప్పు. అది ఒక సూచనప్రాయంగానే ఉండాలి.

బాబూజీకి అభ్యాసుల నుంచి చాలా ఉత్తరాలు వస్తూ ఉండేవి. వాటికి సమాధానాలు వ్రాయటంలో వారు మునిగి ఉండేవారు. అది గమనించిన ఒక అభ్యాసీ బాబూజీతో, "మీరు ఇంత బిజీగా ఉంటే ఈ ఉత్తరాలతో ఎలా సతమతవుతారు" అని అన్నాడు. అందుకు బాబూజీ, "నేను వాటిని వినగలను, పరిష్కరించగలను. నీవు విచారించవద్దు. బిడ్డ తన తల్లికి బాధను చెప్పకపోతే ఆమెకు ఎలా తెలుస్తుంది" అని అన్నారు.

**అభ్యాసీ: భయంకరమైన కలలు వస్తూ ఉంటాయి, ఎందుకు?**

**జవాబు:** మీ జీన్స్ (జీవాణువులు) మీద వాటి ప్రభావంపడి ఉండవచ్చు. ఒక పిల్లవాడు ఏదైనా భయంకర దృశ్యం చూసినపుడు దాని ప్రభావం అతని మనస్సు మీద ఉంటుంది. ఆధ్యాత్మికంగా ప్రాక్టీస్ చేసినట్లయితే అవి నిన్ను వదలిపోతాయి. నీవు నిర్మలమవుతావు. బాబూజీ వాటిని తొలగిస్తారు. భయమనేది సబ్‌కాన్షస్‌మైండ్‌లో ఉంటుంది. మనం స్మరించుకుంటున్నామంటే అది హృదయాన్ని కాదు, అది హృదయాంతరాళం నుంచి కలగాలి. బాబూజీని తలచుకున్నామంటే 'వారు' కళ్ళకు కట్టినట్లు ఉండాలి.

ఆధ్యాత్మికస్థితిని గురించి తెలియజేసేటపుడు “ఏ కండిషన్ ఉందో దానినే వ్రాయిగాని అంతకుమించి వ్రాయవద్దు” అని బాబూజీ చెప్పేవారు.

ప్రిసెప్టర్ అనేవారు అభ్యాసీని దైవంతో కనెక్ట్ చేస్తారు. అభ్యాసీ కృషితో దివ్యస్థితి వస్తుంది. ఆ విధంగా రియాలిటీతో (సత్యత్వంతో) కలవటం జరిగినపుడు, ఎవరూ తప్పు చేయలేరు. బాబూజీ ఇచ్చిన కండిషన్ పరిరక్షించుకోవాలంటే, ఆ స్థితిని నీవు పగలంతా తలుస్తూనే ఉండాలి. అలాగే నిద్రపోతున్నప్పుడు కూడా అదే స్థితిలో మునిగి ఉండాలి. అప్పుడు ఉదయం నిద్ర లేవగానే నీవు ఏదో దివ్యదేశం నుంచి దిగివచ్చినట్లు అనిపిస్తుంది. అలా ఉంటే, నిరంతర స్మరణ నీలో ఉందని విశ్వాసం కలుగుతుంది. నీవు చదువుతున్నా, వింటున్నా, దేనినైనా చూస్తూ ఉన్నా ‘వారే’ నీ స్మృతిపథంలో మెదుల్తూ ఉంటారు. అదే నిరంతర స్మరణ. లయావస్థ రావాలంటే, బాబూజీ మనకు ఇచ్చిన లక్ష్యం, శక్తితో సాధన చేయాలి. సాధనతోనే సాధ్యమవుతుంది.

నీవు దివ్య సముద్రంలో మునిగిపోతున్నప్పుడు, నీవు ఉన్నావు అనే భావం ఏ మాత్రం ఉన్నా, లయమైనట్లు కాదు. ‘ఫనా’ అనగా లయమైపోవటం. ఫనాయియత్ అనగా లయమవుతున్న స్థితి మాత్రమే. అలా అవుతున్న స్థితి తెలిసినా లయం కానట్లే. మోబిద్ అనగా నిశ్శబ్దం.

మానవుడు పరిణామం చెందాలి. ప్రపంచంవైపు దృష్టి మళ్ళించి ఉంటే ఆత్మ ఇక్కడే ఉంటుంది. అలా కాకుండా దృష్టిని అనంతంవైపు మళ్ళించితే అది అటువైపే పయనమైపోతూ ఉంటుంది. వెనుదిరిగి ఇటువైపు చూడదు. ఇక్కడ జీవించి ఉన్నా జీవించనట్లే.

దివ్య చైతన్యమంటే దైవం యొక్క స్మృతి లేదా స్ఫురణ కలిగినప్పుడు ఏదో లోతు నుంచి పొంగి వచ్చినట్లు ఉంటుంది.

మానవునికి ఇంతటి ఆధ్యాత్మిక ఔన్నత్యం కలిగించి అనంతానికి చేరేటటువంటి స్థితిని కలిగించినవారు ఆధ్యాత్మిక చరిత్రలో ఇంతకుపూర్వం ఎవరూ లేరు. అవతార పురుషులు ఏ దివ్య సంకల్పంతో వస్తారో అది నెరవేరిన తర్వాత వెళ్ళిపోతారు.

నిజమైన అభ్యాసీలో ఒక దివ్య ఆకర్షణ ఉంటుంది. ఇతడు శ్రీరామచంద్ర మిషన్ అభ్యాసీ అని ప్రజలు అతని జీవన విధానాన్ని చూసి గుర్తిస్తారు. అభ్యాసీలందరు అటువంటి ఆధ్యాత్మిక జీవితాన్ని గడపాలని బాబూజీ కోరేవారు.

ఎవరినీ తప్పు పట్టకూడదు. ఎదుటివారిలో తప్పు కనపడితే ఆ తప్పును సరిచేయమని మనం బాబూజీ మహరాజ్‌ను ప్రార్థన చేయాలి. అది అంటే ఆ తప్పు బాబూజీ మహరాజ్ కృపతో సవరించబడుతుంది.

**ప్రశ్న: శబరి శ్రీరాముని ఇదివరకు ఎప్పుడూ చూసి ఉండలేదు కదా! మరి శ్రీరాముడు ఆమె దగ్గరకు వెళ్ళగానే అతడే రాముడు అని ఆమె ఎలా తెలుసుకోగలిగింది?**

**జవాబు:** దర్శన సమయంలో, ఒక్కసారిగా ఏదో అలికిడి అయినట్లు అయి, వారే వచ్చినట్లు అనిపిస్తుంది. రాముడు వస్తాడు, వస్తాడని శబరి ఎదురుచూసి చూసి సరిగ్గా రాముడు వచ్చే సమయంలోనే, ఆ రాముని ధ్యానంలో పూర్తిగా మునిగిపోయింది. అప్పుడు స్వయంగా రాముడే ఆమెను ‘శబరీ’ అని పిలిచి, ఆమెను

ధ్యాన స్థితిలో నుండి బయటకు తీసుకొని వచ్చాడు. అప్పుడు శబరి కళ్ళు తెరచి చూస్తే, ఎదురుగా రాముడు కనిపించాడు.

మహాభారత యుద్ధానికి ముందు, కృష్ణరాయబారం అయిన తర్వాత శ్రీకృష్ణుడు విదురుని ఇంటికి ఆతిథ్యం తీసుకోవటానికి వచ్చినప్పుడు, శ్రీకృష్ణ భగవానుడు వచ్చాడు –అని విదురుడు తన భార్యతో అనగా 'శ్రీకృష్ణ' శబ్దం వినగానే విదురుని భార్య శ్రీకృష్ణ ధ్యానంలో తన్ను తాను పూర్తిగా మరచిపోయింది. కృష్ణుడు వచ్చింది, వాళ్ళ ఇంటిలో కూర్చొన్నది –ఆమెకు ఏదీ తెలియదు. అయినా కాని విదురుని భార్య అరటిపళు ్ళ ఒలిచి, పండును ప్రక్కన పడవేసి, తొక్కను మాత్రం కృష్ణునికి ఫలహారంగా ఇస్తుంది. "నీవు ఏం చేస్తున్నావు?" అని విదురుడు కసురుకొని అడగ్గానే, ఆమె మరల ఈ ప్రపంచంలోకి వచ్చి, కృష్ణుని యొక్క దర్శనం చేసుకొన్నది.

దర్శన–సమయంలో భక్తుడు ధ్యానంలో పూర్తిగా లీనమై, తన ఎరుకను పూర్తిగా కోల్పోతాడు. అప్పుడు స్వయంగా ఆ భగవంతుడే అతడిని ధ్యాన స్థితిలో నుండి బయటకు తీసుకొని వచ్చి, తన దర్శనాన్ని ప్రసాదిస్తాడు.

**ప్రశ్న: ఆత్మ స్వరూపాన్ని ఏ విధంగా గుర్తుపట్టగలం?**

**జవాబు:** ఆత్మ స్వరూపాన్ని మీరు గుర్తుపట్టలేరు. ఎందుకంటే ఇంతవరకు చూడని దానిని మీరు ఎలా గుర్తుపడతారు? ఎప్పుడైతే ఆ స్థితి మీకు కలుగుతుందో, అప్పుడు స్వయంగా ఆ స్థితియే మీతో మాట్లాడుతుంది.

**ప్రశ్న: డివైన్ నాలెడ్జ్ (దివ్య జ్ఞానం) మాకు ఎలా వస్తుంది?**

**జవాబు:** చదవకుండా నాలెడ్జ్ (జ్ఞానం) ఎలా వస్తుంది. ఇంగ్లీష్ చదవటం నేర్చుకోకపోతే, ఇంగ్లీష్ భాష ఎలా వస్తుంది? ధ్యానంలో, ''ఈశ్వరుడు మీ హృదయంలోనే ఉన్నాడు'' అని బాబూజీ మనలను గుర్తుపెట్టుకోమన్నారు. అందువలన దైవం (ఈశ్వరుని)తో ఒక కనెక్షన్ అనేది ఏర్పడి, ఆ కనెక్షన్ ద్వారా ఫీలింగ్ (అనుభూతి) అనేది ఏర్పడుతుంది. అప్పుడు మీరు దైవం వద్దకు ఎంత దగ్గరగా వెళ్ళితే అంతగా, 'వారే' ఆ దివ్య జ్ఞానాన్ని మీకు ప్రసాదిస్తారు. డివైన్‌ని (ఈశ్వరుని) మీరు జ్ఞానంతో బంధించలేరు, తెలుసుకోలేరు. మీరు లయావస్థలో, డివైన్ (దైవం)లో లయమైపోయినకొద్దీ, మీకు కలిగిన అనుభవాన్ని గురించి, స్థితిని గురించి మీరు చెప్తారు. కాని ఏ డివైన్ (ఈశ్వరుని)లో అయితే మీరు లయమైపోతున్నారో, 'వారి'ని గురించిన నాలెడ్జ్ (జ్ఞానం) మీలో ఎక్కడ ఉన్నది!

**ప్రశ్న: డివైన్ థాట్ (దివ్య ఆలోచన) అంటే ఏమిటి?**

**జవాబు:** బాబూజీగారి ఆలోచనలో, 'వారి' స్మరణలో ఉండటమే డివైన్ థాట్ (దివ్య ఆలోచన). డివైన్ (దైవం) యొక్క స్మరణలో ఉన్నప్పుడు మీకు కలిగే అనుభవాన్ని గురించి మీరు చెప్పగలరు. కాని ఎవ్వరు కూడా డివైన్ గురించి చెప్పలేరు.

**ప్రశ్న: ఎన్నో సంవత్సరాల నుండి ధ్యానం చేస్తున్నాం కదా! మేము ఏ స్థితిలో ఉన్నామో ఎలా తెలుసుకోగలం?**

**జవాబు:** నేను కూడా సాధన చేశాను. ఈ స్థితుల గురించి, ఏ స్థాయి వరకు ప్రోగ్రెస్ అయ్యామో నాకు కూడా తెలియదు. కాని నాకు కలిగిన అనుభవాలను గురించి బాబూజీకి వ్రాసినప్పుడు, 'వారు' నా మీద రీసెర్చ్ (పరిశోధన) చేసి ఇది ఫలాన స్థితి, నీవు ఇంతవరకు ప్రోగ్రెస్ అయ్యావు అని నాకు ఉత్తరాలలో వ్రాసేవారు. భక్త మీరాబాయి, తులసీదాస్, సంత్ కబీర్ –వీరు ఎవ్వరు కూడా ప్రోగ్రెస్‌కు సంబంధించిన విషయాల గురించి వ్రాయలేదు. ఎందుకంటే, వాళ్ళమీద ఎవరూ రీసెర్చ్ (పరిశోధన) చేయలేదు. **బాబూజీ మహరాజ్, మానవుల నందరిని అతితక్కువ సమయంలో అంతిమసత్యం (అల్టిమేట్) వద్దకు, ఏ విధంగా దగ్గరి దారిలో తీసుకుని వెళ్ళాలి అనే ఉద్దేశ్యంతో నా మీద రీసెర్చ్ చేసారు.** అందువల్లనే 'వారు' ప్రోగ్రెస్‌కు సంబంధించిన పాయింట్స్ (బిందువులు), స్థితులను గురించి నాకు వ్రాశారు. కాని ప్రేమ, భక్తితో సాధన చేయటమే అభ్యాసీ యొక్క కర్తవ్యం. భక్తి అనే దానిలో మీరు ఏ పాయింట్‌లో, ఏ స్టేజిలో ఉన్నారో చెప్పగలరా? మీ యొక్క ప్రేమ మరియు భక్తి అనేవి అపారంగా, అనంతంగా ఉండాలి. వాటికి మీరు ఫుల్–స్టాప్ పెట్టవద్దు. నేను ఆ పాయింట్‌లో ఉన్నాను, ఈ పాయింట్‌లో ఉన్నాను అని అనుకుంటే, ప్రేమ, భక్తి అనే వాటికి మీరు ఫుల్–స్టాప్ పెట్టినట్లు అవుతుంది. ప్రేమ, భక్తి మరియు లయావస్థ –వీటితోనే మీరు ప్రయాణించాలి. దీనివలన కలిగే ఫలితం ఏమిటంటే, నేను ఎవరు? అనే దానిని మీరు మరచిపోతారు. 'నేను' అనే దానిని కోల్పోతారు.

ఎప్పుడైనా మీ మనస్సులో, "నేను ఏ స్టేజి (స్థితి)లో ఉన్నాను?" అనే ప్రశ్న ఉదయించినా, లేదా ఎవరైనా మిమ్మల్ని, "మీరు ఎక్కడివరకు ప్రోగ్రెస్ అయ్యారు?" అని అడిగితే – "నేను కేవలం బాబూజీ మహరాజ్ దివ్య చరణాల వద్దనే ఉన్నాను, 'వారి' శరణులోనే ఉన్నాను" అని చెప్పండి. మన ప్రోగ్రెస్ –కేవలం 'వారు' మాత్రమే. దివ్య ప్రేమమూర్తి అయిన 'వారు' మనకు లభించారు. మనకు ఇంక కావలసింది ఏముంది? ఇంకా ఎంత దూరం వెళ్ళాలి అనే ఆలోచన వచ్చినప్పుడు, వెంటనే 'వారి'ని స్మరించండి. "బాబూజీ! మీరు నా ఎదుటనే ఉన్నారు. మీరు నాలోనే ఉన్నారు అని అనుకోండి." అప్పుడు ఆ దూరం అదృశ్యమైపోతుంది. ఈ విధంగా ప్రతి పనిని, ప్రతి ఆలోచనను కూడా 'వారి'తోనే కనెక్ట్ చేయండి.

హార్ట్ రీజియన్, మైండ్ రీజియన్ మరియు సెంట్రల్ రీజియన్‌లను గురించి తెలుసుకోవటం చాలా సులభం. హార్ట్ రీజియన్ (హృదయ మండలం) అంటే బాబూజీ మహరాజ్ యొక్క విరాట్ హృదయం. సెంట్రల్ రీజియన్ (కేంద్ర మండలం) అనేది బాబూజీ యొక్క శిరస్సు. అది శక్తి కేంద్రం. మరి 'వారి' చరణాలు ఎందుకు? ఎందుకంటే, ఎప్పుడైతే మన మనస్సును, ఆలోచనను 'వారి' చరణాల వద్ద ఉంచుతామో అప్పుడు హార్ట్ రీజియన్, మైండ్ రీజియన్, సెంట్రల్ రీజియన్ అన్నీ మనవే అవుతాయి.

**ప్రశ్న: ధ్యానం చేస్తున్నప్పుడు ప్రతిసారి 'ఓమ్' అక్షరంలో, బాబూజీ మహరాజ్ కనపడుతున్నారు.**

**జవాబు:** ఇంతకుపూర్వం మీరు 'ఓమ్' మీద ధ్యానం చేసి ఉంటారు. అందువల్లనే మీకు ఆ విధంగా జరుగుతుంది. మీరు 'ఓమ్' మీద ఎక్కువ దృష్టిని పెట్టకుండా, బాబూజీ మహరాజ్ మీదనే దృష్టిని ఉంచినట్లయితే అది తొలగిపోతుంది.

ఒక వ్యక్తి చనిపోయిన తరువాత, అతనిలోని సంస్కారాలను తొలగించటానికిగాను 13 రోజుల కర్మకాండ, పిండ ప్రదానాలు చేస్తారు. కాని ఇప్పుడు ఆ విధంగా సంస్కారాలను తొలగించే శక్తి ఎవరికి ఉంది? ఎవరికి కూడా లేదు. అందువల్లనే బాబూజీ మహరాజ్ మొదటి నుండి కూడ, మీరు ఈశ్వరునితో కనెక్షన్‌ను ఏర్పరచుకొని మిమ్మల్ని మీరు మరచిపోండి –అని చెప్పేవారు. “బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు” అని గుర్తుపెట్టుకొని ధ్యానం చేయటం వలన ‘నేను’ అనే భావన నశించిపోతుంది. మీరు జీవించి ఉన్నారా లేక మరణించారా అనే తేడా కూడా మీకు తెలియదు. మీరు ఎల్లప్పుడు కూడా బాబూజీ చరణాల వద్దనే ఉన్నట్లు అనిపిస్తుంది. మరణించిన తర్వాత కూడా, మీరు ‘వారి’ ఒడిలోనే ఉన్నట్లు అనిపిస్తుంది. అందువలన బాబూజీ యొక్క దివ్య–ధ్యానం వలన ఈ జీవితంలోను, ఈ జీవితం తర్వాత కూడా ఎంత గొప్ప లాభం కలుగుతుందో చెప్పటానికి మాటలు లేవు.

ఇతడు నా కొడుకు, ఈమె నా కోడలు అని మనం అంటాము. కాని ఈ సంబంధం కేవలం శరీరం ఉన్నంతవరకు మాత్రమే! శరీరం నశించిన తర్వాత ఆత్మ యొక్క సంబంధం ప్రారంభమవుతుంది. కాని బాబూజీ మహరాజ్, మనకు ప్రారంభం నుండి కూడా ఆత్మతోనే కనెక్షన్‌ను ఏర్పరచుతారు. ఆత్మ అనేది ఎల్లప్పుడు కూడా డివైన్ (ఈశ్వరుని)తోనే కనెక్షన్‌ను కలిగి ఉంటుంది. ఆత్మకు పేరు లేదు. ప్రాణం అనేది మనకు ఈశ్వరుని నుండి వస్తుంది. ఈ శరీరంతో మనం అందర్నీ చూస్తాము. ఆత్మ అందరిలోను ఉన్నప్పటికి అది అందరిని చూడలేదు. ఆత్మ కేవలం డివైన్ (దైవం)ను మాత్రమే చూస్తుంది. ఎందుకంటే, ఆత్మ యొక్క కనెక్షన్ కేవలం డివైన్‌తోనే ఉంది కనుక.

“మీ సహజమార్గ్‌లోని ప్రత్యేకత ఏమిటి?” అని నన్ను ఒకసారి ఎవరో అడిగారు. సామాన్య ప్రజలులాగా కాకుండా మనం ఒక విశేషతను, ప్రత్యేకతను కలిగి ఉన్నాం. ఈశ్వరుడు నా హృదయంలోనే ఉన్నాడు –అని బాబూజీ చెప్పినటువంటి ధ్యానం చేయటంవలన, మన లోపలనే ఉన్నటువంటి డివైన్ (ఈశ్వరుని)తో మనకు ఏదో కనెక్షన్ ఉంది, అని మనకు కలిగే అనుభవాల వలన తెలుస్తుంది. అప్పుడు మనం ప్రత్యేకతను కలిగినవారం అవుతాం. ఈ ప్రత్యేకత, విశేషత మీలో ఉన్నప్పటికిని, గొప్పవాళ్ళం అనే భావన (ఫీలింగ్) మీలో రాకూడదు. అప్పుడు ప్రోగ్రెస్ ఉంటుంది.

ఒకసారి ఒక అభ్యాసీ “బాబూజీ! మీరు ఎవరు?” అని అడిగాడు. అప్పుడు వారు, “భాయీ! నేను శరీరం కాదు. ఈ శరీరం నేను కాదు. దీని తర్వాత ఏదైతే ఉంటుందో అదే నేను” అని అన్నారు. ఆ తర్వాత మరల “ఏమీలేదు’ మరియు ‘ఉన్నది’ అనేదానికి మధ్య ఏదైతే ఉన్నదో, అదే గాడ్ (ఈశ్వరుడు). గాడ్ (ఈశ్వరుడు) మరియు అల్టిమేట్ (అంతిమం) మధ్యన ఏదైతే ‘ఉన్నది’ మరియు ‘ఏమీలేదు’ అనేది ఉందో ఆ ‘ఏమీలేదు’ అనేదానిలో నన్ను వెదకండి” అని అన్నారు.

**ఉన్నది – ఐడెంటిటీ = సెంట్రల్ రీజియన్**

**ఏమీలేదు – ఐడెంటిటీ తన ఐడెంటిటీని మరచిపోయింది.**

**(భూమా యొక్క 7 వలయాలు)**

బాబూజీ చెప్పిన ఈ మాటలను అర్థం చేసుకోవటం చాలా కష్టం. ఎప్పుడైతే మీరు ఆ స్థాయి వరకు, ఆ స్థితి వరకు చేరుకోగలరో, అప్పుడే మీరు దానిని గురించి చెప్పగలరు. గాడ్ (ఈశ్వరుడు) మనకు చాలా

దూరంలో ఉన్నాడు అని అనుకుంటాం. కాని ఈశ్వర దర్శనం లేదా ఈశ్వర సాక్షాత్కారం అయిన తర్వాత, అల్టిమేట్ (అంతిమం) మనకు చాలా దూరంలో ఉన్నదని అనుకుంటాం. కాని ఎప్పుడైతే బాబూజీ అభ్యాసీని సెంట్రల్ రీజియన్ (కేంద్ర మండలం)లో ప్రవేశపెడతారో, అప్పుడు అంతిమం అనేది ఉందని అనిపిస్తుంది. ఎందుకంటే, సెంట్రల్ రీజియన్ అనేది అల్టిమేట్ యొక్క వైభవ సామ్రాజ్యం కాబట్టి. ఎప్పుడైతే బాబూజీ అభ్యాసీని భూమా (అంతిమం) యొక్క 7 వలయాల్లో ప్రవేశపెడతారో, అప్పుడు మీకు భూమా, బాబూజీ అంటే ఎవరు? అనేది కొద్దిగా తెలుస్తుంది.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ అడిగారు –"బాబూజీ! మీరు ప్రతిసారి కూడా ఈ పనిని లాలాజీ సాహెబ్ చేసారు, ఈ పని లాలాజీ సాహెబ్ వల్లనే అయ్యింది, ఇది అంతా కూడా లాలాజీ సాహెబ్ కృప, అని మీరు మాటిమాటికి లాలాజీ సాహెబ్ పేరును తలుస్తారు. మీరు వారి కంట్రోల్‌లో పనిచేస్తున్నారు కనుక, మీరు ఈ విధంగా అంటున్నారని మాత్రం నేను అనుకోను. మరి ఎందుకు మీరు ప్రతి పనికి ఆ విధంగా అంటున్నారు?" అని.

దానికి బాబూజీ "లాలాజీ సాహెబ్ నా మాస్టర్. వారు ఏ పనిని అయితే చేస్తున్నారో, దానిని నీవు నాతో ముడిపెట్టవద్దు. లాలాజీ సాహెబ్ – ఆ పనిని ఎందుకు చేస్తున్నారు? ఎలా చేస్తున్నారు? అనేది నీకు తెలియదు. అసలు నా శరీరాన్నే నేను ఎప్పుడూ కూడా చూడలేదు. లాలాజీ సాహెబ్‌యే ఇక్కడ ఉన్నట్లు ఉంటుంది. ఎవరైనా నన్ను బాబూజీ అని పిలిచినా లేదా ఏదైనా పని నా ద్వారా జరిగినప్పుడు, నా వద్ద కేవలం లాలాజీ సాహెబ్‌తప్ప వేరే ఏమీ లేదు. ఈ శరీరం పేరుకే ఉంది. నా దృష్టిలో ఎల్లవేళలా కేవలం నా లాలాజీ సాహెబ్ తప్ప, మరేది లేదు" అని అన్నారు.

'వారి'ని నేను అడిగాను –"బాబూజీ! మేము మీ ఎదుటకు రాగానే మాలో అసలు ఏ ప్రశ్నలు కూడా ఉదయించవు. అసలు మాలో ప్రశ్నలే లేనట్లుగా అనిపిస్తుంది" అని. దానికి బాబూజీ "బిటియా! రియాలిటీ (సత్యత్వం)లో ఎటువంటి ప్రశ్నలు కూడా ఉదయించవు. ఎప్పుడైతే నీవు ఆ దివ్య వాతావరణంలో నా ఎదుట కూర్చొని ఉంటావో, ఆ క్షణమే ప్రశ్నలన్నీ అదృశ్యమైపోతాయి.

ఒకసారి నేను బాబూజీని ఇలా ప్రశ్నించాను: "బాబూజీ! ఏ రోజు నుండి అయితే బసంత్ పంచమి ఉత్సవంలో పాల్గొవటానికి మీ వద్దకు రావాలి అని అనుకుంటానో ఆ రోజు నుండి కూడా మిమ్మల్ని అడగటానికి మాలో ఏ ప్రశ్నలు ఉదయించవు. బసంత్ పంచమికి ఇరవై రోజులు ముందు నుండే షాజహాన్‌పూర్‌కు త్వరగా వెళ్ళాలి, త్వరగా వెళ్ళాలి అనే ఒక ఆరాటం మాత్రం మాలో ఉంటుంది. మాలో ఎటువంటి ప్రశ్నలు కూడా ఉండవు. ఎందుకు ఆ విధంగా జరుగుతుంది?" అని. దానికి సమాధానంగా వారు, "బిటియా! నీవు నా గేటు (ద్వారం) వద్దకు రాగానే –షాజహాన్‌పూర్‌కు వచ్చేసాము –అని అనుకుంటావు. అలాగే ఎప్పుడైతే అభ్యాసులు బసంత్ పంచమి ఉత్సవానికి షాజహాన్‌పూర్ వెళ్ళాలి, వెళ్ళాలి –అని అనుకుంటారో, అప్పటి నుండే మీరు ప్రశ్నల గురించి మరచిపోతారు. ఎందుకంటే, స్వయంగా షాజహాన్‌పూర్ వాతావరణమే మీ ఇంటివరకు వ్యాపిస్తుంది కనుక. ఇంక మీకు ప్రశ్నలకు అడగాలనే ఆలోచన ఏదీరాదు.

అందువలన మీరు బాబూజీ ఫంక్షన్‌కు వెళ్ళలేకపోయి నట్లయితే– ఆ ఫంక్షన్ యొక్క దైవీయ వాతావరణం అంతా కూడా మీ ఎదుటనే ఉంది –అని భావించండి. అప్పుడు ఉత్సవం యొక్క దైవీయ వాతావరణం మీ ఎదుటనే ఉంటుంది. అందుకనే, కొంతమంది అభ్యాసులు ఇక్కడకు రాకుండానే ఫంక్షన్ (ఉత్సవం)లో పాల్గొనేవారు, అని బాబూజీ అనేవారు.

మరొక సందర్భంలో ఈశ్వర్ సహాయ్‌జీ బాబూజీతో ఇలా అన్నారు: “హుజూర్! లాలాజీ సాహెబ్ ఫంక్షన్ (బసంత్ పంచమి  ఉత్సవం)కు ఇంకా నెల రోజులే సమయం ఉంది కదా! మీరు మరి ఎలా ఏర్పాటు చేస్తారు?” అని. దానికి సమాధానంగా బాబూజీ, “భాయీ! బయటకు సంబంధించిన ఏర్పాట్లను, పనులను అన్నింటినీ లాలాజీ సాహెబ్ ముందే చేసిపెడతారు. వారు ఈ పని చేయమని నాకు ఆజ్ఞ ఇస్తారు –ఎవరైతే ఫంక్షన్ (ఉత్సవం)కు రావాలని అనుకుంటారో, ఎవరైతే అభ్యాసులు ఫంక్షన్ కొరకు ఇక్కడకు వస్తున్నారో, వాళ్ళ అందరి మనస్సులను కూడా డివైన్ (దైవం) మీదనే స్థిరంగా నిలిచి ఉండేట్లుగా, వాళ్ళ దృష్టి అస్థిరం కాకుండా ఉండే విధంగా వాళ్ళను నేను తయారుచేయాలి. ఇది చాలా ముఖ్యమైన పని. ఒకవేళ ఆ విధంగా తయారు చేయలేకపోతే, వాళ్ళు ఒక జాతరకు వచ్చినట్లుగా వచ్చి వెళ్ళిపోతారు. వాళ్ళు ఆధ్యాత్మిక  ఉత్సవంలో పాల్గొనడానికి వస్తున్నారు కనుక ఈ విధంగా వాళ్ళను తయారుచేయటం అనేది చాలా అవసరం. నేను ఆ విధంగా ఫంక్షన్ కొరకు అందరిని తయారు చేస్తున్నప్పుడు, వాలంటీర్స్‌ను మాత్రం ఎందుకు విడిచిపెడతాను? వాలంటీర్స్ యొక్క మనస్సు మాత్రం వాళ్ళకు ఇవ్వబడిన పనిమీద ఉంటుంది. కాని హృదయంలోని ధ్యానస్థితి అనేది అందరికి సమానంగానే లభిస్తుంది” అని అన్నారు.

అందువలన బాబూజీ మహరాజ్ ఫంక్షన్ నుండి వచ్చిన తర్వాత, ఆ దివ్య వాతావరణం నుండి మరల ఈ బాహ్య ప్రపంచపు వాతావరణంలోకి రావటానికి మాకు ఏడెనిమిది రోజులు పట్టేది. మేము ఇంటికి వచ్చాము అని ఆ పదిరోజుల తర్వాత అనిపించేది. ఒక గంట ధ్యానం పదిహేను నిమిషాల్లో అయిపోయినట్లుగా ఉండేది. మా దృష్టి అంతా కూడా కేవలం బాబూజీ మహరాజ్‌లోనే లయమై ఉండేది. అందుకే బాబూజీ “నేను ఒకే ఒక ఏర్పాటు చేస్తాను. అది ఏమిటంటే, ఇది నా లాలాజీ సాహెబ్ యొక్క ఉత్సవం, అభ్యాసులందరి కాన్షస్‌నెస్ (స్పృహ)ను లాలాజీ సాహెబ్‌లోనే లయంచేసి, తమను తాము మరచిపోయేట్లుగా తయారుచేస్తాను” అని అనేవారు.

**బాబూజీ మహరాజ్ రచనలు నాకు 50 సంవత్సరాల తర్వాత ఇప్పుడు అర్థమవుతున్నాయి.**

నేను విజయవాడ వెళ్ళినప్పుడు 500 మంది అభ్యాసులు  ఉంటారు. అందరూ కూడా చాలా నిశ్శబ్దంగా ఉంటారు. ట్రాన్స్‌మిషన్ యొక్క ఆ దివ్య ప్రవాహంలో మునిగిపోయి ఉంటారు. అనవసరమైన మాటలు మాట్లాడాలనే ఆలోచన వారి మనస్సులోకి రాదు. నేను అక్కడ ఉన్న రెండు లేక రెండున్నర రోజులు కూడా, ఈ స్థితి బాగుంది, ఈ స్థితి ఇలా ఉంది అని కేవలం ఆధ్యాత్మికతను గురించి మాట్లాడుకోవటంతప్ప వారిలో వేరే ఆలోచన ఏదీ ఉండదు. ఇదే విధంగా తిరుపతి, నెల్లూరులో కూడా ఉంటుంది. బహుశా అందువల్లనే కాబోలు, **“నీ శరీరంలో శక్తి ఉన్నంతవరకు, నీకు నడవగలిగే ఓపిక ఉన్నంతవరకు నీవు తప్పకుండా విజయవాడ సెంటర్‌కు వెళ్ళాలి” అని బాబూజీ మహరాజ్ నాతో అన్నారు.** బాబూజీ మహరాజ్ అందరి మీద సమానంగా పనిచేస్తారు. కాని ‘వారు’ చేసేపని యొక్క మహిమను,

గొప్పతనాన్ని ఎవరు అర్థం చేసుకుంటారు? ఎవరు దానిని కాపాడుకొంటారు? అనేది మీ చేతుల్లో ఉంది. సెంటర్ ఇన్‌ఛార్జ్, బాబూజీ యొక్క పనిని గుర్తించి సెంటర్ (ఆశ్రమం)లో ఉన్న దివ్య వాతావరణం కాపాడటమనేది గొప్ప విషయమే.

**ప్రశ్న: లక్నోలో జరిగిన బాబూజీ శతాబ్ది ఉత్సవంలో పాల్గొన్నప్పుడు, ధ్యానంలో నన్ను నేను పూర్తిగా మరచిపోయాను. ఇప్పుడు ధ్యానస్థితి ఆ విధంగా ఉండటం లేదు, ఎందుకని?**

**జవాబు:** బాబూజీ శతాబ్ది ఉత్సవంలోని వాతావరణం అనేది ప్రత్యేకమైనది, విశేషమైనది. ఆ ప్రత్యేకమైన వాతావరణం మీరు మరచిపోలేరు. మీరు బసంత్ పంచమి ఉత్సవంలో పాల్గొన్నారు అనుకోండి. ఆ దివ్య వాతావరణం యొక్క జ్ఞాపకం అనేది ఎప్పుడు మీ ఎదుటనే ఉంటుంది. ఎందుకంటే, ఆ దివ్య వాతావరణం ఒక ప్రిసెప్టర్ ఏర్పరచినది కాదు. అది డివైన్ (దైవం) నుండి లభించిన ఆశీస్సులు. మనకు ప్రసాదించబడిన ఆ దివ్య ఆశీస్సులు మరల ఎప్పుడు కూడా వెనుకకు వెళ్ళవు. అవి నెమ్మది నెమ్మదిగా అభ్యాసీ సిస్టమ్‌లో లయమవుతాయి. అందువల్లనే, సంవత్సరానికి ఒకసారి ఒక ఉత్సవం తప్పనిసరిగా జరపాలి. అది బసంత్ పంచమి ఉత్సవం అని బాబూజీ అనేవారు. మరల 'వారు' లాలాజీ సాహెబ్ జన్మదినం రోజున మనం మిషన్ యొక్క వార్షికోత్సవం జరుపుకుంటున్నాము. వీలున్నంతవరకు ప్రతి అభ్యాసీ ఈ బసంత్ పంచమి ఉత్సవంలో పాల్గొనాలి –అని అనేవారు. అటువంటి ఉత్సవాలలో ఎందుకు పాల్గొనాలి? అనేది నాకు ఇప్పుడు అర్థమవుతున్నది. డివైన్ (దైవం) యొక్క అశీస్సులు సమస్త మానవాళి కొరకు ఉంటాయి. కాని ఎవరైతే ఆ ఉత్సవంలో పాల్గొంటారో, వాళ్ళు ఇంటికి వచ్చిన తరువాత కూడా, ఆ దివ్య వాతావరణం యొక్క ఆనందం ఎప్పుడూ గుర్తుకు వస్తూనే ఉంటుంది. ఎవరైనా అభ్యాసీ ఇక్కడకు రావాలి అనుకొని రాలేకపోయినగాని, ఏదైనా కారణంవలన బాబూజీ లేదా లాలాజీ ఫంక్షన్‌కుగాని, **ఇక్కడ లక్నోలో ప్రతి శనివారం సాయంత్రం 6.00 గంటలకు జరిగే సత్సంగ్‌కుగాని హాజరు కాలేకపోయినప్పటికీ, వాళ్ళందరికి కూడా బాబూజీ కృప లభించాలని నేను ఒక సంకల్పం ఏర్పరచి, 'వారి'ని ప్రార్థిస్తాను.** బాబూజీ వద్ద నుండి అటువంటి శిక్షణను నేను ఇప్పుడు నేర్చుకుంటున్నాను.

**ప్రశ్న: నేను ఈ మధ్యనే క్రొత్తగా అభ్యాసీగా చేరాను. ఈశ్వర్‌ప్రాప్తి కొరకు నాకు కోరిక ఉంది. ఈశ్వరుని నేను చూడలేదు. నేను నా తల్లిదండ్రులను మాత్రమే చూసాను. వారే నాకు భక్తిని నేర్పారు. ఇప్పుడు వాళు ్ళ లేరు. నేను నా తల్లిదండ్రులను పూజించవచ్చా? జన్మనిచ్చిన తల్లిదండ్రులను పూజిస్తే నాకు ముక్తి లభిస్తుందా?**

**జవాబు:** జన్మనిచ్చిన తల్లిదండ్రులను పూజిస్తే, మీకు ఎప్పటికీ ముక్తి లభించదు. ఎవరైతే మీ శరీరానికి జన్మనిచ్చారో, వాళ్ళను మీ తల్లిదండ్రులు అని మీరు అనుకుంటున్నారు. కాని, ఎవరైతే మిమ్మల్ని ఈ సృష్టిలోకి తీసుకొని వచ్చారో, ఆ తల్లిదండ్రుల (సృష్టికర్త) యొక్క జ్ఞాపకాన్ని, బాబూజీ మీకు కలిగిస్తారు. మీరు సృష్టిలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు కూడా మీరు అసంఖ్యాకమైన తల్లిదండ్రులను కలిగి ఉన్నారు. మీరు వారు ఎవరెవరిని గుర్తు పెట్టుకుంటారు. "ఎవరైతే నిన్ను ఈ సృష్టిలోకి తీసుకొని వచ్చారో, ఆ డివైన్ (దైవం) నీలోనే ఉంది" అని బాబూజీ అనేవారు. కాని ఎవరైతే ఈ శరీరానికి జన్మనిచ్చారో, ఆ తల్లిదండ్రులు మన హృదయంలో లేరు. వాళ్ళు మన జ్ఞాపకంలో మాత్రమే ఉన్నారు. అందుకే బాబూజీ, "డివైన్ (ఈశ్వరుడు) నీ హృదయంలోనే ఉన్నాడు. **'అతడు' ఎంత ప్రేమమూర్తి అంటే, మానవులనందరిని**

**సృష్టించి మరల అందరి హృదయాలలో ప్రవేశించి, మానవుడ్ని ముందుపెట్టాడు. ఇప్పుడు ఈ సాధన ఎందుకంటే, మన కర్తవ్యం ఏమిటంటే, ఎవరైతే మనలను సృష్టించి, మన హృదయంలోనే ఉన్నటువంటి ఆ డివైన్‌ను (ఈశ్వరుని) ముందు పెట్టి, మనం 'వారి' వెనకనే ఉండాలి" అని అనేవారు.**

**అభ్యాసీ అంటే ఎవరు? ఎవరి హృదయంలోనయితే ఈశ్వరుడు ప్రకాశిస్తున్నాడో అతడే అభ్యాసీ.**

మూడు సిట్టింగ్‌లు తీసుకొని, మిషన్‌లో చేరగానే అభ్యాసీ కాదు. సాధనలో మనకు కలిగిన అనుభూతి, ఆనందం అందరికి కూడా లభించాలనే తపన ఎప్పుడైతే మనలో ఏర్పడుతుందో, అప్పుడే మనం నిజమైన శ్రీరామచంద్ర మిషన్ అభ్యాసీ అయినట్లు. ఎందుకంటే, శ్రీరామచంద్ర మిషన్ అంటే సంస్థ కాదు. సమస్త మానవాళిలో ఈశ్వర ప్రాప్తి కొరకై తపనను మేల్కొల్పే సంకల్పమే, బాబూజీ మహరాజ్ యొక్క దివ్య సంకల్ప రూపమే శ్రీరామచంద్ర మిషన్.

జన్మనిచ్చిన తల్లిదండ్రులు అనగా జన్మదాత వలన ఈ శరీరానికి జన్మ ఇవ్వబడుతుంది. కాని మనం మన తల్లిదండ్రులలో ఐక్యం కాము. "నేను ఎటు చూసినా, ఎవర్ని చూసినా నాకు కృష్ణుడే కనిపిస్తున్నాడు. వారిలోనే నేను ఐక్యం అవుతాను" అని భక్త మీరా అనేది. ఎందుకంటే, ఈ సృష్టిలో, ఎవరైతే సమస్తం నందు కూడా వ్యాపించి ఉన్నారో, ఆ డివైన్ (ఈశ్వరుని)లోనే మనం ఐక్యం కాగలం. మన తల్లిదండ్రులు ఎక్కడ ఉన్నా సరే, వాళ్ళ ఆత్మోన్నతి కొరకు మనం ప్రార్థన చేయాలి. ఇది మన కర్తవ్యం.

**ప్రశ్న: మా అత్తగారు బ్రతికి ఉన్నప్పుడు నన్ను చాలా బాధపెట్టేది. ఇప్పుడు ఆమె లేదు. ఆమె గురించి నేను ప్రార్థన చేయలేను. ఎందుకంటే, ఆమె జ్ఞాపకం వస్తే చాలు, నాకు కోపం వస్తుంది. నేను ఏం చేయాలి?**

**జవాబు:** "ఎవర్నీ కూడా ద్వేషించవద్దు" అని బాబూజీ చెప్పేవారు. శ్రీరామచంద్ర మిషలో 7 సం॥ల నుండి సాధన చేస్తున్నావని నీవు చెప్పావు కదా! నీలో ఈ ద్వేషం ఎలా ఉంది? ఆమె జీవించి ఉన్నప్పుడు నిన్ను కష్టపెట్టింది. ఇప్పుడు ఆమె లేదు కనుక నీవు ఆమె కోసం "బాబూజీ మహరాజ్! ఆమె ఒక మంచి ఆత్మగా మారి భగవంతుని చేరుకోవటానికి, ఆమెకు మంచి జన్మను ప్రసాదించండి" అని ప్రార్థించండి.

**ప్రశ్న: పునర్జన్మ అనేది నిజమేనా? ఋజువు ఉన్నదా?**

**జవాబు:** నిజమే. ఋజువు ఉంది. జడభరతుని కథ అన్నింటి కంటె గొప్ప ఋజువు. ఎవరు ఎటువంటి పనిచేస్తే అటువంటి జీవితాన్నే అనుభవిస్తారని పెద్దలు చెప్పారు. కర్మ ఎలా ఉంటే, ఫలితం కూడా అదే విధంగా ఉంటుంది –అని భగవద్గీతలో కూడా శ్రీకృష్ణుడు అర్జునితో చెప్పాడు. ఈ ప్రాపంచికమైన విధులను సక్రమంగా, పూర్తిగా నిర్వహించటం అనేది ఈ శరీరం మరియు మనస్సు యొక్క కర్తవ్యం. కాని ఆత్మోద్ధరణ అనగా ఈశ్వర సాక్షాత్కారం పొందటం అనేది మానవుని యొక్క కర్తవ్యం అని కూడా శ్రీకృష్ణుడు గీతలో బోధించాడు.

**ప్రశ్న: బాబూజీ అభ్యాసీకి ఈ జీవితంలోనే రియలైజేషన్ (ఈశ్వర సాక్షాత్కారం)ను ప్రసాదిస్తానని హామీ ఇచ్చారు కదా! దానిని తెలుసుకోవటం ఎలా? దాని అనుభూతి ఎలా ఉంటుంది?**

**జవాబు:** దీన్ని గురించి ఎవరూ కూడా చెప్పలేరు. సాధన చేయటం మీ వంతు. సాధనచేస్తూ, 'వారి' సామీప్యతను పొందుతున్నకొద్దీ, 'వారి'ని గురించి మీరు కొంచెం కొంచెంగా తెలుసుకోగలరు. ఎప్పుడైతే

మీరు 'వారి' వద్దకు చేరుకుంటారో, అప్పుడు ఎటువంటి భ్రమలేదు, ఎటువంటి భయం కూడా లేదు. నేను, నీవు అనే భ్రమ లేదు. 'నీవు' ఉన్నప్పుడు అక్కడ 'నేను' లేను –అని మీరు అనుభవంతో అంటారు. దీన్ని గురించి మీకు ఎవరు చెబుతారు! కాని ఒక్కటి మాత్రం నిజం. ఆ స్థితిని పొందినప్పుడు ఈ ప్రపంచాన్ని మీరు చూస్తున్నారని ప్రజలు అనుకుంటారు. కాని మీకు కేవలం బాబూజీ మహరాజ్‌తప్ప, మీ ఎదుట ఉన్నవారు ఎవరినీ కూడా మీరు చూడలేరు. మీరు మాట్లాడుతారు, అన్ని పనులు చేస్తారు. కాని మీ ఎదుటనే ఉన్న వారిని ఎవరిని కూడా మీరు చూడలేరు. ఎటు చూసినా, ఎవరిని చూసినా కేవలం బాబూజీ మహరాజ్ మాత్రమే మీకు కనపడతారు. "ఎప్పుడైతే నేను నా లాలాజీ సాహెబ్‌ను చూసానో, అప్పటి నుండి నేను మరల ఎవరినీ చూడలేదు" అని బాబూజీ చెప్పిన ఈ మాటల యొక్క అర్థం, నాకు ఇప్పుడు, 50 సం॥ల సాధన తర్వాత అర్థమవుతున్నది. మనకు అందరి పేర్లు తెలుసు. అందరిని పేరుపెట్టి పిలుస్తాం. అన్ని పనులను చేస్తాం. కాని మన గురించిన ఎరుక –స్పృహ అనేది మనకు ఉండదు. ఈ ప్రపంచంలో ఉంటూనే, గృహస్థ జీవితాన్ని గడుపుతూ, 'వారు' మనలను ఈ విధంగా ఎలా జీవించునట్లుగా చేస్తారనేది ఎవరు కూడా చెప్పలేరు. ఎవరికి కూడా దీన్ని గురించి అర్థం కాదు.

శ్రీకృష్ణుడు కురుక్షేత్ర యుద్ధ సమయంలో గీతోపదేశం చేయడానికి అర్జునునికి తన దివ్యదృష్టిని ప్రసాదించి, బ్రహ్మాండ మండలంలో జరిగే సంఘటనలను చూపించాడు. ఆ తర్వాత శ్రీకృష్ణుడు తన దివ్యదృష్టిని ఉపసంహరించి, మరల అర్జునుని యథాస్థితికి తీసుకొని వచ్చాడు. కాని బాబూజీ మహరాజ్ మనకు ఏ స్థితినైతే ప్రసాదిస్తారో, దానిని 'వారు' ఎప్పుడు మరల వెనుకకు తీసుకోరు. 'వారు' ప్రసాదించిన ఆ స్థితి మనలోనే లయమై, మన స్వంతం అవుతుంది. అందువల్లనే "నేను ఏ స్థితినైతే ప్రసాదించానో, ఆ ఫీలింగ్ (అనుభూతి) ఆ స్థితికి అనుగుణంగా అభ్యాసీ తన నడవడికను, జీవన విధానాన్ని మలచుకోవాలని, అది అభ్యాసీ యొక్క కర్తవ్యం" అని బాబూజీ అనేవారు.

భీష్ముని "నీవు పాండవ పక్షపాతివి" అని దుర్యోధనుడు నిందించినప్పుడు భీష్ముడు కోపంతో రేపు యుద్ధంలో పాండవులలో ఎవరో ఒకరిని హతమారుస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. పాండవ శిబిరంలో ఈ వార్త తెలియగానే, అక్కడి వాతావరణం అంతా కూడా ఒక్కసారిగా స్తబ్దమైపోయింది. దీని అర్థం ఏమిటంటే, రేపటితో యుద్ధం సమాప్తం అవుతుంది అని. "నా రథాన్ని ఎందుకు తయారు చేస్తున్నారు? భీష్ముడు రేపు మాలో ఎవరో ఒకరినైనా చంపుతానని ప్రతిజ్ఞ చేసాడు. పాండవులలో ఏ ఒక్కరు చనిపోయినా, మిగిలిన నలుగురు కూడా అగ్ని ప్రవేశం చేయవలసిందే. ఇంకా రేపు యుద్దం లేదు" అని కృష్ణునితో అర్జునుడు అన్నాడు. "మరణించవలసి వస్తే అందరం కూడా యుద్ధంలోనే మరణిస్తాం" అని మరల పాండవులు నిశ్చయించుకున్నారు.

కృష్ణుడు ద్రౌపది శిబిరంలోనికి వెళ్ళి, ఆమెతో, "నేను ఈ రాత్రి 3 గంటలకు ఇక్కడికి వస్తాను. అప్పుడు ఇక్కడ పాండవులుకాని, ఎవరుకాని ఉండటానికి వీలులేదు. నీవు నీ పెండ్లినాటి దుస్తులను, ఆభరణాలను ధరించి తయారుగా ఉండు. ఎందుకంటే, రేపు యుద్ధంలో పాండవులు మరణిస్తారు. అప్పుడు నీవు ఈ పెండ్లి దుస్తులను, ఆభరణాలను ధరించే అవకాశం ఉండదు. పెండ్లినాటి దుస్తులు, నగలు ధరించి సిద్ధంగా ఉండు" అని అన్నాడు. ద్రౌపది శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా వేకువజామున 3 గంటలకే పెండ్లినాటి

దుస్తులను, నగలను అలంకరించుకొని తయారుగా ఉన్నది. 4 గంటలకు శ్రీకృష్ణుడు వచ్చి, "నాతో పాటుగా పద" అని ఆమెను కౌరవుల శిబిరంవైపుకు తీసుకొని వెళ్ళుతున్నాడు. "హే కృష్ణా! మీరు నన్ను ఎక్కడికి తీసుకొని వెళ్ళుతున్నారు?" అని ద్రౌపది అడగ్గానే, "నీవు మారు మాట్లాడకుండా నాతో పాటుగా పద" అని శ్రీకృష్ణుడు అన్నాడు. శ్రీకృష్ణుడు సరిగ్గా భీష్మ పితామహుని శిబిరం ముందు వెళ్ళి నిల్చున్నాడు. "ద్రౌపదీ! నేను ఇక్కడ ద్వారంవద్ద నిలబడి ఉంటాను. నీవు నీ మేలిముసుగును పెద్దదిగా చేసుకొని, శిరస్సు నిండా కప్పుకొని, మీ ముఖాన్ని కనిపించకుండా దాచుకో! ఈ సమయంలో భీష్ముడు ధ్యానంలో లీనమై ఉంటాడు. లోపలికి వెళ్ళి అతని ఎదుట నిలబడు. సరిగ్గా అతడు నెమ్మదిగా కళ్ళు తెరచే సమయానికి వెంటనే నీవు భీష్ముని పాదాలపై నీ శిరస్సును ఆనించు" అని చెప్పాడు. శ్రీకృష్ణుడు చెప్పినట్లుగానే ద్రౌపది చేసింది. తన ఎదుట ఎవరో సౌభాగ్యవతి నిలబడి ఉన్నదని భీష్ముడు, ఆమెను "సదా సౌభాగ్యవతీ భవ!" అని దీవించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు చెప్పిన విధంగానే, ద్రౌపది తన మేలిముసుగును పూర్తిగా తీసివేసింది. భీష్ముడు ద్రౌపదిని చూడగానే, "ఇది కృష్ణుని పనే అయి ఉంటుంది. అతడు ఇక్కడే ఎక్కడో వెనకనే ఉండి ఉంటాడు, ఇటువంటి పథకం నీవు చేయలేవు" అని అంటూ, భీష్ముడు బయటకు వచ్చాడు. అతనికి ద్వారం వెలుపల కృష్ణుడు కనిపించాడు. "కృష్ణా! నాకు తెలుసు. నీకు నా మీద తక్కువ ప్రేమ ఉందని, పాండవుల మీద ఎక్కువ ప్రేమ ఉందని. అందువల్లనే నీవు వాళ్ళను కాపాడటానికి వ్యూహంపన్ని, నా ద్వారం వద్దకు వచ్చావు. కాని లోపలికి మాత్రం రాలేదు. కాని నేను ఒక ప్రతిజ్ఞ మాత్రం చేస్తున్నాను. అది ఏమిటంటే, ఈ రోజు యుద్ధంలో నిన్ను నా వద్దకు పిలిపించుకునే అస్త్రం నావద్ద ఉంది. యుద్ధ భూమిలో నీవు నా వద్దకు తప్పకుండా రావలసిందే!" అని భీష్ముడు అన్నాడు. ఆ రోజున భీష్ముడు ఎంత భీకరంగా యుద్ధం చేసాడంటే, అతడు వేసే బాణాలు అర్జునికి కనిపించలేదు, కృష్ణునికి కూడా కనిపించటం లేదు. పాండవ సైనికులు అందరు మరణిస్తున్నారు. అప్పుడు కృష్ణునికి కోపం వచ్చి, రథం నుండి దిగి, సుదర్శన చక్రాన్ని ధరించి భీష్మునివైపు పరుగెత్తాడు. నిజానికి యుద్ధంలో ఎటువంటి ఆయుధాన్ని కూడా ముట్టుకోనని శ్రీకృష్ణుడు ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు. కాని ఎప్పుడైతే శ్రీకృష్ణుడు సుదర్శన చక్రం ధరించాడో అప్పుడు వెంటనే భీష్ముడు తన విల్లు, బాణాలను విడిచిపెట్టి "ఈ రోజున నేను కృష్ణుని ప్రతిజ్ఞను భంగం చేసాను. నా కొరకు అతడు తన ప్రతిజ్ఞను కూడా విడిచిపెట్టవలసి వచ్చింది. విజయం నాదే!" అని అన్నాడు.

ఎప్పుడైతే శ్రీకృష్ణుడు తన సుదర్శన చక్రాన్ని భీష్ముని మీదకు వదిలాడో, అప్పుడు భీష్ముని బ్రహ్మచర్యం యొక్క తేజస్సును చూసి, సుదర్శన చక్రం అతనిని చంపకుండానే, వెనుకకు తిరిగి వచ్చింది. దీనిని గురించి బాబాజీ –శ్రీకృష్ణుడు సుదర్శన చక్రాన్ని వదులుతూనే ఆ చక్రం భీష్ముడిని ప్రస్తుతం అతడు ఉన్న స్థితి నుండి ఈశ్వర సాక్షాత్కార స్థితి వరకు తీసుకొని వెళ్ళాలి అనే సంకల్పంతో ప్రయోగించాడు. ఆ సుదర్శన చక్రం భీష్ముని ఆ స్థితి వరకు తీసుకొని వెళ్ళి, మరల అది వెనకకు తిరిగి యథాస్థితికి వచ్చింది" అని అన్నారు.

బాబాజీ మనకు ఏ స్థితిని ప్రసాదించినా ఎప్పుడు కూడా మరల దానిని వెనుకకు తీసుకోరు. శ్రీకృష్ణుడు మాత్రం స్వయంగా అటువంటి సన్నివేశాలను, పరిస్థితులను సృష్టించి, ఆయా స్థితులను ప్రసాదించవలసి వచ్చింది. కాని **మనం గృహస్థులమై ఉండి, అత్యంత కఠినమైన ఈ కలియుగంలో**

**ఉంటున్నప్పటికీ, బాబూజీ మహరాజ్ మనకోసం బాహ్యపరిస్థితులను మార్చకుండా, మనల్ని ఆ పరిస్థితులకు అనుగుణంగానే ఉంచుతూ, స్థితులను ప్రసాదిస్తూ ఆ అంతిమానికి తీసుకువెళ్ళటానికి తయారుచేస్తారు.**

ధ్యానం యొక్క ప్రభావం ఎలా ఉంటుందంటే, అది అభ్యాసీ యొక్క నడవడికను, ప్రవర్తనను మారుస్తుంది. అభ్యాసీకి పూర్వం చాలా కోపం అనేది ఉంటే, అది క్రమక్రమంగా తగ్గిపోతుంది. రోజురోజుకు ప్రవర్తనలో మార్పును తీసుకొని వస్తుంది. కాని మనం కూడా మన ప్రవర్తనలో మార్పు రాడటానికి కృషి చేయాలి, మాట్లాడే విధానంలో మార్పు కొరకు తప్పనిసరిగా ప్రయత్నించాలి.

"శ్రీ బాబూజీ మహరాజ్ నా ఎదుటనే కూర్చొని ఉన్నారు. 'వారు' నా హృదయంలోనే ఉన్నారు. వారి హృదయం నుండి పవిత్రమైన ఈశ్వరీయ ధార నాలోనికి ప్రవహిస్తూ ఉన్నది. అది నా హృదయాన్ని చాలా శాంతంగాను, పవిత్రంగాను చేస్తూయున్నది" అని ఈ విధంగా మీరు ధ్యానంలో ఆ పవిత్రతను అనుభూతి చెందటానికి ప్రయత్నించండి.

**అభ్యాసీ: ధ్యానం చేస్తున్నప్పుడు కొన్నిసార్లు బాబూజీ నా ప్రక్కనే కూర్చొని ఉన్నట్లుగా, నా భుజం మీద చేయి వేసినట్లుగా అనిపిస్తుంది. ఇప్పుడు సత్సంగ్‌లో కూడా ఇదే విధంగా అనిపించినది.**

**సోదరి:** అది నిజమే. కొంతమంది అభ్యాసులు ఇలా అనుభూతి చెందుతారు. కొంతమంది అభ్యాసులు ధ్యానంలో అస్సలు ఏమీ ఫీల్‌కారు, అనుభూతి చెందరు. మీ దృష్టి 'వారి' మీదనే ఉన్నట్లయితే మీరు 'వారి' ప్రజెన్స్‌ను అనుభూతి చెందుతారు. మీ దృష్టి 'వారి' మీద ఉన్నప్పుడే మీకు ఆ ఆనందం లభిస్తుంది. మీ దృష్టి 'వారి' మీద లేకపోతే మీరు ఆ అనుభూతి, ఆనందం నుండి దూరమవుతారు. కాని మీరు 'వారి' కృప నుండి మాత్రం ఎప్పుడు కూడా దూరం కాలేరు. మీ దృష్టి 'వారి' మీద లేకపోయినా, 'వారి' దృష్టి మాత్రం బిడ్డలమైన మన మీద ఎల్లప్పుడు ఉంటుంది. 'వారి' కృప ఎల్లప్పుడు మన మీదనే ఉంటుంది. బాబూజీ మహరాజ్ సమస్త మానవాళి కొరకు అవతరించారని చెప్పటానికి ఇది ఒక గొప్ప ఋజువు.

**అభ్యాసీ: ధ్యానంలో ఒకసారి బాబూజీ కనపడి –నేను నా పనిలో చాలా బిజీగా ఉన్నాను. నీవు ఎందుకు నా ఆత్మను మరలా మరలా పిలుస్తున్నావు– అని నాతో అన్నారు.**

**సోదరి:** ధ్యానం అంటే ఆత్మను పిలవటం కాదు. ధ్యానం అంటే బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు అని భావించి, 'వారి' మీదనే అటెన్షన్ (దృష్టి)ని పెట్టడం వలన 'వారి' సామీప్యతను పొందుతారు. "బాబూజీ నావారు, నా ఎదుటనే ఉన్నారు" అని మీకు మొదట అనిపిస్తుంది. ఆ తర్వాత స్థితి ఏమిటంటే, మీరు 'వారి' లోపలనే ఉన్నట్లుగా అనిపిస్తుంది. బాబూజీ మీ హృదయంలోనే ఉన్నారు. వారు విశ్వం అంతటా వ్యాపించి ఉన్నారు. అందువలన 'వారు' –నా ఆత్మను మరల మరల పిలుస్తున్నావు– అనే ప్రశ్నేలేదు.

ఒకసారి బాబూజీ అనారోగ్యంతో ఉన్నప్పుడు, కొంతమంది అభ్యాసులు వారి ఇంటిలో వరండాలో కూర్చొని ధ్యానం చేసుకుంటున్నారు. అప్పుడు బాబూజీకి సేవలు చేస్తున్న ఇద్దరు అభ్యాసీలు వాళ్ళవద్దకు వచ్చి, బాబూజీ అనారోగ్యంతో ఉన్నారు. మీరు బాబూజీ నుండి ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి)ని లాక్కొంటున్నారు. వారికి బాధ కలుగుతుంది –అని అన్నారు. ఆ తర్వాత నేను "బాబూజీ! ట్రాన్స్‌మిషన్ ఏమైనా లాక్కుంటే వచ్చే వస్తువా? మేము మీ సన్నిధిలో కూర్చొన్నాము. ఆ దివ్య ప్రవాహం దానంతట అదే మాలోకి ప్రవహిస్తున్నది" అని వారితో అన్నాను. అప్పుడు వారు "బిటియా! వీళ్ళు ఎప్పుడూ కూడా స్వయంగా తామంతట తాముగా

ధ్యానం చేయరు. వీళ్ళకు ఎవరో ఒకరు సిట్టింగ్ ఇస్తేనే ధ్యానంలో కూర్చుంటారు. అందువల్లనే ఆ విధంగా అన్నారు. ట్రాన్స్‌మిషన్ అనేది ఆ విధంగా లాక్కుంటే వచ్చేది కాదు. ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి శక్తి) అనేది ఆటోమాటిక్‌గా (అప్రయత్నంగా), దానంతట అదే నా నుండి ప్రవహిస్తుంది" అని అన్నారు.

**అభ్యాసీ: "బాబూజీ! మా ఊరు చాలా దూరంలో ఉంది. మేము మరల మరల ఇక్కడకు, షాజహాన్‌పూర్ రాలేము. మరి మేము మిమ్మల్ని ఏ విధంగా కలుసుకోగలం? మాపై కృప చూపండి."**

**బాబూజీ:** "భాయీ! నీవు ఎప్పుడు తలుచుకుంటే అప్పుడు నేను నీ దగ్గరకు వస్తాను" అని అన్నారు.

దీని అర్థం ఏమిటంటే, 'వారు' సర్వవ్యాపి, అంతటా వ్యాపించి ఉన్నారు. కనుక ఎప్పుడైతే మన దృష్టి వారివైపు మరలుతుందో, అప్పుడు 'వారు' మనలను చూస్తారు.

మీకు ఏమైనా సమస్యలు, కష్టాలు ఉన్నట్లయితే, వాటిని బాబూజీ ముందుపెట్టి, 'వారి'ని ఇలా ప్రార్థించాలి –"బాబూజీ! మీరే అన్నీ చేయగలరు, మీ ఇష్టం. నాకు సహాయం చేయండి" అని వారిని ప్రార్థించి, ఫలితం కొరకు ఎదురు చూడకూడదు. అంతేకాని ప్రార్థన చేసి నాలుగు రోజులైంది, ఇంకా ఏమి కాలేదు, అని మాత్రం అనుకోకూడదు. ఫలితం ఎన్నిరోజులు పడుతుంది అనేది బాబూజీ ఇష్టం.

ఒకసారి ఒక అభ్యాసీ, బాబూజీకి, తన కష్టాలను, బాధలను తెలుపుతూ రెండు పేజీల ఉత్తరాన్ని వ్రాశాడు. బాబూజీ పర్సనల్ సెక్రటరీ అయిన రాయిజాదాగారు ఆ ఉత్తరం పూర్తిగా బాబూజీకి చదివి వినిపించాడు. "బాబూజీ! ఈ అభ్యాసీ ఉత్తరం నిండా తన కష్టాలను గురించే వ్రాశాడు" అని రాయిజాదాగారు అనగానే, వారు, "భాయీ! నీవు ఎప్పుడూ కూడా ఆ విధంగా అనవద్దు. పిల్లవాడికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు, దాన్ని గురించి తన తల్లికి చెప్పుకోకుండా మరి ఎవరికి చెప్పుతాడు. అలా తన తల్లికి చెప్పుకోగానే, అతనికి వెంటనే రిలీఫ్ (ఉపశమనం) కలుగుతుంది. ఈ విషయం నీకు తెలుసు కదా! అదే విధంగా అభ్యాసీ తన తల్లియైన నాకు, తమ సమస్యలను గురించి వ్రాయటం వలన, అతనికి ఉపశమనం కలుగుతుంది. నేను వాటిని తీరుస్తాను. సమస్యల నుండి అతడ్ని విముక్తి చేస్తాను" అని అన్నారు బాబూజీ.

చిన్న పిల్లవానికి ఏదైనా దెబ్బ తగిలినప్పుడు తల్లి దగ్గరకు వచ్చి చెప్పగానే, ఆమె ఏ మందు రాయకుండా ఊరకనే చేతులతో నిమిరి, తగ్గిపోయింది –అనగానే, పిల్లవాడు ఒక్కసారిగా సంతోషంగా ఆడుకోవటానికి బయటికి పరుగెత్తుతాడు. అదే విధంగా మన సమస్యలను మన తల్లి అయిన బాబూజీకి చెప్పుకుంటే, మనకు వాటి గురించి రిలీఫ్ (ఉపశమనం) తప్పకుండా దొరుకుతుంది. బాబూజీ వాటిని దూరం చేస్తారు. కాని బాబూజీ చెప్పిన ఒక వాక్యాన్ని మీరు గుర్తుపెట్టుకోవాలి. "అభ్యాసీలు ఎప్పుడూ చిన్న పిల్లల్లాగానే ఉండాలి. మేము పెద్దవాళ్ళం అనే భావన వచ్చినట్లయితే, వాళ్ళు తమ సమస్యల గురించి తల్లితో చెప్పుకోలేరు" అని బాబూజీ చెప్పారు. మేము ఎప్పుడూ కూడా బాబూజీ ఎదుట చిన్న పిల్లల్లాగానే ఉండేవాళ్ళం. బాబూజీ మనస్సులో ఎప్పుడు కూడా తాను గొప్పవారు అనే భావన వారికి ఉండదు. 'వారు' అందరికొరకు అవతరించారు కనుక వారిలో ఎప్పుడూ కూడా –నేను పెద్దవానిని అనే భావన కలగలేదు. బాబూజీ అంటే అందరికి ప్రేమ ఉండేది. ఎవరికి కూడా భయం అనేది ఉండేది కాదు. సహజమార్గ సాధన

యొక్క రమణీయత ఏమిటంటే, అది మనలోని ఇగో (అహం)ను తగ్గించి వేస్తుంది. అహంను కరిగింపజేస్తుంది. అందువలన గొప్పవాడిని, పెద్దవాడిని అనే ఫీలింగ్ (భావన) మనలో రాదు. సోదరభావం అనేది వస్తుంది.

**ప్రశ్న: బెహెన్‌జీ! మా కోడలును, కూతురును మిషన్‌లో చేరమని ఎంత చెప్పినా వాళ్ళు వినటం లేదు. వాళ్ళు అభ్యాసీలు కావాలంటే ఎలా?**

**జవాబు:** ఎవరిలోనైతే పూజ చేయాలి, అనే సంస్కారం ఉంటుందో, వాళ్ళకు మీరు ధ్యానం గురించి చెప్పగానే విని, గ్రహించి, వెంటనే సాధన ప్రారంభిస్తారు. కాని ఎవరిలోనైతే పూజ చేయాలి, అనే సంస్కారం ఉండదో వాళ్ళకు మీరు ఎంత చెప్పినా వినరు. కాని మీ యొక్క కోరిక వలన, మీకు వాళ్ళతో ఉన్న ఎటాచ్‌మెంట్ (అనుబంధం) వలన వాళ్ళలో పూజచేయాలి, అనే సంస్కారం ఏర్పడుతుంది. అప్పుడు వాళు ్ళ, మీరు చెప్పింది అర్థం చేసుకొని మీతో సహకరిస్తారు. దీనికి సమయం పడుతుంది. ఇప్పుడు కాకపోయినా, రేపైనా తప్పకుండా వాళ్ళు అభ్యాసీలుగా చేరతారు.

కొంతమందికి భగవద్గీత చదువుకోవటం అంటే ఇష్టం. కొంతమందికి గుడికి వెళ్ళటం ఇష్టం. వాళ్ళను మీరు మాటి మాటికి మిషన్‌లో చేరమని ఒత్తిడి చేయవద్దు. అలాచేస్తే, ఎప్పుడో ఒకసారి వాళ్ళు మీకు వ్యతిరేకంగా అయ్యే అవకాశం ఉంటుంది. ఈ ధ్యానం చాలా మంచిది అని వాళ్ళకు ప్రేమతో చెప్పండి. కాని వాళ్ళను మిషన్‌లో చేరమని ఒత్తిడి మాత్రం చేయకూడదు. నాకు తెలిసిన ఒక అభ్యాసీ ఉంది. ఆమెకు 70 సం॥లు. ఆమె తన కూతురు, కోడలు, మనవళ్ళందరిని కూడా మిషన్‌లో చేరమని ఎంతగానో చెప్పింది. వాళ్ళందరు కూడా అభ్యాసీలుగా కావాలనే కోరిక ఆమెలో తీవ్రంగా ఉండేది. కాని ఆమె జీవించి ఉన్నప్పుడు ఎవ్వరూ కూడా ఆమె మాటలు వినలేదు. ఆమె మరణించిన తర్వాత ఇప్పుడు వాళ్ళందరు కూడా అభ్యాసీలయ్యారు. అయ్యో! ఎంత సమయం వృథా చేసాము. మా అమ్మమ్మగారు చెప్పినప్పుడే ధ్యానంలో చేరితే ఎంత బాగుండేది అని ఇప్పుడు అనుకుంటున్నారు. మరి వాళ్ళందరు మిషన్‌లో ఎలా చేరారు? వాళ్ళ అమ్మమ్మకు ఉన్న తీవ్రమైన కోరిక వలన, ఆమెకు వాళ్ళందరితో ఉన్న అనుబంధం వలన వాళ్ళు ఇప్పుడు అభ్యాసీలుగా అయ్యారు.

"బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అని గుర్తు పెట్టుకొని మీరు ధ్యానం చేస్తారు. "బాబూజీ నాలోనే ఉన్నారు" అనే దానిని మీ మనస్సు మాత్రమే అంగీకరించినది. కాని మీకు ఇంకా ఆ ఫీలింగ్, అనుభూతి కలగలేదు. ఎప్పుడైతే బాబూజీ మీలోనే ఉన్నట్లుగా, మీకు ఫీలింగ్ (అనుభూతి) కలుగుతుందో అప్పుడే మీరు అభ్యాసీగా అయినట్లు. "బాబూజీ నా హృదయంలో ఉన్నారా, లేరా" అనే సందేహం అప్పుడప్పుడు మీకు వస్తుంది. ఎప్పుడైతే –"అవును, బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అనే ఫీలింగ్ (అనుభూతి) మీలో కలుగుతుందో అప్పుడు మీరు, వాస్తవానికి, సహజమార్గ్ సాధన ప్రారంభించినట్లు అవుతుంది.

**ప్రశ్న: బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు అని మేము దృఢ విశ్వాసంతో ఎప్పుడు చెప్పగలం?**

**జవాబు:** నీవు బాబూజీ పేరును స్మరించగానే 'వారు' ఇక్కడే నీ ఎదుటనే ఉన్నట్లుగా అనిపిస్తుంది. నీవు ఎప్పుడైనా బాబూజీ గురించి విన్నప్పుడు కూడా 'వారు' నీ ఎదుటనే ఉన్నట్లుగా అనుభూతి చెందుతావు. అప్పుడు బాబూజీ మీ హృదయంలోనే ఉన్నారని మీరు దృఢ విశ్వాసంతో చెప్పగలరు. సహజమార్గ్ సాధన

అనేది చాలా అనుభవపూర్వకమైనది. బాబూజీ యొక్క ప్రతి వాక్యం, ప్రతి మాటకు కూడా ప్రాక్టికల్‌గా ఎంతో అర్థం ఉంది.

బ్యాలెన్స్‌డ్ స్టేట్ (Balanced State), బ్యాలెన్స్‌డ్ కండిషన్ (Balanced Conditon) –ఈ రెండింటిని కూడా 'సామ్యావస్థ' అని ప్రజలు ఒక్కటేగానే భావిస్తారు. కాని ఈ రెండింటికి చాలా తేడా ఉంది. బ్యాలెన్స్‌డ్ కండిషన్ అనేది వస్తుంది. దానిని మనం అనుభూతి చెందుతాము. మరల దానిని మరచిపోతాము. కాని ఎప్పుడైతే బ్యాలెన్స్‌డ్ స్టేట్ అనేది మనలో ఏర్పడుతుందో, అప్పుడు మనం ఆ స్థితిలోనే జీవిస్తూ ఉంటాము. ఆ స్థితియే మన ఇల్లుగా అవుతుంది. మనం ఎప్పుడూ కూడా ఆ స్థితిలోనే ఉంటాము.

ప్రిసెప్టర్ పని చేయటానికి, అతనికి ఒక చిన్న శక్తి కేంద్రంతో కనెక్షన్ ఇస్తారు. అందువలన ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇచ్చినప్పుడు ఆ చిన్న శక్తి కేంద్రం నుండే ప్రాణాహుతి ప్రవహిస్తుంది. కాని ఎప్పుడైతే ప్రిసెప్టర్ బాబూజీలో మునిగిపోయి, బాబూజీ నుండే ప్రాణాహుతి అందరి హృదయాల్లోకి ప్రవహిస్తున్నది –అని ఒక సంకల్పం ఏర్పరచినప్పుడు, ఆ చిన్న శక్తి కేంద్రం నుండి కాకుండా దాని కంటే కూడా ఉన్నతమైన శక్తి కేంద్రం నుండి ప్రాణాహుతి ప్రవహిస్తుంది. ప్రిసెప్టర్ బాబూజీలో లయావస్థను పొంది, వారిలోనే మునిగిపోయి సిట్టింగ్ ఇచ్చినప్పుడు, బాబూజీ ఏ మూల కేంద్రంలోనైతే కనెక్షన్ కలిగి ఉన్నారో, అక్కడి నుండే ప్రాణాహుతి ప్రవాహం అభ్యాసులకు లభిస్తుంది. అందువలన ప్రిసెప్టర్ ఎప్పుడూ కూడా దివ్య శక్తి యొక్క మూలం (సోర్స్)తోనే కనెక్షన్ కలిగి ఉండాలి. బాబూజీయే ఆ సోర్స్ (మూలం). ప్రిసెప్టర్ బాబూజీలోనే మునిగిపోయి సిట్టింగ్ ఇవ్వడం వలన, అతడు అభ్యాసీలకు ఎంతో గొప్ప సేవ చేయగలడు.

అర్జునుడు యుద్ధం చేసేప్పుడు, ఏ శక్తితో అయితే బాణం ఛార్జ్ చేయబడి ఉన్నదో, ఆ శక్తిని జ్ఞాపకం చేసుకొని, ఆ శక్తి యొక్క ధ్యానంలో లీనమై ఆ బాణాన్ని వదిలేవాడు. అందువలన అది పూర్తి ఫలితాన్ని ఇచ్చేది.

నేను ఒకసారి బాబూజీ మహరాజ్‌ను ఇలా అడిగాను: "బాబూజీ! ఈ మధ్యన ఎప్పుడైనా క్లీనింగ్ చేసుకోవాలి, ప్రార్థన చేయాలి అనే విషయం గుర్తుకు రాగానే, వెంటనే నా ఆధ్యాత్మిక స్థితి డిస్టర్బ్ అయినట్లుగా (కలత చెందినట్లుగా) ఉంటుంది. కేవలం ఈ ధ్యానం ఒక్కటే, ఈ విధంగా నిరంతరం ఆ ధ్యానంలోనే మునిగి ఉంటే చాలా బాగుంటుంది. క్లీనింగ్, ప్రార్థన చెయ్యాలని మీరు చెప్పారు కనుక, ధ్యానంలో మునిగిపోయిన మనస్సును మరల బయటకు తీసి, క్లీనింగ్‌లో కూర్చోవడం వలన నా స్థితి డిస్టర్బ్ (కలత చెందినట్లుగా) అవుతోంది" అని. అప్పుడు బాబూజీ "బిటియా! క్లీనింగ్, ప్రార్థన అనేవి ఏ శక్తితో అయితే ఛార్జ్ చేయబడినవో, ఆ శక్తి ఇప్పుడు నీలో లయమైనది. కనుక ఇప్పుడు నీకు క్లీనింగ్, ప్రార్థన యొక్క అవసరం ఏ మాత్రం లేదు. వాటిని విడిచిపెట్టు" అని అన్నారు.

మన సహజమార్గ సిస్టమ్‌లో ధ్యానం, క్లీనింగ్, ప్రార్థన, దశ నియమాలు, ప్రతిదీ కూడా దివ్యశక్తితో ఛార్జ్ చేయబడ్డాయి. ఈ విధంగా ఛార్జ్ చేయబడిన ఈ శక్తి, అభ్యాసీకి ఎంతో విలువైనది. ప్రార్థనను ఆ ధ్యాసలో, ఆ వినమ్రతా స్థితిలో (ప్రార్థనా భావంలో) ఉండి ప్రార్థన చేయాలని బాబూజీ అనేవారు. ఆ విధంగా చేయడం వలన ప్రార్థనలో 'ఛార్జ్ చేయబడిన శక్తి' మీలో లయం కావటం మొదలవుతుంది. అందువల్లనే 'వారు' ఆ మూడ్ అనగా ఆ ధ్యాస గురించి ఎక్కువగా నొక్కి చెప్పారు.

క్లీనింగ్ సమయంలో అభ్యాసీలు ఎక్కువగా స్థూలత్వం, అంధకారం మొదలైనవి పొగరూపంలో వెళ్ళిపోతున్నాయని వాటి మీదనే దృష్టి ఎక్కువగా ఉంచుతారు. అలా కాకుండా –బాబూజీ మహరాజ్ నా ఎదుటనే కూర్చొని ఉన్నారు. 'వారి' దివ్యశక్తి నాలోనికి ప్రవహిస్తూన్నది. 'వారి'ని పొందటానికి ప్రతిబంధకాలుగా ఉన్న అనవసరమైన వాటినన్నింటినీ 'వారి' దివ్యశక్తితో బయటకు విసిరివేస్తూన్నది –అని క్లీనింగ్ చేసుకోవాలి. 15,20 నిమిషాలు క్లీనింగ్ అయిన తర్వాత, ఇప్పుడు –అనవసరమైన విషయాలన్నీ నాలో నుండి వెళ్ళిపోయాయి, నేను స్వచ్ఛంగా, పవిత్రంగా అయ్యాను. నాలోని అణువణువు 'వారి' దివ్యకృపతో నిండిపోయింది. ఇప్పుడు 'బాబూజీ' నాలో ప్రకాశిస్తున్నారు –అని అనుకోవాలి.

మన దశ నియమాలలోని రెండవ నియమం ఏమిటంటే, "ధ్యానాన్ని (పూజను) ప్రార్థనతోనే ప్రారంభించాలి" –నేను ఎంతమంది అయితే అభ్యాసీలను గమనించానో, వాళ్ళందరు కూడా, ఉదయం– "ఓ మాస్టర్! నీవే మావన జీవితానికి యథార్థ లక్ష్యం" –అని ప్రార్థన చదివిన తరువాతనే ధ్యానం ప్రారంభిస్తారు. కాని నిజానికి బాబూజీ, మిషన్ ప్రార్థనను రాత్రి పడుకునే ముందు చేయాలి–అని పుస్తకాలలో వ్రాశారు. ఉదయం ధ్యానం చేయటానికి ముందు చేసే ప్రార్థనకు మరియు రాత్రి పడుకునేముందు చేసే ప్రార్థనకు తేడా ఏమిటి? ఉదయం ధ్యానం చేయటానికి ముందు, "బాబూజీ మహరాజ్! మీరు ఏ మెడిటేషన్ (ధ్యానం)ను అయితే మాకు ఇచ్చారో, దీనిలో మేము సఫలం అయ్యేట్లుగా, విజయాన్ని సాధించేట్లుగా చేయండి. మాలో ప్రేమ, భక్తి ఎంతగా అభివృద్ధి కావాలంటే, మేము ఎల్లప్పుడు కూడా మీ చరణాల వద్దనే శరణాగతులమై ఉండి, మీలో సంపూర్ణ లయావస్థను పొందేవిధంగా చేయండి" –అని 'వారి'కి ప్రార్థన చేయాలి.

బాబూజీ చెప్పినట్లుగా మిషన్ ప్రార్థన (ఓ మాష్టర్! నీవే మానవ జీవితానికి యథార్థ లక్ష్యం) రాత్రి పడుకునేముందు చేయాలి. "బాబూజీ! మీరే మా లక్ష్యం; మీరే మా సర్వస్వం" అని ఈ మిషన్ ప్రార్థన మనకు గుర్తుచేస్తూ, మనలో వినమ్రతా భావాన్ని కలిగిస్తుంది. ఈ విధంగా మిషన్ ప్రార్థన చేయటంవలన, ఆ వినమ్రతా భావంలో మునిగిపోయి 'వారి' పావన చరణాలవద్దనే నిద్రిస్తాము. అనగా రాత్రి అంతా కూడా 'వారి'తోనే ఉంటాము. ఉదయం లేచిన తర్వాత, –మనం ఎవరికోసమైతే ధ్యానం చేస్తున్నామో, ఆ ధ్యానం పూర్తి అయి, మనం త్వరత్వరగా 'వారి'ని చేరుకోవాలని– ఉదయం ధ్యానానికి ముందు వారిని ప్రార్థిస్తాము. దీని తర్వాత బాబూజీ చెప్పినట్లుగా –"ఈశ్వరుడు నా హృదయంలోనే ఉన్నాడు"– అని ధ్యానంలో గుర్తు పెట్టుకోవటం వలన, మెడిటేషన్ (ధ్యానం) ఏ శక్తితో ఛార్జ్ చేయబడినదో ఆ శక్తి మీలో లయం కావటం ప్రారంభమవుతుంది. ధ్యానం అయిన తర్వాత రోజంతా కూడా అదే ధ్యానస్థితిలో మెడిటేషన్ మూడ్ అనగా ధ్యానం యొక్క ధ్యాసలోనే ఉండి అన్ని పనులు చేసుకోవాలి. మిషన్ ప్రార్థన (ఓ మాష్టర్! నీవు మానవ జీవితానికి యథార్థ లక్ష్యం) అనే ప్రార్థనను రాత్రి పడుకునేముందు మాత్రమే చేయాలి. ఈ మిషన్ ప్రార్థనను ఉదయం ధ్యానానికి ముందు చేయవలసిన అవసరం లేదు.

ఈ మిషన్ ప్రార్థన, క్లీనింగ్ అనేవి, ఇవన్నీ కూడా క్రొత్తగా సాధన ప్రారంభించిన వారికొరకు మాత్రమే. మీరు కొద్దిగా పురోగతి సాధించగానే, ఇవన్నీ కూడా మీకు అవసరంలేదు. క్లీనింగ్, మిషన్ ప్రార్థన, ఇవన్నీ కూడా కేవలం మీ దృష్టి (అటెన్షన్)ను లక్ష్యం (బాబూజీ)వైపు మరల్చటం కొరకు మాత్రమే. ఏ రోజునైతే మీ దృష్టి 'వారి' నుండి మరలదో, మీ దృష్టి నిరంతరం 'వారి' మీదనే ఉండే విధంగా ఎప్పుడైతే

మీకు 'వారి'తో కనెక్షన్ అనేది ఏర్పడుతుందో అప్పటి నుండి ఈ క్లీనింగ్, ప్రార్థన మొదలైనవి ఏవీకూడా మీరు చేయవలసిన అవసరంలేదు.

అభ్యాసీ యొక్క వినమ్రతా భావం మరియు బాబూజీ యొక్క సమర్పణ భావం అనేవి ఒక దానితో ఒకటి, 'వారి' కృపతో ముడిపడి ఉన్నాయి. "నేను సమస్త మావనాళికి సమర్పించబడి ఉన్నాను" –అని బాబూజీ అనేవారు. ఏ రోజునైతే మీరు వినమ్రతా భావంతో 'వారి' సామీప్యతను పొందుతారో, అప్పుడు సమస్త మానవాళిపట్ల వారికిగల సమర్పణ భావాన్ని మీరు స్పర్శించటంవలన, మీకు 'వారి' నుండి శక్తి లభిస్తుంది.

**ఉదయం చేసే ప్రార్థన:** ధ్యానం సఫలం కావాలని, ప్రేమ, భక్తి పెంపొందాలని లక్ష్యాన్ని పొందాలని 'వారి'ని ప్రార్థించి ధ్యానం చేయాలి.

ధ్యానంలో కలిగిన ఫీలింగ్ (అనుభూతి) లేదా ధ్యాన స్థితిని కాపాడుకుంటూ, నిరంతరం ధ్యానం యొక్క ధ్యాసలోనే ఉండి అన్ని పనులు చేసుకోవాలి.

**రాత్రి చేసే ప్రార్థన:** "ఓ మాస్టర్! నీవే మానవ జీవితానికి యధార్థ లక్ష్యం....." అనే మిషన్ ప్రార్థనను, వినమ్రతా భావంతో చేసి, దానిలోనే మునిగిపోయి, 'వారి' చరణాలవద్ద నిద్రపోవాలి.

**ప్రశ్న: బెహెన్‌జీ! మీరు ఇప్పుడు వివరించినట్లుగానే ఉదయం ప్రార్థన చేసి ధ్యానం చేస్తాం. కాని మరల ధ్యానం చేయాలని, ఎప్పుడైనా అనిపిస్తే, అప్పుడు కూడా ఈ ఉదయం ప్రార్థనను మరల చేయాలా?**

**జవాబు:** బాబూజీ ధ్యానం చేయమని అనలేదు. "ఈశ్వరుడు నా హృదయంలోనే ఉన్నాడు. నేను 'వారి' వాడిని" –అనే దాన్ని నిరంతరం గుర్తుపెట్టుకోమన్నారు.

మీరు అన్నం వండుతున్నారు. అది ఉడకడానికి ఇంకా 5 నిమిషాల సమయం ఉంది. అప్పుడు మీరు అక్కడే నిలబడి– "బాబూజీ మహరాజ్ నా ఎదురుగా కూర్చొని ఉన్నారు. 'వారి' నుండి ఈశ్వరీయ ధార యొక్క పావన ప్రవాహం నాలోనికి ప్రవహిస్తూన్నది" –అని అనుకోండి. ప్రతిక్షణం కూడా 'వారి'దే సమయం, స్థలం. ప్రతీది కూడా 'వారి'దే.

చాలామంది అభ్యాసులు, ధ్యానం మొదలుపెట్టి అయిపోయేంతవరకు, ఆ 30, 40 నిమిషాలూ మరల మరల మిషన్ ప్రార్థనను చేస్తూనే ఉంటారు. మాకు పూజలో మనస్సు లీనం కావటం లేదు కనుక, ప్రార్థనను చేస్తున్నాం అని వాళ్ళు అంటారు. అది తప్పు. మీ దృష్టి (అటెన్షన్) 'వారి' మీద ఉండటం అనేది ముఖ్యమైన విషయం. మీ అటెన్షన్ (దృష్టి) అనేది 'వారి'తో కనెక్ట్ కావాలి. "క్లీనింగ్, మిషన్ ప్రార్థన అన్నీ కూడా మీ దృష్టిని ధ్యానంలో నిమగ్నం చేయటానికి సహాయపడతాయి" అని బాబూజీ చెప్పేవారు.

ఇప్పటికీ అభ్యాసీలు సాధనలో ఏదో ఒక తప్పు చేస్తుంటారు. ఏ విధంగానంటే, సాయంత్రం 6 లేదా 7 గంటలు కాగానే క్లీనింగ్ సమయం అయింది, క్లీనింగ్ చేసుకోవాలి అని –'వారి' స్మరణలో మీరు పూర్తిగా లీనమై ఉన్నప్పటికీ మీ దృష్టి సంపూర్ణంగా 'వారి' మీదనే ఉన్నప్పటికీ –ఆ స్థితిని ప్రక్కకు నెట్టి క్లీనింగ్‌లో కూర్చుంటారు –క్లీనింగ్ చేసుకోవాలి కదా, అని. మీకు ఉన్నటువంటి ఆ కండిషన్‌ను, మీరే చెడగొట్టుకోవటం (డిస్టర్బ్ చేసుకోవటం) వలన ఆ ఆనందానుభూతి అనేది మీకు లభించదు.

చాలామంది అభ్యాసీలు, ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇవ్వటం మొదలుపెట్టగానే, మాకు క్లీనింగ్ జరుగుతుంది అని భావిస్తారు. సిట్టింగ్ అయిపోయిన తర్వాత, మీరు ఇక్కడ క్లీన్ చేసారు, ఈ ప్రదేశంలో క్లీన్ చేసారు అని చెప్తుతారు. క్లీనింగ్ ఎక్కడ చేయటం, ఎలా చేయాలి అనేది ప్రిసెప్టర్‌కు సంబంధించిన పని. అది అభ్యాసులకు సంబంధించినది కాదు. అందుకే బాబూజీ –"ఈ సహజమార్గ్ పద్ధతి అనేది పూర్తిగా సహజమైనది" అని అనేవారు. ఉదాహరణకు క్లీనింగ్ లేదా ప్రేయర్ (మిషన్ ప్రార్థన) ఏవైతే శక్తితో ఛార్జ్ చేయబడినవో, ఆ చార్జింగ్ (అనగా శక్తి) మీకు ఎప్పుడైతే లభిస్తుందో, అప్పుడు మీకు క్లీనింగ్ లేదా మిషన్ ప్రార్థన చేయవలసిన అవసరం అనిపించదు. దీని అర్థం ఏమిటంటే, ఏ కారణం వలన అయితే అవి చేయాలని మీకు నిర్దేశించబడినవో, ఇప్పుడు వాటి ఫలితం మీలో ప్రవేశించినది కనుక, మీకు దానితో కనెక్షన్ అనేది ఏర్పడినది. ఆ కనెక్షన్ ద్వారా ఇప్పుడు ఆ ఆనందాన్ని పొందటం మాత్రమే మీరు చేయవలసిన పని.

ఒకరోజు సాయంత్రం 5 గంటలకు షాజహాన్‌పూర్‌లో 'వారి' ఇంటిలోని వరండాలో మేమందం బాబూజీ ఎదుట కూర్చొని, 'వారు' చెప్పే మాటలను వింటున్నాము. ఇంతలో సమయం 6 గంటలు కాగానే దక్షిణ భారతదేశం నుండి వచ్చిన నలుగురైదుగురు అభ్యాసీలు అక్కడి నుండి లేచి క్లీనింగ్ చేసుకోవాలని వెళ్ళిపోయారు. అప్పుడు బాబూజీ "బిటియా! ఇంతకుపూర్వం వీళ్ళు విగ్రహారాధన బాగా చేసేవారు. ఆ అలవాటు ప్రకారం, సరిగ్గా 6 గంటలు కాగానే క్లీనింగ్ చేసుకోవాలనే రిజిడిటి (మూర్ఖభావన) వీళ్ళలో ఏర్పడింది" అని అన్నారు.

అదే విధంగా రాత్రి 10 గంటలు కాగానే, రాత్రి ప్రార్థన చేసుకోవాలని, బాబూజీ అక్కడే కూర్చొని ఉన్నప్పటికీ కొంతమంది అభ్యాసీలు లేచి వెళ్ళిపోయేవారు. మన మనస్సు ఒక మంచి ఉన్నతమైన స్థితిలో లీనమై ఉన్నప్పుడు, అది ఆ స్థితి నుండి తొలగిపోవటానికి ఇష్టపడదు. కనుక మీరు క్లీనింగ్ చేసుకోవాలి, ప్రార్థన చేసుకోవాలి అని దానిని డిస్టర్బ్ (చెడగొట్టే విధంగా) చేయకూడదు.

ఈ సహజమార్గ్‌లో ధ్యానం, క్లీనింగ్, ప్రార్థన మొదలైనవి ఇవ్వబడినవి. వీటన్నింటి బంధనాల నుండి కూడా స్వేచ్ఛను పొందాలి. ప్రార్థన సమయంలో, ఎందుకో ప్రార్థన చేయటానికి మనస్సుకు ఇష్టంగా లేదు. ధ్యానంలోనే మనస్సుకు ఆనందంగా ఉంది అని అనిపిస్తే, అప్పుడు మీరు ప్రార్థన చేయకండి. ప్రార్థన తప్పనిసరిగా చేయాలి కదా అని ఒక చండశాసనంలాగా, అదీ ఒక బంధనంలాగా చేయకూడదు. మీ మనస్సు బాబూజీలోనే మునిగిపోయి ఉన్నప్పుడు –సాయంత్రం క్లీనింగ్ సమయం అయ్యింది కదా అని మీరు బలవంతంగా క్లీనింగ్‌లో కూర్చోకూడదు. మీరు క్లీనింగ్ యొక్క శాసన బంధనాన్ని దాటి వెళ్ళండి. 'వారు' మన ఎదుటనే కూర్చొని ఉండగా మనం 'వారి' ఎదుటనే కూర్చొని ఉన్నాం. ఇంక ఏ క్లీనింగ్ అవసరం ఉంది!

బాబూజీని ఒక అభ్యాసీ అడిగాడు: "బాబూజీ మహరాజ్! నేను క్లీనింగ్‌లో కూర్చొన్నప్పుడు, ఆ సమయంలో నాకు చాలా రోతగా, చెడ్డగా అనిపిస్తుంది" అని. దానికి సమాధానంగా బాబూజీ, "భాయీ! నేను స్వీపర్స్‌ని (ఊడ్చేవారిని) తయారు చేయటం లేదు. అభ్యాసీలను తయారు చేస్తున్నాను. నీవు స్వీపర్‌గా కావాలని ఎందుకు అనుకుంటున్నావు?" అని అన్నారు.

బాబూజీ మనకు అన్ని విషయాల గురించి తెలిపారు. మనకు 'అంతిమ సాక్షాత్కారం' అనే లక్ష్యాన్ని ప్రసాదించిన 'వారి' మీదనే మనం దృష్టి అంతా కూడా పూర్తిగా కేంద్రీకృతమై ఉండాలి. మన దృష్టి ఎప్పుడూ వారినే అంటిపెట్టుకొని, 'వారి' నుండి విడిపోకుండా ఉండాలి.

అభ్యాసీకి ధ్యానం చేసుకోవటానికి రాత్రి, పగలు అనే సమయం యొక్క బంధనం లేదు. ప్రతి క్షణం అభ్యాసీదే. ప్రతి నిమిషమూ 'వారి' ధ్యానంలోనే ఉండాలి.

బాబూజీ పెద్ద కుమార్తె మాయా యొక్క వివాహం జరిగినప్పుడు, ఆ పెళ్ళి పనులతో బిజిగా ఉండటంవలన బాబూజీ 5 రోజులు నిద్రపోలేదు. ఆ సందర్భంలో ఈశ్వర్ సహాయ్‌జీ "బాబూజీ! ఇప్పుడు పెళ్ళివారికి వీడ్కోలు చెప్పటం అంతా అయిపోయింది కదా! ఇంక మీరు వెళ్ళి నిద్రపోండి" అని అన్నారు. అప్పుడు వారు "భాయీ! నీవు నన్ను నిద్రపొమ్మని అనగానే, ఇప్పుడు లాలాజీ సాహెబ్ కూడా నన్ను 'నిద్రపో' అని అంటున్నారు. ఎప్పటివరకైతే నా లాలాజీ సాహెబ్ నన్ను నిద్రింపజేయటానికి రారో అప్పటివరకు నేను ఎలా నిద్రపోగలను? ఇప్పుడు వారు చెప్పారు. ఇంక నేను నిద్రపోతాను" అని అన్నారు. అలసిపోయాను అనే ఎరుక, రాత్రి–పగలు అనే స్పృహ బాబూజీకి అప్పుడు కలిగింది.

అలసిపోయినప్పుడు మీరు విశ్రాంతి కోరుతారు. విశ్రాంతి తీసుకోండి, "బాబూజీ! మీరు నా వారు. నేను మీ వాడినే!" అనే ఒక ఫీలింగ్ మాత్రం కలిగి ఉండండి.

ఒకసారి బాబూజీ బంధువు ఒకరు బాబూజీగారి ఇంటికి వచ్చారు. అతడు "బాబూజీ! మీరు పెళ్ళికి రావడం లేదా?" అని అడిగాడు. దానికి బాబూజీ, "పెళ్ళి రేపు కదా! పెండ్లి–పత్రికలో రేపటి తేదీ ఉంది కదా!" అని అతనితో అనగానే, ఆ బంధువు "పెళ్ళి కూతురుకి గ్రహాలు అనుకూలంగా లేవట. అందుకని ఈ రోజు మొదటగా రావిచెట్టుతో ఆమెకు వివాహం చేసి, ఆ గ్రహాల యొక్క చెడు ప్రభావాన్ని తొలగించాలని పురోహితుడు వాళ్ళకు చెప్పాడు" అని అన్నాడు. ఆ తర్వాత ఆ బంధువు పెండ్లికి వెళ్ళిపోయాడు. అపుడు బాబూజీ నాతో "బిటియా! రావిచెట్టు ఏమైనా పెళ్ళి కూతురు సంస్కారాలను అనుభవిస్తుందా?" అని అన్నారు. గ్రుడ్డిగా విశ్వాసాలను పాటించవద్దు. నీవు ఏది కరక్టు అనుకుంటావో అదే చేయి.

ఒకసారి నేను 'వారి'కి ఇలా వ్రాశాను: "బాబూజీ! నా మనస్సు పరమానందంతో నృత్యం చేస్తోంది. నా మనస్సు ఆ పరమానందంలో కొట్టుకొనిపోతోంది. కాని ఎప్పుడైతే ధ్యానం చేయాలని కూర్చుంటానో, అపుడు ఆ పరమానందానికి నా మనస్సు ఒక విధమైన బానిస అయిపోతోంది. దానితో బంధనం ఏర్పడుతోంది" అని వ్రాశాను. అప్పుడు "బిటియా! ఇది చాలా సహజమైన విషయం. ఎందుకంటే, నీ మనస్సు ధ్యానావస్థలో లీనమై, ఆ పరమానందంలో మునిగిపోయింది. కాని నీవు ధ్యానం చేయాలని బలవంతంగా నీ మనస్సును మరల అందులో నుండి బయటకు తీయడానికి ప్రయత్నిస్తున్నావు. అందువల్లనే ఈ విధంగా జరుగుతున్నది" అని వ్రాశారు బాబూజీ.

అప్పుడు మరల నేను "బాబూజీ! నా కండిషన్ (స్థితి) ఎప్పుడు డిస్టర్బ్ అయినా (కలత చెందినా) నేను ప్రార్థన చేయటం లేదు. నేను మిమ్మల్నే చూస్తున్నాను. ప్రార్థనను మరచిపోయాను, దాని ప్రాముఖ్యత ఏమీ కనపడటం లేదు. కేవలం మిమ్మల్నే చూస్తున్నాను" అని వ్రాశాను.

అందువలన మీరు మీకు కలిగే ఫీలింగ్ ప్రకారం, మీరు నడుచుకోవాలి. ఇది చాలా సహజమైన, సూక్ష్మమైన విషయం. మీరు ఏదైనా పని చేసేప్పుడు, మీలో ఒక ఫీలింగ్ కలుగుతుంది. మీకు ఆ పని ఇష్టం లేదని, ఆ ఫీలింగ్ మీతో చెప్తుతుంది. అంటే ఆ పని యొక్క అవసరం లేదు, అని దాని అర్థం.

**ప్రశ్న: బెహెన్‌జీ! సంస్థలో జాయిన్ కావటం తేలిక. శ్రీ రామచంద్ర మిషన్‌లో జాయిన్ కావటం కష్టం అన్నారు, వివరించండి.**

**జవాబు:** బాబూజీ అందరినీ ఆ స్థితికి తీసుకు వెళ్ళటానికి ప్రయత్నం చేస్తారు. మన అందరికి ఆ కండిషన్ రావటానికి సహాయం చేస్తారు. కండిషన్ పెరుగుతూ ఉంటుంది. మానవులందరినీ –ప్రాణి మాత్రులందరినీ బాబూజీ అంతిమ సాక్షాత్కారంవైపు తీసుకు వెళ్ళతారు. మనకు వచ్చిన ఆ కండిషన్ అందరిలో కూడా వృద్ధి అవ్వాలని కోరుకుంటాం. ఇదే మిషన్. రామచంద్రుని మహాయజ్ఞ ఆశయం.

ఇంక సంస్థ అంటే, నియమాలు ఉంటాయి. టెన్ కమాండ్‌మెంట్స్ ఫాలో అవ్వటం. ప్రార్థన, క్లీనింగ్, ధ్యానం –ఇవి ఆచరించటం, ఆచరింపజేయటం అన్నమాట.

**ప్రశ్న: బెహెన్‌జీ! ఈశ్వరుని గురించి చెప్పలేము, ఈశ్వరుని కృప గురించి చెప్పగలం, అన్నారు కదా! వివరించండి.**

**జవాబు:** బాబూజీ మహరాజ్‌ని గురించి ఎవరూ చెప్పలేరు. బాబూజీ ఇస్తున్న కృప గురించి మాత్రం చెప్పగలం. అంతేకాదు, బాబూజీ ఆబ్జెక్ట్! సబ్జెక్ట్ మాత్రం కాదు. సబ్జెక్ట్ గురించి చెప్పగలం. ఆబ్జెక్ట్ గురించి చెప్పలేము. ఇలా అయింది, అలా అయింది అని, వారు ఇచ్చిన కృప గురించి మాత్రమే మనం చెప్పగలం.

బాబూజీ గురించి చెప్పాలంటే, 'వారే' చెప్పారు – తానెవరో తనకి తెలియదు అని. వారు చమత్కారం చేస్తారు. మీరు వారిని చేరుకునేప్పటికి మీ గురించి మీరు మరచిపోతారు. వారెవరో కూడా మరిచిపోతారు. ఏమీ తెలియదు. అన్ని మరచిపోతాం. బాబూజీ మహరాజ్ అంటారు– భగవంతునికే తెలియదు తాను భగవంతుడినని! ఎవరు పొందారో, ఎవరు సాక్షాత్కారం చేసుకున్నారో వారే చెప్పారు ఇది –భగవంతుడు ఉన్నాడని. అందువల్లనే భక్తుడు చెప్పగలడు, కాని భగవంతుడు చెప్పలేడు. అందుచేత భక్తుడుగా మారగలరుగాని భగవంతుడుగా అవ్వలేరు ఎవ్వరూ.

బాబూజీతో లాలాజీ సాహెబ్ అన్నారు– "నేను ప్రార్థనతో ఈ భూమిపై నిన్ను అవతరింపజేశాను. నీవు అంతిమం నుంచి వచ్చావు. కాని నువ్వు ఎవరివో, నీ శక్తి ఏమిటో నీకు తెలియదు" అని.

బాబూజీ సంస్థ ఉంది. దాంట్లో ప్రార్థన, ధ్యానం, క్లీనింగ్, నియమాలు ఉన్నాయి. వీటిని పాటిస్తూ సాధన మొదలుపెట్టాం. మొదట హృదయంలో దివ్యజ్యోతి ఉందని భావించి ధ్యానం మొదలు పెడతాం. ఒక్కసారి దివ్యజ్యోతి వెలిగించు. తర్వాత మళ్ళీ మళ్ళీ వెలిగించవద్దు.

ఒక అభ్యాసీ బాబూజీ మహరాజ్‌తో అంటారు– "డివైన్ లైట్‌పై సాధన చేస్తున్నాను. 6 సంవత్సరాలు గడిచాయి. ఇప్పుడు లైట్ కనపడటం లేదు" అని. దానికి బాబూజీ, "6 సంవత్సరాల నుంచి లైట్ వెలిగించటం, ఆర్పటం మాత్రమే సాధనలో చేస్తున్నావా! డివైన్ లైట్ ఎప్పుడైతే వెలిగిస్తావో అప్పటి నుంచి వెదికి ఆ దివ్యత్వాన్ని పట్టుకోవాలి. దివ్యత్వం పట్టుకున్నాక లైట్ సంగతి మరిచిపో! ధ్యాసంతా దివ్యత్వంపై ఉండాలి. అది మనదే. అది మనలో ఇక్కడే ఎక్కడో మన హృదయంలోనే ఆ దివ్యత్వం ఉంది."

మన ఈ సంస్థ యొక్క ప్రాణం బాబూజీయే! సంస్థలో జాయిన్ అయినా, ఆ ప్రాణాన్ని మరచిపోయారు అనుకోండి. ఇంక దానికి అర్థం లేదు. రెండవది: మీకు ఎలా తెల్సింది, మీరు సంస్థ యొక్క నిజమైన అర్థంతో జాయిన్ అయ్యారా! బాబూజీ మహరాజ్ చెప్పారు: "నేను ఈ సంస్థలో సహోదరత్వం (బ్రదర్‌హుడ్) అనే ప్రాణాన్ని నింపాను" అని. ఇందులో 'ప్రాణం' (బ్రదర్‌హుడ్) సోదరత్వం మాత్రమే! మీకు ఎప్పుడైతే (బ్రదర్‌హుడ్) సోదర భావం వస్తుందో, అప్పుడు మీరు సంస్థని పూర్తిగా గ్రహించినట్లు, అందులో చేరినట్లు. అలా కాకుండా (బ్రదర్‌హుడ్) సోదరత్వానికి బదులు ఇతర అభ్యాసులలో తప్పులు, వారి గుణగణాలు చూస్తే మీరు సంస్థలో (మిషన్‌లో) చేరినా చేరనట్లే. ఏదైతే ప్రాణమో (బ్రదర్‌హుడ్) దాన్ని టచ్ చేయాలి, స్పృశించాలి. అప్పుడే మీరు జాయిన్ అయినట్లు. దానికి ఇదే రుజువు. మనం రోజు రోజుకి సాధనలో ముందంజ వేస్తున్నట్లు రూఢీ ఇదే. అపుడు అందరిపై ప్రేమ జనిస్తుంది. అందరిపై బ్రదర్‌హుడ్ ఏర్పడుతుంది. అభ్యాసీలపై ఉండేంత ప్రేమ కుటుంబ సభ్యులపై కూడా ఉండదు. కుటుంబ సభ్యుల నుంచి కూడా లభించనంత ప్రేమ అభ్యాసీల నుంచి పొందుతాం. ఎందుకని? ఎందుకంటే, మన ఈ మిషన్‌లో (సంస్థలో) బాబూజీ మహరాజ్ సహోదరత్వం (బ్రదర్‌హుడ్) అనే 'ప్రాణాన్ని' నింపారు కనుక.

ఈశ్వర్ సహాయ్‌గారు ఒకసారి బాబూజీతో "భగవంతుడు అన్నిచోట్లా ఉంటారు, అని మీరు చెప్పిన తర్వాతనే అనుభూతి పొందాం (ఫీల్ అవుతున్నాము). ఎందుకని అంతకుముందు ఫీల్ అవలేదు?" అని అడగ్గా, దానికి బాబూజీ, "భగవత్ శక్తి లేకుండా ఈ సృష్టిలో ఏదీలేదు. ఈ భగవత్ శక్తి అందరి హృదయాల్లోనూ ఉందని ఎప్పుడు సంకల్పం వస్తుందో అప్పుడు ఈశ్వరుడుని అందరి హృదయాల్లో ఫీల్ అవుతాము, అనుభవిస్తాం. ఆ శక్తికి సంకల్పం జోడిస్తే అప్పుడు ఆ శక్తి పని చేస్తుంది. ఇప్పుడు నీవు ఈశ్వరుని, ఈశ్వరీయ శక్తిని అనుభూతి చెందుతున్నావు" అని అన్నారు.

"సిట్టింగ్ ఇచ్చే సమయంలో ప్రిసెప్టర్ పని చేయదు. ప్రిసెప్టర్ నిద్రపోతాడు" అని బాబూజీ అప్పుడప్పుడు అనేవారు. ప్రిసెప్టర్ పని చేయడం అంటే ఏమిటి? ప్రాణాహుతి అభ్యాసీలోకి ప్రవహిస్తుంది –అని అనుకుని ప్రిసెప్టర్ ఊరకనే కూర్చుంటే ఏం లాభం? ప్రిసెప్టర్ ఆ డివైన్ పవర్‌కు (దివ్యశక్తికి) అంటే ఆ ట్రాన్స్‌మిషన్ పవర్‌కు ఒక పని నిర్దేశించి, దానితో ఆ పని చేయించుకోవాలి. అభ్యాసీలో ప్రేమ, భక్తి ఏర్పడునట్లుగా అభ్యాసీ సిస్టమ్‌ను క్లీన్ చేయాలి. ప్రతి అభ్యాసీ బాబూజీ మహరాజ్ యొక్క సంకల్పానుసారం ఈశ్వరప్రాప్తికి యోగ్యుడయ్యే విధంగా అభ్యాసీ సిస్టమ్‌ను క్లీన్ చేయాలి. ఈ వర్క్ మొత్తం పూర్తిచేసే ట్రాన్స్‌మిషన్ పవర్ బాబూజీ మహరాజ్ నుండియే వస్తోందని అనుకోవాలి. ఇలా వర్క్ చేసేవారికి పని సులువుగా జరిగిపోతుంది. ప్రిసెప్టర్ పని చేయటం అంటే ఇదే.

నేను పుస్తకాలను వ్రాసేటప్పుడు నాకు ఒక ఆలోచన వచ్చింది. ఏమంటే, ఈ వచ్చిన అవతారాలన్నీ గాడ్లీ రీజియన్ నుండియే అవతరించాయి. శక్తి అంటే శక్తియే. అందరికి ఒకే రకమైన శక్తులు కాకుండా వేరు వేరుగా 12 కళల శక్తి, 16 కళల శక్తితో ఎందుకు అవతరించారు? శక్తిలో ఈ భేదానికిగల కారణం ఆ తర్వాతనే ఇది అర్థం అయింది.

ఈ అవతారాల రాకకై ఋషులు, మునులు గాడ్ అనగా భగవంతుని ప్రార్థించారు. భగవానుడు ఆ అవతరాలకు వారు చేయవలసిన దైవీయ కార్యాలను అప్పగించాడు. ఆయా దైవీయ కార్యాలకు ఆ కార్య నిర్వహణకై ఎంత శక్తి కావాలో అంత శక్తి తీసుకొని ఈ భూమి మీదకు ఆయా అవతారాలు వచ్చాయి. దైవీయం కారణంగా 12 కళల దివ్యశక్తి, 16 కళల దివ్యశక్తి అనేది ఏర్పడింది.

ఈ సందర్భంలో నాలో మరో ప్రశ్న ఉత్పన్నమైంది. బాబూజీ మహరాజ్ గాడ్లీ రీజియన్ నుండి కాకుండా దానికి అతీతంగా ఉన్న అల్టిమేట్, 'భూమా' నుండి అవతరించటానికి కారణం, లాలాజీ మహరాజ్ ఆ అంతిమాన్నే ప్రార్థించారు కనుకనా?

లాలాజీ సాహెబ్ ఆ అంతిమాన్నే ఎందుకు ప్రార్థించినట్లు? ఎందుకంటే, సృష్టి యొక్క రచన అంతిమం (భూమా) నుండే జరిగింది కాబట్టి ఈ సృష్టిని 'డివైన్ బ్యూటీ' (దివ్య సౌందర్యం)తో అలంకరించాలంటే, మానవులందరిని దివ్య సౌందర్యంతో అలంకరించాలంటే మొదట సమస్త మానవాళిలో ఈశ్వరప్రాప్తి అనే తీవ్రమైన తపనను మరల మేల్కొలపాలి. ఎక్కడి నుండి అయితే సృష్టి రచన జరిగిందో, ఆ అంతిమసత్యం నుండే బాబూజీ అవతరించారు. అందువలన సృష్టి రచన కొరకు ఎంత అయితే దివ్యశక్తి అవసరమైందో, ఆ మొత్తం శక్తి అనగా అనంత శక్తి బాబూజీ యొక్క దివ్య సంకల్పంలో ఇమిడిపోయింది. అందువలన బాబూజీ యొక్క శక్తి విషయంలో ఈ కళల ప్రసక్తి లేదు. 'వారు' సమస్త మానవాళిని అంతిమం (భూమా) వరకు తీసుకొని వెళ్ళటానికై అంతిమం (అల్టిమేట్) నుండి అనంత శక్తితో అవతరించారు.

మానవులందరు కూడా ఆధ్యాత్మికంగా పతనమైపోయారు. అందుచేత ఈ యుగాన్ని మరల ఉద్ధరించాలి. ఎవరైతే సృష్టి రచన యొక్క శక్తిని తీసుకొని వస్తారో, వారే ఈ పని చేయగలరు. అందువలన ఒక డివైన్ పర్సనాలిటీని 'అంతిమం' నుండి అవతరింపజేయాలని, ప్రకృతి ఈ పనిని ఒక సూఫీ–మహాత్మునికి అప్పగించింది. ఈ సూఫీ–మహాత్ముడు ఈ పనిని తన ప్రియ శిష్యుడు అయిన మౌల్వీ సాహెబ్‌కు అప్పగించారు. ఈ మహోన్నతమైన పనిని తాను పూర్తి చేయలేనని అతడు తన అశక్తతను వెల్లడిచేశారు. కాని ఎప్పుడైతే ఆ మౌల్వీ సాహెబ్, లాలాజీని చూశారో, అప్పుడు వారిని, నీవు ఈ పనిని చేయాలి, నీవు చేయగలవు, అని కోరారు. అప్పుడు లాలాజీ సాహెబ్ 7 నెలలు తీవ్రమైన సాధనచేసి తన ప్రార్థన వలన అంతిమం (అల్టిమేట్) నందు వైబ్రేషన్స్ (స్పందనలు) కలుగునట్లుగా చేశారు. అప్పుడు డివైన్ పర్సనాలిటీ (దివ్యపురుషుడు) శ్రీ బాబూజీ మహరాజ్ అంతిమ శక్తితో ధరణిమీద అవతరించారు. సంకల్పం అనేది శక్తిలో వైబ్రేషన్స్ (స్పందనల)ను కలిగింపజేస్తుంది. అప్పుడు ఆ శక్తి పని చేయటం ప్రారంభిస్తుంది.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ "బాబూజీ! మీరు ఎప్పుడైనా ఒకసారి మాతో కోపంగా మాట్లాడండి. అసలు మీకు కోపం అనేదే రాదు కదా!" అని అన్నారు. దానికి బాబూజీ, "నాకు కోపం రావాలి లేదా నాకు కోపం రాకూడదని నన్ను నేను కంట్రోల్ (ఆధీనం)లో ఏమీ పెట్టుకోను. నా సంకల్పంలో ఒకే ఒకటి ఉంది. అది ఏమిటంటే, సమస్త మానవాళికి అంతిమ సాక్షాత్కారం ప్రసాదించాలి, మరియు ఆ సంకల్పానికి తగినట్లుగా మానవాళిని తయారుచేయాలి. ఇది తప్ప వేరేది, ఏదీ నేను చేయలేను. ఇంక నేను కోపంగా ఎలా మాట్లాడగలను?" అని అన్నారు.

**ఈశ్వర్ సహాయ్‌జీ: "బాబూజీ! మీరు మాలోని దోషాలను గురించి మాకు ఎందుకు చెప్పరు?"**

**బాబూజీ:** "అది నా నిస్సహాయత. దోషాలను, నేను చూడలేను. అసలు దోషాలు అనేవి ఎక్కడా లేనేలేవు. నేను అతితక్కువ స్థాయిలోకి అనగా మానవ స్థాయికి దిగివచ్చినప్పుడే, మానవీయ మనస్సులో ఆ దోషాలు కనబడతాయి."

ఈ సందర్భంగా నేను ఇలా అన్నాను: "మీరు ఉన్నత స్థితిని పొందిన తర్వాత మీ మనస్సు పవిత్రం అవుతుంది. అక్కడ దోషాలు అనేవి ఉండలేవు. మీరు ఇతరుల గురించి చెడుగా ఆలోచించలేరు. ఒకవేళ చెడుగా ఆలోచించినా, మీ మనస్సు వాటిని బయటకు విసిరివేస్తుంది."

**ప్రశ్న: బెహెన్‌జీ! బాబూజీ అంటే ఎవరో, వారి శక్తి ఏమిటో లాలాజీ సాహెబ్‌కు కూడా తెలియదా?**

**జవాబు:** లాలాజీ సాహెబ్ యొక్క ప్రార్థనవలన ఆ అంతిమ శక్తి బాబూజీ రూపంలో భూమి మీదకు దిగి వచ్చింది. ఆ శక్తి ఎంత అని ఎవరు ఊహించగలరు. "నీలో ఎంత దివ్య శక్తి ఉంది అనేది నీకు తెలియదు. కాని నీలో ఎంత దివ్య శక్తి ఉన్నదనేది ఆ అల్టిమేట్‌కు (అంతిమానికే) తెలుసు" అని లాలాజీ సాహెబ్ ఒకసారి బాబూజీతో అన్నారు.

ఒకవేళ మీరు ఇది తెలుసుకోవాలంటే, మీరు 'వారి'లో లయమై అక్కడికి (అల్టిమేట్) వెళ్ళి తెలుసుకోండి. అందుకే స్వామి వివేకానందజీ, "ఇక్కడ భూమా సామ్రాజ్యంలో లాలాజీ సాహెబ్ యొక్క ముద్దుబిడ్డ అంటే ఎవరికీ తెలియదు. ఇక్కడ బాబూజీ అంతిమ సత్యం యొక్క చక్రవర్తి, అంతే" అని అన్నారు.

బాబూజీ మహరాజ్‌ను గురించి ఒకవేళ బాబూజీ నాతో వ్రాయించకపోయినట్లయితే, 'వారి'ని గురించి ఎవరూ వ్రాయలేకపోయేవారు. 'వారి'లో పూర్తిగా మునిగి లీనమైపోయి వ్రాసినట్లయితే, ఆ వ్రాసేది 'వారే'నని, ఆ రచనకు సంబంధించినది అంతా కూడా అక్కడి నుండే వస్తూందని నాకుగా నేను వ్రాయటం లేదు అని మీకు అర్థం అవుతుంది.

ఒక అభ్యాసి నన్ను ఇలా అడిగాడు: "బెహెన్‌జీ! మేము లక్నోకి బయలుదేరినప్పటి నుండి, మీ వద్ద ఉన్నంతసేపు మాకు మా కుటుంబ సభ్యులు, మా సంబంధ బాంధవ్యాలు గుర్తుకే రావు. మేము బాబూజీ మహరాజ్ స్మృహలో ఎంతగా మునిగిపోతామంటే, ఇంటివద్ద విషయాలు ఏవీ గుర్తుండవు. మరల మేము ఇళ్ళకు వెళ్ళిపోయిన తర్వాత, ఈ కండిషన్‌లో ఉండలేకపోతున్నాం. మేము ఎప్పుడూ అదే కండిషన్‌లో ఉండాలంటే ఏమి చేయాలో చెప్పండి."

దానికి నేను ఇలా చెప్పాను: "నీవు మీ ఇంటికి వెళ్ళాలి కాబట్టి నీవు షాజహాన్‌పూర్ నుండి వెళ్ళు. కాని నీ జ్ఞాపకాన్ని మాత్రం ఇక్కడ వదిలిపెట్టి వెళ్ళు" అని బాబూజీ అనేవారు. మీరు ధ్యానం చేస్తారు. ఆఫీస్ పని, ఇంటిపని చేసుకోవాలి కాబట్టి, మీరు ధ్యానంలో  నుండి లేస్తారు. కాని ధ్యానం అయిపోయిందని మాత్రం ఎప్పుడూ కూడా అనుకోవద్దని, బాబూజీ చెప్పేవారు. ధ్యానం అయిపోయింది అని అనుకుంటే 'అది' అక్కడితో ఆగిపోతుంది. దివ్య ప్రవాహం ఆగిపోతుంది. ఏ విధంగానైతే మీరు ధ్యానంలో మునిగిపోతున్నారో, అదే విధంగా ఆ ధ్యాసలోనే, ఆ మూడ్‌లోనే ఉండి మీ పనులను చేయండి. నెమ్మది నెమ్మదిగా మనస్సు నిరంతరం ఆ ధ్యాన స్థితిలోనే ఉండటానికి అలవాటుపడుతుంది. అదే విధంగా మీరు కూడా అనుక్షణం ఆ ధ్యాన స్థితిలోనే ఉండి అన్ని పనులు చేస్తూ ఉంటారు. మీరు ఎల్లప్పుడు కూడా బాబూజీతోనే ఉన్నట్లుగా అనిపిస్తుంది. మీరు ఎప్పుడూ కూడ, 'వారి' నుండి విడిపోయినట్లుగా అనిపించదు.

మీరు లక్నో, షాజహాన్‌పూర్ అని వేరుగా ఆలోచించకండి. ముఖ్యమైంది, మనకు కావలసింది బాబూజీ. 'వారు' లక్నోలో ఉన్నారు, షాజహాన్‌పూర్‌లోనూ ఉన్నారు. 'వారు' అంతటా ఉన్నారు. మీరు ఇక్కడికి లక్నోకు వచ్చినప్పుడు బాబూజీ మాటలను వింటారు. మీ మనస్సు, ఆలోచన అనేది 'వారి' మీదనే

ఏకాగ్రమవుతుంది. మీరు మీ ఇంటికి వెళ్ళిన తర్వాత, అక్కడ మీరు మీ పనులలో పూర్తిగా మునిగిపోయినప్పుడు, 2,3 గంటల తర్వాత 'వారి' స్మరణ జ్ఞాపకం రాగానే, అయ్యో! ఇప్పటివరకు బాబూజీని మరచిపోయామే, అని అనుకోవద్దు. మీరు 'వారి' స్మరణ మరచిపోయాం అని అనుకుంటే అది అక్కడితో తెగిపోతుంది. ఆ విధంగా కాకుండా, మీ పనిలో లీనమై, మీరు బాబూజీని మరచిపోయినా, మరల 'వారి' జ్ఞాపకం రాగానే, "బాబూజీ! నా ఆలోచన, నా మనస్సు ఎల్లప్పుడూ మీ చరణాలవద్దనే ఉన్నాయి" అని భావించండి. ఈ విధంగా నెమ్మది నెమ్మదిగా నిరంతర స్మరణ అనేది అలవాటు అవుతుంది. మీరు నిరంతరం 'వారి'తోనే ఉంటారు. అప్పుడు డబ్బులు ఖర్చుపెట్టి లక్నో వెళ్ళడం ఎందుకు, లక్నో మా ఇంటిలోనే ఉంది కదా! అని మీరు అంటారు. మీరు ఆ పని చేయాలని, ఈ పని చేయాలని ఆలోచిస్తూ ఉంటారు. "నన్ను నీతో తీసుకొని వెళ్ళు లేదా నిన్ను నీవు ఇక్కడ వదిలేసుకుని వెళ్ళు. మనం ఇద్దరం ఒకసారి కలుసుకున్న తర్వాత మరల విడిపోవటం అనేది ఉండకూడదు. నన్ను నీతో ఉంచుకో లేదా నీవు నాతో ఉండు" అని బాబూజీ అనేవారు.

చాలామంది మన ఈ సాధన ఏకొద్దిసేపో (అరగంటో, గంటో) చేస్తూండవచ్చు. అలాకాకుండా మీరాబాయిలాగ 'వారి'ని కళ్ళల్లోనే నిలుపుకొంటే ఎప్పుడూ, రోజంతా 'వారు' నీతోనే ఉంటారు.

"కృష్ణా! నా నయనాలలోనే ఇమిడిపో" –అని ఒకసారి భక్త మీరాబాయి అంటుంది. నా కంటికి కృష్ణుడుతప్ప వేరే ఏమీ కనిపించటం లేదని మీరాబాయి అన్నది. మీరు ఇంటిపని, ఆఫీస్‌పని, ఏ పని చేసినా కూడా, ఆ సమయంలో 'వారి' జ్ఞాపకం లేకపోయినా, తిరిగి మరల 'వారు' జ్ఞాపకం రాగానే, నేను ఇప్పటివరకు 'వారి' ధ్యాసలోనే ఉన్నాను అని అనుకోవాలి. ఏ రోజునైతే మీ కళ్ళ ఎదుట కేవలం బాబూజీ మహరాజ్‌యే ఉంటారో, ఆ రోజున మీరు కూడా మీరాబాయిలాగా ఆ స్థితిని పొందారని చెప్పవచ్చు.

**అభ్యాసీ: ప్రతి శనివారం సాయంత్రం 6 గంటలకు ఇక్కడ లక్నోలో సత్సంగ్ జరుగుతూంది కదా! అదే సమయంలో మేము కూడా మా ఇంటివద్ద ధ్యానంలో కూర్చోవచ్చునా?**

**బెహెన్‌జీ:** మొత్తం ప్రపంచంలో బాబూజీ మహరాజ్‌ను ఎవరైతే జ్ఞాపకం చేసుకుంటున్నారో, వాళ్ళందరికీ కూడా ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) చేరుతూంది అనే సంకల్పంతో నేను సత్సంగ్‌ను నిర్వహిస్తాను. కాబట్టి మీకు తెలియకుండానే మీరు సత్సంగ్‌లో పాల్గొంటున్నారు. మీరు ఎక్కడ ఉన్నా సరే, శనివారం సాయంత్రం 6 గంటలకు ధ్యానంలో కూర్చోవచ్చు.

నేను బాబూజీ మహరాజ్ యొక్క కృపని అందరికి పంచాలనే నియమాన్ని అనుసరిస్తాను. బాబూజీ కృపని, ప్రేమని పొందాలనుకునే వారికి ఎవరి యొక్క అనుమతి అవసరంలేదు. బాబూజీ యొక్క కరుణా ప్రవాహం ఎల్లప్పుడూ విశ్వమంతా ప్రవహిస్తూనే ఉంటుంది.

సత్సంగ్ కొరుకు ఎవరి అనుమతి అవసరం లేదు. 'సత్' అంటే ఈశ్వరుడు, 'సంగ్' అంటే సాన్నిహిత్యం. సత్సంగ్ అంటే ఈశ్వరునితో కలిసి ఉండటం. సత్సంగ్ గురించి కాని, ఈశ్వరప్రాప్తిని గురించి కాని మాట్లాడుకోవడానికి ఎవరి అనుమతి అవసరం లేదు. మీరు ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ధ్యానంలో కూర్చోవచ్చు. ఇక్కడ జరిగే శనివారం సాయంత్రం 6 గంటల సత్సంగ్‌లో మీరు కూర్చోవాలని అనుకుంటున్నారు కదా! మీరు ఎక్కడ ఉన్నా సరే ఆ సమయానికి ధ్యానంలో కూర్చోండి. ఇంకో విషయం ఏమిటంటే, ధ్యానం చేసుకోవడానికిగాని, సత్సంగ్‌కుగాని ఎవరి అనుమతి అవసరం లేదు. ఎందుకంటే, ప్రాణాహుతి అనేది

మనకు బాబూజీ మహారాజ్ యొక్క ఆశీస్సుల వలన లభించింది. మీరు ఎప్పుడు ధ్యానంలో కూర్చుంటే అప్పుడు ప్రాణాహుతి లభిస్తుంది.

**అభ్యాసీ: కొంతమంది ప్రిసెప్టర్స్ (ప్రశిక్షకులు) "నేను నీకు బ్రహ్మాండ మండలం నుండి ప్రాణాహుతిని ఇచ్చాను. నీవు ఆ స్థితిలో ఉన్నావు" అని ఈ విధంగా చెప్పుతున్నారు.**

**బెహెన్‌జీ:** వాళ్ళకు ఒక లక్ష్యమనేది లేదు. అందుకే గొప్ప గొప్ప మాటలను అభ్యాసీల ఎదుట ప్రదర్శిస్తున్నారు. నిజంగా ఆ ప్రశిక్షకులు తమ గొప్పదనాన్ని చూపించాలంటే, ఒక్కొక్క అభ్యాసీ ఉన్నత స్థితిలోకి వెళ్ళే విధంగా పని చేయమని చెప్పండి. ఎంత చక్కగా పని చేసారని 'వారు' చూస్తారు. ఆ విధంగా పనిచేస్తే వాళ్ళకు బాబూజీ నుండి దివ్య బహుమానం కూడా లభిస్తుంది.

ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీ ఇంటికి 5,6 బుట్టలతో ద్రాక్ష పండ్లను తీసుకునివచ్చి ఇచ్చాడు. అప్పుడు బాబూజీ, "భాయీ! ఈ రోజు సాయంత్రం మన అభ్యాసీలందరు కూడా ద్రాక్ష పండ్లను తింటారు" అని ఎంతో ప్రేమతో అన్నారు. అదే విధంగా మాలిన్‌ని (ఆడ-పనిమనిషి) పిలిచి, "మాలిన్! మన తోటలో నుండి జామకాయలు కోసుకొనిరా! రేపు మన అభ్యాసీలు జామకాయలు తింటారు" అని అనేవారు. బాబూజీ ఆరోగ్యం కొరకు ఉపయోగపడుతుందని మేము బొప్పాయిపండ్లను తీసుకొని వెళ్ళేవాళ్ళం. బాబూజీ ఒక ముక్క తిని, మిగిలినదంతా అందరికీ పంచేవారు. మీరు బాబూజీతో కలసి ఏమేమి తిన్నారని, ఎవరైనా ఈ రోజున అడిగితే, నాకు ఏమీ తెలియదు అని జవాబు చెప్పుతాను. నాకు వారితో ఉన్నప్పుడు ఆ దైవీయ వాతారణం మాత్రమే తెలుసు. కాని వారితో కలసి ఏం తిన్నాను అనేది నాకు తెలియదు.

బాబూజీలాగా మన హృదయంలో ప్రేమ అనేది అందరిమీద ఉండాలి. తన ఎదుట కూర్చున్న వాళ్ళందరిని కూడా ప్రిసెప్టర్, తన వాళ్ళే అని ప్రేమతో భావించాలి. సిట్టింగ్‌లో ఎవరైనా అభ్యాసీ ప్రాణాహుతిని తక్కువగా రిసీవ్ (గ్రహింపు) చేసుకుంటున్నట్లుగా కనపడితే, ఆ అభ్యాసీ ప్రాణాహుతిని పూర్తిగా రిసీవ్ (గ్రహింపు) చేసుకోవాలని ప్రిసెప్టర్ కృషి చేయాలి. ప్రేమ అనేది ఉన్నప్పుడే, ఆ ప్రాణాహుతి శక్తి చాలా శక్తివంతంగా పనిచేస్తుంది. హృదయంలో ప్రేమ అనేదే లేకపోతే, ఇంక పని ఏమి చేయగలరు? డా॥ పార్థసారధిగారు, డా॥ వి.పి.రావుగారు, సోదరి బర్తే (డెన్మార్క్) లు అభ్యాసీలమీద వీళ్ళు చేస్తున్న పనికి ఆనందించి బాబూజీ వీరికి ఎన్నో దివ్య కానుకలను ఇచ్చారు.

క్రొత్తగా అప్పుడే చేరిన అభ్యాసులతో, నాతో కూడా బాబూజీ ఎటువంటి భేదభావాన్ని చూపేవారు కాదు. నేను ప్రిసెప్టర్ అయ్యాక అభ్యాసులతో ఎక్కడా కూడా ఎటువంటి ఎక్కువ తక్కువ అనే భేదభావం రాకుండా అందరినీ సమానంగా చూసేటువంటి జీవన విధానాన్ని బాబూజీని చూసి 'వారి' నుండి నేను నేర్చుకున్నాను. "నీవు పని చేసేప్పుడే ప్రిసెప్టర్‌వి. మిగిలిన సమయంలో అభ్యాసీవే" అని అనేవారు బాబూజీ. ఈ విషయాలన్నింటిని మనం ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుని ఆచరించాలి.

షుమారు 30,35 మంది అభ్యాసులం రెండవ బాచ్‌గా లక్నో యాత్రకు బయులుదేరాం. 2002 అక్టోబర్ 7వ తేదీ, ఉదయం ఆరున్నరకే కొచ్చిన్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రేస్. ఎంతో ఉత్సాహంగా, పెద్దవాళ్ళమయినా ఓపిగ్గా యాత్రకు బయలుదేరాం. చక్కని, సమశీతోష్ణ వాతావరణం. సాధనానుభూతులను నెమరువేసుకుంటూ బాబూజీ చెప్పిన ఎన్నో విషయాలను ఒకరికొకరం చెప్పుకుంటూ ఒక దివ్య వాతావరణంలో మునిగిపోగా

ఆనందంగా ప్రయాణం కొనసాగింది. ఆ మరునాడు మధ్యాహ్నానికి లక్నో నగరం –అప్పుడే వచ్చేశామా అన్నట్లుగా చేరాం.

సోదరులు హరీష్, ప్రబోధ్‌గారలు ముందే ఏర్పాటు చేసిన చిన్న బస్‌లో యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌కు చేరాము. స్నానపానాదులు ముగించుకునేలోపుగా తేనీరు అందించారు. ఆపై మేము వచ్చిన మినీబస్‌లోనే అందరం కస్తూరీ సోదరి నివాసం, మహానగర్, హెచ్‌రోడ్‌లోని 'పారిజాత' గృహానికి 10 నిమిషాల్లో చేరుకున్నాము.

సోదరీ కస్తూరీజీ ఎంతో సంతోషంగా, ప్రేమగా తన తోబుట్టువులను వెంటబెట్టుకున్నట్టు లోనికి తీసుకువెళ్ళి సాదరంగా అందరినీ కుశలప్రశ్నలు వేశారు. బాబూజీ ముందు కూర్చున్న అనుభూతి ఆనందాదులతో ఉన్నాం.

సోదరీతో మాట్లాడే ప్రతి మాట –బాబూజీగారి సందర్శన సందర్భాలలో నిండిపోయి దివ్యధారలు జాలువారతాయి. అలాంటి ఒక సందర్భాన్ని సోదరి గుర్తుకు తెచ్చారు. బాబూజీని దర్శించుకోవటానికి వచ్చిన ఒక అభ్యాసీని ఉద్దేశించి 'వారు' ఇలా అడిగారు:

**బాబూజీ: మీ ఊరు నుండి ఇక్కడికి, ఇంత దూరం ఎందుకు వచ్చావు?**

**అభ్యాసీ:** మీ దర్శనం కోసమే వచ్చాను బాబూజీ!

**బాబూజీ:** కాదు. మొదటగా, అంత దూరం నుండి ఇక్కడికి ఎందుకు వచ్చావో తెలుసుకో. ఇక్కడికి నీవు 'అనంత యాత్ర' కోసం వచ్చావు. సహజమార్గ్ సిస్టమ్‌లోని అనంతయాత్ర కొరకు నీ ఊరి నుండి ఇక్కడికి ఇంత దూరం వచ్చావు. అందువలన ప్రయాణం యొక్క దూరం అనే భావన నీలో ఉండదు. అలా ఎందుకంటే, ఈ యాత్ర యొక్క ఉద్దేశం ఈశ్వరప్రాప్తి కాబట్టి. కాలినడకన ప్రయాణం చేస్తే చాలా సమయం పడుతుంది. అదే రైలులో ప్రయాణం చేస్తే తక్కువ సమయం పడుతుంది. మరి విమానంలో ప్రయాణిస్తే మరింత తక్కువ సమయం పడుతుంది. కాని నీవు నీ హృదయంతో ప్రయాణిస్తే ఒక్కసారిగా ఇక్కడ ఉన్నట్లుగా భగవత్ సన్నిధిలో ఉంటావు.

నీ హృదయంలోనే భగవంతుడు ఉన్నాడని కదా మన బాబూజీ అనేది. హృదయంలో ఉన్న భగవంతుని విడిచిపెట్టి బయట వెదికితే ఏం ప్రయోజనం? దైవం హృదయంలో ఉండగా బయట వెదకటం వలన అంటే జప తపాదులతో, కీర్తనలతో, విగ్రహ పూజలతో –ఇలా బాహ్య విషయాలు అదనంగా కలిసి –ఇవే ప్రతిబంధకాలుగా ఏర్పడతాయి.

"బాబూజీ నా హృదయంలో ఉన్నారు" అనేది గుర్తుపెట్టుకుంటే చాలు. ఆ విశ్వాసంతో అలా జ్ఞాపకంతో ఉంటే 'వారి'తో ఒక కనెక్షన్ ఏర్పడటం మొదలవుతుంది. అలా కాకుండా, భగవంతుని మీరు బాహ్యంగా వెదకటం ప్రారంభిస్తే, ఆ కనెక్షన్ కోసం మీరే వెదుక్కోవాలి. భగవంతుని బాహ్యంగా వెదకటం వలన మీ దృష్టి 'భగవంతుని' నుండి మరలిపోయి బాహ్య విషయాలలో చిక్కుకొనిపోతుంది. "మన దృష్టి అంటే మన ధ్యానం భగవంతుని మీదనే ఉండాలి" అని బాబూజీ అనేవారు. భగవంతుడు నా హృదయంలోనే ఉన్నాడన్న ధ్యాసవలన ఆ దైవంతో ఒక కనెక్షన్ ఏర్పడుతుంది. ఆ కనెక్షన్ ద్వారా మనకు (పవర్) శక్తి

లభిస్తుంది. ఆ శక్తి వలన మనలో దృఢ విశ్వాసం (కాన్ఫిడెన్స్) ఏర్పడుతుంది. దీనితో మీకు అనుభవాలు లభిస్తాయి. దానితో లక్ష్యసిద్ధికై మీరు చక్కగా సాధన చేయగలరు.

సాధారణంగా మన అందరికీ కలిగే ప్రశ్న –మనం ఎంత ప్రోగ్రెస్ అయ్యాము? మన ప్రోగ్రెస్ ఏ విధంగా తెలుసుకోవాలి? –అని.

భగవంతుని సామీప్యతానుభుతి పొందటం ద్వారా – మన ప్రోగ్రెస్‌ను తెలుసుకోవచ్చు అని బాబూజీ చెప్పేవారు. మనం దైవ స్వరూపులు బాబూజీని పొందాలని నిర్ణయించుకున్నాము. 'వారు' నాతోనే ఉన్నారు. నాలోనే ఉన్నారు అన్న సంపూర్ణ భావనతో మన హృదయం అనుభూతి చెందాలి. 'వారి' జ్ఞాపకం రాగానే మన హృదయం ప్రేమతో ఎంతగా ఉప్పొంగిపోతుందో –అంతగా మనం ప్రోగ్రెస్ అయినట్లు తెలుస్తుంది. ఆ పాయింట్‌కు చేరాను, ఈ పాయింట్‌కు చేరాను, అని అనుకుంటూ అభ్యాసులు పాయింట్స్ లెక్కతో తమ ప్రోగ్రెస్‌ను అంచనా వేస్తారు. ఇది తప్పు.

పాయింట్స్ (బిందువులు) అనేవి బాబూజీ యొక్క రీసెర్చ్ (పరిశోధన)కు సంబంధించినవి. నేను నాకు కలిగిన స్థితులను, అనుభూతులను వారికి వ్రాశాను. అప్పుడు 'వారు' రీసెర్చ్‌చేసి ఆ పాయింట్స్ (బిందువు)లను గుర్తించారు. అందువలన ప్రోగ్రెస్ గురించి తెలుసుకోవాలంటే మీరు బాబూజీ మహరాజ్ యొక్క సామీప్యతానుభూతిని ఎంతగా పొందారు అనేది అందులో ముఖ్యమైన విషయం.

సామ్యీపత యొక్క ఫీలింగ్ (అనుభూతి) అంటే ఏమిటి? దీనికి ఒక చక్కటి జవాబు ఉంది. బాబూజీ మనకు గుర్తుకు రాగానే మన హృదయం వారిపట్లగల ప్రేమ, సమర్పణ భావంతో ఉప్పొంగిపోవాలి. 'వారి' సామీప్యతానుభూతి కలిగిన కొద్దీ హృదయం ఒక్కసారిగా పూర్తిగా తెరుచుకుని, 'వారి'లోనే కలిసిపోవాలని కోరుకుంటుంది.

"బాబూజీ నా ఎదుటనే ఉన్నారు. నాలోనే ఉన్నారు. నాతోపాటుగానే ఉన్నారు" –అనేది ఒక ఆలోచన మాత్రమే. ఇది ఫీలింగ్ కాదు. ఫీలింగ్ అంటే బాబూజీ స్మరణకి రాగానే, ఒక్కసారిగా "ఈ హృదయం వారికి అర్పించబడింది. ఈ హృదయం వారిదే" అనే ఫీలింగ్ మనలో ఎప్పుడైతే ఏర్పడుతుందో, అప్పుడే సామీప్యాతానుభూతి యొక్క నిజమైన స్థితి మీకు లభించిందని గుర్తు.

ఒకసారి ఒక గురువు ఉపన్యసిస్తు, "మీరు భగవంతుని చూడలేకపోయినట్లయితే, నన్నే భగవంతునిగా అనుకోండి" అని అన్నాడు.

ఇది సరియైనది కాదు. ఎక్కడైతే "అనుకోవటం లేదా భావించడం" అనే మాట వస్తుందో అక్కడ ఫీలింగ్ అనేది ఉండదు. అనుకోవడం అనేది మనస్సుకు సంబంధించింది. ఫీలింగ్ అనేది హృదయానికి సంబంధించింది. "వీరు నా వారు" అని ఎప్పుడైతే హృదయం స్వీకరిస్తుందో, అదే ఫీలింగ్ యొక్క నిజమైన అర్థం.

"ఎప్పుడైతే భగవత్ దర్శనానికై తపన అనేది ఏర్పడుతుందో అప్పుడు మీరు సహజమార్గంలో మొదటి మెట్టు మీద స్థిరపడినట్లే" అని బాబూజీ అనేవారు.

చాలా మందికి, మనం బాబూజీని స్మరించగానే అది 'వారి'కి తెలుస్తుందా? అని అనుకుంటారు. నేను కూడా అదే విధంగా అనుకొనేదాన్ని. నేను లఖింపూర్‌లో ఉండగా, "నేను ఇక్కడ ఉండి బాబూజీని తలచుకుంటున్నాను కదా, మరి నా స్మరణ, నా పిలుపు అక్కడ షాజహాన్‌పూర్‌లో ఉన్న బాబూజీకి తెలుస్తుందా?" అనే ప్రశ్న నాలో చాలా రోజుల వరకు ఉండేది. ఒకసారి మేము షాజహాన్‌పూర్‌కు వెళ్ళాము. నేను లఖింపూర్‌లో ఉండి వారిని స్మరించినపుడు అది వారికి తెలిసిందా, లేదా? అని అడగాలని నా మనస్సులో ఉంది. కాని నేను ఈ ప్రశ్న అడగకముందే బాబూజీ, "బిటియా! నాకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే, నీవు ఇక్కడకి ఏ బస్సు, రైలు ఛార్జీలు చెల్లించకుండానే చాలాసార్లు వచ్చి, వెళ్ళావు" అని అన్నారు. నా ప్రశ్నకు జవాబు లభించిందని నాకు అప్పుడు అనిపించింది. ఎవరో భక్తుడు, ఎవరో పిల్లవాడు తన్ను జ్ఞాపకం చేసుకుంటున్నాడని, మన క్రేవింగ్ (తపన) వలన 'వారి'కి వినబడుతుంది, 'వారి'కి తెలుస్తుంది. "నీవు టికెట్ లేకుండానే చాలాసార్లు ఇక్కడికి వచ్చి వెళ్ళావు" అనే 'వారి' మాటల వలన మన అందరికి ఏమి తెలుస్తుందంటే, ఎప్పుడైతే మన స్మరణ, క్రేవింగ్ (తపన)తో ఉంటుందో అప్పుడే ఆ పిలుపు 'వారి'ని తప్పకుండా చేరుతుంది. ఎలా అంటే, 'వారు' సర్వవ్యాపి కాబట్టి.

**అభ్యాసీ ప్రశ్న: బాబూజీ! ఈశ్వరుడు సర్వవ్యాపి కదా! మరి అందరి పిలుపు ఈశ్వరునికి ఎందుకు వినపడదు?**

**బాబూజీ:** భాయీ! ఈశ్వరునికి నీ పిలుపు వినపడే పద్ధతిని ముందు నేర్చుకో. ఎప్పుడైతే నీలో క్రేవింగ్ (తపన) ఏర్పడుతుందో, అప్పుడు నీ పిలుపే కాదు, నీవు ఏది ఆలోచించినా కూడా అది, నీ హృదయంలో ఉన్న ఈశ్వరుని స్పర్శిస్తుంది.

అందువలన అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే, మనం 'వారి'ని ఎప్పుడు స్మరించినా, ఎప్పుడు తలచుకున్నా ఎంతో ప్రేమతో, హృదయపూర్వకంగా ఉండాలి. దాని వలన మన క్రేవింగ్ (తపన) 'వారి'ని చేరుతుంది. 'బాబూజీ, బాబూజీ' అని ఒక మాటలాగా కాకుండా, మన హృదయం పూర్తిగా క్రేవింగ్ (తపన)తో నిండిపోయేట్లుగా మనం సాధన చేయాలి. ప్రతి స్మరణ, జ్ఞాపకం తపనతోనే నిండిపోవాలి.

**అభ్యాసీ: బెహెన్‌జీ! భగవంతుడు ఒక్కడే అంటారు. నేను బాబూజీనే ఈశ్వరుడు అని అనుకుంటాను. కాని మీరు వ్రాసిన ఒక పుస్తకంలో ఒకచోట ఈశ్వరుడు కూడా బాబూజీ ముందు తలవంచాడు అని వ్రాసి ఉంది. అంటే ఈశ్వరుడు వేరే, బాబూజీ వేరే అని అర్థమా?**

**బెహెన్‌జీ:** అవును. ఈశ్వరుడు వేరు, బాబూజీ వేరు. వారిద్దరి మధ్యన చాలా భేదం ఉంది. "మానవ మాత్రులందరికీ ఈశ్వరప్రాప్తిని ప్రసాదించటానికే నేను అవతరించాను" అని బాబూజీ అన్నారు. అందువలన ఈశ్వరునికంటే ఎక్కువ శక్తి, ఎక్కువ సామర్థ్యం ఎవరిలోనైతే ఉంటుందో వారే మనకు ఈశ్వర సాక్షాత్కారాన్ని ప్రసాదించగలరు. లాలాజీ సాహెబ్ ప్రార్థనచేసి అంతిమ శక్తి నుండి బాబూజీని ఈ ధరణిమీద అవతరింప జేసారు. మానవులందరు ఈశ్వరునితోగల కనెక్షన్‌ను, ఈశ్వరుని కూడా పూర్తిగా మరచిపోయారు. అందువలన బాబూజీ యొక్క సంకల్పం ఏమిటంటే, సమస్త మానవాళిలో ఈశ్వరప్రాప్తికై మరల తీవ్రమైన తపనను మేల్కొలపాలి. అప్పుడే ప్రజలు ఈశ్వరుని పొందగలరు, అని. సృష్టి ఏర్పడాలి అనే సంకల్పం వలన సృష్టి నిర్మాణానికి ఎంత శక్తి అయితే అవసరమో, అంతే శక్తి మూలం (సోర్స్) నుండి విడిపోయి గాడ్ (ఈశ్వరుని)గా ఏర్పడింది. కాని ఎక్కడైతే సృష్టి రచన యొక్క సంకల్పం ఏర్పడిందో, ఆ మూలం (సోర్స్) అనేది అనంత-శక్తి,

ఆది–శక్తి, అంతిమసత్యం. అందువలన ఎవరైతే మూలం (అంతిమం) నుండి అవతరిస్తారో, కేవలం వారు మాత్రమే ఈశ్వర సాక్షాత్కారాన్ని కలిగించటానికి అవసరమైన దివ్య శక్తిని తీసుకొని, ఒక సహజమైన నేర్పుతో (టెక్నిక్‌తో) అవతరిస్తారు. ఎవరైతే సమస్త మానవాళి శ్రేయస్సు కొరకు వస్తారో, 'వారే' ఆ ఆదిశక్తి యొక్క మాస్టర్‌గా అయి ఈ ధరణి మీద అవతరిస్తారు.

అందువలన ఈశ్వర సాక్షాత్కార సమయం వచ్చినప్పుడు మన లోపల గాడ్ (ఈశ్వరుని) గురించి ఏ మాత్రం ఎరుక, జ్ఞానం ఉన్నా కూడా మనం సత్యపథ్ స్థితిని చేరుకోలేము. ఎందుకంటే, సంపూర్ణంగా మరచినస్థితి అనేది సత్యపథ్‌వద్దగల స్థితి. అందువలన సాక్షాత్కార సమయం రాగానే, ఒక్క క్షణం మాత్రమే, ఇది 'ఈశ్వర సాక్షాత్కారం' అని చూపించి, బాబూజీ అభ్యాసీని తమ హృదయంలోకి తీసుకొని, గాడ్ (ఈశ్వరీయ శక్తి కేంద్రం) లోపల ముంచి, అభ్యాసీని సంపూర్ణంగా ఈశ్వరీయ శక్తితో అలంకరించి, వెంటనే బాబూజీ తమ దివ్యశక్తితో అభ్యాసీని సత్యపథ్ (కేంద్ర మండలం యొక్క ప్రవేశ ద్వారం) వద్ద స్థిరపరుస్తారు.

అక్కడకు కబీర్ కూడా చేరలేకపోయాడు. కబీర్ అహం యొక్క 16 వలయాలను దాటి, ఈశ్వర సాక్షాత్కారాన్ని పొందాడు. కాని ఆ తర్వాత ముందుకు వెళ్ళలేక అక్కడే ఆగిపోయాడు. ముందు ఇంకా ఏదో ఉందని అతనికి తెలుసు. కాని ముందుకు వెళ్ళలేకపోయాడు. కేవలం బాబూజీ మహరాజ్ మాత్రమే సత్యపథ్‌ను దాటించి, అభ్యాసీని అంతిమం (అల్టిమేట్) వరకు తీసుకొని వెళ్ళగలరు. ఎలా అంటే, 'వారు' అంతిమం నుండి –మూలం నుండి అవతరించారు కాబట్టి.

సృష్టిలోని దుష్టత్వాన్ని సంహరించటానికి అవతార పురుషులు వస్తారు. వారి కార్యానికి ఎంత శక్తి అయితే అవసరమో, అంతే ఈశ్వరీయ శక్తిని తీసుకొని భూమిమీద అవతరిస్తారు. అందువల్లనే రాముడు 12 కళల శక్తిగలవాడని, శ్రీకృష్ణుడు 16 కళల శక్తిగలవాడని అంటారు. వారి ఈశ్వరీయ శక్తి అనేది వారు చేయవలసిన కార్యం మీద ఆధారపడి ఉంటుంది. సమస్త మానవాళిలో ఈశ్వరప్రాప్తికై తపనను మేల్కొలపాలి అనే ఈ దైవీయ మహా కార్యాన్ని ఈశ్వరీయ శక్తి కంటే కూడా అత్యంత మహా శక్తివంతమైన అంతిమశక్తి (ఆదిశక్తి) నుండి ఎవరైతే అవతరించారో, కేవలం ఆ బాబూజీ మహరాజ్ మాత్రమే ఈ పనిని చేయగలరు. వారే ఈ సృష్టి యొక్క మాస్టర్ కూడా. ఎవరైతే సోర్స్ (మూలం) నుండి అవతరించారో, వారే ఈ సృష్టి రచనలో ప్రాణాన్ని నింపగలరు.

బాబూజీ మహరాజ్ ఏమైనా చేయగలరు. 'వారు' గాడ్ (ఈశ్వరుని)తో కూడా జోక్ చేయగలరని మేము అనుకునే వాళ్ళం. నిజానికి బాబూజీ ఎప్పుడు కూడా వాస్తవమైన దానినే, యదార్థాన్నే చెప్పేవారు– "ఈశ్వరుడు అంటే ఈశ్వరుడే. యదార్థానికి మానవుడు ఈశ్వరుని యొక్క సాక్షాత్కారాన్ని పొందవలసినదే. కాని **ఎవరైతే గాడ్ (ఈశ్వరుని) కంటే కూడా ఉన్నతమైన స్థితి నుండి అవతరిస్తారో, 'వారు' ఈశ్వరునితో, ఈశ్వరీయ శక్తితో పని చేయించుకుంటారు. 'వారే' ఈశ్వరునికి కూడా మాస్టర్ అవుతారు" అని బాబూజీ అనేవారు.**

అందువలన బాబూజీ ఎప్పుడు కూడా ఈశ్వరుని ముందుపెట్టి, వారు ఈశ్వరుని వెనుక ఉండేవారు. బాబూజీకి ఈశ్వరుని యొక్క అస్తిత్వం గురించి తెలుసు. సాక్షాత్కారం అనేది మానవుని యొక్క జీవన కర్తవ్యం అనే ఉద్దేశ్యంతోనే బాబూజీ ఎప్పుడు కూడా ఈశ్వరుని మన ముందు ఉంచి, వారు ఆ వెనుక

ఉండేవారు. ఈశ్వర సాక్షాత్కారం అయిన తర్వాత, బాబూజీ మనలను ఎప్పుడైతే సత్యపద్ (సెంట్రల్ రీజియన్ ప్రవేశద్వారం) వద్ద స్థిరపరుస్తారో, అప్పుడే మనకు తెలుస్తుంది –కేవలం బాబూజీ మహరాజ్ (డివైన్ పర్సనాలిటీ) మాత్రమే మనలను 'అంతిమ సత్యం' వద్దకు తీసుకొని వెళ్ళగలరు అని. దీనినే నేను ఆ కండిషన్ (స్థితి)తో పాటుగా పుస్తకాలలో వ్రాశాను. అందువలన మానవులు దీనిని తప్పకుండా నమ్మి తీరాలి, నమ్ముతారు కూడా.

అహం యొక్క 16 వలయాల్ని దాటించి, బాబూజీ ఎప్పుడైతే అభ్యాసీని ఈశ్వరీయ శక్తి కేంద్రంలో ముంచి, పైకి తీసి, సత్యపథ్‌వద్ద స్థిరపరుస్తారో, అప్పుడు అహం అనేది పూర్తిగా సమాప్తమై, కేవలం ఐడెంటిటీ మాత్రమే మిగిలి ఉంటుంది. ఇప్పుడు బాబూజీ ఈ ఐడెంటిటీని కూడా సెంట్రల్ రీజియన్ యొక్క ముఖ్య కేంద్రంలో లయం చేస్తారు. అనగా ఇప్పుడు ఈ ఐడెంటిటీ కూడా తన ఐడెంటిటీని (ఉనికిని) గుర్తించలేదు. ఆ ఐడెంటిటీ కూడా తనను తాను పూర్తిగా మరచిపోతుంది. ఇప్పుడు బాబూజీ ఈ ఐడెంటిటీని అల్టిమేట్ (అంతిమం) వద్దకు భూమా యొక్క 7 వలయాల ద్వారా తీసుకొని వెళ్తారు. ఈ ఐడెంటిటీయే అక్కడి ఆ అనుభవాలను తెలుసుకుంటుంది. ఇదే సహజమార్గ్ సిస్టమ్ యొక్క గొప్పదనం! శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క డివైన్ బ్యూటీ (దైవీయ సౌందర్యం) అనేది అపూర్వం, అద్భుతం, అద్వితీయం. (ఐడెంటిటీ అనగా 'ఏమీలేదు' అనే దానిని 'ఉన్నది' అని భావించటం)

గాడ్లీ రీజయన్, సెంట్రల్ రీజియన్, అల్టిమేట్ అనే వాటి గురించి ఇంతకుపూర్వం ఎవరూ వ్రాయలేదు. భవిష్యత్తులో వీటిని గురించి ఎవరూ వ్రాయలేరు. ఎందుకంటే, బాబూజీ మహరాజ్ యొక్క ఈ రీసెర్చి (పరిశోధన)ను సమస్త మానవాళికి వెల్లడి చేయటం కోసమే బాబూజీ కలాన్ని నా చేతికి ఇచ్చారు. కాని నిజమైన రచయిత కేవలం 'వారు' మాత్రమే. నా చేతి వ్రేళ్ళలోని కలం కదులుతున్నది. కాని ఆ స్థితులను గురించి వర్ణించి వ్రాసేది 'వారు' మాత్రమే. ఈ విధంగా ఇంకా ఎవరు కూడా వ్రాయలేరు.

ఒకసారి మేమందరం షాజహాన్‌పూర్‌లో బాబూజీ ఇంటిలోని వరండాలో కూర్చొని ఉన్నాం. ఇంతలో 'వారు' ఒక్కసారిగా "భాయి! స్వామి వివేకానంద నాతో ఏదో చెప్పాలనుకుంటున్నారు" అని అనగానే వెంటనే మేమందరం నిశ్శబ్దంగా ఉండిపోయాము. కొంత సమయం తర్వాత –"నీ యొక్క ఈ రీసెర్చి (పరిశోధన) అంతా కూడా కేవలం నిన్ను నీవు ఈ ప్రపంచానికి వెల్లడి చేయటానికే. నీవు ఎటువంటి డివైన్ పర్సనాలిటీవి (దివ్య పురుషునివి)? నీవు ఎవరు? నీవు ఎక్కడ నుండి వచ్చావు? అనేది నీ రీసెర్చి (పరిశోధన) వలన అందరికీ తెలుస్తుంది. 'అనంత యాత్ర' అంటే ఇదే! అని స్వామి వివేకానంద నాతో అంటున్నారు" అని మాకు చెప్పారు బాబూజీ.

**అభ్యాసీ: బెహెన్‌జీ! బాబూజీ మహరాజ్‌కు, లాలాజీ సాహెబ్‌కు ఇద్దరికి ఒకే పేరు ఎందుకు ఉన్నది?**

**బహెన్‌జీ:** చాలా మంచి ప్రశ్నయే, కాని జవాబు 'వారు'తప్ప ఇంకెవ్వరు చెప్పగలరు? ఏ రోజునైతే 'డివైన్ పర్సనాలిటీ' భూమి మీద దివ్య శిశివుగా అవతరించారో, అప్పుడే నేను ఆ దివ్య శిశువులో మెర్జ్ (విలీనం) అయ్యాను– అని లాలాజీ సాహెబ్ అన్నారు. కాని భూమి మీద అవతరించినటువంటి ఆ దివ్య శక్తికి ఎటువంటి పేరు లేదు. ఆ దివ్యశక్తికి ఎటువంటి కాన్షస్‌నెస్ (స్పృహ) కూడా లేదు. తాను ఏమిటి అనేది ఆ దివ్యశక్తికి తెలియదు. మీరు జోతిష్యమే అనండి, ఇంకా ఏమైనా అనండి. అది ఏమి చెప్పినా కాని

ఆ దివ్యశక్తిలో లాలాజీ సాహెబ్ యొక్క రూపం మాత్రమే ఉంది. ఎందుకంటే, లాలాజీ సాహెబ్ ఆ దివ్యశక్తి (దివ్య శిశువు)లో మెర్జ్ (విలీనం) అయ్యారు కాబట్టి. అందువలన బాబూజీకి, లాలాజీ సాహెబ్ యొక్క పేరు 'రామచంద్ర' తప్ప, వేరే పేరు పెట్టడానికి అవకాశమే లేదు. మరో విషయం ఏమిటంటే, ఆ దివ్యశక్తి (అంతిమ శక్తి) భూమి మీద అవతరించిన తర్వాత, లాలాజీ సాహెబ్ నెమ్మది, నెమ్మదిగా ఆ దివ్యశక్తిలో స్పృహను కలిగించారు. అప్పుడు ఆ దివ్యశక్తికి దానిలో లాలాజీ సాహెబ్ యొక్క రూపమే కనపడింది. ఇంక వేరే ఏమీ కనపడలేదు. అందుచేత అప్పుడింక బాబూజీకి వేరే పేరు ఎలా వస్తుంది? అందువల్లనే బాబూజీ, లాలాజీ ఇద్దరికీ ఒకే పేరు 'రామచంద్ర' అని వచ్చింది.

దీనికి ఋజువు కూడ మన పురాణాలలో ఉంది. కృష్ణునికి కృష్ణుడు అనే పేరు ఎందుకు వచ్చింది? కృష్ణునిది ఈశ్వరీయ శక్తి. ఋషులు, మునులు ప్రార్థనచేసి ఈశ్వరుని నుండి ఆ అవతార పురుషుని అవతరింపజేశారు. పురోహితుడు పేరు పెట్టడానికి వచ్చినపుడు, ఆ బాలుని చూడగానే, వారు ఆ బాలునివైపు ఒక్కసారిగా ఆకర్షింపబడ్డాడు. అందువలన పురోహితుడు ఆ బాలునికి 'కృష్ణ' అని పేరు పెట్టారు. కృష్ణ అనగా ఆకర్షించువాడు అని అర్థం. అదే విధంగా వశిష్టుడు రామునికి నామకరణం చేసేముందు, కౌసల్యామాతతో "ఈ బాలుడు విశ్వమంతటా వ్యాపించి ఉండటాన్ని ఈతడు జన్మించకముందే చూడటం జరిగింది. కాబట్టి ఇతనికి 'రామ్' అని పేరు పెడుతున్నాను" అని అన్నాడు. 'రామ్' అనగా సమస్తం నందు వ్యాపించి ఉన్నవాడు అని అర్థం. అందువలన రామునికి ఆ పేరు వచ్చింది.

మేము మిషన్‌లో చేరకముందు మా ఇంటికి అనేక మంది సాధువులు వస్తూ ఉండేవారు. ఒకసారి ఒక సాధువు –"నేనే రాముణ్ణి" అని నా తండ్రిగారితో అన్నాడు. ఈ మాటనే నా తండ్రిగారు బాబూజీకి తెలుపగా వారు, "భాయీ! ఆ సాధువు –నేనే రాముణ్ణి అని అన్నాడు కదా! 'నేను' అనే పదం ఉపయోగించగానే అతడు రాముడి నుండి తనను తాను వేరు చేసుకొన్నాడు. 'నేను' అనేది అతడిని, రాముని నుండి విడిపోయేట్లుగా చేసింది. మొదట అతడు రాముని నుండి విడిపోయి, మరల –నేను రాముణ్ణి అని అంటున్నాడు. ఎవరైనా రాముణ్ణి పేరు అడిగితే, 'రామ్' అని అంటాడు. అంతేకాని నేను రాముణ్ణి –అని అనడు కదా! అందువలన నీవు, 'నేనే రాముణ్ణి' అని భావించుకొని సాధనచేస్తే నీకు ఎటువంటి ఫలితం ఉండదు. ఎందుకంటే, 'నేను' అనేది ఎల్లప్పటికీ వేరుగా, విడిగానే ఉంటుంది కాబట్టి" అని అన్నారు బాబూజీ.

దీనిని నేను ఇంకా వివరిస్తూ ఇలా అన్నాను: చూడండి! సాధకునిగా మారుతారు. కాని –నేనే రాముణ్ణి, అని అనగానే 'నేను' అనే దాని వలన రాముని నుండి విడిపోతారు. అందువల్లనే సహజమార్గ సిస్టమ్ యొక్క రమణీయత ఏమిటంటే, సాధన ప్రారంభం నుండి కూడా –ఈశ్వరుడు నీ హృదయంలోనే ఉన్నాడు, అని బాబూజీ చెప్పేవారు. ఈ విధంగా –"ఈశ్వరుడు నాలోనే ఉన్నాడు" అనేది నిరంతరం గుర్తు పెట్టుకోవటం వలన ఒకరోజున నీవు. నీ పేరు, నీ రూపం, నీ సర్వస్వం మరచిపోతావు. అప్పుడు కేవలం 'వారు' మాత్రమే నీకు కనపడతారు. బాబూజీ నిన్ను 'అక్కడి'కి తీసుకుని వెళ్ళినప్పుడే "వారు ఎవరు?" అనేది నీకు తెలుస్తుంది. అందుకని నేను ఒక పాటలో ఈ విధంగా వ్రాశాను: బాబూజీ నాకు ఈశ్వరప్రాప్తిని కలిగించి, సత్యపద్‌వద్ద స్థిరపరచి, ఆ తర్వాత కేంద్ర మండలంలో స్విమ్మింగ్ చేయించినప్పుడు –"ఇక్కడ

బాబూజీ అంటే 'భూమా' యొక్క దివ్యపుత్రుడు, అంతేకాని లాలాజీ సాహెబ్ యొక్క ముద్దుబిడ్డ కాదు" అని స్వామి వివేకానందజీ తెలిపారు.

"ఈ ప్రపంచానికి చెందిన మీ కస్తూరీ మరణించింది. కాని నా కస్తూరీ జీవించియే ఉన్నది" అని ఒకసారి బాబూజీ నా తండ్రిగారితో అన్నారు. దీని అర్థం ఏమిటి? అని ఒకసారి ఆలోచించాను. ఇంటి పనులు అన్నీ చేసేది ఈ కస్తూరీయే. కాని బాబూజీ యొక్క పనిని చేసేది ఈ కస్తూరీ మాత్రం కాదు. వేరే, ఎవరో, బాబూజీలోనే లయమై ఉన్నటువంటి వేరే ఎవరో కస్తూరీ 'వారి' పనిని చేస్తున్నట్లుగా నాకు అనిపించేది. కాని ఇది నాకు ఇప్పటివరకు కూడా అర్థం కాలేదు.

బాబూజీ మహరాజ్ పరిశోధనా సౌందర్యం ఏమిటంటే, ఎప్పుడైనా, ఏదైనా ఒక కండిషన్ అంటే స్థితి గురించి వివరణ వ్రాయాలన్న ఆలోచన రాగానే వెంటనే ఆ స్థితి నా ఎదుట –ఒక పారదర్శకమైన అద్దం వంటిదానిలో ప్రత్యక్షమైనట్లు కనిపించేది. ఎదురుగా కనిపిస్తున్న ఆ దృశ్యాన్ని చూస్తూ నా చేయి వ్రాస్తూనే ఉంటుంది. ఏది కనిపిస్తే అది కాగితం మీద వ్రాస్తాను. అంతా అయ్యాక చూస్తే అక్కడ అక్షరాలు, పదాలు ఉంటాయి. అందువలన అసలు రచయిత కేవలం 'వారు' మాత్రమే. ఇది అంతా బాబూజీ మహరాజ్ యొక్క గొప్పదనం. ఈ విధంగా వ్రాయడం అనేది ఇంతకుపూర్వం ఆధ్యాత్మిక చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. భవిష్యత్‌లో జరగబోదు.

ఒకసారి ఒక ఋషీశ్వరుని శిష్యుడు మిథిలా నగరాధీశుడు జనక మహారాజును దర్శించుకుని ఆయన్ని ఇలా అడిగాడు, "రాజా! మిమ్మల్ని 'విదేహుడు' అని అంటారు కదా! ఎందుకని?

జనక మహారాజ్, "మునీశ్వరా! ఇప్పుడు నేను రాచకార్యంలో మునిగి ఉన్నాను. మీరు మా పట్టణం దర్శించుకుని, అందులోని వింతలు, విశేషాలను పరిశీలించి రండి. ఈలోగా నా పని పూర్తవుతుంది. మీ సందేహాలకు అప్పుడు సమాధానం ఇస్తాను" అని అన్నాడు.

అందుకు ఆ ముని అంగీకరించాడు. అప్పుడు జనక మహారాజు "మునిశ్రేష్టా! దీనికి ఒక నిబంధన ఉంది" అన్నాడు.

"ఏమిటో అది శెలవివ్వండి" అన్నాడు ముని.

'అదేమంటే, మీరు పురదర్శనానికి వెళ్ళేముందు ఈ దీపాన్ని మీతో తీసుకుని వెళ్ళండి. పురదర్శనం పూర్తయ్యేవరకు ఈ దీపం ఆరిపోకుండా జాగ్రత్తగా చూసుకుంటూ తిరిగివచ్చి, మీరు చూసిన విశేషాలు నాకు చెప్పాలి" అని అన్నాడు జనక మహారాజు.

మొత్తానికి మునీశ్వరుడు జనక మహారాజ్ నిర్దేశించినట్లుగా దీపం ఆరిపోకుండా జాగ్రత్తగా చూసుకుంటూ పురదర్శనం కానిచ్చి రాజువద్దకు వచ్చాడు. ఏయే వింతలు గమనించింది వివరించమని రాజు కోరగా మునీశ్వరుడు, "రాజా! ఏమి చూశానని చెప్పను! నిజం చెప్పాలంటే, ఈ దీపంతప్ప నాకు ఏమీ కనపడలేదు. ఎంతసేపూ, మీ నిర్దేశం ప్రకారం ఈ దీపం ఆరిపోకుండా చూసుకోవటంతోనే సరిపోయింది" అని అన్నాడు.

అప్పుడు జనక మహారాజ్ అన్నాడు, "మునీశ్వరా! నీ దేహం పురమంతా చుట్టిరాగా నీ దృష్టి అంతా దీపం మీదనే ఉన్నట్లు, నా దృష్టి (నా చైతన్యం) అంతా ఆ దైవం మీదనే ఉండగా నా దేహం రాచకార్యాల్లో మునిగి ఉంటుంది. దేహదృష్టి లేకపోవటం వలన 'విదేహుడు' అంటున్నారు" అని.

బాబూజీ మహరాజ్‌ని ఒక అభ్యాసీ ఇలా అడిగాడు:

**అభ్యాసీ: బాబూజీ! కౌరవ, పాండవులకు జరిగిన మహాయుద్ధంలో శ్రీకృష్ణుడు అర్జునునికి గీతోపదేశం చేశాడు. అయితే కృష్ణుడు అర్జునునికి అన్ని వందల శ్లోకాలు చెప్పటానికి అంత సమయం ఎక్కడ ఉంది?**

**బాబూజీ:** కేవలం 7 నిమిషాలలో శ్రీకృష్ణుడు అర్జునునికి 7 శ్లోకాలు (గీతోపదేశం) వినిపించాడు. ఆ శ్లోకాలతోపాటుగా కృష్ణుడు మొదట అర్జునుని బ్రహ్మాండ మండలం స్థితికి తీసికొని వెళ్ళాడు. ఏదైనా సంఘటన మొదట బ్రహ్మాండ మండలంలో జరిగిన తర్వాతనే, అది భూమి మీద జరుగుతుంది. అందువలన శ్రీకృష్ణుడు అర్జునుని మొదటగా బ్రహ్మాండ మండలస్థితికి తీసికొని వెళ్ళి, "అర్జునా! ఇటు చూడు. కౌరవులందరు ముందే మరణించి ఉన్నారు. నీవు ఈ యుద్ధంలో కేవలం నిమిత్తమాత్రుడివే" అని గీతోపదేశం చేశాడు. ఆ బ్రహ్మాండ మండలం యొక్క దృశ్యాన్ని చూడటం కోసం శ్రీకృష్ణుడు అర్జునునికి (ఆ స్థితిని) దివ్యదృష్టిని కూడా ప్రసాదించాడు. ఆ తర్వాత ఆ స్థితిని ఉపసంహరించిన తర్వాత, అర్జునుడు మరల మామూలు స్థితిలోకి వచ్చాడు. 7 నిమిషాలలో చెప్పబడిన 7 శ్లోకాలమీద వ్యాఖ్యానాలు వ్రాయటం వలన అంత పెద్ద గ్రంథం తయారయ్యింది.

ఏ పవర్ (శక్తి) అయితే క్రియేషన్ (సృష్టి నిర్మాణం) కొరకు వచ్చిందో, అది ఆర్క్ (చాపం, అర్ధచంద్ర) రూపంలో వచ్చింది. శక్తి అనేది ఆర్క్ రూపంలో ఎందుకు వచ్చిందంటే, ఒకవేళ శక్తి పై నుండి క్రిందికి సూటిగా వచ్చినట్లయితే అది రిఫ్లెక్ట్ (పరావర్తనం) చెంది, పైకి వెళ్ళిపోయి, ఆ శక్తి దాని మూలంలోనే కలిసిపోతుంది. మరల ఆ శక్తి క్రిందికి రాదు. ఆ విధంగా జరుగకుండా ఉండటానికిగాను, శక్తి ఒక ఆర్క్ (చాపం) రూపంలో వచ్చింది. గంగ ఒకవేళ సూటిగా భూమిమీదకు ప్రవహించినట్లయితే, అది మరల వెనుకకు వెళ్ళిపోయేది. అందుకనే శివుడు గంగను తన శిరస్సుమీద జటాజూటంతో బంధించి, గంగను ఆర్క్ (చాపం) రూపంలో ప్రవహించేట్లుగా చేశాడు.

సోర్స్ (మూలం) లేదా అల్టిమేట్ నుండి శక్తి క్రిందికి దిగి వచ్చే సమయంలో భూమా యొక్క సప్త వలయాలు ఏర్పడ్డాయి. ఈ వలయాలు ఒకదానికంటే ఒకటి పెద్దవిగా ఏర్పడ్డాయి. ఆ తర్వాత ఈ శక్తి స్థిరత్వం నంది (బలపడి) అనంతంగా వ్యాపించి, సెంట్రల్ రీజియన్ (కేంద్ర మండలం)గా ఏర్పడింది. అందువల్లనే ఈ సెంట్రల్ రీజియన్‌ను అల్టిమేట్ (భూమా) యొక్క వైభవ-సామ్రాజ్యం అని అన్నారు. మూలం నుండి ప్రవహించిన శక్తిలో (సాంద్రత) డెన్సిటీ ఎక్కువగా ఉంది. అది ఇక్కడే, సెంట్రల్ రీజియన్‌లో స్థిరపడింది కాబట్టి, ఇది అన్నిటికంటే కూడా చాలా పెద్ద వృత్తం. దీనిలో అనంతమైన శక్తి ఇమిడి ఉంది.

ఛాంద్యోపనిషత్‌లో దహర్-విద్య అని పిలువబడే బ్రహ్మవిద్య ఉంది. దహర్ అనగా భగ్గుమని మండటం. ఈ బ్రహ్మవిద్య మన సంస్కారాలను భస్మం చేస్తుంది.

లైట్ (జ్యోతి) దగ్గరికి వెళ్ళినపుడు వేడిగా అనిపిస్తుంది. ఇంకా దగ్గరకు వెళ్ళితే జ్యోతి కారకమైన ఆ అగ్ని మీ దుస్తులను, శరీరాన్ని కాల్చుతుంది. బాబూజీ మహరాజ్ డివైన్ లైట్ (దివ్య జ్యోతి) అని

అన్నారు. ఈ డివైన్ లైట్ దగ్గరకి చేరినకొద్దీ దాని ఫోమెంటేషన్ (నులివెచ్చదనం కావడం) వలన అహం కరిగిపోతుంది. అందువల్లనే బాబూజీ ఈ విధంగా అనేవారు: "నేను మిమ్మల్ని ధ్యానం చేయమని చెప్పటం లేదు. ఈశ్వరుడు మీ హృదయంలోనే ఉన్నాడు –అనే దానిని మరచిపోకుండా, గుర్తుపెట్టుకొని, నిరంతరం ఈశ్వరునితోనే ఉండటానికి ప్రయత్నం చేయండి. మీరు సదా ఈశ్వర సాన్నిధ్యంలో ఉండటంవలన అహం మరియు అనవసరమైనవి అన్నీ కూడా కరిగిపోతాయి." దీనినే బాబూజీ ఒక చక్కని ఉదాహరణతో వివరించారు. "ఒక మండుతున్న నిప్పు కణిక ఉంది. దీన్నే డివైన్ లైట్ అనుకోండి. ఇంకా అంధకారంగానే ఉన్న మన హృదయాన్ని ఒక బొగ్గు ముక్క అనుకోండి. మీరు ఈ బొగ్గు ముక్కను నిప్పు కణిక దగ్గరకు తీసుకొని వెళ్ళినపుడు మొదటగా బొగ్గు ముక్కను నిప్పు కణిక దగ్గరకు తీసుకొని వెళ్ళినపుడు మొదటగా బొగ్గు ముక్క వేడెక్కి, వేడెక్కి ఆ తర్వాత ఒక్కసారిగా మండుతుంది. అదే విధంగా, ఏ రోజునైతే మీ హృదయం ఆ డివైన్ లైట్‌ను స్పర్శించి, ప్రజ్వలితం అవుతుందో అప్పుడు మీ మొత్తం సిస్టమ్ అంతా దివ్య ప్రకాశంతో ప్రకాశిస్తుంది."

ఒకసారి మేమందరం ఇలాగే బాబూజీ ఇంటిలో బయట వరండాలో కూర్చొని ఉన్నాం. దూరంగా ఎవరో సాధువు మైక్‌లో ఇస్తూన్న ఉపన్యాసం మాకు వినపడుతూ ఉన్నది. ఆ సాధువు తన శిష్యులతో "చూడండి! కబీర్ కూడా చెప్పాడు మాయ చాలా చెడ్డది. మిమ్మల్ని మోసం చేస్తుంది" అని. అది వింటూన్న బాబూజీ, "బిటియా! ఎంతో సులభమైన దాన్ని ఈతడు ఎంత క్లిష్టంచేసి చెప్పుతున్నాడు. ఈ సాధువు, తాను ఒక్కడే ఈ మాయను జయించినట్లు, ఇతరులెవరూ మాయను జయించలేరని అన్నట్లుగా చెప్పుతున్నాడు, విను.

**"కండ్లు తెరిస్తే మాయ, కండ్లు మూస్తే డివైన్ (దైవం)!"**

ఎంత సులభమో చూడు! అందువల్లనే నీ దృష్టి ఎల్లప్పుడూ కూడా ఈశ్వరుని మీదనే ఉండాలని చెప్పాను" అని అన్నారు.

మన దృష్టి ఎప్పుడూ 'వారి' మీదనే ఉంటే ఈ ప్రాపంచికమైన పనులు ఏ విధంగా చేయగలం? అని అనుకుంటాము. కాని ఈ ప్రాపంచికమైన పనులను చేసేది మనస్సు మాత్రమే, హృదయం కాదు.

హృదయం 'వారి' ధ్యానం (స్మరణ)లో ఉంటుంది. "బాబూజీ నా వారు" అని మీరు నోటితో అంటారు కాని –"బాబూజీ నావారు" అని జ్ఞాపకం రాగానే మీ హృదయం ప్రేమతో ఉప్పొంగిపోయినపుడు మీకు ఈశ్వరునితో ప్రేమ ఏర్పడిందని గుర్తు.

ఒక అభ్యాసీ బాబూజీని అడిగాడు కదా–

**అభ్యాసీ: "బాబూజీ! నేను పూర్తిగా మీ వానినిగా కావాలని కోరుకుంటున్నాను. కాని మీవానిగా కాలేకపోతున్నానే!"**

**బాబూజీ:** అవును. నీవు ఎప్పటికి కూడా ఆ విధంగా కాలేవు. ఎందుకంటే, నేను 'కోరుకుంటున్నాను' అనే పదాన్ని నీవు ఉపయోగించావు. ఈశ్వరుడు కోరికకు అతీతంగా ఉన్నాడు. నీవు ఈశ్వరునితో అటాచ్‌మెంట్ (వీడని బంధం – కనెక్షన్) ఏర్పరచుకో. కోరిక అనే దాని వలన మధ్యలో ప్రతిబంధకం (దూరం) ఏర్పడుతుంది. నీవు ఏ పనిని చేసినా –'నేను' అనే దానిని ఈశ్వరునితో కనెక్ట్ చేయి –అనుసంధానం చేయి.

నేను (కస్తూరీగారు) ఒకచోట ఈ విధంగా వ్రాశాను: 'సంధ్య సల్‌వట్ ఓఢనీ' (సంధ్య ఫిర్యాదు చేస్తుంది) –బాబూజీ! మీరు నాకు మీ దర్శనం కూడా ప్రసాదించారు. నన్ను ఇక్కడివరకు తీసుకొని వచ్చారు. నేను మీలో సంపూర్ణంగా లయమయ్యానని తెలిపారు. అయినప్పటికీ మీకు నాకు మధ్య ఈ సన్నని మేలిముసుగు వంటిది ఎందుకు ఉన్నది? ఈ మాత్రం దూరం కూడా ఎందుకు ఉంది?

లాలాజీ సాహెబ్ 'బాబూజీ'ని అంతిమం నుండి అవతరింపజేశారు. వారిని నీవు చూడగలవు. కాని 'వారి'లాగా కాలేవు. ఎందుకంటే, 'వారు' డివైన్ (అల్టిమేట్) కాబట్టి. అందుకే ఈ దూరం. లాలాజీ సాహెబ్ ఎంతో కష్టపడి తమ ప్రార్థన ద్వారా 'వారి'ని భూమి మీద అవతరింపజేశారు. అందువలన లాలాజీకి కూడా అంత విలువను ఇవ్వాలి, ఇవ్వండి.

"నేను నీలో మెర్జ్ (విలీనం) అయ్యాను. ఇది యదార్థం. నేను నీలో మెర్జ్ అయ్యాను –అనే ఈ సత్యాన్ని ఎవరితోనైనా చెప్పటానికి నేను సిద్ధంగా ఉన్నాను. కాని నీవు ఏదైతే అయి ఉన్నావో 'అది' నేను కాదు" –అని లాలాజీ సాహెబ్ తనతో అన్నారని బాబూజీ చెప్తూ, "ఈశ్వర్ సహాయ్‌జీ! లాలాజీ సాహెబ్ నాలాగా అయిపోతే, ఇంక నాకు శిక్షణ ఇచ్చేది ఎవరు?" అని అన్నారు.

బాబూజీలో ఎంత వినమ్రత ఉందో చూడండి! యదార్థానికి మనం బాబూజీ బాహ్య జీవన విధానాన్ని వారి మాటలను విని, నేర్చుకుంటే వారిని అలా అనుసరించినట్లయితే, మనం కూడా ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థాయిని పొందటానికి యోగ్యతను సంపాదించుకుంటాం. వారు ఎంతో ప్రేమతో, ఎంతో మృదువుగా మాట్లాడుతారు, మనల్ని ఎంతో ప్రేమతో చూస్తారు. అలాగే మనం కూడా వారిలాగా జీవించటానికి ప్రయత్నిస్తే, అత్యున్నతమైన ఆధ్యాత్మిక స్థితిని పొందటానికి యోగ్యులుగా తయారవుతాము.

నేను బాబూజీ మహరాజ్‌కు నా కండిషన్ (స్థితి)ని గురించి వ్రాసేదాన్ని. అది ఏ విధంగా ఉండేదంటే, మూగవానికి బెల్లం ఇచ్చి రుచి చెప్పమన్నట్లుగా అనిపించేది. యదార్థం ఏమిటంటే, నేను ఎన్ని పుస్తకాలయితే వ్రాశానో అవి అన్నీ కూడా అటువంటివే. అంటే మూగవాడికి బెల్లం ఇచ్చి దాని రుచి చెప్పమంటే ఏమి చెప్తాడు! ఎలా చెబుతాడు! నా 'స్థితి'ని వ్రాయటంలో ఇక్కడ నేనూ మూగదాన్నే. కాని బెల్లపు ముక్క తీపిని (ఆ దివ్య స్థితులను) వర్ణింపజేసేది 'వారే'. దీనినిబట్టి 'వారు' ఒక మూగవాడిచేత కూడా మాట్లాడించగలరని తెలుస్తుంది. మీరు కూడా ఈ ఆధ్యాత్మిక స్థితులను గురించి నేడు కాకపోయినా రేపు అయినా మాట్లాడుతారు.

ఒకసారి బాబూజీ ఆధ్యాత్మికత మీద తాను వ్రాసిన ఒక ఆర్టికల్ (వ్యాసం)ను డా॥ కె.సి.వరదాచారి గారికి పంపి "నా ఇంగ్లీషు ఎలా ఉందో కాని, దానిలో కనీసం ఒక వాక్యాన్నయినా నీవు మార్చగలవేమో చూడు" అని అన్నారు. నెల రోజుల తర్వాత డా॥ కె.సి. వరదాచారిగారి వద్ద నుండి ఉత్తరం వచ్చింది. "బాబూజీ! నేను ఎంతో ప్రయిత్నించాను. కాని ఒక్క వాక్యాన్ని కూడా మార్చి వ్రాయలేకపోయాను. ఏ కొంచెం మార్చినా, ఒక స్వచ్ఛమైన తెల్లని వస్త్రం మీద మురికిని చల్లినట్లు అవుతుందని నాకు అనిపించింది. అందుచేత మీరు ఏదైతే వ్రాశారో అదే కరెక్ట్" అని వరదాచారిగారు తెలిపారు.

అప్పుడప్పుడు ఏమని అనిపిస్తుందంటే, బాబూజీ చదువురాని నన్ను ఎందుకు ఈ రీసెర్చ్ (పరిశోధన) కొరకు తీసుకున్నారో కదా! అని. అది ఇప్పుడు కొద్దిగా అర్థం అయింది. చదువుకొన్న వాళ్ళయితే 'వారు'

చెప్పింది వ్రాయకుండా ఎక్కడో ఒకచోట తమ స్వంత పాండిత్యాన్ని చేరుస్తారు. బాబూజీ చాలా తెలివిగలవారు. అందుకనే ఏం చదువుకోని నామీద రీసెర్చి (పరిశోధన) చేశారు. వారు 'అ' అంటే 'అ' అని, 'బ' అని అంటే 'బ' అని వ్రాస్తానని వారికి తెలుసు.

**అభ్యాసీ: లివింగ్ మాస్టర్ (సజీవ గురువు) సహాయం లేనిదే భగవంతుని ఎవరూ చేరుకోలేరు అని కొందరు అంటున్నారు.**

**బహెన్‌జీ:** ఆధ్యాత్మిక చరిత్రలో లివింగ్ మాస్టర్ (సజీవ గురువు) సహాయంతో సాక్షాత్కారం పొందినట్టి వారు ఒక్కరు కూడా లేరు, ఒక్క ఉదాహరణా లేదు. భక్త మీరాబాయి, సంత్ కబీర్, తులసీదాస్, వీరందరూ కూడా ఈశ్వర సాక్షాత్కారాన్ని పొందినవారే. కాని వారెవరికీ కూడా 'లివింగ్ మాస్టర్' అనేవారు లేరు. లివింగ్ మాస్టర్ లేకుండా భగవంతుని చేరుకున్న వారి ఉదాహరణలు ఎనెన్నో ఉన్నాయి. ఎందుకంటే, ప్రేమ, భక్తి ద్వారానే ఈశ్వర దర్శనం సాధ్యమవుతుంది. "ఈ మార్గం ద్వారా వెళ్ళితే నీవు ప్రేమను పొందుతావు, భక్తిని పొందుతావు. నీవు ఈ మార్గం ద్వారా వెళ్ళితే తప్పకుండా ఈశ్వరుని చేరుకుంటావు" అని లివింగ్ మాస్టర్ తన అనుభవం ద్వారా చెబుతాడు. లివింగ్ మాస్టర్ దారిని చూపగలడు. అంతేకాని, లివింగ్ మాస్టర్ ద్వారా సాక్షాత్కారాన్ని పొందారని చెప్పటానికి ఇంతకుపూర్వం ఒక్క ఉదాహరణ కూడా లేదు. భవిష్యత్తులో కూడా ఒక్క ఉదాహరణా లభించదు. ఎందుకంటే, ఎప్పుడైతే 'నీవు' అక్కడ ఉండవో, అప్పుడే సాక్షాత్కార సమయం వస్తుంది.

**అభ్యాసీ: స్వామి వివేకానందజీకి 'లివింగ్ మాస్టర్' ఉన్నారు కదా?**

**బహెన్‌జీ:** స్వామి వివేకానంద ఈశ్వర సాక్షాత్కారం గురించి ఎక్కడ కూడా వ్రాయలేదు. వారి లివింగ్ మాస్టర్ శ్రీ రామకృష్ణ పరమహంస. వారిని స్పర్శించి వారివద్ద ఉన్నదంతా వివేకానందునికి ట్రాన్స్‌ఫర్ (బదిలీ) చేశారు. "నా దగ్గర ఉన్నదంతా నీకు ఇచ్చివేశాను. ఇపుడు నీవు ఇంకా ముందుకు వెళ్ళు" అని రామకృష్ణ పరమహంస అతనితో అన్నారు. రామకృష్ణ పరమహంస చాలా కష్టపడి అవధూత స్థితిని మాత్రమే పొందారని బాబూజీ ఒకసారి శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారితో అన్నారు. అవధూత స్థితిలో దేహ చైతన్యం అనేది ఉండదు. పూర్తిగా మరచిన స్థితిలో ఉంటారు. ఎవరైనా, ఏమైనా ఇస్తే తింటారు. తాను ఎక్కడ తిరుగుతున్నది, ఏం చేస్తున్నది వారికి తెలిసేది కాదు. రామకృష్ణ పరమహంసకు ఈ అవధూత స్థితి అంటే చాలా ఇష్టం. కాబట్టి చివరి రోజులలో అతడు సమాధిలోనికి వెళ్ళి దాని కొరకు ప్రార్థించి, ఆ అవధూత స్థితిని పొందిన తర్వాతనే మహాసమాధి నొందారని, బాబూజీ మహరాజ్ తెలిపారు.

నాకు కూడా ఇటువంటి అవధూత స్థితి వచ్చినపుడు నేను బాబూజీకి ఉత్తరం వ్రాశాను. అప్పుడు వారు, "బిటియా! కంగ్రాట్యులేషన్స్. ఇప్పుడు స్వామి రామకృష్ణ పరమహంస యొక్క స్థితి నా ఎదుట కనపడుతున్నది. నిజానికి ఇటువంటి స్థితిలో నీవు తప్పనిసరిగా నా సమక్షంలోనే ఉండాలి. అయినా ఫరవాలేదు. లాలాజీ సాహెబ్ కృప నిన్ను అనుక్షణం కనిపెట్టుకొని ఉంటుంది" అని వ్రాశారు.

ఈ స్థితిలో నేను ఏమైనా తిన్నానా, లేదా అనేది నాకు తెలిసేది కాదు. ఎక్కడికి వెళ్ళుతున్నాను, ఏం చేస్తున్నాను అనేది కూడా నాకు ఏ మాత్రం తెలిసేది కాదు. అనుక్షణం బాబూజీయే నాకు స్పృహ కలిగించి నన్ను కాపాడేవారు. నేను ఈ అవధూత స్థితిలో ఉన్నాననే విషయం మా ఇంటిలోని వారికి కూడా తెలియదు.

**అభ్యాసీ: వివేకానందునికి ఆ పేరు ఎలా వచ్చింది?**

**బెహెన్‌జీ:** స్వామి రామకృష్ణ పరమహంస నరేంద్రుని స్పర్శించడం వలన అతనిలో వివేకం మేల్కొన్నది. రామకృష్ణ పరమహంస ట్రాన్స్‌ఫర్ (బదిలీ) చేసిన ఆధ్యాత్మిక స్థితి వలన నరేంద్రుడు ఆనందం పొందాడు. అందువలన అప్పటినుండి ఆతడు వివేకానంద అయ్యాడు.

ఒకసారి మన బాబూజీ గురు-భాయి అయిన పండిట్ రామేశ్వర్ ప్రసాద్ మిశ్రాజీ, తన తల్లిగారిని చూడటానికి ఊరికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఒక అడవి ఉంది. అతడు ఆ అడవిలో వెళ్తూ, లాలాజీ సాహెబ్ ధ్యానం (స్మరణ)లో పూర్తిగా మునిగిపోయి సర్వం మరచిపోయారు. అప్పుడు దాదాపు రాత్రి అయింది. ఇంతలో ఒక సింహం అతడి ఎదుటకు వచ్చింది. దాదాపు 2,3 అడుగుల దూరంలోనే ఉంది సింహం. వారు పూర్తిగా లాలాజీ సాహెబ్ స్మరణలోనే మునిగిపోయి ఉండటం వలన తన ఎదుట సింహం ఉన్నదనే సంగతే వారికి తెలియదు. అప్పుడు లాలాజీ సాహెబ్ అతని భుజం మీద ఒక దెబ్బవేసి, వారికి బాహ్య స్పృహను కలిగించారు. గభాల్న స్పృహలోకి వచ్చిన ఆయన సింహం తనవైపే చూస్తూ ఉండటం గమనించిన గురు-భాయి తన ఎదుట ఉన్న సింహం కళ్ళను చూస్తూ-చూస్తూ, దాని కళ్ళలో లాలాజీ సాహెబ్ కండ్లనే చూశారు. ఇంకేముంది! మరల ఆయన తన బాహ్య స్పృహను కోల్పోయారు. ఇంక అప్పుడు స్వయంగా లాలాజీగారే అతణ్ణి చేయి పట్టుకొని అడవి బయటకు తీసుకొని వచ్చారు.

రియాలిటీని నమ్ముకుంటే ఎటువంటి హాని కూడా జరుగదు. రియాలిటీ (వాస్తవికత)ను నమ్ముకుంటే అన్నింటిలోను, అంతటా కూడా మీరు మాస్టర్‌నే చూస్తారు.

**అభ్యాసీ: డివోషన్ అంటే ఏమిటి?**

**బెహెన్‌జీ:** దివ్యత్వమనే సముద్రంలో లోతుగా మునిగిపోవటం, మరల ఎప్పుడూ కూడా బయటకు రాకూడదు. అప్పుడే లయావస్థ పొందగలరు.

మీరు బాబూజీని పూజిస్తున్నారు. మీరు బాబూజీని మూర్తి-పూజగా చేస్తున్నారు అని ప్రజలు అంటారు. కాని ధ్యానంలో లోతుగా వెళ్ళి చూస్తే బాబూజీ మహరాజ్ విశ్వం అంతటా కూడా వ్యాపించి ఉన్నట్లుగా అనిపిస్తుంది. అప్పుడు ఇది మూర్తి-పూజ ఎలా అవుతుంది.

"బాబూజీ! ఈశ్వరుడు మా హృదయంలోనే ఉన్నాడని మీరు చెప్పారు. కాని మా హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడో, లేడో మాకు తెలియదు. కాని మా హృదయాలలో మీరే నిండిపోయి ఉన్నారు అనేది మాత్రమే మాకు తెలుసు"- ఇదే మన విన్నపం 'వారి'కి.

**అభ్యాసీ: ఒకసారి ధ్యానంలో అణుమాత్రంగా ఉన్న వెలుగు నా హృదయంలోకి ప్రవేశించి క్రమంగా పెద్దదై, హృదయమంతటా నిండిపోయి, ఆ తర్వాత అది విశ్వం అంతటా వ్యాపించినట్లుగా అనిపించింది.**

**బెహెన్‌జీ:** బాబూజీ ఏమన్నారంటే, "నేను అభ్యాసీ హృదయంలో ఆధ్యాత్మికత అనే బీజాన్ని నాటి, ప్రాణాహుతి అనే నీరు పోయటం వలన ఆ బీజం మొలకెత్తి, పెద్దదై హృదయం అంతా నిండిపోయి, ఆ తర్వాత అది విశ్వమంతా వ్యాపిస్తున్నట్లుగా అనిపిస్తుంది" అని అన్నారు.

ఇక్కడ ఉదయించే ప్రశ్న ఏమిటంటే, “ఈశ్వరుడు నీ హృదయంలోనే ఉన్నాడు, అని బాబూజీ అన్నారు కదా! మరి ఇంకా ఈ బీజం వేయవలసిన అవసరం ఏముంది?” అని.

ఈ బీజం భక్తికి సంబంధించినదే కాకుండా ఆ భక్తికి పునాదిరాయి వంటిది కూడా. ఆధ్యాత్మిక చరిత్రలో మొదటిసారిగా బాబూజీ తన రీసెర్చ్ (పరిశోధన) ఫలితంగా అభ్యాసులలో భక్తి అనే ఈ బీజాన్ని నాటుతున్నారు. ధ్యానం చేయడం మరచిపోతే లేదా ప్రతిరోజూ ధ్యానం రెగ్యులర్‌గా చేయకపోతే, భక్తి అనే ఆ విత్తనానికి ప్రాణాహుతి అనే నీరు లభించకపోవటంవలన అది విత్తనంగానే మిగిలిపోతుంది. ప్రోగ్రెస్ ఉండదు. రెగ్యులర్‌గా సాధన చేయటం వలన ప్రోగ్రెస్ చక్కగా ఉంటుంది.

స్త్రీలకు ఇంటిలో చాలా పనులు ఉంటాయి. అందువలన ధ్యానం చేసుకోవటానికి సమయం లేదు అని అంటారు. పిల్లవాడు నిద్రపోతున్నప్పుడు లేదా ఎప్పుడు తీరిక దొరికితే అప్పుడు ధ్యానం చేసుకోవచ్చు. ధ్యానానికి ఫలానా సమయం అని లేదు. ఎప్పుడు వీలైతే అప్పుడు ధ్యానం రోజూ చేసుకోవాలి, చేసుకోవచ్చు.

**అభ్యాసీ: రెగ్యులర్‌గా అభ్యాసం చేయవలసిన అవసరం ఏమిటి?**

**బెహెన్‌జీ:** ప్రతిరోజు ఆహారం ఎందుకు తీసుకుంటున్నావు? ఆహారం అనేది శరీరానికి అవసరం. అదే విధంగా రెగ్యులర్‌గా సాధన అనేది ఆత్మ పురోభివృద్ధికి అవసరం.

మీరు ధ్యానం చేసే అవసరంలేని సమయం ఒకటి వస్తుంది. అది ఎప్పుడు? ఎప్పుడైతే నీవు నీలో బాబూజీని చూసుకున్నప్పుడు. నిన్ను నీవు చూడలానుకున్నా నీవు చూడలేవు. నీకు కేవలం బాబూజీయే కనపడతారు. ఎవరైనా నిన్ను పిలిస్తే పలుకుతావు, కాని మాట్లాడేది నీవు కాదు ‘వారు’. ఎప్పుడైతే ఈ స్థితి నీలో కలుగుతుందో, అప్పుడు ఆ స్థితియే అంతులేని ధ్యానంగా మారుతుంది. అప్పుడు మీరు ధ్యానానికి విధిగా కూర్చోవలసిన అవుసరం లేదు.

ఒకసారి బాబూజీ, “బిటియా! నీ జీవిత లక్ష్యం ఏమిటి?” అని నన్ను అడిగారు. అపుడు నేను, “బాబూజీ! ఎప్పుడైతే మీరు నన్ను చూసి, ‘నాకు చాలా సంతోషంగా ఉంది’ అని అంటారో, అదే ఆ మాటే నా జీవిత లక్ష్యం. నాకు ఆధ్యాత్మికత అంటే ఏమిటో తెలియదు. సాక్షాత్కారం అంటే తెలియదు. ఎప్పుడైతే మీరు నా స్థితిని చూసి, ‘నాకు చాలా సంతోషంగా ఉంది’ అని అంటారో, అదే నా జీవిత లక్ష్యం” అని అన్నాను.

ప్రతి అభ్యాసీ కూడా ఇటువంటి లక్ష్యాన్నే కలిగి ఉండాలి. మనం చాలా త్వరగా, సులభంగా, అత్యున్నతమైన ఆ లక్ష్యస్థితిని చేరుకోవటానికిగాను బాబూజీ రీసెర్చి (పరిశోధన) చేసి ఎన్నో విషయాలను కనుగొన్నారు. ఇంక నేను ఒకే ఒక విషయాన్ని కనుగొన్నాను. అది, “నేను నీ స్థితిని చూసి చాలా సంతోషంగా ఉన్నాను” అని బాబూజీ ఎప్పుడు అంటారు? ఎప్పుడైతే కస్తూరీలో అణువణువున ‘వారే’ నిండిపోయి ఉంటారో అప్పుడు. అటువంటి స్థితిలో నేను నా చేతిని స్పర్శించినా, బాబూజీని స్పర్శించినట్లుగా అనిపించేది. ఎవరిని చూసినా, అప్రయత్నంగా బాబూజీనే చూస్తున్నట్లుగా ఉండేది. ఏ పని చేసినా బాబూజీయే చేస్తున్నట్లుగా ఉండేది. ఈ స్థితిని గురించి నేను బాబూజీకి ఉత్తరం వ్రాసినపుడు, వారు “బిటియా! నేను నీలో ఉన్నానా? లేక నా లాలాజీ సాహెబ్‌లో ఉన్నానా? నన్ను నేను వెదుక్కోవలసి వస్తోంది” అని నాకు వ్రాశారు. అంతే! ఆ రోజు నుండి కూడా నేను సహజమార్గ్‌లో ప్రోగ్రెస్ అవుతున్నానని నాకు ఎప్పుడూ అనిపించలేదు.

ఆ రోజు నుండి కూడా నేను బాబూజీ మహరాజ్ లోపలే ప్రోగ్రెస్ అవుతున్నాను అని నాకు ఎల్లవేళలా అనిపించేది.

**అభ్యాసీ: ప్రపంచంలో ఎంతో అశాంతి ఉంది కదా! విశ్వశాంతి ఎప్పుడు ఏర్పడుతుంది?**

**బెహెన్‌జీ:** అది ప్రకృతి యొక్క పని. దైవం యొక్క పని. దానిని గురించి ఎవ్వరూ చెప్పలేరు. ఈ మిషన్ ఎప్పటివరకు నడుస్తుంది, అని కొందరు అడుగుతారు. ఇది మన పనికాదు. నాకు ఇవ్వబడిన ఆధ్యాత్మిక కార్యాన్ని నేను చేస్తున్నాను. ప్రకృతి కార్యం గురించి ఎవరికీ తెలియదు. ఎవరూ చెప్పలేరు కూడ. ఎవరైతే ప్రకృతిమీద ఆధిపత్యం కలిగి ఉంటారో, ఎవరైతే అల్టిమేట్ (భూమా) నుండి అవతరించారో, ఆ బాబూజీ మహరాజ్‌యే ప్రకృతి యొక్క 'ప్రకృతి'ని గుర్తించగలరు, చెప్పగలరు.

**అభ్యాసీ: ప్రస్తుతం మన మిషన్‌లో ఉన్న డిస్టర్బెన్స్ (గందరగోళం) అంతా పోయి, మరల మనందరం షాజహాన్‌పూర్‌లో కలుసుకొనే అవకాశం వస్తుందా?**

**బెహెన్‌జీ:** తప్పకుండా! మరల మనందరం కలుసుకునే రోజు వస్తుంది. కాని షాజహాన్‌పూర్ అనే పేరును ప్రక్కన పెట్టండి. షాజహాన్‌పూర్ అనేది ఒక పట్టణం. లక్నో అనేది ఒక పట్టణమే. మనందరం కూడా ఏకం కావటం అనేది ఎక్కడి నుండియైనా జరగవచ్చు. సోదరభావంతో మరల మరల మనందరం కలసి ఒక్కటిగా అవుతాం.

"నా సహజమార్గ్ పద్ధతిలో నేను సోదరభావం అనే ప్రాణాన్ని నింపాను" అని బాబూజీ అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఒక ఇంటిలోని అన్నా తమ్ముళ్ళ మధ్యనే ప్రేమ లేదు. అభ్యాసుల మధ్య ప్రేమను అంత త్వరగా ఎలా ఆశించగలం. నేచర్ (ప్రకృతి)లో ఏర్పడే ఈ గందరగోళ పరిస్థితులు అన్నీ కూడా ఒక మంచి మార్పును తీసుకొని రావటానికే! ఎక్కడ బాబూజీ ఉంటే అదే షాజహాన్‌పూర్. ఎక్కడ బాబూజీ, అభ్యాసులు ఉంటే షాజహాన్‌పూర్ అక్కడే ఉంటుంది. ఎక్కడైతే చక్రవర్తి ఉంటాడో, అక్కడే వారి సామ్రాజ్యం కూడా ఉంటుంది. బాబూజీయే విశ్వానికి మాస్టర్!

**అభ్యాసీ: ఈ మిషన్ పరిస్థితి ఏమవుతుంది?**

**బెహెన్‌జీ:** ఇది శ్రీరామచంద్ర మిషన్. ఈ మిషన్ శ్రీరామచంద్రజీది. మన మిషన్ కాదు. 'వారి' మిషన్, దానికి వారే మాస్టర్. 'వారి' మిషన్ గురించి వారే చూసుకుంటారు.

"బాబూజీ! మీరు సమస్త మానవాళిని అంతిమసత్యం వద్దకు చేర్చాలనే ఒక మహా సంకల్పంతో వచ్చారు కదా! మరి మేము లక్ష్యాన్ని చేరుకోవటానికి ఆలస్యం ఎందుకు అవుతోంది?" అని ఒకసారి ఎవరో అభ్యాసీ అడిగినపుడు బాబూజీ, "భాయీ! ఇక్కడ ఒక త్రాడు పై నుండి వ్రేలాడుతున్నది. నీవు ఈ త్రాడును పట్టుకొని పైకి ఎక్కుతున్నావు. కొంతదూరం ఎక్కిన తర్వాత, అరే ఇదేమిటి, అని అటువైపు చూస్తూ ఆగిపోయావు. త్రాడును పట్టుకొని పైకి ఎక్కుతున్నావు. కాని మధ్య మధ్యలో ఆగి, అటూ ఇటూ ఈ బాహ్య ప్రపంచాన్ని చూస్తున్నావు. అందువలన ఆలస్యం జరుగుతుంది. మరల త్రాడును చూడగానే (లక్ష్యం) జ్ఞాపకం వచ్చి మరల పైకి ఎక్కడం మొదలుపెట్టావు" అని అన్నారు.

బాబూజీ మహరాజ్ కృపను చూడండి! "మీరు ఎంత పైకి అయితే ఎక్కుతారో అక్కడి నుండి మరల క్రిందకు రారు, పడరు. ఎందుకంటే, మీరు చేరిన స్థితి యొక్క ఆధారాన్ని నేను తొలగించివేస్తాను (Washout చేస్తాను), లాగివేస్తాను. అందువలన అభ్యాసీ తాను ఉన్న స్థితి నుండి మరల క్రిందికి పడిపోవటం అనేది జరుగదు" అని బాబూజీ అనేవారు.

ఎన్నో సంవత్సరాల నుండి సాధన చేసేవారు కూడా, ఇంట్లో పరిస్థితులు ఏం బాగాలేవు. అందువలన ధ్యానం (పూజ) సరిగ్గా చేయలేకపోతున్నాను అని అంటారు. ఇంటిలోని పరిస్థితులు అన్నీ చక్కబడిన తర్వాత, పూజ సరిగ్గా కుదురుతుంది అని అంటారు. దీని కొరకు నీవు ఎప్పటివరకు ఎదురుచూస్తావు? ముందు నిన్ను నీవు సరిదిద్దుకో. ఇంటి పనులు చూసుకో. ఇంటిలోని పరిస్థితులు చక్కబడటానికి బాబూజీని ప్రార్థించు. కాని మొదట నిన్ను నీవు సరిదిద్దుకో. మనం మిషన్‌లో చేరామంటే దాని అర్థం ఏమిటి? మనం లక్ష్యాన్ని చేరుకొని, ఇతరులు కూడా లక్ష్యం వద్దకు వెళ్ళడానికి వాళ్ళకు సహాయపడాలి.

"బాబూజీ మహరాజ్! మేము మరల-మరల మిమ్మల్ని చాలాసార్లు మరచిపోతున్నాం. కాని ఎప్పుడైనా మీరు జ్ఞాపకం రాగానే, మీరు మా ఎదుటనే ఉన్నట్లుగా కనిపిస్తుంది" అని బాబూజీకి చెప్పుకోగా దానికి బాబూజీ, "భాయీ! నీవు నన్ను మరచిపోవచ్చు. కాని నేను మాత్రం నిన్ను మరచిపోను" అని అన్నారు.

మనం బాబూజీని మరచిపోయినా కూడా వారు మన ఎదుటనే ఉంటున్నారు. మన కోసం ఎదురు చూస్తున్నారు. అందువలన మన కర్తవ్యం ఏమిటంటే, మనం 'వారి'నే చూస్తూ అన్ని పనులు చేసుకోవాలి. అప్పుడు మనం వారిని మరచిపోయే సమస్యే ఉండదు. వారు మనకోసం ఎదురు చూడవలసిన అవసరం రాదు. అందువలన మన దృష్టి ఎల్లవేళలా 'వారి' మీదనే ఉండాలి.

**అభ్యాసీ: విశ్వశాంతి కొరకు ఎన్నో మతయుద్ధాలు అవుతున్నాయి. వీటికి అంతం ఎప్పుడు?**

**బెహెన్‌జీ:** సమస్త మానవాళిలో మరల ఈశ్వరప్రాప్తి కలగాలనే తీవ్రమైన తపన మేల్కొలపబడాలి అని బాబూజీ మహరాజ్ అన్నారు. దీని అర్థం ఏమిటంటే, సత్యయుగం రావాలని. 'సత్' అనగా ఈశ్వరుడు. ఈశ్వరీయ యుగంలో అందరూ ఈశ్వరుని గురించి తెలుసుకుంటారు. అప్పుడే ఈ మత-కలహాలు అంతమవుతాయి. యుగం మారడం అనేది చాలా కష్టమైన పని. ఈ యుగ పరివర్తన చేసేది బాబూజీ మహరాజ్ మాత్రమే.

**అభ్యాసీ: అనేక సాధనలు ఉన్నాయి, కాని బాబూజీ మాత్రం ధ్యానం అనే దానినే ఎందుకు ఇచ్చారు?**

**బెహెన్‌జీ:** ముందు నుంచి కూడా 'ధ్యానం' అనే మాట వాడుకలో ఉంది. పిల్లవాడు సరిగ్గా చదవకపోతే ధ్యానంతో (ధ్యాసతో) చదువు అని అంటాం. ఏదైనా పనిని సరిగ్గా చేయకపోతే, ఆ పనిని ధ్యానంతో (ధ్యాసతో) చేయి అని అంటారు. రామాయణం పఠించకపోతే, అయ్యో! ఈ రోజు రామాయణం చదువలేదు, రామాయణం చదువలేదు అని ప్రజలు బాధపడతారు. కాని రాముని స్మరించలేదే అని ఎవరూ కూడా దుఃఖపడరు. గీతా పారాయణం చేయకపోతే, అయ్యో! ఈ రోజు ఎంత పొరపాటు జరిగిపోయింది. గీతా పారాయణం చేయలేదే, అని బాధపడతారు. కాని కృష్ణుని జ్ఞాపకం చేసుకోలేదే అని ఎవ్వరు అనుకోరు. అందువలన ధ్యానం (దృష్టి) అనేది రాముని మీద లేదు. కృష్ణుని మీద లేదు. ప్రజల ధ్యానం అనేది కేవలం పఠించటం, పారాయణం మీదనే ఉన్నది. అందువల్లనే, ధ్యానం చేయటం కాదు. "ఈశ్వరుడు నీ హృదయంలోనే

ఉన్నాడు అనేది గుర్తుపెట్టుకో" అని బాబూజీ అన్నారు. మీరు దీనిని ధ్యానంలో గుర్తుపెట్టుకున్నప్పుడు మీ మనోనేత్రం అనేది 'దైవం' మీదనే నిలిచి ఉంటుంది. ధ్యాన సమయంలో వేరే ఆలోచనలు వచ్చి కలతగా ఉంటే అప్పుడు మీరు జాగ్రత్తగా ఉండి, "నేను ధ్యానం చేస్తున్నాను. బాబూజీ నావారు. నాకు అత్యంత ప్రియమైన వారు; వారు నన్ను గాఢంగా ప్రేమిస్తున్నారు" అని హృదయ పూర్వకంగా భావించాలి. అప్పుడు ఏదైతే కనెక్షన్ జీవునికి, ఈశ్వరునికి మధ్య ఎప్పటి నుండియో మనకు తెలియకుండానే ఉన్నదో, ఆ కనెక్షన్ ఇప్పుడు ప్రకాశవంతమవ్వటం వలన మీరు ఆ కనెక్షన్‌ను అనుభూతి చెందుతారు. ఎప్పుడైతే మీరు ఆ కనెక్షన్‌ను ఫీల్ అవుతారో ఇంక అప్పుడు మీరు ధ్యానం కుదరటం లేదు అనే మాటను మరచిపోతారు. అందువల్లనే బాబూజీ మనకు ధ్యానం అనే దాన్ని ఇచ్చారు. ప్రాపంచికమైనా సరే లేదా ఆధ్యాత్మిక సాధన అయినా సరే, అన్నింటికీ కూడా ధ్యానమే ప్రాణం. లక్ష్యం మీద ధ్యానం (దృష్టి) లేకపోతే ఆ సాధన వృధా అవుతుంది.

మూర్తి–పూజను నేను కూడా చేశాను. మూర్తి–పూజను మీరు ఈ విధంగా సరిదిద్దుకోవచ్చు. మీరు రాముని విగ్రహాన్ని చేతిలోకి తీసుకొంటున్నప్పుడు, నేను రాముని యొక్క స్పర్శను పొందుతున్నాను, అనే ఆలోచన, భావన మీ మనస్సులో ఉండాలి. ఎప్పుడైతే ఇటువంటి ధ్యానం (దృష్టి) మీలో ఏర్పడుతుందో, అప్పుడు ఆ స్పర్శతో మీకు ఎంత ఆనందం కలుగుతుందంటే, మీరు ఆ విగ్రహానికి స్నానం చేయించటం, కుంకుమ పెట్టడం, అలంకరణ చేయడం అన్నీ మరచిపోతారు. కాబట్టి ధ్యానం వల్లనే మీరు ఈశ్వరుని (గాడ్) యొక్క స్పర్శను పొందగలరు.

మీరందరు కూడా మీ హృదయాలలో బాబూజీ మహరాజ్ ఇమిడిపోయేట్లుగా సాధన చేయాలి. అప్పుడే అభ్యాసీ యొక్క జీవితం  సార్థకం అవుతుంది. నేను ఒక్క రామచంద్రుని (బాబూజీ)నే భూమి మీదకు పంపాను. కాని అక్కడ ఎందరో రామచంద్రులు ఉన్నారు అని భూమా కూడా భ్రమపడే విధంగా మీరు కృషి చేయాలి. ఆ విధంగా అయినప్పుడే, మీరు ఇక్కడికి లక్నో వస్తున్నారు, చెప్పేది వింటున్నారు, కృషి చేస్తున్నారు అన్నది నాకు అర్థమవుతుంది.

బాబూజీయే మన తల్లి, తండ్రి, సద్గురువు, దైవం. వారే మన సర్వస్వం. మీరు ఎప్పుడూ బాబూజీని మరచిపోకూడదు. బాబూజీ ఎల్లవేళలా మీ ఎదుటనే ఉన్నట్లుగా భావించండి. మీరు ఏ పనిని చేసినా ఎప్పుడూ 'వారి'నే చూస్తూ, మీ పనులను చేయండి. మీ అందరికి బాబూజీ ఈ స్థితిని ప్రసాదించాలని, 'వారి'ని ప్రార్థిస్తున్నాను.

**ప్రశ్న: నిరంతర స్మరణ లేదా సతత స్మరణ ఎలా చేయాలి?**

**జవాబు:** నిరంతర స్మరణ అనగా నిరంతరమూ కొనసాగేది. అంతరాయం లేనిది. మనం ఏ పనిలో ఉన్నా, వంటపని, ఆఫీస్ పని దేనిలో ఉన్నా, ఎక్కడైనా సరే బాబూజీ జ్ఞాపకం వస్తే, ఇప్పటివరకు 'వారి'తోనే, 'వారి' జ్ఞాపకంలోనే ఉన్నామన్న ఆలోచన, భావన రావాలి. ఇప్పటిదాకా మనం మరచిపోయాం అన్న తలంపు రాకూడదు, అంతే.  సతత స్మరణ అంటే అంతరాయం లేనిది. శ్రీ బాబూజీ లేకుండా నేను లేను అనే సంకల్పంతో ఉండాలి. ఏ పనిచేస్తున్నా వారు మనతోనే ఉన్నారన్న అనుభూతితో ఉండాలి.

ఒకసారి నన్ను శ్రీ బాబూజీ, "సహజమార్గంలో చేరిన తర్వాత ఎప్పుడైనా నన్ను మరచిపోయావా" అని ప్రశ్నించారు. 'మీరు' నన్ను ఎంతో ప్రేమతో చూస్తున్నారు. ఆ ప్రేమ నన్ను మిమ్మల్ని మరచిపోనివ్వటం లేదు అని నవ్వుతూ సమాధానం ఇచ్చాను. స్మరణ ఉన్న చోట మరపు ఉండదు.

ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీని ఇలా ప్రశ్నించాడు.

**అభ్యాసీ: "నేను అహాన్ని జయించటం ఎలా?"**

**బాబూజీ:** "నీవు అహాన్ని జయించలేవు. నీవు దాన్ని గుర్తుంచుకున్నంత కాలం దాని నుండి విడివడలేవు. దివ్యత్వాన్ని గుర్తుంచుకుంటే అహం కరిగిపోతుంది."

వరదాచారిగారు, బాబూజీని "నేను ప్రతి హృదయాన్ని జయించటం ఎలా?" అని ప్రశ్నించారు.

దానికి సమాధానంగా బాబూజీ, "నీ హృదయం దివ్యత్వంతో సంపూర్ణంగా నిండి ఉంటే అన్ని హృదయాలను నీవు జయించగలవు" అని అన్నారు. దివ్యత్వంతో అనుసంధానం కలిగి ఉంటే ఏదైనా సాధ్యమే.

"గురు–శిష్యులలో ఎవరు జయించేవారు? ఎవరు కోల్పోయేవారు" అని బాబూజీని అడిగారు ఒక అభ్యాసీ. దానికి బాబూజీ, "గురువు కోల్పోయేవాడు, శిష్యులు జయించేవారు" అని సమాధానం చెప్పారు. మరల "నా విషయంలో 'నేను' కోల్పోయిన వాడినీ మరియు జయించిన వాడినీ కూడా. ఎందుకంటే, మనల్ని మనం కోల్పోతే అంతటిని జయించినట్లే" అన్నారు నవ్వుతూ. 'వారు' (బాబూజీ) మన కోసమే వచ్చారు. కనుక మనమే విజేతలం.

"మీరు సహజమార్గం చాలా తేలిక అన్నారు. కాని నా దృష్టిలో సహజమార్గం చాలా కష్టం" అని ఒక అభ్యాసీ బాబూజీతో అన్నాడు.

"నేను నా భాషలో తేలిక అని చెప్పాను. మీరు మీ భాషలో కష్టం అని అంటున్నారు. మన భాషలు ఒక్కటైనప్పుడు మీరు సహజమార్గం తేలిక అని ఒప్పుకుంటారు" అని అన్నారు బాబూజీ.

సహజమార్గం తేలిక. ఎందుకంటే, బాబూజీ మనకోసం అవతరించారు. మనం వారిని స్మరిస్తున్నాం. మనం వారిని ప్రేమించటం తేలిక. ప్రేమ ఉన్నది. మనం ఆ దివ్య ప్రేమను తాకుతున్నాం. మన హృదయం బాబూజీని ప్రేమిస్తుంది, కనుక సహజమార్గం తేలిక.

**ప్రశ్న: బాబూజీగారి భాషను అర్థం చేసుకోవటం ఎలా?**

**జవాబు:** మీరు రోజూ ధ్యానంలో ఉంటున్నారు. అనుభూతి పొందుతున్నారు. అలాగే అభివృద్ధి చెందుతున్నారు. అదే 'వారి' భాష.

ఒకసారి డాక్టర్ వరదాచారిగారు బాబూజీతో "మీ పుస్తకాలలోని భాష చాలా సామాన్యంగా ఉంది. అలా కాకుండా ఉన్నతమైన భాషలో బాగా వ్రాస్తే ఎందరికో ఉపయోగంగా ఉంటుంది కదా!" అన్నారు. "మీరు మార్చండి, మార్చి వ్రాయండి" అని శ్రీ బాబూజీ అన్నారు.

రెండు నెలల తర్వాత వరదాచారిగారు "నేను ఎంతో ప్రయత్నించి విఫలమయ్యాను. ఒక్కమాట కూడా మార్చి వ్రాయలేకపోయాను. మార్చవచ్చుగాని ఆ భావం రావటం లేదు" అని ఉత్తరంలో బాబూజీకి

వ్రాశారు. అప్పుడు శ్రీ బాబూజీ "వాస్తవాన్ని (రియాలిటీని) ఎవ్వరూ మార్చలేరు. దాన్ని తాకి మనం మారిపోతాం" అని చెప్పారు. నిరంతర స్మరణతో, వారితో అనుబంధాన్ని ఏర్పరచుకొని, ఆ దివ్యత్వాన్ని అనగా బాబూజీగారిని ధ్యాన హృదయంతో తాకితే మనం మారిపోతాం.

ఒక పంజాబీ యోగి దీనినే చాలా చక్కగా చెప్పారు. పరసువేది అనేది ఇనుమును బంగారంగా మారుస్తుంది. దానికి అలాంటి శక్తి ఉంది. అయినా ఈ పరసువేది కచ్చా-పచ్చాయైనదే కాని పరిపక్వమైంది కాదు.

ఒక గురువు ఎవరినైనా తాకి దివ్యంగా మార్చితే, అలా దివ్యంగా మారినవారు, మరొకరిని తాకి దివ్యంగా మార్చగలరు. అలాంటి పరిపక్వ పరసువేదిని చేయగలవారే గురువు.

అంటే లోహాన్ని బంగారంగా కాకుండా 'పరసువేది'గానే చేయగల పరిపక్వ స్థితిగల పరసువేది కావాలి. అలాంటి దివ్య గురువులు మన బాబూజీ. రియాలిటీకి మానవ రూపమే వీరు.

ఒకసారి ఒక అభ్యాసీ సోదరి తాజ్‌మహల్ చూసి వస్తానంటే బాబూజీ ఆమెను పంపారు. అక్కడ ఆమె బస చేసిన హొటలులో చాలామంది కూర్చొని ఉన్నచోటుకు ఆమె కూడా వెళ్ళి కూర్చున్నారు. ఆమె దగ్గరకు ఒకరు వచ్చి, "మీరు ఏదైనా ఆధ్యాత్మిక సంస్థకు చెందినవారా?" అని అడగ్గా, "అవును. నేను శ్రీరామచంద్ర మిషన్‌కు చెందిన అభ్యాసీని" అని చెప్పి, "ఎందుకు అలా అడిగారు?" అని ప్రశ్నించింది ఆమె. దానికి జవాబుగా "మీరు వచ్చి కూర్చొనగానే, మాకు మీ దగ్గర నుండి మంచి ఆనందపు స్పందనలు అలల వలె మమ్మల్ని తాకుతున్న అనుభూతి కలిగింది" అని చెప్పారు వారు. అవి దివ్యశక్తితో కూడిన స్పందనలు. నిజమైన అభ్యాసీ అలా దివ్యత్వాన్ని వ్యాపింపచేస్తారు.

**ప్రశ్న: ధ్యానంలో ఒక్కొక్కసారి తేలికదనం, ఒక్కొక్కసారి మునిగిపోయి ఉండటం సంభవిస్తుంది. ఎందుకని?**

**జవాబు:** ధ్యానంలో ఉన్నప్పుడు మనలోని అనవసరమైనవి తొలగిపోతుంటాయి, కనుక తేలికదనం అనుభవిస్తూ ఉంటాము. ఇంక మునిగి ఉండటం -బాబూజీ ఎప్పుడూ అంటూ ఉంటుంటారు, "ధ్యానంలో లోతుగా వెళ్ళండి" అని. ఎందుకు? అక్కడ బాబూజీ ఉంటారు కనుక. ఈ హృదయాన్ని మందిరంగా భావిస్తాము కదా! ధ్యానంలో లోతుగా వెళ్ళితే ఆ మందిరపు ద్వారం దగ్గరకు వెళ్ళతాం. ఎప్పుడు ద్వారం తెరువబడితే అప్పుడు లోనికి వెళ్ళవచ్చు. అక్కడ ఆ మందిరంలో ఎవరు ఉంటారు? ఇంకెవరు శ్రీ బాబూజీయే ఉంటారు. మళ్ళీ మళ్ళీ ధ్యానంలో లోతుగా వెళ్ళిన ఆ స్థితిని గుర్తుకు తెచ్చుకొని అదే స్థితిలో ఉండటానికి ప్రయత్నించాలి.

నిరంతర స్మరణ మంచిదే! దాని కంటే కూడా నిరంతరం ఆ లోతైన స్థితిలో ఉండటం ఇంకా మంచిది. 'వారి' జ్ఞాపకంలో ఉండటం కన్నా వారి ధ్యాసలో మునిగి ఉండటం చాలా మంచిది. అలా ఉన్నప్పుడు 'వారు' కృపతో ద్వారాలు ఎప్పుడు తెరిస్తే అప్పుడు తక్షణం లోపలకు వెళ్ళవచ్చు.

**ప్రశ్న: 'నేను' అనేది నిర్మూలించడం ఎలా?**

**జవాబు: '**నేను' అనేది చాలా ముఖ్యమైనది. 'నేను' అనేది లేకపోతే ఏదైనా అనుభూతిని ఎలా పొందుతాం? స్థితి లేనప్పుడు, స్థితులన్నీ బాబూజీలో మునిగిపోయినప్పుడు, ఈ 'నేను' అనేది ఉండదు. అనుభూతీ

ఉండదు. 'నేను' అనేది మరచిపోండి, అప్పుడు నెమ్మదిగా అది కరిగిపోతుంది. 'వారి'తో అంటే శ్రీ బాబూజీతో అనుబంధాన్ని బలంగా ఏర్పరచుకోండి.

అహం (ఎగో)లో 3 స్థితులు ఉన్నాయి.

1. ఐనెస్ (అహంభావం) అనే దాన్ని నిర్మూలించాలి. ఐనెస్ అంటే 'నేను' చేస్తున్నాను లోని 'నేను'. నేను అంటే ఈ శరీరం –పేరు. కనుక ఐనెస్ తొలగించాలి.

2. తర్వాత ఏమి జరుగుతుంది. మై సెల్ఫ్ లో 'సెల్ఫ్' (తాను) తొలగిపోతుంది.

నేను ఇది చేస్తున్నాను, అది చేస్తున్నాను (తాను ప్రత్యేకం) అనే భావం తొలగిపోతుంది.

3. తర్వాత 'వారు' అనే స్థితి వస్తుంది. అప్పుడు 'లయ' ఆరంభం అవుతుంది. పైన చెప్పిన అహంలోని రెండు స్థితులు తొలగిపోతే లయావస్థ ప్రారంభమవుతుంది.

ఐనెస్ అనేది మైనెస్‌గా మారుతుంది.

'ఐ' అనేది లోపలకు సంబంధించినది. బాహ్యానికి సంబంధించింది కాదు. ఆ తర్వాత బాబూజీతో లయావస్థ పొందటం జరుగుతుంది. అటువంటి స్థితిలో నేను పొందిన సాటిలేని అనుభవాన్ని శ్రీ బాబూజీకి వ్రాశాను. "నేను నా శరీరాన్ని తాకుతున్నా తాకుతున్నానన్న ఆలోచన ఉన్నది. కాని తాకుతున్నానన్న అనుభూతి లేదు. మరల నా పేరు నాకు తెలుసు. నా పేరు కస్తూరీ. కాని అది నన్ను తాకటం లేదు. నేను ఎక్కడ ఉన్నానో తెలియటం లేదు" అని. అప్పుడు శ్రీ బాబూజీ "ఇటువంటి స్థితి ప్రతి అభ్యాసీకి తప్పక వస్తుంది. కాకపోతే కొందరికి తెలిసి అంటే జాగృతావస్థలోను, మరి కొందరికి తెలియక అంటే నిద్రావస్థలోను వస్తుంది" అన్నారు నవ్వుతూ.

నిద్రాణమైన స్థితి అంటే ఏమిటి? మనం ప్రయాణం చేస్తూ ఉంటాం. మనకు తెలియకుండానే గమ్యం చేరుకుంటాం. కాని కొందరు "ఏ స్టేషన్ వస్తుంది? గమ్యం ఇంకా ఎంత దూరంలో ఉంది? ఎంతసేపటికి చేరగలం?" అని తపనతో ఎదురు చూస్తుంటారు. అలా తెలుసుకుంటూ గమ్యం చేరుతారు. అలాగే మన సంస్థలో కూడా కొందరు నిద్రాణంగాను, కొందరు మెళకువగాను స్థితులు దాటుతూ ఉంటారు." అలా వివరణ ఇచ్చారు బాబూజీ నాకు.

నీవు అనుభూతి పొందుతావు. "నేను ఈ అనుభూతి పొందుతున్నాను" అని భావిస్తావు. అంతరంగంలో అనుభూతి పొందుతావు. నీ అంతరంగం ఆనందంలో మునిగి ఉంటుంది. 'వారి' కృప వలన నీవు సంపూర్ణంగా మునిగి ఉన్నా కూడా 'నేను' అనే దానివలన నీవు నీ స్థితిని అనుభవించేలాగ చేస్తారు. ఇది 'వారి' కృప. స్థితి వచ్చినప్పుడు 'నేను' అనేది నీడలాగ ఉండి మనకు అనుభూతిని కలుగజేస్తుంది. అప్పుడు మనం ఇది నా స్థితి, నేను అనుభూతి పొందిన స్థితి అని చెబుతాం. మనం సహజమార్గ్ విధానం గురించి సంపూర్ణంగా చెప్పలేము. శ్రీ బాబూజీకే అది తెలుసు. మన అనుభూతికి వచ్చినప్పుడు మాత్రమే మనం చెప్పగలం. అది 'వారి' కృపవల్లనే తెలుస్తుంది.

ఆ అనంతుని సామ్రాజ్యంలో సర్వాధికారైన శ్రీ బాబూజీ పాద పద్మాలను మనం తాకినప్పుడు "నీవు 'దీనిని' గురించి వ్రాయి" అని 'వారి' ముఖం మనలను నిర్దేశిస్తుంది. అప్పుడు 'వారి' కన్నులు మనకు

'దానినే' వివరిస్తూ ఉన్నాయని తెలుస్తుంది. ఇంక మనం అప్పుడు వ్రాస్తాము. అంతేకాని మనం 'దాన్ని' అనుభూతి చెందాం అని చెప్పలేం. వారి కన్నులు చెపుతున్నాయి, మనం వ్రాస్తున్నాము, అంతే!

శ్రీ బాబూజీ చాలా తెలివిగలవారు. మన గృహం అక్కడ  ఉన్నది. మన దృష్టితో దాన్ని చూడలేం! అక్కడకు చేరనూలేము. 'వారి' కృపవల్లనే మనం అక్కడకు చేరగలం. 'వారి'ని దోచుకుని 'వారి'లాగా మారితేనే చేరగలం. కనుక శ్రీ బాబూజీని ఆధ్యాత్మికంగా దోచుకొనే దొంగలాగా మారాలి. "శ్రీ లాలాజీ ఈ విధంగా పెద్ద దొంగ. ఎందుకంటే, 'అక్కడి' అనగా భూమా నుండి నన్ను దోచుకున్నారు" అన్నారు బాబూజీ నవ్వుతూ.

**ప్రశ్న: ఆధ్యాత్మికంగా అందరూ యాత్ర హృదయ మండలం నుండి ప్రారంభిస్తారు కదా! కొందరు వేగంగాను, కొందరు ఆలస్యంగాను అభివృద్ధి చెందుతారు, ఎందువలన? సున్నితత్త్వం ఎక్కువగా ఉండటంవల్లనా?**

**జవాబు:** ప్రేమ –కొందరు ప్రపంచాన్ని ప్రేమిస్తారు. కొందరు బాబూజీని ప్రేమిస్తారు. 'వారి'ని ప్రేమించినవారు తొందరగా అభివృద్ధి చెందుతారు. ప్రపంచాన్ని ప్రేమించేవారు ఆధ్యాత్మిక అనుభూతిని ఆలస్యంగా పొందుతారు.

**ప్రశ్న: బాబూజీపై ప్రేమను అభివృద్ధి చేసుకోవటం ఎలా?**

**జవాబు:** ప్రేమను అభివృద్ధి చేసుకోలేరు. "నిన్ను నీవు దివ్యానికి అనుసంధానించుకో!" అని బాబూజీ అంటారు. నిన్ను నీవు శ్రీ బాబూజీకి అనుసంధించుకోవాలి.

నిన్ను నీవు దివ్యత్వంతో జతపరచుకోవాలి. నీవు నీ పని చేస్తున్నప్పుడు నీ దృష్టి అంతరంగంపై ఉండాలి, ధ్యాస ఉండాలి. బాబూజీ అంతరంగంలో ఉన్నారు. 'వారు' అక్కడే కూర్చొని ఉన్నారు. ఈ భావన మరచిపోకూడదు. ఒకవేళ ఏదైనా పనిలో ఉండి ఒక్క క్షణమైనా, కొంతసేపైనా మరచిపోతే మరల గుర్తుకు వచ్చినపుడు, ఇప్పటివరకు బాబూజీ, నేను మిమ్మల్ని మరచిపోలేదు. నేను 'మీ' వాడినే అనే భావం ఉండాలి. 'వారి'తో ఉన్నామన్న ఆలోచన ఛేదింపబడకూడదు. అప్పుడు మనం 'వారి'ని పొందుతాం. 'వారి' అనుబంధంలో మునిగిపోవాలి. అలాంటి సమయంలో 'వారి' ప్రేమను పొందగలం.

**'వారి' ధ్యాసను అంటి ఉండటం అభ్యాసీ వంతు.**

**ప్రేమనిచ్చి దివ్యం చేయడం బాబూజీ వంతు.**

**ప్రశ్న: అలవాటును వదిలిపెట్టడం ఎలా?**

**జవాబు:** అలవాటు అనే దానికి స్థానం ఉన్నప్పుడు అది మంచిదైనా కావచ్చు, లేదా చెడ్డదైనా కావచ్చు. అలవాటుకు స్థానం ఉండకూడదు. ఒకసారి ఈ అలవాటును గురించి బాబూజీగారిని ఒక అభ్యాసీ అడిగినప్పుడు 'వారు'– "అలవాటును గురించి ఆలోచించవద్దు" అన్నారు. అయినా ఆలోచన వచ్చినట్లయితే 'వారి' వైపుకు అంటే శ్రీ బాబూజీగారివైపుకు తోసివెయ్యి. "నాకేమి అలవాటు లేదు. శ్రీ బాబూజీగారి స్మరణే (జ్ఞాపకమే) నా అలవాటు" అని అనుకోవాలి.

ఎవరైనా 'సిగరెట్' కాల్చే అలవాటు ఉండి, అది తొలగింపబడాలి అనుకుంటే 'సిగరెట్' ఆలోచన వచ్చినప్పుడు "ఇది 'మీ' పాదాలవద్ద ఉన్నది. నాకు ఉన్న అలవాటు మిమ్మలను (దివ్యాన్ని) గుర్తుంచుకోవటమే"

అని అనుకోవాలి. కనుక అలవాటును 'వారి'వైపు తోసెయ్యండి. ఇది 'వారి'ది అని తలంచండి. ఆవైపు ట్రాన్స్‌ఫర్ చేయండి. మంచి ఫలితం వస్తుంది.

ఈ అలవాటు నీకు ఉందని అంగీకరిస్తే నీవు దానికి బానిస అయినట్లే. అది నీకు అభ్యాసమైనట్లే, అంటే దానిని నీవు పట్టుకుంటున్నావన్న మాట.

**ప్రశ్న: ఎవరైనా మానసిక రుగ్మతలవారు వస్తే ఏమి చెయ్యాలి?**

**జవాబు:** ప్రార్థించండి. వారికోసం ప్రార్థించండి. వదలి వెయ్యకండి.

పూర్వం శ్రీ బాబూజీగారి ఎదుట ఎవ్వరైనా సత్సంగంలో అభ్యాసీ కానివారు ఉంటే వారిని ప్రేమతో వెనుకగా కూర్చోమనేవారు. కాని ఇప్పుడు బయటకు పొమ్మంటున్నారు. దీనితో చాలామంది ఎంతో కోపంగా తయారవుతున్నారు. అటువంటి సమయంలో అభ్యాసీ కానివాళ్ళు "మేము అభ్యాసీ కానంత మాత్రాన బయటకు వెళ్ళిపోవాలా?" అని అడుగుతున్నారు. ఢిల్లీలో ఇలాంటిదే ఒక సంఘటన జరిగింది. "ఇది సహజమార్గ విధానమా?" అని ప్రశ్నించారు. అప్పుడు నేను (కస్తూరీ బెహెన్) –"ఇది సహజమార్గ విధానం కాదు. మేము మీకు కూడా సేవ చేస్తాము. మొదట కూర్చున్న వీరికి సేవచేసి, తర్వాత మీకు కూడా సేవ చేస్తాము" అని చెప్పాను. అప్పుడు వారన్నారు –"వినమ్రంగా, ఆప్యాయంగా చెప్పవచ్చు కదా!" అని.

సహజమార్గ విధానం గురించి వివరిస్తాము. ఒకవేళ మీకు నచ్చితే, చేరాలని అనిపించితే సిట్టింగ్స్ తీసుకోవచ్చు– ఇలా చెప్పి ప్రక్కకు పంపించడం మా పద్ధతి, అలవాటు అని మనం చెప్పవచ్చు.

శ్రీ బాబూజీ చెప్పారు "నేను అందరివాడిని, అందరి కొరకు వచ్చాను" అని. ఇలా అప్పుడప్పుడు అభ్యాసీ కానివారు రావచ్చు. వారిని వదిలించుకోకండి.

**ప్రశ్న: బెహెన్‌జీ, ఒక్కొక్కసారి చెడ్డవాళ్ళు, మానసికంగా ఇబ్బందిగా ఉన్న వాళ్ళు వస్తారు, ఏమి చెయ్యాలి?**

**జవాబు:** వారిని సహజమార్గంలోకి తీసుకోకండి. వారి కొరకు ప్రార్థన చెయ్యండి.

ఎవరైనా తల్లిదండ్రులు వారి పిల్లలను తీసుకువస్తారు. వారికి కోపం తగ్గాలని, వారి చెడు అలవాట్లు తొలగించమని తీసుకువస్తారు. ఇది చాలా కష్టం. వారి కొరకై ప్రార్థన చెయ్యండి. వారిని గ్రహించడానికి ప్రయత్నం చెయ్యండి. అభ్యాసీగా తీసుకొనడానికి ప్రయత్నించండి. వారికి మొదటగా సహజమార్గ విధానం గురించి వివరించండి. వెంటనే వారిని అభ్యాసీగా గ్రహించలేము. అయినా కాని ఇప్పుడు ఇలాంటివి జరుగుతున్నాయి. పిచ్చివాళ్ళను, మానసికంగా 'ఫిట్' కానివాళ్ళను తీసుకోరాదు. అయినా కాని తీసుకుంటున్నారు. అలాంటి పిచ్చివాళ్ళను మన సంస్థలో 5,6 గురిని చూశాను. ఇది చాలా తప్పు. శ్రీ బాబూజీ– అటువంటి వారికి సేవచెయ్యాలనిపిస్తే ప్రార్థించండి. ప్రార్థన ఎలా ఫలించాలంటే, వారి తల్లిదండ్రులకు సహజమార్గ విధానంపై నమ్మకం ఉండాలి. కాని మీ సంకల్పంవలన పిల్లల రుగ్మత తగ్గిపోవాలనుకుంటే ఉపయోగం ఉండదు. వారు (తల్లిదండ్రులు) బాబూజీ శరణాగతమై, వారు ప్రార్థిస్తే ఉపయోగం ఉంటుంది. ఎవరినిబడితే వారిని తీసుకోరాదు. ఎవరికైతే ఆధ్యాత్మికంగా అభివృద్ధి కావాలని కోరిక ఉంటుందో వారినే తీసుకోవాలి. అలా కాని వారిని తీసుకొని మనం శ్రీ బాబూజీగారికి అధిక శ్రమను ఇస్తున్నాము. మనం బాబూజీగారి కొరకు మాత్రమే సమావేశమవుతున్నాం. ఇలాంటివి పరిహరించాలి.

ఒకసారి బరోడాలో సిట్టింగ్ ఇస్తున్నప్పుడు చికాకు కలిగింది. కళ్ళు తెరచిచూస్తే ఒక అభ్యాసీ శీర్షాసనం వేసుకొని ఉన్నాడు. నేను వెంటనే 'దిగు' అని అన్నాను. అయినా వినలేదు. రెండవసారి గట్టిగా అన్న తర్వాతే అతడు మామూలు స్థితికి వచ్చాడు. "ఇది సహజమార్గం విధానం కాదే" అని అన్నాను. ప్రక్కగదిలో ఉన్న అతని తండ్రి నా దగ్గరకు వచ్చి "ఇతడు సహజమార్గంలో చేరిన నాటి నుండి ఇలాగే శీర్షాసనం వేస్తున్నాడు" అని చెప్పారు. ఇది హఠయోగానికి సంబంధించింది. అక్కడ ఇలా చేయడంవల్లనే ఇక్కడా అలా చేస్తున్నాడు. కారణం అదే, అని చెప్పాను.

ఎవరైనా సహజమార్గం గురించి తెలుసుకోవడానికి వచ్చి మన సంస్థలో చేరతామన్నప్పుడు వారు దానికి అనుకూలంగా, సరిగా లేకపోతే "6 నెలలు ప్రార్థన చెయ్యండి, తర్వాత మేము మీకు సేవ చేస్తాము" అని చెప్పండి. ప్రార్థన ఎలా చెయ్యాలో కూడా చెప్పండి.

అలవాటు ఎలాంటిదైనా దాన్ని మనం పట్టుకొని వదలడం లేదు. అంటి పెట్టుకొని ఉంటున్నాం దాన్నే. ఒకరు, "సిగరెట్ తాగడం వదిలిపెట్టాలనుకుంటున్నాను, కాని వీలుపడటం లేదు" అని చెప్పారు. అప్పుడు శ్రీ బాబూజీ "నీవు వాటిని తెచ్చుకుంటున్నావు. వెలిగిస్తున్నావు, పీలుస్తున్నావు, అనుభవిస్తున్నావు. అంటే నీవు దాన్ని వదలిపెట్టడం లేదు. అది నీ తప్పు. సిగరెట్ తప్పుకాదు" అని అన్నారు.

హాబిట్ అనేది ఎ బిట్ అంటే చిన్నది. కాని దానిని ఆ అలవాటుని వాటేసుకుని అంటి పెట్టుకుని చాలా పెద్ద అలవాటుగా మార్చుకుంటున్నాము. హాబిట్ అనేది ఏమీలేదు. అది ఎ బిట్ చాలా చిన్నది. నువ్వే ముఖ్యం.

తిరుపతిలో ఒకసారి శ్రీ బాబూజీ 'సిట్టింగ్' ఇచ్చే సమయంలో నన్ను (కస్తూరీ బెహెన్) వెనుకకు వెళ్ళి కూర్చొని గమనించమన్నారు. 40 నిమిషాలు సిట్టింగ్ ఇచ్చారు. సిట్టింగ్ తర్వాత ముందువరుసలో ఉన్న నలుగురు స్త్రీలను "ధ్యానంలో ఏమి అనుభూతి పొందారు" అని అడిగాను. దానికి వారు, "ఆహా! ధ్యానంలో ఈ విధమైన అనుభూతి మేము ఎప్పుడూ పొందలేదు. ఒక్క ఆలోచన కూడా లేదు. కాని మైండ్ చాలా బరువుగా ఉన్నది" అని చెప్పారు. అప్పుడు నేను వారిని "ఉదయం మీరు ఎవరితోనైనా గొడవపడ్డారా?" అని అడిగాను. దానికి వారు "అవును. మా ప్రక్క ఇంటి ఆవిడ చాలా చెడ్డది. ఆవిడతో బాగా గొడవ జరిగింది" అని అన్నారు. ధ్యానంలో ఉన్న ఆ 40 నిమిషాలు కూడా ఆవిడ ఏమి అన్నది? వీరు ఏమి అనాలి? అనే ఆలోచనతో పూర్తిగా వారి మనస్సు నిండిపోయింది. అయినా కాని వారు ఈ విధమైన అనుభూతి ఎన్నడూ రాలేదని చెప్పారు.

బాబూజీ ఒకసారి నన్ను ఫ్రాన్స్‌లో జరిగే సహజమార్గ్ సమావేశాలకు పంపాలని నిర్ణయించారు. అప్పుడు 'వారు' –"అక్కడ ప్రతి ఒక్కరు 'వ్యక్తిగతమైన సిట్టింగ్' కావాలని కోరతారు. చాలామంది అభ్యాసీలు అక్కడ ఉన్నారే మరి. నీవేమో ఒక్కదానివి. ఎలా అందరికి వ్యక్తిగతమైన సిట్టింగ్స్ ఇస్తావు" అని నన్ను ప్రశ్నించారు.

"మీరు పంపుతున్నారు. ఇంక అది 'మీ' మీదే ఆధారపడి ఉంది. నాకేమి తెలియదు" అని నేను జవాబు చెప్పాను. దానికి 'వారు' –"నీ ముందు వేలమంది అభ్యాసీలు ఉన్నా కూడా, ప్రతి ఒక్కరు 'వ్యక్తిగతమైన

సిట్టింగ్' పొందుతున్నారు అని నీవు భావించినట్లయితే, వారు ఆ విధంగానే అనుభూతిని పొందుతారు" అని సూచించారు.

ఒకసారి చారిజీ "కస్తూరీగారు అభ్యాసీలను మాయ చేస్తున్నారు. వారు 'వ్యక్తిగతమైన సిట్టింగ్' ఇస్తున్నానని అంటూ ఉన్నారు. కాని చిన్న చిన్న గ్రూపులకు సిట్టింగ్ ఇస్తున్నారు" అని ఆరోపించారు. సుబ్బారావు అనే అభ్యాసీ సోదరుడు కూడా నన్ను పై విధంగానే అడిగినప్పుడు శ్రీ బాబూజీగారు నాకు చెప్పిన పై మాటలే, ఆ విధానమే చెప్పాను. క్షాళన జరుగుతుంది, శక్తి 'వ్యక్తిగతమైన సిట్టింగ్' ఇస్తున్నట్లే వెళ్ళుతుంది.

అందుకని ఆనాటి నుండి నేను చిన్న చిన్న గ్రూపులకు సిట్టింగ్ ఇస్తున్నాను, వ్యక్తగతంగానే పని జరుగుతుంది అని శ్రీ బాబూజీ చెప్పారు కనుకనే. అది 'వారి' ఆదేశం. అది 'వారి' విశిష్టత కూడా.

"నీ ఆలోచనగాని, భావనగాని నిద్రలోనైనా సరే అది దివ్యశక్తి వంటిదే" అని నాకు చెప్పారు శ్రీ బాబూజీ. శ్రీ బాబూజీ ఇలా చెయ్యమని చెబితే అది ఏదైనా చెయ్యవచ్చు, అది అంతే.

ఒకసారి శ్రీ బాబూజీ 'ప్రిసెప్టర్ల' సమావేశంలో నాతో, "నీవు అభ్యాసీని హృదయ మండలం నుండి కేంద్ర మండలం వరకు తీసుకొని వెళ్ళగలవు" అని అన్నారు. 'వారు' దయాళువు! అప్పుడు నేను, శ్రీ బాబూజీగారితో "నేను మిమ్మల్ని ఒక్కటే కోరుతున్నాను. మీరు 'ఈ పని ఇలా చెయ్యి' అని చెప్పండి. నేను అలాగే చేస్తాను. మీరు చెప్పకపోతే ఈ శక్తి ఇక్కడ ఉన్నదని అనుభూతి పొందలేను. అయినా కాని శక్తి ఉన్నది. మీరు చెప్పినప్పుడు మాత్రమే అనుభూతి అభివృద్ధి చెందుతుంది. మీరు చెప్పినప్పుడు మాత్రమే నేను ఏదైనా చేయగలను" అని చెప్పాను.

"నువ్వు చెయ్యగలవు" అని 'వారు' అన్నప్పుడు నేను ప్రతిసారి ప్రతి అభ్యాసీకొరకు బాబూజీని "నేను గ్రహించలేనిది ఏమీ అభ్యాసీలో ఉండరాదు" అని ప్రార్థిస్తాను. కనుక మొదట ప్రార్థన, తర్వాత పని. ఇదే చారిగారికి నా సమాధానం. "ఇది ఎలా జరిగింది. ఇదెలా జరిగింది" అని అడగండి, అంతేగాని తప్పుడు ఆలోచన కల్పించకండి. అది తప్పు. సందేహం ఉన్నప్పుడు అడిగి తెలుసుకోండి. ఇంకొకరిలో చెడు ఆలోచనలు కల్పించకూడదు. ఈ నియమం అభ్యాసీలైనా, ప్రిసెప్టర్లయినా సరే పాటించాలి –ఇది అందరి కొరకు.

ప్రేమ అనేది అభివృద్ధి కాదు. శ్రీ బాబూజీ మహరాజ్ మీ హృదయంలో ఉన్నారని భావించినప్పుడు 'నేను' ఏదైనా చెయ్యాలని అనుకుంటే, ఆ 'నేను' అనేది శ్రీ బాబూజీకి అనుసంధానించి ఆ పని చెయ్యవచ్చు.

శ్రీ బాబూజీ సమక్షంలో డా॥ కె.సి.వరదాచారిగారు, "మీరు నా సోదరి కదా! నాకు ఎందుకు చెప్పలేదు" అని అన్నారు. అప్పుడు శ్రీ బాబూజీ "అది ఆమెకే తెలుసు" అన్నారు. నేను దానికి సమాధానంగా, "నాకు ఒక్కటే తెలుసు. నేను బాబూజీ పుత్రికను, నేను శ్రీ బాబూజీ ప్రక్కన మిమ్మల్ని చూడగలిగినప్పుడు మీరు నా సోదరులని చెప్పగలను. అక్కడ కనిపించకపోతే నేను మీరు నా సోదరులని ఎలా చెప్పగలను" అని అన్నాను, నవ్వుతూ.

చాలామంది సమక్షంలో శ్రీ బాబూజీ బహిరంగంగా "నేను ఆధ్యాత్మికతను అందించడం కొరకు మాత్రమే వచ్చాను. ఇంక దేనికీ కాదు. నేను ప్రాపంచికమైనవి ఇవ్వడంలో ఫెయిల్ కావచ్చుగాని ఆధ్యాత్మికతను ఇవ్వడంలో అలా ఎప్పటికీ జరుగదు. ఎందుకంటే, నేను వచ్చిందే ఆధ్యాత్మికతను, సాక్షాత్కారాన్ని ఇవ్వడం

కోసమే" అని అన్నారు. మనం చూస్తూ ఉంటాం, చాలామంది బాధలతో సతమతమవుతుంటారు. మనం వారితో మీరు "సహజమార్గంలో చేరండి. మీ బాధలన్నీ పోతాయి" అని అనకూడదు. అది తప్పు. అలా అన్నామంటే ఆ ఆలోచన కొనసాగుతుంది. వారు ఈ ఆలోచనతో చేరి తర్వాత అడుగుతారు, లేదా ప్రశ్నిస్తారు. అందువలన నేను ఎప్పుడూ అలా చెప్పలేదు.

**ప్రశ్న: కొన్ని సందర్భాలలో బాధపడుతున్నవారికి (అభ్యాసీలకు) ఉపశమనం కల్పించడం ఎలా?**

**జవాబు:** లేదు. అది మన పని కాదు. వారి బాధలను ఎలా తొలగించగలరు. వారి సంస్కారాలను ఎలా తీసివేయగలరు? కాని మీరు ప్రార్థించవచ్చు. హృదయంతో ప్రార్థించినట్లయితే వారి బాధలు, సమస్యల ఒత్తిడి తగ్గవచ్చు. ఆ సమస్యలను, బాధలను ఎదుర్కొనే ధైర్యం రావచ్చు.

ప్రిసెప్టర్ల పని ఏమంటే, దివ్యం కొరకు, శ్రీ బాబూజీ కొరకు అభ్యాసీలలో తపన పెంపొందేలాగా చేయడం.

చాలామంది వ్రాస్తున్నారు –"నేను ఈ రోజు 26 సిట్టింగ్స్ ఇచ్చాను. ఎంతోమంది అభ్యాసీలు సిట్టింగ్స్ తీసుకుంటున్నారు. అభ్యాసీల సంఖ్య పెరుగుతున్నది" అని. ఇక్కడ పెరుగవలసినది దివ్యం కొరకు, శ్రీ బాబూజీ కొరకు తపన. అదే చేయవలసిన పని. అభ్యాసీలలో తపన పెరగాలి. అహమ్మదాబాద్‌లో ఒక అభ్యాసీ అన్నాడు, "ఈ రోజు నేను 17 సిట్టింగ్స్ తీసుకున్నాను" అని. "నీవు ఏమి పొందావు. ఎంత కాలం వృధా అయిందో తెలుసా?" అని అన్నాను. సిట్టింగ్స్ తీసుకోవడానికైన తపన సరైనది కాదు. ఆ దివ్యత్వాన్ని పొందడానికై తపన చెందాలి.

**"ధనం కోసం పేరాశ మంచిది కాదు, అది తప్పు.**

**సిట్టింగ్స్ కోసం పేరాశ తప్పుకాదు. కాని ఉపయోగం ఉండదు."**

హృదయంలో స్థలం ఉండాలి. ఆనందం, శాంతి పొందాలంటే అక్కడ అవకాశం (ఖాళీ) ఉండాలి. అదే పనిగా సిట్టింగ్స్ తీసుకుంటూ ఉంటే అక్కడ గ్రహించి ఇముడ్చుకునే (అబ్జార్బ్ చేసుకునే) శక్తి లేనప్పుడు ఏ అనుభూతి పొందజాలరు. ఆనంద ప్రశాంతతల అనుభూతి పొందలేనప్పుడు ఎన్ని సిట్టింగ్స్ తీసుకున్నా ప్రయోజనం ఏమి ఉండదు. అభ్యాసీల అంతరంగంలో ఖాళీ లేనప్పుడు ఏమి చేస్తాం. వారిలో తపన ఏర్పడటం కోసం ప్రార్థించడం తప్ప!

చాలామంది ఉన్నప్పుడు నలుగురైదుగురిని తీసుకొని ఆ అభ్యాసీలలో శ్రీ బాబూజీగారిపై ప్రేమ, భక్తి పెరగాలని, దివ్యత్వం కొరకై తపన పెరగాలని, భావన చేసి సిట్టింగ్ ఇవ్వవచ్చు.

ఇప్పుడు పాడిన పాటలోని ముఖ్యమైన రెండు వాక్యాల అర్థాన్ని వివరిస్తాను –శ్రీ బాబూజీగారితో అనుసంధానమైన ఈ వాతావరణమంతా 'వారి' ప్రేమతో నిండి ఉన్నది. అది నా అనుభూతికి వస్తూ ఉన్నది. అటువంటి ఈ వాతావరణం మనకు ఒక సందేశాన్ని ఇస్తూన్నది,– "అందరు ఎటువంటి అవరోధం లేకుండా, సులభంగా 'వారి' మందిర ద్వారం వద్దకు చేరుకోగలరు" అని.

వారం రోజుల క్రిందట నేను ఒక అభ్యాసీని గమనిస్తున్నప్పుడు ఆయన ఒక్కసారిగా కేంద్రమండలంలోకి దూకి అక్కడ ఈదులాడుతున్నారు. ఆ అభ్యాసీ శ్రీ బాబూజీ ఉన్నప్పటి నుండి కేంద్ర మండలం ద్వారం వద్ద

వేచి ఉన్నారు. అవకాశం రాలేదు. ఇప్పుడు ఇది ఎలా సాధ్యమయ్యిందని ఎంతో ఆలోచించాను. మరుసటి రోజు సాయంత్రం కేసరితో ధ్యానంలో కూర్చున్నప్పుడు ఒక దృశ్యం కనపడింది. అది –కేంద్రమండల ద్వారం దగ్గర శ్రీ బాబూజీగారి సంకల్పమనే శక్తి గృహం ఉన్నది. దానిని, ఆ శక్తిని స్పృశించగానే 'వారి' కృప అభ్యాసీని లోపలకు దూకించటం జరుగుతుంది. అలా ఇది గ్రహించాను. ఇది వారి పరిశోధన. ఎవ్వరికీ అర్థం కాదు. నాకు నేర్పాలనే అది వివరించారు. నేను నేర్చుకున్నాను.

ఎవరన్నా, ఏదైనా ఒకరి నుండి దొంగిలించారని అనుకోండి. అది మనకు తెలియదు. మనం చేయగలిగేదీ ఏమిలేదు. మనం ఆ జరిగేది చూస్తూంటే అనగా దొంగలించేవారిని చూస్తుంటే అడగవచ్చు, ప్రశ్నించనూవచ్చు. కాని ఇక్కడ శ్రీ బాబూజీ మనకు నేర్పించాలని అనుకున్నప్పుడు, మనం ఇంక ఆలోచన, అనుభూతి, మెదడు ఉపయోగించాల్సిన అవసరం ఏమిలేదు. నేను నేర్చుకోవాలని 'వారు' సంకల్పిస్తే నేర్చేసుకోవటమే. అంతే! ఇదే తేలిక మార్గం. ఇలా చాలా సంవత్సరాల నుండి 'వారు' నేర్పుతూనే ఉన్నారు నాకు.

ఆ శక్తి గృహం దగ్గరకు చేరడానికి సంపూర్ణమైన భక్తి కావాలి. ఆ భక్తి సమాప్తం కావాలి. భక్తి అన్నా, భక్తి స్థితి అన్నా తెలియాలి. ఒకసారి శ్రీ బాబూజీ "నీవు సంపూర్ణమైన భక్తి స్థితిలో ఉన్నావు" అని ఉత్తరంలో వ్రాశారు. నాకు చాలా సంతోషం కలిగింది. ఏదో నేను వ్రాస్తున్నప్పుడు, "భక్తి చాలా కష్టం" అన్న సంగతి తెలిసింది. శ్రీ బాబూజీ అంటూ ఉంటారు, "ఆ దివ్య మహాసముద్రంలోకి దూకి లోతుగా మునిగిపో!" అని. అలా మునిగితే ఇంక పైకి రావడమంటూ ఉండదు.

బాబూజీ ఇది నేర్పిస్తే నేను ఈ ప్రపంచాన్ని అంతటినీ అక్కడకు తీసుకొని వెళ్ళతాను. ఆ విషయంలో నేను తప్పక విజయాన్ని సాధిస్తాను. అభ్యాసీకి భక్తి ఉంటే తప్పక అక్కడకు అంటే దివ్యత్వం వద్దకు చేరుకుంటాడు. ఆ దివ్య మహాసముద్రంలో నీకు నీవే స్వయంగా మునిగిపో!

**ప్రశ్న: ధ్యానంలో లోతుగా మునిగిపోయినప్పుడు ఒక్కొక్కసారి ఏమీ వినపడదు. కాని కొన్నిసార్లు వినపడుతుంది. ఎందువలన?**

**జవాబు:** శ్రీ బాబూజీ నన్ను ఆ స్థితికి తీసుకొని వెళ్ళినప్పుడే, నాకు ఆ విషయం తెలిసింది. మనలను మనం మరచినప్పుడు ఏమీ వినపడదు. మనం వినాలనుకున్నప్పుడు, అర్థం చేసుకోవాలని అనుకున్నప్పుడు, అనుభూతి పొందాలని అనుకున్నప్పుడు 'మునిగిపోయినట్లు' ఉంటుంది. వినపడటం జరుగుతుంది.

శ్రీ బాబూజీగారిని నేను ఇలా అడిగాను: "సంపూర్ణ లయావస్థ ఉన్నది, భక్తి ఉన్నది, సమత్వస్థితి ఉన్నది. అయినా దివ్యత్వానికి మరియు 'వారి'కి అనుసంధించిన ఆలోచనలు వస్తాయి. ఎందుకని? అప్పుడు శ్రీ బాబూజీగారు అన్నారు కదా, "మనస్సు (మైండ్) మునిగి ఉంటుంది. కాని మనం జాగృదావస్థలో ఉంటాం. మైండ్ సంపూర్ణంగా మునిగిపోతే అలోచనలు రావు, చనిపోయినట్లే" అని. కాని నాకు అలా జరగటం ఇష్టం లేదు. నేను బ్రతికే ఉండాలి అన్నాను నవ్వుతూ.

సంపూర్ణమైన భక్తి అంటే ఎల్లప్పుడూ శరణాగతితో ఉండటం. నేను మీ వాడినేనన్న భావం ఉంటుంది. కాని 'మీరు', 'నేను' అనేవి ఉంటే రెండు భిన్నంగా ఉన్నట్లవుతుంది. "నేను మీ వాడిని" అన్నప్పుడు ఆ భావం ఉండదు. 'నేను', 'మీరు' అనేవి ఏకమైనప్పుడు ఆ భేదం ఉండదు.

**ప్రశ్న: ధ్యానంలో కూర్చొనడానికి ఏదైనా నిర్దేశమైన సమయం ఉన్నదా? ఒక గంటసేపు కూర్చోవాలా? ఎంతసేపైనా కూర్చోవచ్చా?**

**జవాబు:** ఏ సమయంలోనైనా, ఎంతసేపైనా కూర్చోవచ్చు. ధ్యానం సమాప్తి కాదు. అది అనంతమైన ధారగా ప్రవహిస్తూనే ఉంటుంది. ఆ ధ్యాసలో ఉంటూ, ఇంటి పని, ఆఫీస్ పని, ఇంక ఏ పనైనా గాని చేస్తున్నప్పుడు అది (ధ్యానం) అడ్డం రాదు. ఒకవేళ మరచిపోయి మరల గుర్తుకు వచ్చినప్పుడు మరచిపోయామని భావించ కూడదు. ధ్యానం యొక్క ధ్యాసలోనే ఉండండి. ఎల్లప్పుడు 'వారి'తోనే ఉన్నామన్న తలంపురావాలి. "నేను మీ వాడినే" అన్న అనుభూతి ఉండాలి.

ఒకసారి నేను శ్రీ బాబూజీగారికి, "నేను రాత్రి నిద్రపోయి ఉదయం లేచాను. మరచిపోయాను క్షమించండి" అని వ్రాశాను. దానికి జవాబుగా శ్రీ బాబూజీ "అలా అనుకోవద్దు. నిద్రకు ఉపక్రమిస్తున్నానన్న ఆలోచన రానివ్వకూడదు" అని అన్నారు. ప్రక్కపై పడుకొని 'వారి'పై ధ్యాసతో, 'వారి'తోనే ఉన్నానన్న భావనతో నిద్రపోవాలి. పని జరిగిపోతుంది. అప్పుడు నీవు అక్కడే అంటే 'వారి' దగ్గరే ఉంటావు.

ధ్యానంలో అంతరంగం ఆ దివ్యత్వంలో మునిగి ఉన్నదన్న అనుభూతితో ఉండాలి. సమయం అంతా 'వారు' నాతోనే ఉన్నారు. నేను 'వారి'తోనే ఉన్నాను, అని అనుకొన్నప్పుడు ఇంక కాలానికి, స్థలానికి సహజమార్గంలో తావులేదు. శ్రీ లాలాజీగారి ప్రార్థనతో శ్రీ బాబూజీ అవతరించారు. మన కొరకు, మనల్ని అక్కడకు అంటే ఆ అంతిమం వద్దకు చేర్చడానికే అవతరించారు 'వారు'.

పిల్లలు సహజమార్గ విధానంలోకి రాకపోతే ప్రార్థన చెయ్యండి. శ్రీ బాబూజీ పాదపద్మాలకు పిల్లలను అప్పగించెయ్యండి.

ఇప్పుడు పాడిన పాటలోని అర్థాన్ని వివరిస్తాను. కేంద్ర మండలంలో ఈదిన తర్వాత శ్రీ బాబూజీ అంతిమం, అంటే శ్రీ బాబూజీ తమ గృహానికి తీసుకొని వెళ్ళారు. అప్పటి స్థితి ఎలా ఉన్నది, నన్ను ఎలా తీసుకొని వెళ్ళుతున్నారో, ఇది 'వారి' కృపవల్లననే వ్రాయడం జరుగుతోంది. ఆ కృప లేకపోతే ఎవ్వరూ వ్రాయలేరు.

నేను అంతిమం, శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క గృహం చేరుకున్నాను. భగవత్ సాక్షాత్కారం గురించి మరచిపోయాను. అది శూన్యం. నేను 'వారు' ప్రసాదించిన దివ్య నేత్రాలతో చూశాను. అలా కాకపోతే దర్శించలేము. అది పూర్తిగా వియోగ దుఃఖ స్థితి. నన్ను శ్రీ బాబూజీ మహరాజ్ భగవత్ సాక్షాత్కార స్థితి నుండి తీసుకొని వెళ్ళుతన్నప్పుడు వియోగం వలన నా కంటి నిండా నీరు, అలాగే దైవం నుండి శ్రీ బాబూజీ తీసుకొని వెళ్ళుతున్నందుకు ఆ భగవంతుని కంటి నిండా నీరు ఉండటం నేను గ్రహించాను.

శ్రీ బాబూజీ నన్ను కేంద్ర మండలంలోని మొదటి వలయం దగ్గరకు తీసుకొని వెళ్ళినప్పుడు వారి గృహాన్ని, వారి హృదయంలో చూశాను. అవి ఏడు ద్వారాలు. 'వారి' పుస్తకంలో వ్రాసినట్లు ఆ అంతిమంలో కాంతి, చీకటి రెండూ లేవు. ఆ స్థితి కాంతికి, చీకటికి అతీతం. అప్పుడే 'వారి' గృహం చూశాను.

అక్కడ ఒక సౌందర్యం ఇమిడి ఉంది. దానితో ఒక ఊహ మెరిసింది. మన ఈ బాబూజీ, లాలాజీగారి దివ్య పుత్రులు. నా చేయి పట్టుకొని ఇక్కడికి తీసుకు వచ్చింది అంతిమం, భూమ యొక్క ప్రియపుత్రులు.

ఇక్కడ లాలాజీ సాహెబ్ ఎవరికీ తెలియదు. నా ఆలోచనలో ఉన్న –లాలాజీ పుత్రులు బాబూజీ అనేది ఇక్కడ మాయమైంది. ఇంక ఇక్కడ బాబూజీ, లాలాజీ పుత్రులు కానేకాదు. అంతిమసత్యం –భూమా యొక్క ముద్దుబిడ్డయే బాబూజీ –అన్నది నా ఊహలో మెరిసినట్టి అనంతసత్యం. అలానే 'వారి'ని పిలవాలి. ఈ అనంతంలో 'వారి' యొక్క స్థితియే, ఆ వాతావరణమే వ్యాపించి ఉన్నది, మరెవరిదీ కానేకాదు. దాని గురించి మరెవ్వరూ ఆలోచించలేరు. అక్కడ వారే మాస్టర్.

**ప్రశ్న: వసంత పంచమి ఉత్సవం 'షాజహాన్‌పూర్'లో మాదిరిగా ఇక్కడ ఎందుకు జరుపకూడదు?**

**జవాబు:** షాజహాన్‌పూర్‌లో మాదిరిగానే మనమూ వసంత పంచమి ఉత్సవం ఇక్కడ జరుపుతున్నాం.

పూర్వం 'శ్రీరామచంద్ర మిషన్' ఒక్కటే. ఇప్పుడు చాలా తయారయ్యాయి. రామచంద్ర కాన్షస్‌నెస్, ఆధ్యాత్మిక శిక్షణ, శ్రీవాత్సవ మిషన్ మొదలైనవి. అప్పుడు అభ్యాసీలు అందరు ఒకే సంస్థలో ఉన్నారు. ఇప్పుడు విడిపోయారు.

**ప్రశ్న: ఆయా సందర్భాలలో అభ్యాసీలు ఇక్కడకు రావచ్చునా?**

**జవాబు:** తప్పక రావచ్చు. మనం కూడా వసంత పంచమినాడు (శ్రీ లాలాజీ జన్మదినం), ఏప్రిల్ 30న శ్రీ బాబూజీ జన్మదినం ఉత్సవాలు జరుపుతాము. అందరూ తప్పకుండా రావచ్చు.

**ప్రశ్న: నిరంతర స్మరణను సాధించటం ఎలా?**

**జవాబు:** అవిచ్ఛిన్న స్మరణ ధార –నిరంతర (సతత) స్మరణ అంటే అంతరాయం లేని స్మరణ. 'వారి'తో అనుసంధానం అంతరాయం లేకుండా ఉండాలి. అందువలన ధ్యానం తర్వాత "ధ్యానం అయిపోయింది" అని అనకూడదని శ్రీ బాబూజీ ఎప్పుడూ చెప్పేవారు. ధ్యానాన్ని ఒక లక్ష్యం సాధించటానికి (పొందటానికి) ఉపయోగించుకొంటున్నారు. ఆ లక్ష్యం శ్రీ బాబూజీ ఇచ్చారు. అది సంపూర్ణంగా పొందేవరకు ధ్యానం పూర్తికాదు. కనుక 'ధ్యానం అయిపోయింది' అని అనకూడదు. అలా అన్నా, భావించినా అంతరాయం ఏర్పడినట్లే.

ఇంటి పని, ఆఫీస్ పని చేస్తున్నప్పుడు ధ్యానం పూర్తయ్యింది అని భావించకూడదు. హృదయంలో ఒకే ఎటెన్షన్, శ్రద్ధ ఉండాలి. మనం 'అంతర్నేత్రం' అనే మాట గురించి వింటాం, చదువుతాం. కాని ఉపయోగించుకొనం. అంటే విని, చదివి వదిలేస్తాం. ఎటెన్షన్ అంటే (ఇన్నర్ ఐ) –అంతర్నేత్రం. మీ ఎటెన్షన్ అంతరంపై అంటే శ్రీ బాబూజీగారి దివ్య పాదపద్మాలపై ఉండాలి. ఒకవేళ డ్యూటీలో ఉన్నప్పుడు లేదా ఏదైనా పనిలో ఉన్నప్పుడు మరచిపోయినా, గుర్తుకు వచ్చినప్పుడు, "ఓ బాబూజీ! నేను మీవాడను. మీ జ్ఞాపకం లేకుండా నేను ఉండలేను" అని భావించాలి. "ఇది చాలా బాగుంది. ఆచరించదగినది" అని ఈ విషయాన్ని గురించి శ్రీ బాబూజీ అన్నారు.

ఒకసారి శ్రీ ఈశ్వర్ సహాయ్‌గారు "బాబూజీ మేము మీ పిల్లలము, మరచిపోతుంటాము. మిమ్మల్ని మరియు మీ కృపను ఎలా పొందాలి?" అని అడిగారు. దానికి సమాధానంగా బాబూజీ, "మీరు నన్ను మరచిపోయినా కూడా నేను మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటాను" అని అన్నారు. అందువలన మనం మరచిపోయి

గుర్తుకు తెచ్చుకున్నా కూడా అనుబంధం ఉంటుంది. ఎందుకంటే, 'వారు' మనలను గుర్తుపెట్టుకుంటారు. మరచిపోయాం అని అనుకోకూడదు. 'వారి'తో అనుంబంధం నిరంతరం ఉంటుంది.

శ్రీ బాబూజీ చాలాసార్లు –"సంస్థ నుండి ఎవ్వరినీ తొలగింపలేము. ప్రిసెప్టర్ నుండి శక్తిని ఎవ్వరూ తొలగించలేరు, 'నేను' కూడా. ఎందుకంటే, నేను ఇవ్వడానికే వచ్చాను. తీసివేయడానికి, తీసుకోవడానికీ కాదు" అని అన్నారు. ఉదయం ఎవ్వరో అన్నారు, ఒకరిని ప్రిసెప్టర్‌గా తొలగించారని, అప్పటి నుండి ఆయన పని చెయ్యడం మానేసారు అని. అది సరైనది కాదు. మీ నుండి శక్తి తొలగించారని ఎలా భావించారు? మీ శక్తి తీసివెయ్యలేరు. దివ్యత్వాన్ని బాబూజీ ఇస్తారు, తీసివెయ్యలేరు. ఒకసారి శ్రీ బాబూజీ, "మన సంస్థ నుండి ఎవ్వరూ ఎవ్వరినీ తొలగించలేరు" అన్నారు. ఇది భగవంతుని సంస్థ. కాని మీరే అనుకుంటున్నారు "నన్ను తొలగించారు" అని. అలా భావిస్తే మిమ్మల్ని మీరే తొలగించుకున్నట్లు అర్థం. ఎవరైనాగాని మనల్ని మన ఇంటి నుండి గెంటివెయ్యవచ్చు. కాని ఈ సంస్థ నుండి గెంటివెయ్యలేరు.

**ప్రశ్న: మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతున్నామని ఎలా తెలుస్తుంది?**

**జవాబు:** 'వారు' అంటే శ్రీ బాబూజీ మన దగ్గరే ఉన్నారన్న అనుభూతియే మనం అభివృద్ధి చెందుతున్నామని అనడానికి నిదర్శనం. మనం ధ్యానంలో ఉన్నప్పుడు శ్రీ బాబూజీ మన దగ్గరే ఉన్నారని భావిస్తాము. ఆ పై క్రమంగా ఆ అనుభూతినీ పొందుతాము. అభివృద్ధి పొందుతున్నామని దీని వలన తెలుస్తుంది. 'వారు' చాలా దగ్గరగా, అతిసామీప్యంగా ఉన్నారు" అని మీ హృదయమే చెబుతుంది అది అంతా. మైండ్‌తో ఆలోచిస్తే ఎలా! భగవంతుడు ఇంకా పెద్దమైండ్ కదా! అని అన్నాను నవ్వుతూ.

**ప్రశ్న: అభివృద్ధి చెందడంలేదని భావిస్తే, అభివృద్ధి పొందటం ఎలా?**

**జవాబు:** దాని అర్థం మీరు, శ్రీ బాబూజీపై కాకుండా, మీ అంతరంపై ఆధారపడుతున్నారు. 'మిషన్' అంటే శ్రీ బాబూజీ మహరాజ్ కనుక మీరు సంస్థలో చేరిన తర్వాత అభివృద్ధి చెందటం లేదనే ప్రసక్తి ఎక్కడ ఉంటుంది? 'వారి'ని నమ్మితే 'వారి' మార్గదర్శకత్వంలో ఉంటే తప్పకుండా అభివృద్ధి ఉంటుంది. నీ మనస్సు బలహీనమైతే నీవు గ్రహించలేకపోవచ్చు. అంతేకాని అభివృద్ధి లేకుండా ఉండదు. 'వారి' కృప మీద ఆధారపడి ఉన్నాం.

మీరు ఐదారుగురు కలిసి ఒకచోట కూర్చొని శ్రీ బాబూజీ మీ ముందు ఉన్నారని, సిట్టింగ్ ఇస్తున్నారని, ఆ సిట్టింగ్‌లో 'వారే' ప్రాణాహుతి ఇస్తున్నారని భావించండి. పూర్తిగా నిమగ్నమవ్వండి. సందిగ్ధత రాకూడదు. అప్పుడు 'వారే' మీకు సిట్టింగ్ ఇస్తారు.

మీరు సెంటర్‌కు వెళ్ళినప్పుడు, అక్కడ సిట్టింగ్ వీరు ఇస్తున్నారు, వారు ఇస్తున్నారని అనుకోకుండా శ్రీ బాబూజీ మీ ముందు ఉన్నారు, 'వారే' ప్రాణాహుతి ఇస్తున్నారని భావించాలి. మీరు తరచుగా అక్కడకు వెళ్ళితే ఎవరెవరో, ఏదేదో చెబుతుంటారు. దానితో కన్‌ఫ్యూజన్ (సందిగ్ధత) ఏర్పడుతుంది. అది అనవసరం. కొన్నిసార్లు "ఆ వారి దగ్గర నుండి ప్రాణాహుతి వస్తున్నది, సిట్టింగ్ ఇస్తున్నారు, వీరి దగ్గర నుండి ప్రాణాహుతి వస్తున్నది, సిట్టింగ్ ఇస్తున్నారు" అని అంటూ ఉంటారు. కాని ప్రాణాహుతి శ్రీ బాబూజీగారి దగ్గర నుండి మాత్రమే వస్తుంది. సెంటర్‌కు వెళ్ళడం వలన ఉపయోగం ఉందనుకుంటే వెళ్ళండి. కాని శ్రీ బాబూజీ మాత్రమే ప్రాణాహుతి ప్రసారం చేస్తారు.

**ప్రశ్న: నేను ఉద్యోగం చేసేచోట సంప్రదాయమైన పూజలు అంటే 'గణేష్ చతుర్థి' లాంటివి చెయ్యవలసి వస్తుంది. ఒక గంటసేపు పూజా కార్యక్రమం నిర్వహించవలసి ఉంటుంది. కాని నేను 2 నిమిషాలు ధ్యానం చేసి కూర్చుంటాను. నేను చేసేది సరైనదేనా? నేను ఏమి చెయ్యాలి?**

**జవాబు:** నీవు పనిచేసేచోట అంటే ఫ్యాక్టరీ నుండి జీతం తీసుకుంటున్నావు, కనుక అక్కడి ఆచారాలు పాటించవలసినదే. ఇలాంటి సందర్భంలో శ్రీ బాబూజీ చెప్పిన మాటలు –"హోమం చేసేటప్పుడు అగ్నిలో నెయ్యి వేస్తాము. ఆ నెయ్యి వేసే చెయ్యిని నీవు అడిగితే అది ఏమని సమాధానం చెబుతుంది? నీ చేయి ఏమి చేస్తుందో నీకు తెలియదు." అప్పుడే శ్రీ బాబూజీ ఇంకొక మాట కూడా అన్నారు. అది –"నా చెయ్యి ఏమి చేస్తుందో నాకు తెలియదు. ఎందుకంటే, నా మైండ్ శ్రీ లాలాజీగారితో ఉన్నది." అలాగే మనం ఏమి చేసినా కూడా 'వారి'తోనే (శ్రీ బాబూజీతోనే) ఉండాలి.

ఇలాంటి సందర్భంలో శ్రీ బాబూజీ పూర్వం వివాహంకాని స్త్రీలకు ధ్యాన సాధన ఇచ్చేవారు కాదు. ఎందుకంటే, వారు అత్తవారింటికి వెళ్ళినప్పుడు ఇలాంటి సాధన అవతలివారు అంగీకరించకపోవచ్చు. సంప్రదాయమైన పూజలు చెయ్యమనవచ్చు. అక్కడ ఒక విధమైన ఘర్షణతో కూడిన అశాంతి వాతావరణం ఏర్పడుతుంది. "నా సహజమార్గం శాంతిని ఇస్తుంది. కనుక అశాంతిని ఇచ్చే విధానం వద్దు" అనేవారు బాబూజీ. కనుక వారి ఫ్యాక్టరీ, వారు పూజ చేయిస్తున్నారు. మనం కూర్చుంటాము, ఏమవుతుంది! ఇక్కడ ఇళ్ళలో పూజ చేస్తారు. నేను కూడా కూర్చుంటాను, ఏముంది! ఏమీ లేదు. నేను ఎందుకు కూర్చున్నాను, నా చెయ్యి ఎందుకు పూజ చేసిందని ఆలోచించవద్దు. ఏమీ లేదు.

**ప్రశ్న: జ్ఞాపకం హృదయం నుండి వస్తుందా? మైండ్ నుండి వస్తుందా?**

**జవాబు:** మైండ్ నుండి ఒక ఆలోచన వస్తే దాని పూర్వపు ఆలోచన పోతుంది. కనుక జ్ఞాపకం హృదయం నుండే వస్తుంది. మనం ఎవరిని ప్రేమిస్తామో 'వారి'తో మన హృదయం అనుసంధించి ఉంటుంది.

బాబూజీకి ఒకసారి "బాబూజీ! నేను మిమ్మల్ని జ్ఞాపకం చేసుకున్నపుడు లేదా 'మీరు' జ్ఞాపకం వచ్చినపుడు, నేను 'షాజహాన్‌పూర్'లో మీ మందు ఉన్న అనుభూతి కలుగుతుంది" అని వ్రాశాను. దానికి సమాధానంగా 'వారు' –"బిటియా! నేను నిన్ను గుర్తుకు తెచ్చుకున్నప్పుడు 'మోడీనగర్'లో నీ ముందు ఉన్నాననే అనుభూతి కలుగుతుంది" అని వ్రాశారు. ఇది అంతా ప్రేమవల్లనే అని నాకు వారం రోజుల క్రిందటనే తెలిసింది. నేను 'స్థితి'ని గురించి తెలుసుకొనగలను. కారణమూ తెలుసుకొనగలను. అది ఏమిటో కూడా తెలుసుకొనగలను. అది ఏమిటంటే, కారణ శరీరం యొక్క బంధం తెగిపోగానే నీవు ఎప్పుడు 'వారి'ని గుర్తుకు తెచ్చుకుంటే అప్పుడు అక్కడే, అంటే 'వారి' ముందే ఉంటావు. కాబట్టి నేను వ్రాసిన ఉత్తరానికి శ్రీ బాబూజీగారు వ్రాసిన వాక్యం యొక్క అర్థం 40 సం॥ల తర్వాత తెలిసింది. నాకు మిగిలిన ఉత్తరం అంతా తెలిసిందని ఎలా చెప్పగలను!

ఈ సందర్భంలో నేను ఒక తమాషా సంఘటనను వివరిస్తాను. అది...తరచుగా నేను బాబూజీగారికి ఉత్తరాలు వ్రాసే రోజులలో, మామూలుగా నా స్థితి గురించి ఉత్తరంలో వ్రాశాను. అక్కడ ఉన్న వారు ఆ ఉత్తరాన్ని శ్రీ బాబూజీకి చదివి వినిపించారు. అప్పుడు 'వారు' ఆ వాక్యం గుర్తించు, ఈ వాక్యం గుర్తించు, ఆ స్థితి చాలా బాగుంది, సంతోషం అని అంటూ ఉండేవారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఒక

అభ్యాసీ అవన్నీ వ్రాసుకొని, ఇంటికి వెళ్ళిన తర్వాత వీటినన్నింటిని తన స్థితులుగా వివరిస్తూ శ్రీ బాబూజీకి ఉత్తరం వ్రాసి ఎదురు చూస్తున్నాడు. బాబూజీగారి నుండి సమాధానం వచ్చింది. అందులో "భాయీ! ఇప్పుడు నీ ఆరోగ్యం బాగోలేదు. డాక్టర్ ఇక్కడ ఉన్నారు. నీవు తప్పకుండా రావలసినది. ఎందుకంటే, నీ ఆరోగ్యం బాగు చేసుకునేందుకు" అని వ్రాసి ఉంది.

నేను ఉత్తరాలలో వ్రాసేటప్పుడు నా స్థితిని గురించి కాకుండా స్థితి యొక్క స్థితిని గురించి వ్రాస్తాను, అంతే. ఇప్పుడు పుస్తకాలలో వ్రాసేటప్పుడు అది నిజమైనదని, స్థితి యొక్క స్థితి అని, వారు నాకు కల్పించినట్టి వాతావరణం గురించి వ్రాశాను. ఎందుకంటే, నా అనుభూతితో నేను వ్రాస్తే అది నా స్థితి అవుతుంది. కాని నేను స్థితి యొక్క స్థితిని వ్రాశాను, అంటే నేను అక్కడ లేను. అందుకనే 'వారు' ఇచ్చిన వాతావరణాన్ని గురించి వ్రాశాను. మీరు అక్కడ ఉంటే మీ స్థితిని గురించి వ్రాస్తాను.

అభ్యాసీ ఎప్పుడూ సంతోషంగానే ఉంటాడు. ఎందుకంటే, అతనికి బాబూజీ ఒక్కరే తెలుసు. కాని బాబూజీ తమ అభ్యాసీపట్ల ఎప్పుడూ ఎంతో జాగరూకతతో ఉంటారు. కాని అభ్యాసీకి అదేమీ తెలియదు. నేను చాలాసార్లు ఉత్తరాలు వ్రాస్తూ ఉండేదాన్ని. ఆపై ఏ కలతా లేకుండా హాయిగా నిద్రపోతుండేదాన్ని. హాయిగా ఉండేది. ఆ తర్వాత 'వారు', "ఆ రోజు రాత్రి నీకు ఈ స్థితి ప్రసాదించబడింది. నీవు ఆ స్థితి నుండి పై స్థితికి వెళ్ళావు" అని వ్రాసేవారు. నాకు చాలా ఆశ్చర్యంగాను, ఆనందంగాను ఉండేది. నేను నిద్రిస్తున్నాను, అయినా 'వారు' ప్రసాదిస్తున్నారు. 'వారు' ప్రసాదించిన ఆ స్థితులను గురించి 'వారే' ఆ తర్వాత వ్రాస్తున్నారు. ఎంత ఆశ్చర్యం! ఇదే ప్రేమంటే. ఇదే దివ్య ప్రేమంటే.

**ప్రశ్న: చారీజీ వారి పుస్తకాలలో భగవంతునికి మైండ్ లేదు. కనుక మన ప్రార్థన వినిపించాలంటే "లివింగ్ మాస్టర్ (జీవించి ఉన్న మాస్టర్) యొక్క అవసరం ఉన్నది" అని వ్రాశారు. ఇదేమిటి? దయచేసి వివరించండి.**

**జవాబు:** మీరు అంటే చారీజీ మీ మాస్టర్ గురించి ఏమి అనుకుంటున్నారో, ఏమి గ్రహించారోగాని నేను నా మాస్టర్, శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పింది వివరిస్తున్నాను. "భగవంతునికి మైండ్ లేకపోయినా సూపర్ కాన్షస్ మైండ్ ఉన్నది" అని బాబూజీ చెప్పారు. నేను ఆ స్థితిని పొందినపుడు అభ్యాసీ ఏదైనా ప్రశ్న అడిగితే అది నేరుగా ఆ సూపర్ కాన్షస్ మైండ్‌ను తాకి వెంటనే అక్కడి నుండి నా నోటి ద్వారా సమాధానం వస్తుంది. భగవంతుని సూపర్ కాన్షస్ మైండ్ అదే రకంగా పని చేస్తుంది. అలా కాకపోతే అంతిమంకు శ్రీ లాలాజీగారి ప్రార్థన ఏ విధంగా తెలిసింది? శ్రీ బాబూజీగారు మన కొరకు ఎలా వచ్చారు మరి!

మీరు ప్రేమ, భక్తి పెంపొందించే విషయాలను చదవాలి. ఎందుకంటే, మీరు అభ్యాసీ కనుక. అంతేకాని 'పాయింట్ల' గురించిగాని, ఇతరత్రా గురించిగాని చదువనవసరం లేదు. 'ఫిలాసఫి' కాదు చదవలసినది. (ప్రాక్టికల్) ఆచరణకు సంబంధమైన వాటిని చదవాలి. స్థితి ఏదీ స్థిరం కాదు. మారుతూనే ఉంటుంది. ఇంకా, ఇంకా అభివృద్ధి చెందుతూనే ఉంటారు. మీరు శ్రీ బాబూజీగారిలో స్థిరంగా ఉంటారు, 'వారి' కృపతో! నా పుస్తకంలోని చిత్రాలలో సూపర్ కాన్షస్ మైండ్ ఎక్కడ ఉంటుందో చూపించాను. అక్కడ నుండే సరైన సమాధానం వస్తుంది.

ఒక అభ్యాసీ శ్రీ బాబూజీగారిని, "అందరూ భగవత్ సాక్షాత్కారం పొందటం ఎలా?" అని ప్రశ్నించారు. దానికి 'వారు' చెప్పిన సమాధానమే నేను తిరిగి చెబుతున్నాను. మనందరం భూమిమీదకు పంపబడ్డాం.

భూమిపై నిలిచి ఆకాశాన్ని చూస్తున్నాం. ఎలా అంటే, భూమి స్థిరం (బ్యాలెన్స్‌డ్)గా ఉన్నది కనుక. మనం కూడా ఆ బ్యాలెన్స్‌డ్ స్థితిని అంటే సమతాస్థితిని (స్థిరత్వాన్ని) పొందితే అంతిమాన్ని కూడా దర్శించవచ్చు. అది ఎలా అంటే, శ్రీ బాబూజీ మనల్ని అలా అంతిమంవద్దకు చేర్చడానికి వచ్చారు కనుకనే.

**ప్రశ్న: శ్రీ బాబూజీ అనంతానికి మాస్టర్ ఎలా అయ్యారు?**

**జవాబు:** ఎవరైతే 16 వలయాల అహాన్ని తమ చేతిలోనికి తీసుకొనగలిగారో, ఎవరైతే అవసరాన్నిబట్టి వాటిని ఛేదించి మన యాత్రను సుగమం చేస్తారో, అలాగే హృదయ, మనో, కేంద్ర మండలాలను సునాయాసంగా దాటించగలరో, భగవత్ సాక్షాత్కారం చేయించగలరో 'వారే' అనంతంకు మాస్టర్. అవి చేయటానికే శ్రీ బాబూజీ అవతరించారు. ఇంతవరకు ఏ అవతారం ఈ పనులు చేయలేదు. ఇది 'వారి' పరిశోధన. ప్రారంభం నుండి చివరి వరకు 'వారే' పరిశోధన పూర్తి చేశారు. 'వారు' అన్ని మండలాలను 'వారి' దృష్టితో చూసి అభ్యాసీని అవసరమైనపుడు ఆయా మండలాల సరిహద్దులను ఛేదించి ముందుకు తీసుకొని వెళ్ళతారు. ఆ విధంగా ఆ సరిహద్దులను చెరిపేసి నన్ను తీసుకొని వెళ్ళారు. 'వారి'పై ప్రేమ, భక్తి ఉంటే ఎంతైనా ముందుకు పోవచ్చు.

ముందుకు సాగిపోవచ్చు. ఇప్పుడు సరిహద్దులు లేవు. ఇలా తీసుకొని వెళ్ళటం వారి బాధ్యత. ఇది దివ్యం యొక్క పని. కనుక సరిహద్దులు ఛేదించారు. ప్రేమ, భక్తి ఉంటే ఎంతైనా ముందుకు వెళ్ళటం సులభ సాధ్యమే. కబీర్ "హద్, అనహద్ మధ్యలో ఉన్నాను. ఇంకా వెళ్ళవలసినది చాలా ఉన్నది" అన్నారు. సరిహద్దులు ఛేదించి వారిని ముందుకు తీసుకొని వెళ్ళేవారే లేరు. ఆయన ఆత్మ సాక్షాత్కారం నందినవారు. ఇప్పుడు వారు (కబీర్) పుట్టి ఉంటే ఎంతో అభివృద్ధి సాధించేవారు.

మీరు అనుకుంటారేమో శ్రీ బాబూజీ లేరు కదా! ఎవరు తీసుకొని వెళ్ళతారు? అని. 'వారి'పై అంటే శ్రీ బాబూజీపై ప్రేమ, భక్తి ఉంటే మీరు సులభంగా ముందుకు (ఆధ్యాత్మికంగా) సాగిపోవచ్చు. ఆ రోజు సోమవారం 21వ తేదీ అక్టోబర్ 2002వ సంవత్సరం. విజయవాడలో కొచ్చిన్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఉదయం ఆరున్నర గంటలకు లక్నో యాత్రకు బయలుదేరాము. షుమారు 40 మంది అభ్యాసులం. ఆనందంగా, ఉత్సాహంగా ప్రయాణం మొదలుపెట్టాము. బాబూజీ కోసం షాజహాన్‌పూర్ వెళ్ళేప్పటి హృదయానందం స్మరణకొచ్చింది. బయలుదేరిన క్షణం నుండి కూడా 'వారే' మాతో ఉన్నారన్న అద్వితీయ దివ్య వాతావరణం మమ్మల్ని మూగవారినే చేసింది. అందరం 'వారి' దివ్యత్వాన్నే అనుభవిస్తూ, రోజున్నర పయనం గంటన్నరలో అయిపోయినట్లుగా 22వ తేదీ మధ్యాహ్నానికి లక్నో చేరాం. సోదరి కస్తూరిజీని ఎప్పుడెప్పుడు దర్శించుకుందామా అనే ఆతరుతతో 5 గంటలకల్లా సోదరులు హరీష్ చంద్ర, ప్రబోధ్‌లు తోడురాగా పారిజాత కుసుమాల దివ్య గంధాన్ని ఆత్మపరంగా అనుభవించటానికి మహానగర్‌లోని కస్తూరి బెహెన్ నివాసానికి చేరుకున్నాం.

దివ్యకృపా వీక్షణాలతో తల్లి, బిడ్డల్ని కళ్ళారా, మనస్సు నిండుగా పిలుచుకున్నట్లు లోపలికి తీసుకుని వెళ్ళారు బెహెన్‌జీ. అమృతసమానమైన తేనీరు పానం చేశాం. యోగక్షేమాలు ప్రతి ఒక్కరిని మాటతోను, చూపుతోను అనుగ్రహించిన సోదరి ముందు ఆశీనులమయ్యాము. చిరునవ్వులతోడి మధుర వాక్కులు దివ్య

భావజాలంతో మా హృదయాల్ని తాకి 'వారి' ప్రాణశక్తి మాలో వెలుగుల్ని నింపి, తన్మయుల్ని చేసి 'వారి'మయం చేసింది. హృదయాలు లోలోపలే అభివాదాలుచేసి శిరస్సు వంచాయి.

ఏవైన సందేహాలు, ప్రశ్నలు ధ్యానానికి సంబంధించిన వివరణలు కావాలన్నా ఏ ఇబ్బందులు ఉన్నా, ధ్యాన సాధనకు సంబంధించిన అనుభవాలపైన అయినా అడగమని సోదరి మమ్మల్ని ప్రోత్సహించారు. అందరం మౌనంగా ఉండిపోయాం కదా! మరి. అయినా ఎవరూ ఏమీ మాట్లాడలేకపోయారు. అప్పుడు కస్తూరి బెహెన్ అన్నారు కదా –అప్పుడు అంటే మేము బాబూజీ చుట్టూ కూర్చొని ఇలా మీలాగే మౌనంగా ఉండిపోయినప్పుడు, బాబూజీ కూడా మమ్మల్ని ఇలాగే ఏదైనా అడగండి, అని ఉత్సాహపరచేవారు. అలాంటి ఒక రోజున ఒక అభ్యాసీ "మీరు ఏదైనా చెబితే, అది మీ నుండే వినాలని ఎదురు చూస్తున్నాం బాబూజీ" అన్నాడు. అప్పుడు బాబూజీ, "భాయీ! నేను ఏమీ మాట్లాడను. పోనీ మాట్లాడతాను. కాని నా మాటలే మీరు వింటారు. ఆ మాటల భావార్థం మీకు తెలియదు" అన్నారు బాబూజీ. బాబూజీ, బాబూజీయే ఎప్పటికీ.

ఇంక ఇప్పుడు, నేను బాబూజీని కాను కదా! మీకు ఏదైతే అర్థం కాలేదో అది అర్థం అయ్యేట్లు వివరిస్తాను. మీరు అడగకపోయినా మీకు అర్థం అయ్యేట్లు చేస్తాను.

మీ నుండి ప్రశ్న అనేది లేనట్లయితే మీరు బాబూజీ యందు ప్రేమ కలిగి ఉన్నారని అర్థం. మొదట్లో నీలో ప్రశ్న ఉదయించినట్లయితే దానికి జవాబు కూడా నీలోనే ఉంది. 'నేను' అనేది ప్రశ్న. దానికి జవాబు చాలా దగ్గరగానే ఉంది. ప్రశ్నించేటప్పుడు 'నేను' అని వచ్చినప్పుడు 'నీవు' (అంటే బాబూజీ మహరాజ్) అని అనుకుంటే ఆ ప్రశ్నకు జవాబు కూడా ఆటోమేటిక్‌గా వచ్చేస్తుంది. 'నేను' అనగా 'అహం'. అదిపోతే అక్కడ ఉన్నది 'వారు' మాత్రమే. అలా బాబూజీగారిలో మునిగి లీనమైపోతే 'అహం' (నేను) తొలగిపోయి బాబూజీయే మనలో ఉంటారు.

అనుభవ పూర్వకంగా నేను చెబుతున్నది ఏమిటంటే, బాబూజీ కృపలేనిదే ఏ అభ్యాసీ కూడా 'వారి' ప్రేమను పొందలేరు, ఏ అనుభూతిని అందుకోలేడు. 'వారి' నుండియే నేర్చుకోవాలి, అంతా. అభ్యాసీ ఏదైనా తన అనుభవపూర్వకంగా, అనుభూతి చెంది చెప్పినట్లయితే అది బాగా అర్థం అయినట్లుగా తెలుసుకుంటారు. అనుభూతియే భగవంతుని భాష. అర్థం చేసుకోవడానికి అదే తేలికైన భాష.

ప్రొద్దుక్రుంకి చీకట్లు ముసురుకుంటూన్న సంధ్యా సమయం! దోమలు చుట్టూ ఎగురుతూ కమ్ముకుంటున్నాయి. ఫ్యాన్ స్విచ్ వేయించి నేను ఇలా అన్నాను: బాబూజీ చుట్టూ ఇలాగే చేరి 'వారి' దివ్య వాగ్ధార గ్రోలుతూన్న సాయంవేళ దోమలు చుట్టుముట్టినప్పుడు ఒకసారి బాబూజీ నవ్వుతూ అన్నారు కదా! "చూడండి! దోమల్ని సృష్టించిన ఆ సృష్టికర్తే, అవి మనల్ని బాధించకుండా వాటిని మనమూ హింసించకుండా ప్రక్కకు త్రోలివేయడానికి, మనకి రెండు చేతులను కూడా అమర్చాడు ఆ సృష్టికర్త" అని చేతులతో దోమల్ని ముఖం మీద నుండి త్రోలివేసుకుంటూ, అన్నారు బాబూజీ.

గృహస్థాశ్రమంలో రకరకాల అవసరాలు కలుగుతూ ఉంటాయి. మనం ఆ అవసరాలను ఎంతగా తగ్గించుకుంటామో అంత తేలికగా గృహస్థ జీవితాన్ని దాటగలం.

ఒకసారి బాబూజీ మహరాజ్ చాలా బిజీగా ఉన్నారు. అప్పుడు ఈశ్వర్ సహాయ్ మాస్టర్, "బాబూజీ! మీరు ఇంత బిజీగా ఉన్నారు. ఏమిటి విషయం" అని అడిగారు.

"కలకత్తా నుండి ఒక అభ్యాసీ వస్తున్నాడు. అతడికి తాజా కూరగాయలంటే చాలా ఇష్టం. అందుకని కూరగాయలు కొనడానికి వెళ్ళుతున్నాను. అతడు చాలా దూరం నుండి వస్తున్నాడు. అవి లేకపోతే, తనకు తాజా కూరగాయలతో వండి వడ్డించలేదే అనే భావన, బాధ అతడికి కలుగుతుంది. అలా రాకూడదు" అని అన్నారు బాబూజీ.

అప్పుడు ఈశ్వర్ సహాయ్‌జీ "ఆ అభ్యాసీ వచ్చేది ఆధ్యాత్మికత కోసంగాని, తాజా కూరగాయల భోజనం కాదు కదా! అతడు తన ఆధ్యాత్మిక గురువుకోసం వస్తున్నాడు. మీరు ఇలా ఎందుకు ఆలోచిస్తున్నారు" అని అన్నారు.

అప్పుడు బాబూజీ "నేను అంతా చూడగలను. అందరినీ చదవగలను. అతడు నిజంగా భగవత్ సాక్షాత్కారం కోసమే వచ్చేట్లయితే నేను ఇవ్వగలను. కాని అతడి తపన అంతా ఆ కూరగాయలమీదే ఉంది. నిజమైన అభ్యాసీ అయితే అది కావాలి, ఇది కావాలి అని కోరుకోడు. ఏదైనా అవసరం ఉన్నప్పటికీ దాన్ని గురించి పదే పదే ఆలోచించకూడదు. అది తప్పు. దానివలన సంస్కారాలు పెరుగుతాయి. అవసరాల గురించి ఎక్కువగా ఆలోచిస్తే, దాని వలన సంస్కారాలు ఏర్పడతాయి. మన ఆలోచనల్ని అనవసర విషయాలపైకి పోనీరాదు. ఎప్పుడైతే అభ్యాసీ తన అవసరాల గురించి పట్టించుకోడో అప్పుడు ఆ అవసరాల గురించి పట్టించుకోవడం నా వంతు అవుతుంది" అని అన్నారు.

బాబూజీ మహరాజ్ నుండి నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. 'వారి'కి ఎప్పుడూ ఎదుటివారి అవసరాలే తన అవసరాలుగా ఉండేవి. మీరు ఒక ఆధ్యాత్మిక సంస్థలోని అభ్యాసీగా ఉంటూ, ఏ విధంగా ఉండాలి, ఏ విధంగా జీవించాలి, ఎటువంటి గుణాలు పొందాలి, అనేవి నేర్చుకుంటే త్వరగా ముందుకు సాగి, మీరు సరాసరి దైవం నుండి దివ్యప్రేమను పొందుతారు. అదే కాకుండా ఆ ప్రేమ సహజంగానే మనలో కూడా ప్రవహిస్తుంది.

అభ్యాసీలు వస్తున్నారంటే చాలా ఆతృతతో వారికోసం –తల్లి తన పసిపిల్లల కోసం ఎలా ఎదురు చూస్తుందో, ఆ విధంగా బాబూజీ మహరాజ్ ఎదురు చూసేవారు. ఆ రోజు బాబూజీ మహరాజ్ ఉన్నట్లుండి గడియారం వంక చూశారు. 5 గంటలు అయినట్లుంది. ఎవరో కొంతమంది అభ్యాసీలు ఆ సమయానికి వస్తామని చెప్పడంవలన కాబోలు –అది కావాలి, ఎక్కడుంది అది, ఇదిగో ఇక్కడ ఇది ఉండాలే, ఏది? అంటూ ఆతురత పడుతున్నారు. అప్పుడు ఈశ్వర్ సహాయ్‌జీ తల్లిగారు బాబూజీని చూసి "తల్లి తన బిడ్డల కోసం, అది కావాలి, ఇది కావాలి, అనుకుంటూ ఆతృతపడే అమ్మలాగా వ్యాకులపడుతున్నారే మీరు" అన్నారు. దానికి 'వారు', "తల్లిగా నేను మారటం తేలిక. కాని ఈ అభ్యాసీలు పిల్లలుగా అవ్వటం చాలా కష్టం. ఎందుకంటే, పెద్దవాళ్ళయ్యాక పిల్లలుగా మారడం చాలా కష్టం" అన్నారు.

ఒకసారి ఈశ్వర్ సహాయ్ మాస్టర్ బాబూజీతో, "మీ ముఖంలో పసితనం కనిపిస్తుంది. చిన్న పిల్లల్లాగా నవ్వుతారు. పసివారిలాగా చూస్తారు. నిద్రపోతారు. అంతా అమాయకత్వమే మీలో కనిపిస్తూ ఉంటుంది. అలా ఉండటం ఎలా సాధ్యం" అన్నారు.

అప్పుడు బాబూజీ "నా తల్లి నా హృదయంలోనే ఉంటే నేను ఏ విధంగా పెద్దవాడనవ్వగలను! లాలాజీ సాహెబ్ ఎప్పుడూ నా అంతరంగంలోనే ఉన్నటువంటి తల్లి" అన్నారు. అలాగే బాబూజీ మహరాజ్‌ని

మన హృదయంలో నింపుకుంటే మనం వారి బిడ్డగా తయారవ్వడం సులభం. మనం పాత అలవాటులను గుణావగుణాలను మార్చుకోవడం చాలా కష్టం. కాని వాటిని ఏ విధంగా మార్చుకోవాలన్నది నేను బాబూజీ నుండి నేర్చుకున్నాను. ఎప్పుడైతే బాబూజీ మహరాజ్‌ను మన హృదయంలో నింపుకుంటామో, అప్పుడు వారి గుణాల్ని మనం పొందుతాం. ఆ పాత అలవాట్లు, అవగుణాలు అన్నీ కరిగిపోతాయి సహజంగానే.

"స్వయం కృషితో గాంధీజీ సంయమనం పాటించారు. క్రమశిక్షణ అనే హాబిట్‌తో తనను తాను ఆధీనంలో ఉంచుకున్నారు. ఇతరులకూ అదే బోధించారు. అందువల్లనే ఆయన మహాత్ముడయ్యారు" అని ఒక అభ్యాసీ బాబూజీతో అన్నటువంటి సందర్భంలో బాబూజీ ఇలా అన్నారు: "హాబిట్ – హా + బిట్ అంటే కొద్దిగా ఉన్నది అని. క్రమశిక్షణ, ఇంద్రియ నిగ్రహం వలన 'నేను' అనే భావం మిగిలి ఉంటుంది" అని 'అహం' భావాన్ని ఎత్తి చూపారు. అలా కాకుండా బాబూజీ మహరాజ్‌కు పూర్తిగా సమర్పణ అయితే ఆ 'నేను' అనేది కరిగిపోతుంది. ఇంక అక్కడ ఏదీ ఉండదు.

ఎదుటివారిని మార్చాలి అనుకునే ముందు నిన్ను నీవు మొదట మార్చుకో! అప్పుడు నీవు ఎదుటి వారిని అనుకున్న విధంగా మార్చవచ్చు.

మనకు మన ఒంట్లో బాగుండకపోతే మన బంధువులు ఎంతో ఆప్యాయతతో "నీవు ఎలా ఉన్నావు, ఏమి తీసుకుంటున్నావు?" అంటూ ఎలా అడుగుతారో అలానే అత్యంత ఆత్మీయతతో బాబూజీ ఎల్లప్పుడు అభిమానంగా అభ్యాసీలతో మాట్లాడతారు. మనతో 'వారు' మాట్లాడేప్పుడు ఎంత ప్రేమతో, ఎంత మధురంగా మాట్లాడతారో 'వారి' జీవన విధానం తెలుసుకుని అలాగే మనమూ ఇతరులతో మాట్లాడేప్పుడు ప్రేమతో మధురంగా మాట్లాడాలి. మనం వారివద్ద ఇది నేర్చుకోవాలి. బాబూజీకి ఎప్పుడూ అభ్యాసీల ఉన్నతి, వారి పురోగతి మాత్రమే గుర్తు ఉంటుంది. 'వారు' ఈ విషయంలో తన్ను తాను మరచిపోయేవారు. అదే విధంగా ప్రతి అభ్యాసీ బాబూజీ మహరాజ్‌ను పొందాలంటే అతడి ధ్యాస అంతా బాబూజీ స్మరణలోనే ఉండి, తన్ను తాను మరచిపోవాలి. అప్పుడే మనల్ని తయారు చేయడానికి 'వారు' పడే కష్టం సఫలమవుతుంది. ఎప్పుడైతే బాబూజీ మహరాజ్‌ను గుర్తుపెట్టుకొని 'వారి' స్మరణలో ఉంటామో, మన స్మరణ వారితో కనెక్ట్ (సంధానం) అవుతుంది. దివ్య స్మరణలోనే బాబూజీ మహరాజ్‌తో అనుబంధం ఉంటుంది. బాబూజీ మహరాజ్ ఈ పృథ్విపై అవతరించింది మన అందరికోసం.

"మిమ్మల్ని అందరిని గుర్తుపెట్టుకొని, ఆ అనంతానికి తీసుకుని వెళ్ళటానికే నేను ఇక్కడికి వచ్చాను" అని బాబూజీ అనేవారు. కాబట్టి మనం వారిని గుర్తు పెట్టుకొన్నట్లయితే, మన స్మరణ అనేది 'వారి'తో కనెక్షన్‌ను కలిగి ఉంటుంది. అందువలన నేను బాబూజీని మరచిపోయాను, అని ఈ విధంగా ఆలోచించవద్దు. ఎల్లప్పుడు కూడా బాబూజీ మహరాజ్‌తో ఉన్న ఆ డివైన్ కనెక్షన్‌ను గుర్తుపెట్టుకోండి. అప్పుడు మీ ప్రోగ్రెస్ చాలా వేగంగా ఉంటుంది.

**ఈశ్వర్ సహాయ్‌జీ: హుజూర్! మీరు మమ్మల్ని ఫలానా పని చేయమని ఎందుకు ఆజ్ఞాపించరు?**

**బాబూజీ:** భాయీ! ఇచ్చిన ఆజ్ఞను పాటించకపోతే శిక్ష పడుతుంది. అందువలన ఇటువంటి పనిని నేను ఏదీ చేయను. మీ అందరికీ వరదానం మాత్రమే ఇస్తాను. అంతేకాని శిక్ష కాదు.

ఇది శ్రీరామచంద్ర మిషన్. ఈ మిషన్‌లో శ్రీరామచంద్రజీ (బాబూజీ)ని కాకుండా మీరు వేరే ఎవరిని అనుసరిస్తారు? ఇది వేరే ఎవరి మిషన్ కాదు. నేను, రామకృష్ణ పరమహంసను లేదా స్వామి వివేకానందను అనుసరిస్తున్నాను అని మీరు అనలేరు కదా! ఇది బాబూజీ మిషన్. కాబట్టి 'వారి'నే అనుసరించాలి.

ఎప్పుడూ కూడా బాబూజీని నేను మరచిపోయాను అని అనుకోవద్దు. ఎల్లప్పుడూ నేను 'వారి' స్మరణలో ఉన్నానని అనుకుంటే తొందరగా పురోగతి ఉంటుంది. మనం భోజనం చేస్తున్నా, మరేదైనా తింటూ ఉన్నప్పుడు మన కనెక్షన్ 'వారి'తోటే ఉంటూ, అదే ధ్యాసతో తింటూ ఉంటే, ఆ తినే పదార్థం యొక్క రుచిని, ఏం తింటున్నాం అనే గ్రహింపునీ రానీయదు. రోజంతా మనం చేసే పనులన్నీ 'వారి' స్మరణలోనే చేస్తూ ఉంటే మనం ఏ పనులు చేస్తున్నామో కూడా గుర్తుండదు. ఆ విధంగా చేయడంవలన చాలా తొందరగా పురోగతి చెందుతాం. ఏ టెన్షన్, ఆతృతా ఉండదు. **సహజమార్గ విధానాన్ని మనం సరైన పద్ధతిలో అవలంబిస్తే మీ టెన్షన్లు, వత్తిడులూ అన్నీ పోతాయి. ఈ రోజుల్లో 3 సంవత్సరాల బిడ్డ కూడా తలమీద చాలా భారం ఉన్నట్లు మాట్లాడుతుంది. ఎప్పుడైతే బాబూజీ మహరాజ్ స్మరణలో మీరు ఉంటారో, ఆతృతలూ, వత్తిడులూ అన్నీ పోతాయి.**

బాబూజీ ఎప్పుడూ కూడా మనవారే, అని అనుకుంటూ అదే కండిషన్‌లో (స్థితిలో) ఉన్నట్లయితే, అప్పుడే బాబూజీకి మనకు 'అంతరం' (తేడా) తగ్గిపోతుంది. దీన్నిబట్టి ఈ బాబూజీయే ఆ బాబూజీ (షాజహాన్‌పూర్‌లో ఉండే) అని తెలుస్తుంది.

నా అడ్రస్ ఎలాగో సంపాదించి పాట్నా నగరం నుండి నలుగురు శ్రీరామచంద్ర మిషన్ అభ్యాసులు వచ్చారు. వారిని చూసి నేను ఇలా అన్నాను: రెండు పడవల్లో కాళ్ళుంచి ఎవరూ ప్రయాణం చేయలేరు. 'సహజమార్గం' ఒకే పడవ. రెండో పడవ ఎక్కడ ఉంది? గమ్యం చేర్చడానికి బాబూజీ ఒక్కరే ఉన్నారు. ఇంక గమ్యం చేర్చడానికి మీరు 'మరొకర్ని' ఎన్నుకున్నారు. మేము బాబూజీనే ఎన్నుకున్నాం. ఇప్పుడు తెలుసుకుందాం– ఎవరు ఎంతవరకు ఎటు వెళ్ళతారో!

బాబూజీ మహరాజ్ గురించి ఎవరైనా ఫంక్షన్ చేసుకోవచ్చు. దీనికి అందరినీ ఆహ్వానించవచ్చు. ఒకసారి ఇలాగే బాబూజీ మహరాజ్ ఫంక్షన్‌కు పిలవడానికై 'పెద్దాయన' స్వయంగా మా ఇంటికి వచ్చారు. అలా వచ్చినవారు గది బాగుంది. ఆ గదిలో ఏముంది? వాళ్ళు ఎలా ఉన్నారు, వీళ్ళు ఎలా ఉన్నారు అని కుశల ప్రశ్నలు వేసి కాసేపు ఉండి వెళ్ళిపోయారు. కాని ఫంక్షన్‌కు మాత్రం ఆహ్వానించలేదు. ఇంక ఎదుటివారికి సిస్టర్‌ని ఫంక్షన్‌కు ఆహ్వానించినా రాలేదు చూశారా అనేట్లు ఇంప్రెషన్ కలిగించారు. ఇంక ఆ ఫంక్షన్‌కు నేను వెళ్ళకపోవడం వలన పిలిచినా కూడా రాలేదనే ప్రచారం చేసుకున్నారు. లిఖిత పూర్వకంగా ఆహ్వానిస్తే ఇలాంటి అపోహలు రావు కదా! మరోసారి ఇలాగే హైద్రాబాద్‌లో జరిపిన ఫంక్షన్‌కు ఆహ్వానించగా, వెళ్ళాను. ఒక గదిలో కూర్చుని ఇలాగే మాట్లాడుతుండగా చాలామంది అభ్యాసులు నాచుట్టూ చేరారు. 'పెద్దాయన' ఇది చూసి –"మీరు సిస్టర్ దగ్గరకు వెళ్ళాల్సిన పని ఏమిటి? ఆమె కేవలం క్షమాపణ చెప్పడానికి మాత్రమే వచ్చారు" అని అన్నారు. నేను వెంటనే –నేను క్షమాపణలు చెప్పడానికి రాలేదు. బాబూజీ మహరాజ్ ఫంక్షన్‌కి పిలిస్తే వచ్చాను, అని అన్నాను.

ఆ రోజుల్లో కూడా అభ్యాసీలు చాలామంది నా వద్దకు వచ్చి విషయాలు ఎన్నో తెలుసుకొనేవారు. అది చూసి బాబూజీ ఎంతో సంతోషించేవారు. అపుడు అలా నా వద్దకు వచ్చి వెళ్ళిన అభ్యాసులు బాబూజీవద్దకు వెళ్ళి "ఆమెలో మిమ్మల్ని చూస్తున్నాం బాబూజీ!" అని చెప్పేవారట.

'వారు' వరదానం ఇవ్వడానికి వచ్చారు ఈ భూమిపైకి. ఇది శ్రీరామచంద్ర మిషన్. శ్రీరామచంద్రుడు కాకుండా, వేరెవరు 'గురువు'గా ఎలా ఉండగలరు? రామకృష్ణా మిషన్‌ను ఎప్పటికీ రామకృష్ణా మిషనే అంటాము. ఏ సంస్థలోనూ ఒక గురువు తర్వాత మరొక గురువు రావడం ఉండదు. ఒకే గురువు ఉంటారు. ఎప్పటికీ  'వారే' (శ్రీ బాబూజీయే) మనకు గురువు.

ఎవరైనా బాబూజీని మరచిపోయి 'X' లేదా 'Y'ని గురువుగా భావించినట్లయితే ఆ అభ్యాసీపట్ల ఎలాంటి ద్వేషభావంగాని, అవమానభావంగాని మీ మనస్సులోకి రాకూడదు. ఆ ఆలోచనే రాకూడదు. "బాబూజీ మహరాజ్! ఈయన మిమ్మల్ని మరచిపోయాడు. ఇతనిని సరిదిద్ది, మరల సరైన మార్గంలో ఉంచండి" అని మీరు ప్రార్థించండి.

ఏ ఎటిక్వేట్ (Etiquet) అంటే మర్యాద గురించి బాబూజీవద్ద నుండి నేను ఏమి నేర్చుకున్నానో అది చెబుతున్నాను. ఒకసారి గురుభాయిలు  బాబూజీని చూడటానికి వెళ్ళారు. గురుభాయీలు అంటే లాలాజీగారి ఇతర శిష్యులు. వీరందరిలో పెద్దవారయినా వారు బాబూజీ ఇంటికి వచ్చినప్పుడు బాబూజీ వారిని చూడగానే కుర్చీ నుండి లేచి గేటు వద్దకు ఎదురువెళ్ళి వారికి స్వాగతం పలికేవారు. మనం కూడా ఈ ఎటిక్వేట్ –మర్యాదనే నేర్చుకోవాలి. నేను ప్రిసెప్టర్ని, వారు అభ్యాసీలు అని అనుకోరాదు. అభ్యాసీ సోదరులు వచ్చినప్పుడు ప్రిసెప్టర్ అయినప్పటికీ వారిని సాదరంగా ఆదరించాలి. వారు మన ఇంటికి వచ్చిన ఆహ్వానితుల్లాగా ఆదరించాలి. ఈ ఎటిక్వెట్‌ను, మర్యాదను అందరం పాటించాలి. ఎటిక్వెట్ అంటే మర్యాద, మన్నన సత్‌ప్రవర్తనలతో ఉండడం. దీనిని ఇంటిలో, బయటా పాటించాలి. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు వారిని పెద్దవారు దండించి మంచి బుద్ధులు నేర్పినప్పటికీ, పిల్లలు పెద్దవారయ్యాక కూడా పెద్దలు మునుపటిలాగా దండించలేరు కదా! అదే ఎటిక్వెట్ అంటే. అందువల్లనే ఇంటిలో కూడా శాంతి, సత్‌ప్రవర్తన కలిగి ఉండాలి.

బాబూజీ అంటారు, మొదట మీలో శాంతి ఉండాలి. గృహంలో శాంతి ఉండాలి. అప్పుడే వాతావరణంలో కూడా శాంతి ఉంటుంది.   నీలో శాంతి లేనప్పుడు, ఇంక శాంతి ఎక్కడ నుంచి వస్తుంది. వాతావరణంలో శాంతి నెలకొల్పడానికి మనలో, మన జీవనంలో శాంతి అవసరం.

అందరిని కూడా యోగ్యత ప్రకారం గౌరవించాలి. "మొదట నీలో శాంతి అనేది ఉండాలి. అప్పుడే గృహంలో శాంతి ఉంటుంది. అప్పుడు ఆ శాంతి, సమాజంలో కూడా ప్రసరిస్తుంది. నీలోనే శాంతి లేనప్పుడు, నీవు ప్రపంచ శాంతిని ఏ విధంగా తీసుకొని రాగలవు?" అని బాబూజీ అనేవారు.

బాబూజీ దక్షిణ భారతదేశంలోని మిషన్ సెంటర్‌లను దర్శించి, తిరిగి షాజహాన్‌పూర్ వచ్చేసరికి ఒకటి లేదా ఒకటిన్నర నెల అయ్యేది. బాబూజీ ఇంటికి రాగానే, ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసేవారు, వంటమనిషి, పనిమనిషి వీళ్ళందరూ కూడా కోపంతో అలిగి పని మానివేసారనే వార్త వారికి తెలిసేది. అప్పుడు బాబూజీ

ఒక కప్పు టీ త్రాగి, కోటు వేసుకొని పనివాళ్ళకు నచ్చజెప్పటానికి వాళ్ళ ఇళ్ళకు వెళ్ళేవారు. మొదట ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసే వర్కర్ ఇంటికి వెళ్ళేవారు.

**బాబూజీ:** అరే! భాయీ! ప్రింటింగ్ పని ఆగిపోయింది. పద మా ఇంటికి వెళ్ళదాం.

**వర్కర్:** బాబూజీ! నేను మీ ఇంటికి రాను. 'ప్రింటింగ్' పనికి రాను. ఏదో అర్జంట్ పనిమీద 20 రూ.లు అవసరం అయి మీ అబ్బాయిని అడిగితే, ఇవ్వలేదు. ఎప్పుడైనా డబ్బులు అవసరం ఉంటే, మిమ్మల్ని అడగ్గానే మీరు ఇచ్చేవారు. పనికి నేను రాను, బాబూజీ!

**బాబూజీ:** తప్పు చేసింది మా అబ్బాయి కదా! నేను కాదు కదా! నేను తప్పు చేస్తే, నీవు నాకు శిక్ష విధించాలి. నీవు ప్రెస్ పని ఎందుకు ఆపివేశావు?

**వర్కర్:** సరే బాబూజీ! ఇప్పుడే మీ ఇంటికి వెళ్ళదామా!

**బాబూజీ:** భాయీ! త్వరగా వెళ్ళు. ఇప్పటికే చాలా ప్రింటింగ్ పని ఆగిపోయింది. సరే, నీకు ఎన్ని రూపాయలు కావాలో చెప్పు?

**వర్కర్:** బాబూజీ! 20 రూపాయలు కావాలి.

**బాబూజీ:** ఇదిగో 20 రూపాయలు. ఇవి నీ అవసరానికి వాడుకో  సరేనా!

(బాబూజీ వంటమనిషి ఇంటికి వెళ్ళేవారు)

**బాబూజీ:** ఏంటి? వంట చేయడానికి ఇంటికి ఎందుకు రావడం లేదు?

**వంటమనిషి:** బాబూజీ! మీరు నాకు రోజూ 8 రొట్టెలు ఇచ్చేవారు. మీరు ఊరికి వెళ్ళిన తర్వాత మీ అబ్బాయిలు నాకు రోజూ 4 రొట్టెలే ఇచ్చారు.

**బాబూజీ:** సరే! ఇప్పటికి ఎన్ని రొట్టెలు తక్కువ అయ్యాయి.

**వంటమనిషి:** బాబూజీ! 40 రొట్టెలు.

**బాబూజీ:** సరే. ఇప్పుడు నీవు నాతోపాటుగా ఇంటికి రా! నీకు 40 రొట్టెలకు సరిపడ గోధుమ పిండి ఇస్తాను, సరేనా!

(తర్వాత బాబూజీ అంట్లుతోమే పనిమనిషి ఇంటికి వెళ్ళేవారు)

**బాబూజీ:** నీ సంగతి ఏమిటి? పనికి ఎందుకు రావటం లేదు?

**పనిమనిషి:** అరే! బాబూజీ! మీరు ఊరికి వెళ్ళిపోయారు. వీళ్ళేమో నా ముందర అంట్ల గిన్నెలు, వంట పాత్రలు దొంతరలను పేర్చారు. కడుగమని చెప్పారు. నేను కొన్ని కడిగేసరికి అలసట వచ్చి మానివేశాను. మీరు ఉన్నప్పుడు రోజూ రెండు గ్లాసుల పాలు దొరికేవి. వాళ్ళు అవి కూడా ఇవ్వలేదు.

**బాబూజీ:** సరే! నీవు ఇప్పుడు ఇంటికి వెళ్ళు. నీకు ఎన్ని గ్లాసుల పాలు కావలిస్తే అన్ని త్రాగు. నీ అలసటను దూరం చేసుకో. డబ్బులు ఇస్తాను, సరేనా!

అలా అందర్నీ సరేచేసేవారు బాబూజీ.

ఈ విధంగా బాబూజీ ఎంతో ప్రేమతో, సౌమ్యంగా మాట్లాడి పనివాళ్ళు అందరినీ మరల పనిలోకి వచ్చే విధంగా చేసేవారు. ఇటువంటి ఉదాహరణ మీకు చూద్దామన్నా ఎక్కడా దొరకదు. ప్రేమ అనేది చాలా గొప్ప విషయం. మనం అభ్యాసులం కూడా. ఈ విషయాలన్నీ నేర్చుకోవాలి. **ధ్యానం చేసాము, సిట్టింగ్ తీసుకొన్నాం, ప్రార్థన చేసాము అని అనగానే సరిపోదు. మధుర-భాషణ, ప్రేమ, మర్యాద, సత్ప్రవర్తన ఇవి అన్నీ కూడా మీరు నేర్చుకోవాలి.**

మనం ఆధ్యాత్మిక జీవనం గడుపుతున్న సాధకులం, కాబట్టి ప్రతి చిన్న పని ఎలా చేయాలో నేర్చుకోవాలి. వారికి, వీరికి చెప్పడం కాకుండా ప్రేమతో మనమే చేయడం నేర్చుకోవాలి. ప్రాణాహుతి శక్తి మనల్ని మొదట మనిషిగా చేస్తుంది. ఇంక మంచి మనిషిగా తయారవ్వడానికి మనం బాబూజీతో కనెక్షన్ ఏర్పరచుకుంటే త్వరితంగా పురోగతి సాధ్యమవుతుంది. అప్పుడే ఆధ్యాత్మికత మొదలవుతుంది. అప్పుడు దీనివలన తక్కువ సమయంలోనే పురోగతి చెందుతారు. **పక్షి ఎగరడానికి గాలి ఎంత ముఖ్యమో ఆధ్యాత్మికంగా ఎదగడానికి బాబూజీతో కనెక్షన్ అంత అవసరం.**

**ప్రశ్న: మెడిటేషన్‌తో ఆధ్యాత్మిక పురోగతిలో వచ్చే (కండిషన్స్) స్థితులను పొందటానికి మనం ఏమి చేయాలి?**

**జవాబు:** ఆధ్యాత్మిక పురోగతిలో పలు కండిషన్స్ (స్థితులు) వస్తూ ఉంటాయి. ఆ కండిషన్స్ రావడానికి మనం తపనతో ఎదురు చూడ్డం వలన ఆ స్థితులను అందుకుంటాము. దానివలన ఎంతో టైమ్ మిగులుతుంది. దానితో మరింత త్వరగా పురోగమించవచ్చు.

"ట్రాన్స్‌మిషన్ పవర్ –ప్రాణాహుతి శక్తి వలన మానవుడు ఒక మంచి మానవునిలాగా తయారవుతాడు" అని బాబూజీ అనేవారు. అందువలన మంచి మానవునిగా తయారు కావటానికి మనం కూడా ప్రయత్నించాలి. మనం కూడా 'వారి'తో సహకరిస్తే ఆ 'మంచి మానవునిగా తయారయ్యే' పని త్వరగా పూర్తి అయి ఆధ్యాత్మికత అనేది మీలో ప్రారంభమవుతుంది.

దశ నియమాలు (టెన్ కమాండ్‌మెంట్స్) దివ్యశక్తితో ఛార్జ్ అయి ఉన్నాయి. మనం పురోభివృద్ధి సాధిస్తున్నకొద్దీ దివ్యశక్తితో ఛార్జ్ అయిన దశ నియమాలు మనలో ప్రతిబింబించి, మన ప్రవర్తనలో మార్పును తీసుకొని వస్తాయి.

ఇది ఆధ్యాత్మిక సంస్థ. ఇందులోని అభ్యాసీలు తప్పనిసరిగా మంచివారుగా ఉండాలి. మన ప్రవర్తన, నడవడిక, మాటలు అన్నీ మర్యాదగా, ప్రేమపూరితంగా ఉండాలి. ఇది విధిగా పాటించాలి. ధ్యానం ద్వారా ఈ గుణాలన్నీ మనం పొందుతాం. అవి సహజంగానే మీలో ఏర్పడతాయి. ఎప్పుడైతే మనం ఆలోచనలో కూడా పై విధంగా ఉండాలనుకుంటామో అప్పుడు మనం త్వరితగతిన పురోగమిస్తాం. దానివలన సమయం కూడా మరింతగా ఆదా అవుతుంది. నమ్రతగా ఉండడమనేది బాబూజీలో లీనమవ్వడానికి ఒక సాధనం. వినమ్రత మన హృదయంలో ఉంటే దివ్యత్వం యొక్క ప్రభావం అధికంగా ఉంటుందన్న విషయం మనం గ్రహించగలం, చూడగలం అన్నారు బాబూజీ. దీనివలన ఎంత సమయం ఆదా అవుతుందో చెప్పలేనని కూడా అన్నారు.

అభ్యాసీలందరం ఒకే కుటుంబానికి చెందినవారం. ఒకరితో ఒకరు స్నేహభావంతో, సోదర ప్రేమతో ఉంటాం. ఇదే ప్రేమ మనం మన కుటుంబాల్లో కూడా ఎందుకు చూపడం లేదు? మన కుటుంబ సభ్యులతో ఎందుకు సఖ్యంగా ఉండడంలేదు? అభ్యాసీలతో ఉన్న సోదర ప్రేమ, సహోదరులతో ఎందుకు చూపలేకపోతున్నారు? ఎందుకని అంటే, మన ఆలోచనలన్నీ ఒకే రకంగా ఉండవు. అలాగే ఒక ఫ్యామిలీలో ఉన్న మనుషులందరూ ఒకే రకంగా ఆలోచించరు. ఒక పని చేయాలంటే ఒకే కుటుంబంలో ఒకే పెంపకంలోనే ఉన్నా కూడా ఒక్కొక్కరి ఆలోచన ఒక్కో విధంగా ఉంటుంది. ఒక్కోసారి మన ఆలోచనకన్నా ఎదుటివారి ఆలోచన బాగుందని తోచినప్పుడు, అహాన్ని వదలి వారి ఆలోచననే ఆమోదించి స్వీకరించాలి. అలా సమర్పితం అవడం వలన ఏ సమస్యా, ఇబ్బందీ ఉండదు. కుటుంబ సభ్యులతో సఖ్యంగా ఉండవచ్చు. ఈ జ్ఞానం అభ్యాసీకి లభించినప్పుడు అది అతడి జీవన విధానమవ్వాలి. ఇలా అలవరచుకున్నప్పుడు బాబూజీ మహరాజ్‌లో మనం జీవించగలం. బాబూజీలో మన ప్రతిబింబం మొత్తాన్ని చూడగలం. మన ఈ శరీరం మొత్తం బాబూజీలో ఉన్నట్లు అనుభూతిని పొందుతాం. అప్పుడే మనం శాశ్వతానందాన్ని, పరమ శాంతిని పొంది నిరంతర స్మరణలో మునిగిపోతాం. అవిచ్ఛిన్న కృపాధారలో కలసిపోతాం.

బాబూజీ మహరాజ్ చాలా తెలివైనవారు. ఒకసారి ఒక గురుభాయి అభ్యాసి, "బాబూజీ! మీరు ఫతేఘర్‌కు ఎందుకు వెళ్ళడం లేదు" అని ప్రశ్నించాడు.

"మా తండ్రిగారికి కోపం వస్తుంది. అందుకని వెళ్ళడం లేదు"అని సమాధానం ఇచ్చారు బాబూజీ.

తర్వాత మరోసారి బాబూజీ ఫతెఘర్‌కు వెళ్ళుతూ ఉండగా అదే అభ్యాసి "మీరు ఫతేఘర్‌కు వెళ్ళితే మీ నాన్నగారికి కోపం వస్తుందని అన్నారు కదా! మరి ఇప్పుడు ఎలా వెళ్ళుతున్నారు?" అని అడిగాడు.

దానికి బాబూజీ "కోపంగా ఉండటానికి, ఇష్టం లేకుండా ఉండటానికి తేడా ఉంది. మా నాన్నగారికి ఇప్పుడు ఇష్టం లేదు, కాని కోపంగా లేరు. అందుకని ఫతేఘర్ వెళ్ళుతున్నాను" అన్నారు.

బాబూజీ మహరాజ్‌కు తన తండ్రికి తను లాలాజీ మహరాజ్ వద్దకు రావటం ఇష్టం లేదనే సంగతి లాలాజీకి చెప్పాలని మనస్సులో ఉండేది, కాని చెప్పలేకపోయేవారు. అప్పుడు లాలాజీ సాహెబ్, బాబూజీతో "నీ మనస్సులో ఏమున్నా నా మనస్సుకు చేరుతుంది. నీవు మనస్సులో బాధపడినట్లయితే అది నా మనస్సుకు గాయమవుతుంది" అన్నారు. వారిద్దరిమధ్య ఎంత ప్రేమ ఉందో చూడండి! బాబూజీ మహరాజ్ ఆ విషయం లాలాజీకి చెప్పకుండా లోలోపలే మధనపడుతూ ఉంటే, లాలాజీ సాహెబ్‌యే తెలుసుకొని ఆ బాధను తన బాధగానే చేసుకోవటం! (ఒకరిలో ఒకరు అన్నిటా లీనమై ఉన్నారు కాబట్టి)–అదీ ప్రేమంటే.

మరోసారి లాలాజీతో "మీ వద్దకు రావాలని నా మనస్సు కోరుకుంటోంది. కాని నాన్నగారికి ఇష్టంలేదు. కనుక ఆయనకి కోపం తెప్పించి రావటం నాకు ఇష్టంగా లేదు. ఎవరినైనా గాని మనస్సు నొప్పించి, కష్టపెట్టి అలా రావడం మంచిది కాదు కదా! అందుకని నేను రాలేకపోతున్నాను. దీనికి మీరే ఏదైనా పరిష్కారం చూపించండి హుజూర్!" అన్నారు బాబూజీ.

లాలాజీ సాహెబ్ అన్నారు కదా! "ఎవరి మనసునైనా నొప్పించి నీవు ఇక్కడకు వచ్చినా, నీవు సంతోషంగా ఉండలేవు. నన్ను చూడాలనే తీవ్రమైన కోరిక, తపన నీలో ఏర్పడినప్పుడు, నేనే స్వయంగా నీ దగ్గరకు వస్తాను" అని.

వారిద్దరి మధ్య ఎటువంటి ప్రేమ ఉందో కదా! ప్రేమ యొక్క అర్థం ఇదే. బాబూజీ తన్ను తాను మరచిపోయి లాలాజీగారిలోనే ఉన్నారు. అదే విధంగా లాలాజీ సాహెబ్ కూడా బాబూజీలోనే ఉన్నారు. ప్రేమంటే ఇదే!

**ప్రశ్న: బాబూజీ నా కళ్ళముందే ఉన్నట్లు కనపడుతున్నారు.**

**జవాబు:** మంచిదే. 'వారి' దివ్య స్వరూపం మీలో ఇమిడిపోతోందని దాని అర్థం. కాని నీకు ఇంకా లాభం కలగాలంటే, బాబూజీ నీ ముందే ఉన్నారని, నీవు ఎలాంటివాడివైనా, ఏ పరిస్థితుల్లో ఉన్నా, ఏమైపోయినా కూడా "నేను మీ వాడినే, మీదే బాధ్యత. నేను మీకు పూర్తిగా సమర్పితం అయిపోతున్నాను" అనే భావనతో ఉంటే, మరింత లాభం కలుగుతుంది. సమర్పితం –సరెండర్ అయిపోవడం రెండు రకాలు. ఒకటి –సరెండర్ అయిపోయాననే భావనలో ఉండటం. నిన్ను నీవు బాబూజీకి అర్పించుకోవడం. ఇంక రెండవది– నేను బాబూజీకి సరెండర్ అయిపోయాననే భావన కూడా లేకుండా ఆ అనుభూతిలో మునిగిపోవడం.

**ప్రశ్న: బెహెన్‌జీ! నన్ను నేను మరచిపోవడం ఎలా?**

**జవాబు:** బాబూజీని చూస్తూ నిన్ను నీవు మరచిపోవటం. మనం బాబూజీని ఎంతగా ప్రేమించాలంటే ఆ 'ఆలోచన'లోనే ఉండాలి. ఏదైనా ఇష్టమైనది తింటున్నప్పుడు దానిలో ఉప్పు ఎక్కువైనా, తక్కువైనా కాని ఆ రుచిని కూడా గమనించకుండా 'వారి' భావనలో, ప్రేమలో మునిగి ఉండడమే –సరెండర్ కావడం అంటే.

అభ్యాసీలు ఎప్పుడూ సరైన మార్గంలోనే నడవాలి. వారు తప్పుడు మార్గంలో వెళ్ళుతున్నప్పుడు ప్రిసెప్టర్లు సరిచేయాలి. ఒకసారి నాకు (కస్తూరీ) ఒక అభ్యాసీ ఉత్తరం వ్రాశాడు. అందులో "నేను సిట్టింగ్ (ధ్యానం)లో కూర్చున్నప్పుడల్లా బాబూజీని కాకుండా మీరే (కస్తూరీగారు) నా ఎదుట కూర్చొని సిట్టింగ్ ఇస్తున్నట్లు భావించి కూర్చుంటున్నాను. ఇలా 3,4 నెలల నుండి ధ్యానం చేసుకుంటున్నాను. నాకు ఇలా ధ్యానం చేసుకోవటం బాగుంటోంది కూడా" అని వ్రాశాడు. దానికి జవాబుగా నేను "నీవు నీ మనస్సు మీద ఆధారపడి ఇలా చేస్తున్నావు. దానికి నా ప్రమేయం ఏమీలేదు. నా మీద ధ్యానం అని నీవే ఊహించుకుంటున్నావు. నీవు నిజంగా నన్ను తలచుకొని ధ్యానానికి కూర్చున్నట్లయితే బాబూజీతో కనెక్షన్ ఉండేది. కాని నీవు బాబూజీని, నన్ను వేరు వేరుగా అనుకున్నావు. అది చాలా తప్పు. అందువల్లనే హిందువులకు ఇన్ని వేల మంది దేవుళ్ళు తయారయ్యారు. ఒక దేవతకన్నా ఇంకో దేవత గొప్పది– అని ఆ దేవతకు పూజ చేయటం, వారి కోర్కె నెరవేరకపోతే మరొక దేవతను ఆరాధించటం. ఇలా చేయటం వలన లాభం ఏమీ ఉండదు. బాబూజీ మహరాజ్‌కన్నా గొప్పవారెవరూ లేరు. 'వారి'ని ఆరాధించడం ద్వారానే మనం గమ్యాన్ని చేరగలం! బాబూజీ మహరాజ్ అంతటి శక్తిపూర్ణులు ఈ భూమి పైకి రాలేదు. రామకృష్ణ పరమహంస తర్వాత రెండవ రామకృష్ణ పరమహంస రాలేదు. వివేకానందజీ తర్వాత రెండవ వివేకానందుడు రాలేదు. అలాగే మరో మహావీరుడు, మరో గౌతమ బుద్ధుడు రాలేదు. ముస్లింలలో కూడా మహమ్మద్ ప్రవక్త తర్వాత మరో మహమ్మద్ ప్రవక్త రాలేదు. ఎందుకంటే, వారందరూ చాలా తెలివైనవారు. ఎవరికైనా ఇంకొకర్ని పూజించమని వారు ఒకవేళ చెప్పి ఉంటే, ఆ తర్వాత ఇంకొకరు, ఆపై మరొకరు...... ఈ విధంగా సోర్స్ (మూలం) నుండి ప్రజల దృష్టి మరలేది. ఎవరు వచ్చినా మనకు మాత్రం సోర్స్ (మూలం) శ్రీ బాబూజీయే.

బాబూజీయే మెయిన్ సోర్స్, ఆదిమూలం. 'వారి' నుండియే ట్రాన్స్‌మిషన్ వస్తుంది. అంతేగాని రెండవ వారి నుండి కాదు. ఎప్పుడూ అలా జరగదు. కాబట్టి ఇలాంటి తప్పు మళ్ళీ చేయకండి" అని జవాబు వ్రాశాను.

**ప్రశ్న: ఎవరైనా ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇస్తున్నప్పుడు ఆ ప్రిసెప్టరే సిట్టింగ్ ఇస్తున్నారని అనుకోవాలా లేక బాబూజీ మహరాజ్ నుండి ట్రాన్స్‌మిషన్ వస్తూ ఉందని అనుకోవాలా?**

**జవాబు:** ప్రిసెప్టర్ వద్ద సిట్టింగ్ తీసుకునేటప్పుడు ఆ ప్రిసెప్టర్‌ని తలచుకోవటం కాదు. బాబూజీ మహరాజ్‌ని తలచుకుంటే, వారే స్వయంగా నీ ముందు ప్రత్యక్షమవుతారు. ప్రిసెప్టర్ అనేవారు ఆ దివ్యశక్తితో సంబంధాన్ని ఏర్పరచుకొని ఉంటారు. ప్రిసెప్టర్ ఆ అభ్యాసీని ఆ దివ్యశక్తితో సంబంధాన్ని కలుపుతాడు. ఈ విషయం తెలుసుకుని అభ్యాసీలు, బాబూజీపట్ల ప్రేమ పెంచుకొంటే త్వరగా గమ్యం చేర్తారు.

బాబూజీ మహరాజ్ అనంత శక్తి నుండి అవతరించారు. ఆ అనంత శక్తి బాబూజీలో అంతర్లీనమై ఉంది అనగా బాబూజీ మహరాజ్‌లో ఆ దివ్యశక్తి నిండి ఉంది. బాబూజీ మన హృదయంలోనే ఉన్నారు. ఆ అనంతశక్తిని 'వారి' ద్వారా పొందవచ్చు అని అనుకుంటే చాలు, ఇంకేమీ చేయనక్కరలేదు. చాలా మంది అభ్యాసులు – నేను ఆ ప్రిసెప్టర్ దగ్గర సిట్టింగ్ తీసుకున్నాను, ఇదిగో నేను ఈ ప్రిసెప్టర్ దగ్గర సిట్టింగ్ తీసుకొన్నాను, అప్పుడు కండిషన్ అలా ఉంది, ఇప్పుడు ఇలా ఉంది, అని అంటూ ఉంటారు. ఎవరివద్ద సిట్టింగ్ తీసుకున్నా ట్రాన్స్‌మిషన్ మెయిన్ సోర్స్ (మూలం) నుండే వస్తుంది. కాబట్టి ఆ స్థితి బాబూజీ నుండే వస్తుంది. అందువలన మనం మన కనెక్షన్‌ను ఆ సోర్స్‌తోనే (ఆదిమూల శక్తితోనే) అంటే బాబూజీతోనే ఉంచుకోవాలిగాని మరెవరితోనూ కాదు.

సిట్టింగ్ ఎవరివద్ద నుండి తీసుకున్నా ఇచ్చేది బాబూజీ మహరాజ్ అనే మనం గ్రహించాలి. ఒకసారి బాబూజీ, "బిటియా! ఈ రోజు మీ అందరికి లాలాజీ సాహెబ్‌తో సిట్టింగ్ ఇప్పించాలని నాకు చాలా కోరికగా ఉంది. మీరంతా నా గదిలోకి వెళ్ళి లాలాజీ సాహెబ్ మంచం ముందు కూర్చొని ధ్యానం చెయ్యండి" అని అన్నారు. పూజ అయిపోయిన తర్వాత "బిటియా! ఈ రోజు నీకు పూజలో ఏ విధంగా ఉంది?" అని బాబూజీ నన్ను అడిగారు. "బాబూజీ! స్వయంగా మీరే మా ఎదుట కూర్చొని సిట్టింగ్ ఇచ్చినట్లుగా అనిపించింది. నాకు లాలాజీ సాహెబ్ ఏమి కనపడలేదు. కేవలం మీరు మాత్రమే కనపడ్డారు" అని అన్నాను. అప్పుడు వారు, "బిటియా! నేను నిన్ను లాలాజీ సాహెబ్ నుండి సిట్టింగ్ తీసుకోమని చెప్పాను కదా!" అని అన్నారు. అప్పుడు నేను, "అయితే మీరు లాలాజీ సాహెబ్‌నే అడగండి. నా ఎదుట మీరే ఉన్నారు. ఇంతకంటే ఎక్కువ జవాబు నేను చెప్పలేను" అని బాబూజీతో అన్నాను. నిజం చెప్పాలంటే, ఇది మనకు ఒక పరీక్ష వంటిది. మనకు 'వారి' మీద ఎంత విశ్వాసం ఉంది అని తెలియడానికి. ఆ తర్వాత మరల నేను, "బాబూజీ! నేను ఎప్పుడూ లాలాజీ సాహెబ్ నుండి సిట్టింగ్ కావాలనే దురాశలోపడను. ఎందుకంటే, ఇంతటి ప్రేమమయుని, మిమ్మల్ని చూసిన తర్వాత మరల నా దృష్టికి వేరే ఎవరు కూడా రాలేదు" అని వారితో అన్నాను.

వీరరాఘవన్‌గారు మద్రాస్ సెంటర్ యొక్క మొదటి సెంటర్ ఇన్‌ఛార్జ్. సత్సంగ్ వారి ఇంటిలోనే జరిగేది. ఒకసారి నాకు ఆరోగ్యం బాగా లేకపోతే, బాబూజీ నన్ను చారీజీ ఇంటిలో ఉంచి, వారు బెంగుళూరు వెళ్ళిపోయారు. ఒకరోజు వీరరాఘవన్‌గారు చారీజీ ఇంటిలో సత్సంగ్ జరిపారు. పూజ అయిపోయిన తర్వాత వీరరాఘవన్‌గారు సిట్టింగ్‌లో కండిషన్ (స్థితి) ఎలా ఉంది అని అభ్యాసులను అడిగారు. ఒక

అభ్యాసీ "ఈ రోజు కృష్ణుడు సిట్టింగ్ ఇచ్చినట్లుగా అనిపించింది" అని అనగానే, ఇంకొక అభ్యాసీ "ఈ రోజు నాకు మీరాబాయి సిట్టింగ్ ఇచ్చినట్లుగా అనిపించింది" అని అన్నాడు. అప్పుడు వీరరాఘవన్‌గారు "ఈ రోజు ప్రాణాహుతి సూటిగా సోర్స్ (మూలం) నుండే వచ్చింది" అని అన్నారు.

అప్పుడు నేను ఇదంతా విన్న తర్వాత, అభ్యాసులతో "ట్రాన్స్‌మిషన్ ఎక్కడి నుండి వస్తుంది, ఎవరు ఇస్తున్నారు అని మీరు ఇదే ఆలోచిస్తూ ఉండకూడదు. మీరు ఎప్పుడైనా ఇంతకుపూర్వం కృష్ణుడు, మీరాబాయి ఇచ్చిన ట్రాన్స్‌మిషన్ ఇలా ఉందని అనుభూతి చెందారా? ఒకవేళ మీరు అనుభూతి చెందినట్లయితే, ఇది కృష్ణుడు ఇచ్చిన ట్రాన్స్‌మిషన్, ఇది మీరాబాయి ఇచ్చిన ట్రాన్స్‌మిషన్ అని చెప్పగలరు. ట్రాన్స్‌మిషన్ యొక్క అనుభూతి అనేది మీకు కేవలం బాబూజీయే ఇచ్చారు అనేది మీరు గుర్తించడంలేదు. దీని అర్థం ఏమిటంటే, మీ కనెక్షన్ (సంబంధం) అనేది ఒకే ఒక్కరితో కాకుండా చాలామందితో ఏర్పడింది. ఎప్పటివరకైతే దీన్ని మీరు సరిదిద్దుకోరో అప్పటివరకు కూడా మీరు ప్రోగ్రెస్ కావడానికి ఆలస్యం అవుతుంది" అని అన్నాను.

అప్పుడు చారీజీ తండ్రిగారు "ఈ వీరరాఘవన్ ఎప్పుడు ఇలానే ఎవరో ఒకరు సిట్టింగ్ ఇస్తున్నారని చెప్తూ ఉంటారు. నేనే సిట్టింగ్ ఇచ్చానని మాత్రం అతడు ఎప్పుడూ చెప్పలేదు" అని నాతో చెప్పారు. తిరిగి నేను వీరరాఘవన్‌గారితో "మిమ్మల్ని బాబూజీ ప్రిసెప్టర్‌గా ఎందుకు చేసినట్లు? లేకపోతే బాబూజీయే స్వయంగా కృష్ణునికి, మీరాబాయికి చెప్పి, వీళ్ళకు సిట్టింగ్ ఇవ్వమని చెప్పేవారు కదా! బాబూజీ మిమ్మల్ని ప్రిసెప్టర్ చేయవలసిన అవసరం ఏముంది?" అని అన్నాను. ఇది అంతా నేను ఎందుకు చెప్తున్నానంటే, ఇది అంతా కూడా మనస్సు ఆడే నాటకం –ఇమాజినేషన్ (ఊహించు కోవటం) అన్నమాట.

నమ్మకం అనే విషయానికొస్తే మనం కొన్ని నమ్మేస్తాం. ఎవరన్నా కాని, ఈయన కృష్ణుడు –గోపీనాధుడు, అని చెబితే నమ్మేస్తాం. కాని ఆయన నిజంగా కృష్ణుడా, కాదా అని తెలుసుకోవడానికి ప్రయత్నం చేయం.

"నేను డివైన్ పర్సనాలిటీ (దివ్య పురుషుడు)ని" –అని బాబూజీ ఎప్పుడూ, ఎవరికి కూడా చెప్పలేదు. వారిని మేమందరం "బాబూజీ! బాబూజీ!" అని పిలిచేవాళ్ళం. ఒకసారి దక్షిణ భారతదేశం నుండి డాక్టర్ కె.సి. వరదాచారిగారు, చారీజీ, వారి తండ్రిగారు, జాగీర్దార్‌గారు, రాఘవేంద్రరావుగారు అందరూ షాజహాన్‌పూర్‌కు బాబూజీ ఇంటికి వచ్చారు. వాళ్ళందరు "వారు డివైన్ పర్సనాలిటీ, వారు డివైన్ పర్సనాలిటీ" అంటూ మాట్లాడుకుంటున్నారు. 'డివైన్ పర్సనాలిటీ' అనే పదాన్ని బాబూజీ మొదటిసారిగా విన్నారు. వాళ్ళందరు తనను గురించే మాట్లాడుకుంటున్నారని బాబూజీకి అర్థం కాలేదు. అప్పుడు వారు "బిటియా! ఈ చదువుకున్న వాళ్ళంతా ఎవరి గురించి మాట్లాడుకుంటున్నారు. డివైన్ పర్సనాలిటీ ఎవరు?" అని నాతో అన్నారు. ఈశ్వర్ సహాయ్‌గారు నవ్వుతూ –

"బాబూజీ! వాళ్ళు 'డివైన్ పర్సనాలిటీ' అని మిమ్మల్నే అంటున్నారు" అని అనగానే, "వారు అంటున్నారా! నేను ఎప్పుడూ ఈ పేరు వినలేదే! అసలు, నేను ఎవరు? అనేది నాకే తెలియదు. అరే భాయీ! నా పేరు 'డివైన్ పర్సనాలిటీ' కాదు, నా పేరు 'బాబూజీ' అని వీళ్ళకు చెప్పు" అని అన్నారు.

బాబూజీని మనం ఎంతో భక్తితో, ప్రేమతో ప్రార్థన చేయాలి. భరతుడు, హనుమంతుడు రాముని ఎంతటి ప్రేమ, భక్తితో కొలిచారో అంతటి భక్తితో, ప్రేమతో మనం కూడా బాబూజీని సేవించాలి.

ఒకసారి బసంత్ పంచమి భండారా రోజున బాబూజీ కుర్చీలో కూర్చుని ఉన్నారు. నేను (కస్తూరీ బెహెన్) గేటువద్ద నిలబడి ఉన్నాను. అప్పుడు ఆ వచ్చే అభ్యాసులందరూ నాతో మాట్లాడిన తర్వాత బాబూజీ మహరాజ్‌వద్దకు వచ్చి నమస్కారాలు చెప్పుకున్నారు. బాబూజీ ప్రక్కనే రాయ్‌జాదాగారు కూర్చున్నారు. ఇదంతా చూస్తూన్న రాయ్‌జాదాగారు, "బాబూజీ! చూడండి. అందరూ ముందుగా బెహెన్‌జీ వద్దకు వెళ్ళి, ఆ తర్వాతనే మీ వద్దకు వస్తున్నారు" అన్నారు. బాబూజీ ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నారు. కాసేపటికి నేనూ బాబూజీ దగ్గరకు వెళ్ళి కూర్చున్నాను. అప్పుడు బాబూజీ అన్నారు కదా, "రాయ్‌జాదా! ప్రతి మనిషిలోనూ రెండు నడవడికలు ఉంటాయి. ఒకటి మంచి నడవడిక. రెండవది చెడు నడవడిక. మంచి నడవడి కలవారు వారి మనసులో ఒక్కటే ఆలోచన కలిగి ఉంటారు. వారి ఆలోచనంతా ఆధ్యాత్మికంగా ముందుకు పోవడమే. రెండవ నడవడి కలవారు ఎప్పుడూ ఇతరుల లోపాలు వెదుకుతూ ఉంటారు. వాళ్ళేమి చేస్తున్నారు, వీళ్ళేమి చేస్తున్నారు అని చూస్తుంటారు. అలాంటివారికి ప్రోగ్రెస్ (అభివృద్ధి) సరిగ్గా ఉండదు."

బాబూజీ మహరాజ్ అందరికీ దారి చూపడానికే వచ్చారు. అందరినీ ఆ దైవం వద్దకు తీసుకొని వెళ్ళడానికి ఈ భూమిపై అవతరించారు. బాబూజీకి వారు, వీరు అనే భేదభావం ఉండదు. 'వారు' అందరికీ సంబంధించిన వారు. బాబూజీ చూస్తున్నప్పుడు అందరూ– ఎవరికి వారు తమనే చూస్తున్నారని అనుకుంటారు. నా వంకే బాబూజీ చూస్తున్నారని అనుకుంటారు. అలా ఎందుకని అనుకుంటారంటే, 'వారి'కి అందరిపైనా ప్రేమ సమానంగా ఉంటుంది. అందుకని ఎవరికి వారు "బాబూజీ నావంకే చూస్తున్నారు" అని అనిపిస్తుంది.

ఈ సమాజంలో ప్రతి విషయమూ సంస్కారంతో కూడియే ఉంది. అనారోగ్యం అనగా ప్రతి జబ్బు సంస్కారాలవల్లనే వస్తుంది. బాబూజీ చెప్పేది ఏమిటంటే, సహజమార్గ విధానంలో విశ్వాసంతో ఉన్న అభ్యాసీలకు, నిరంతర స్మరణ ద్వారా ఈ సంస్కారాలు దూరమవుతాయి. చెడు కలల ద్వారా కూడా కొన్ని సంస్కారాలు దూరమవుతాయి. అయితే ఇక్కడ ధ్యానంలో మునిగి ఉండటం ద్వారా కూడా సంస్కారాలు దూరమవుతాయి. "నేను సంస్కారాలను అనుభవిస్తున్నాను. నా ప్రారబ్ధం ఇలా ఉంది. అందుకే నాకు బాగుండటం లేదు" అని కూడా అనుకోకూడదు. అది కూడా ఒక సంస్కారంగా ఏర్పడుతుంది. అందువలన, "నేను సంస్కారాలను అనుభవిస్తున్నాను" అనే ఆలోచనే మనస్సులోకి రానివ్వరాదు.

అనారోగ్యంగా ఉన్న ఒక అభ్యాసీ వద్దకు ఒక ప్రిసెప్టర్ వెళ్ళాడు. ఆ ప్రిసెప్టర్ అన్నారు కదా, "ఈ జబ్బు రావడం వలన నీ సంస్కారాలు పోతున్నాయిలే" అని. అప్పుడు ఆ అభ్యాసీ "అయితే నేను డాక్టర్ వద్ద ట్రీట్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం లేదా?" అని అడిగాడు. దానికి ఆ ప్రిసెప్టర్ "ట్రీట్‌మెంట్ (వైద్యం) అవసరం లేదు. కాని ఏమైనా టాబ్లెట్స్ వేసుకునే ముందు సంస్కారాలన్నీ తుడిచి పెట్టుకుపోతున్నాయని అనుకో" అని అన్నాడు. ఈ వృత్తాంతం విన్న తర్వాత బాబూజీ మహరాజ్ ఆ ప్రిసెప్టర్ని పిలిచి "జ్వరం రావడం వలన సంస్కారాలు పోతే, నీవు ఇంక డాక్టర్ వద్దకు వెళ్ళకు. నీకు విరోచనాల వలన సంస్కారాలు పోయేట్లయితే వైద్యం చేయించుకోవద్దు. ఉదాహరణకు ఎవరైనా నీకు ఇప్పుడు నాలుగైదు దెబ్బలు తగిలిస్తే నీ సంస్కారాలు పోతాయి అని అంటే, నీవు మౌనంగా ఉంటావా? అందుచేత అలా చెప్పకూడదు.

అనారోగ్యం వలన సంస్కారాలు పోతున్నాయని ఎవరైనా అభ్యాసీ కానివారు వింటే –"సహజమార్గ సిస్టమ్ చేరితే సంస్కారాలు తొలగిపోవడానికిగాను అనారోగ్యం అనే శిక్ష పడుతుంది. అందుచేత సహజమార్గ్‌లో చేరకూడదు" అని అంటారు.

రోగం వస్తే సంస్కారాలు పోతాయని నీవు ఇలా చెప్పటం సరికాదు. జబ్బు రావడం వలన సంస్కారాలు నశిస్తాయని చెప్పడం వలన ఆ జబ్బు మనిషికి స్వాంతన ఏర్పడదు. నీవు చెప్పాల్సింది ఏమిటంటే, సరైన మందు తీసుకోవడం వలన బాధ తగ్గిపోతుంది అని. మీ ప్రేమ పూర్వకమైన మాటలతో దృఢత్వాన్ని పెంచండి. అపుడు ఆ జబ్బు యొక్క బాధా తగ్గుతుంది" అన్నారు. బాబూజీ మహరాజ్‌గారి కృపతో త్వరగా కోలుకుంటాడు రోగి.

ఒకసారి నేను బాబూజీకి ఈ విధంగా లేఖను వ్రాశాను. "బాబూజీ! ఇప్పుడు రాత్రి 10 గంటలు అయింది. నేను ఒక్కదానినే వేరే గదిలో నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నాను. అకస్మాత్తుగా నా సంస్కారాలు నన్ను విడిచిపెట్టి మీ వైపుకు వెళ్ళుతున్నట్లుగా అనిపించింది. నా ఈ సంస్కారాలు ఎట్టి పరిస్థితులలోను మిమ్మల్ని చేరకూడదని, మిమ్మల్ని స్పర్శించకూడదని రాత్రి అంతా నేను తీవ్రమైన ప్రయత్నం చేశాను" అని.

సరిగ్గా అదే రోజు రాత్రి బాబూజీ నాకు ఒక ఉత్తరాన్ని ఈ విధంగా వ్రాశారు: "బిటియా! నీవు చాలా ఆందోళనతో, వ్యాకులతతో ఉన్నట్లుగా నాకు కనపడుతున్నావు. నీ ఆందోళన, బాధ వలన నేను కూడా బాధపడ్డాను. నీ ఈ బాధకు కారణం ఏమిటో నాకు తెలుసు. అయినా నీ నుండి ఉత్తరం కొరకు ఎదురుచూస్తూ ఉంటాను" అని వ్రాశారు. నా లేఖ బాబూజీకి చేరింది. ఆ సమయంలో ఈశ్వర్ సహాయ్‌గారు కూడా అక్కడే ఉన్నారు. నా లేఖను చదివి బాబూజీ చాలా సంతోషపడ్డారు. మరల 'వారు' నాకు ఈ విధంగా ఉత్తరం వ్రాశారు. "బిటియా! ఎప్పుడైతే లయావస్థ పూర్తి అవుతుందో అప్పుడు అభ్యాసీ యొక్క సంస్కారాలన్నీ అతన్ని వదిలి అతడు ఎవరిలోనైతే లయావస్థను పొందారో, వారి వద్దకు పరుగెత్తే సమయం వస్తుంది. ఎందుకంటే, ఆ సంస్కారాలు ఇంకా పూర్తిగా నిర్మూలించబడలేదు. కాని, ఆ సంస్కారాలను నేను అనుభవిస్తాను అని అనుకొని నీవు బాధపడవద్దు. నాకు ఇష్టమైతే నా బిడ్డ యొక్క కొన్ని సంస్కారాలను నేను అనుభవిస్తాను. కాని నీ బాధను చూసిన తర్వాత, నా వైపు వచ్చిన ఆ సంస్కారాలు అన్నింటినీ నా శక్తితో దగ్ధం చేశాను. అందువలన నీ సంస్కారాల వలన నాకు ఎటువంటి కష్టం కలగలేదు" అని వ్రాశారు బాబూజీ.

**ప్రేమ యొక్క ఇటువంటి స్థితిని పొందినపుడే సంస్కారాలు ఈ విధంగా దగ్ధమవుతాయి. అంతేకాని అనారోగ్యం, జబ్బు వలన సంస్కారాలు తొలగిపోవు. ప్రేమను, లయావస్థను పెంపొందించుకోవాలి. 'వారి'లోనే మునిగిపోయి ఉండటానికి ప్రయత్నించాలి. సంస్కారాలను గురించి ఎందుకు ఆలోచిస్తారు? ఏ రోజునైతే మీరు బాబూజీ పాదపద్మాలను చేరుకున్నారో, ఆ రోజు నుండి సంస్కారాలను గురించి మరచిపోండి. సంస్కారాలను గుర్తుపెట్టుకొనడం వలన, అవి తొలగిపోవడానికి బదులుగా, ఆ సంస్కారాలు మరింతగా బలపడతాయి. అందువలన 'సంస్కారం' అనే పదాన్ని విడిచిపెట్టండి. ఎందుకంటే, ఎవరైనా దివ్య పురుషుడు మనకు లభించినప్పుడు, ఆ రోజు నుండే మీరు సంస్కారాలకు అతీతంగా ఉన్నట్లు భావించండి. అప్పుడే పవిత్రత అనేది మీలోకి వస్తుంది.** ఆ మహాపురుషుడు మనకు ఎన్నో సంస్కారాల వలన దొరకడు. ఎందుకంటే, 'వారు' సంస్కారాలకు అతీతులు. 'వారు' సంస్కారాలను భస్మం చేసేవారు.

సాధనవలన, ప్రేమవలన, ధ్యానంలో మునిగిపోవటంవలన సంస్కారాలు తొలగిపోతాయి. అంతేకాని అనారోగ్యంవలన సంస్కారాలు తొలగిపోవు.

అనారోగ్యాన్ని పదే పదే గుర్తు చేసుకుంటే, దానితోనే ఎటాచ్‌మెంట్ (అనుబంధం) ఏర్పడుతుంది. బాబూజీని స్మరిస్తే, వారితో సంబంధం (కనెక్షన్) ఏర్పడుతుంది. మీరు బాబూజీ మహరాజ్ మీద విశ్వాసం ఉండి, మిషన్‌లో చేరారంటే 'సంస్కారం' అనే శబ్దాన్ని మరిచిపోండి.

భగవంతుడు మనిషికి మనస్సు ప్రసాదించి ఎంతో స్వేచ్ఛను ప్రసాదించాడు. మీరు కావాలనుకుంటే, సైంటిస్ట్‌గా లేదా టీచర్‌గా లేదా ఒక భక్తునిగా లేదా మీరు ఏ విధంగా కోరుకుంటే ఆ విధంగా తయారుకావచ్చు.

ఒకసారి నాకు తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. చాలా బాధగా ఉంది. టాబ్లెట్స్ కూడా వేసుకున్నాను. కాని కడుపునొప్పి తగ్గలేదు. ఆ నొప్పితోనే బాధపడుతున్నాను. అప్పుడు అకస్మాత్తుగా నాకు ఏమని అనిపించిందంటే, నా ఈ బాధను బాబూజీ కూడా ఫీల్ (అనుభూతి) అవుతున్నారని అనిపించింది. నా బాధ వారిని స్పర్శించకుండా ఉండడానికిగాను నాకు, బాబూజీకి మధ్యన 'వారి' శక్తి అడ్డుగోడలాగా నిలిచి ఉందని, నా విల్‌పవర్ (సంకల్ప శక్తి) ఉపయోగించి ప్రయత్నించాను. అప్పుడు ఒక్కసారిగా నాకు ఒక ఆలోచన వచ్చింది. అసలు ఈ కడుపునొప్పి, బాధ అనే ఫీలింగ్ అనేది లేకుండా చేస్తే ఎలా ఉంటుంది! అని. అప్పుడు ఈ నొప్పి యొక్క ఫీలింగ్ వారిని చేరదు కదా! అంతే! నొప్పి, బాధ అనే ఫీలింగ్ లేకుండా ఉండటానికిగాను ఎంత వీలయితే అంతగా ధ్యానంలో కూర్చొన్నాను. బాబూజీ ఒక ఉత్తరం వ్రాసి ఈశ్వర్ సహాయ్‌గారితో ఆనాడే నాకు పంపించారు. "బిటియా! నీ నొప్పి ఒకవేళ నన్ను చేరుతుందేమోనని నీవు దానిని ఆపివేయవలసిన అవసరం లేదు. తల్లి, బిడ్డను ప్రేమతో నిమురుటం వలన, పిల్లవాని యొక్క బాధ తగ్గిపోతుంది అనేది నాకు తెలుసు. నాకు బాధ కలగకూడదనే నీ ప్రేమపూరితమైన ఆలోచన చూసి నాకు చాలా ఆనందంగా ఉన్నది" అని వ్రాశారు బాబూజీ. అప్పుడు నేను వారికి "బాబూజీ! మీ దివ్యశక్తి యొక్క దర్శనం నాకు ఆ రోజు అయ్యింది. ఎందుకంటే, కడుపునొప్పి యొక్క ఫీలింగ్ ఏదీ ఉండకూడదని నేను అనుకోగానే ఒక్కసారిగా వెంటనే ఆ ఫీలింగ్ మాయమయ్యింది. బాబూజీ! నా మీద ఈ కృపను కూడా ప్రసాదించండి –నేను ఎప్పుడు కోరుకున్నా సరే, అప్పుడు ఆనందం, ఈ స్థితులు అన్నీ కూడా అభ్యాసులందరికి లభించాలి. ఏ రోజునైతే ఈ విధంగా జరుగుతుందో, ఆ రోజున నేను చాలా ఆనందిస్తాను" అని వ్రాశాను. అవతార పురుషుడు రాముని మీరు ఎవరూ చూడలేదు. రాముని తలచుకుంటే రాముని ఫోటో జ్ఞాపకం వస్తుంది. కాని బాబూజీని తలచుకుంటే బాబూజీ ఫోటో జ్ఞాపకం రాదు. 'వారి' ప్రజెన్స్ (ఉనికిని) అనుభూతి చెందుతాము. స్వయంగా వారే మన ఎదుట ఉన్నట్లుగా అనిపిస్తుంది. బాబూజీ యొక్క సామీప్యత మన అనుభూతిలోకి వస్తుంది. అంతేకాని బాబూజీ ఫోటో గుర్తుకు రాదు. బాబూజీ మహరాజ్ యొక్క స్వరూపం అనేది మాననీయ స్వరూపం కాదు. మనది మాననీయ స్వరూపం, కాని 'వారి'ది దైవీయ స్వరూపం. ఇప్పటికి, ఎప్పటికి కూడా 'వారి' దివ్య స్వరూపం ఈ ప్రకృతిలోనే వ్యాపించి ఉంటుంది. మీరు ఎంత అయితే ప్రోగ్రెస్ అవుతారో, అంతగా బాబూజీ గురించి, రియాలిటీ (వాస్తవికత)ని తెలుసుకోగలరు. అది ఎప్పుడు తెలుసుకోగలరు? ఎప్పుడైతే మీ మనస్సులో కేవలం 'వారు'తప్ప ఎవ్వరూ లేనప్పుడు –అప్పుడు బాబూజీయే అనుకుంటారు –నా పిల్లవాడు నా గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నాడు, అని. కేవలం అప్పుడు మాత్రమే మీరు 'వారి'ని గురించి తెలుసుకోగలరు. బాబూజీ గురించి తెలుసుకోవడం అంత సులభమైన విషయం కాదు. ఇది ఒక పుస్తకం కాదు, ఒక వ్యాసం కాదు– చదివి తెలుసుకోవడానికి. ఇది

ఒక మౌన సందేశం. ఎవరైతే 'వారి'ని చూశారో అతడు మాట్లాడలేదు. వారిని గురించి స్పష్టం చేసే సామర్థ్యం మనలో లేదు. ఎవరికైతే బాబూజీ తన దివ్య సౌందర్యం (డివైన్ బ్యూటీ)ని చూపించి, దానిని స్పష్టం చేయగల సామర్థ్యం ప్రసాదిస్తారో, అప్పుడే అతడు వారిని గురించి చెప్పగలడు. "వారు ఎవరు?" అనే దానిని గురించి ఇప్పుడు స్వయంగా 'వారే' స్పష్టం చేయాలని అనుకొంటున్నారు.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నాకు షాజహాన్‌పూర్‌కు రావాలని మనస్సులో చాలా కోరికగా ఉంది" అని అన్నాడు. అప్పుడు 'వారు' నేను షాజహాన్‌పూర్‌లోనే ఉన్నాను అని నీవు అనుకుంటున్నావు. అందువల్లనే నీకు షాజహాన్‌పూర్‌కు రావాలని కోరిక ఉంది. కాని ఎవరైనా డివైన్ వర్క్ (దైవీయ కార్యం) కొరకు వచ్చినప్పుడు, వారు ఏదో ఒక పట్టణంలో ఉండరు. వారు అందరి హృదయాలలో ఉంటారు. ఎందుకంటే, అందరి హృదయాలను దివ్య సౌందర్యంతో అలంకరించాలి కనుక.

"నేను షాజహాన్‌పూర్‌లోనే ఉన్నానని నీవు అనుకుంటున్నావు. కాని నీవు ఇక్కడి నుండి మీ ఇంటికి వెళ్ళగానే నీవు ఈ వాతావరణాన్ని మరచిపోతావు. మరల షాజహాన్‌పూర్ వెళ్ళాలి అని కోరుతావు. కనుక నీవు నన్ను కలుసుకోవాలని షాజహాన్‌పూర్‌కు వస్తే, నన్ను నీతోపాటుగా మీ ఇంటికి తీసుకొని వెళ్ళు లేదా నీ హృదయాన్ని ఇక్కడే నా వద్ద విడిచిపెట్టి వెళ్ళు" అని అన్నారు 'వారే'.

బాబూజీ మహరాజ్ నుండి వర్షిస్తున్న 'వారి' దివ్య ప్రేమలో మనం నిరంతరం మునిగిపోయి ఉండటానికి కృషి చేయాలి. భగవంతుని చేరుకోవడానికి సులభమైన, సహజమైన దగ్గరి దారి ఈ 'సహజమార్గం'. బాబూజీ మన అందరికి ప్రసాదించిన గొప్ప ఆధ్యాత్మిక వరదానమే ఈ 'సహజమార్గం'.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! మహాబలవంతుడైన రావణుడు విశ్వకర్మతో లంక నుండి స్వర్గానికి మెట్లను ఏర్పరచమని ఆదేశించాడట. లంకావాసులు ఎవరూ నరకానికి వెళ్ళకుండా, అందరూ స్వర్గానికే వెళ్ళాలి అని. కాని విశ్వకర్మ ఆ పని పూర్తి చేయలేకపోయాడు" అని అనగానే బాబూజీ, "భాయీ! మన సహజమార్గ్ అనేది అల్టిమేట్ (అంతిమం)తోనే కనెక్షన్‌ను కలిగి ఉన్నది. ఏ పనిని అయితే విశ్వకర్మ పూర్తి చేయలేకపోయాడో దానిని సహజమార్గ్ ద్వారా అల్టిమేట్ (అంతిమం) వరకు మెట్లను ఏర్పరిచాను" అని అన్నారు.

బాబూజీ మనమీద ఎంతో ప్రేమను వర్షింపజేస్తూ, మనలను అల్టిమేట్ వరకు తీసుకొని వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు. మీరు నిరాశపడటం దేనికి? ఎంతో ధైర్యంగా, ఉత్సాహంగా ముందుకు వెళ్ళాలి. ఇవ్వాళ కాకపోతే రేపైనా లక్ష్యాన్ని చేరుకుంటారు. ప్రోగ్రెస్ అవుతున్నామా, లేదా? అని ఎప్పుడూ ఆలోచించకూడదు. ప్రోగ్రెస్ యొక్క అర్థం ఏమిటంటే, 'వారు' మన ఎదుటనే ఉన్నారు, అని.

ప్రిసెప్టర్ యదార్థానికి బాబూజీ మహరాజ్‌లో లయమై వారిలోనే పూర్తిగా మునిగిపోయి ఉన్నట్లయితే అభ్యాసీని ఏ విధంగా ముందుకు తీసుకొని వెళ్ళాలి అని అనుకోగానే, ఆ ప్రిసెప్టర్ ఎదుట ఒక పద్ధతి ప్రత్యక్షం అవుతుంది. ఆ పద్ధతి ప్రకారం అభ్యాసికి సిట్టింగ్ ఇచ్చిన తర్వాత, రెండవసారి అంతకంటే కూడా సులభమైన పద్ధతి ఆ ప్రిసెప్టర్ ఎదుట దర్శనం అవుతుంది. బాబూజీ మహరాజ్ పరిశోధన చేసి ఇక్కడి నుండి అక్కడి వరకు అనగా అల్టిమేట్ (భూమా) వరకు ఉన్నటువంటి పరిమితులను, బంధనాలను అన్నింటిని తొలగించి సులభమైన దారిని ఏర్పరిచారు.

అహం యొక్క ఆధారానికే ప్రాణాహుతిని ప్రసారం చేయమని బాబూజీ నాతో చెప్పారు. అహం యొక్క ఆధారం ఎంతగా నశిస్తే, అంతగా అభ్యాసీలో ప్రేమ, సంకల్ప శక్తి అభివృద్ధి అవుతుంది. మళ్ళీ బాబూజీ నుండి 'వారి' సామీప్యత, 'వారి' గ్రేస్ (కృప) బాగా లభిస్తుంది. అప్పుడు ప్రోగ్రెస్ చాలా వేగంగా ఉంటుంది. బాబూజీ నాకు ట్రైనింగ్ (శిక్షణ) ఇప్పుడూ ఇస్తూనే ఉన్నారు.

ఒకసారి ఒక వేద పండితుడు బాబూజీవద్దకు వచ్చి, "మాయను జయించటం చాలా కష్టం కదా! దానికి మీరు ఏం చేస్తారు?" అని అడిగాడు. అప్పుడు బాబూజీ, **"మాయను జయించడం అన్నిటి కంటే కూడా సులభమైన విషయం. కండ్లు తెరిస్తే అంతా మాయ, కండ్లు మూస్తే మాయ సమాప్తం. అంతా దివ్యమే"** అని అన్నారు.

అందువలన మీరు ఈ బాహ్యదృష్టితో పనులు చేసుకోవడానికే ప్రపంచాన్ని చూడండి. కాని మీ అంతర్ దృష్టిని బాబూజీమీద ఉంచండి. బాబూజీ మనవారు. మీరు 'వారి'నే చూస్తూ ఉండండి.

వివేకానందుడు చేపలు తినేవారు కదా! వారు సెయింట్ ఎలా అవుతారు? అని ఒకసారి ఎవరో బాబూజీని అడిగారు. అప్పుడు బాబూజీ, "బెంగాల్‌లో ఒకసారి తీవ్రమైన కరువు పరిస్థితి ఏర్పడింది. అప్పుడు ఆ రోజుల్లో ప్రజలకు బియ్యం, చేపలు తప్ప ఏమీ దొరికేవి కాదు. అందువలన వారు చేపలను తినక తప్పలేదు. వివేకానందుని అసలు పేరు నరేంద్రుడు. నరేంద్రుడు తన తల్లి వద్ద ఉన్నంత వరకు చేపలను తిన్నారు. కాని ఎప్పుడైతే సన్యాసీ అయ్యారో అప్పటినుండి చేపలను తినలేదు. ఎందుకంటే, చేపలు తినడం అనేది సన్యాసులకు నిషేధం కాబట్టి. ఇదే విధంగా మహమ్మదీయులు ఎడారి ప్రాంతాలలో ఉండడం వల్లన వాళ్ళకు నీరు చాలా తక్కువగా లభించేది. నీటి కొరత వలన నమాజ్ (ప్రార్థన) చేసుకోవడానికి, కాళ్ళు చేతులు మాత్రమే శుభ్రం చేసుకుంటే చాలునని మహమ్మదీయుల మతగురువు ఆ రోజులలో చెప్పారు. కాని కాలక్రమేణా అది ఆచారంగా మారింది" అని అన్నారు బాబూజీ.

**అభ్యాసీ: బెహెన్‌జీ! కొన్నిసార్లు ధ్యానం చేస్తున్నప్పుడు గురక (స్నోరింగ్) వస్తుంది. ఏం చేయాలి?**

**బెహెన్‌జీ:** ధ్యానం చేస్తున్నప్పుడు, గురుక వచ్చినట్లుగా అనిపిస్తే, వెంటనే కండ్లు తెరచి 2,3 నిమిషాలు, కండ్లు తెరిచే ధ్యానం చేయండి. తర్వాత మరల కండ్లు మూసుకొని ధ్యానం చేయండి. అప్పుడు గురక రాదు.

**అభ్యాసీ: బెహెన్‌జీ! మా అందరికి అత్యధికమైన ప్రోగ్రెస్ ఇవ్వమని మిమ్మల్ని అడగడంలో తప్పులేదు కదా!**

**బెహెన్‌జీ:** మీరు అడుగుతున్నారు. కాని మీరు అడుగకముందు దాని కొరకు నేను మీ మీద పని చేస్తున్నాను. "ఏదైనా కావాలని పిల్లవాడు అడిగినపుడు దాన్ని తల్లి తన పిల్లవానికి ఇచ్చినట్లయితే అది నిజమైన ప్రేమ కాదు. పిల్లవాడు అడుగకముందే, అతన్ని చూసి, అవసరం అయిన ప్రతీదానిని కూడా తల్లి ఇస్తే, ఆమె నిజమైన తల్లి" అని బాబూజీ అనేవారు. మీరు ఇక్కడికి, లక్నోకు రావాలని అనుకున్నప్పటి నుండే మీ మీద 'వారి' పని ప్రారంభమైంది. బాబూజీయే మన నిజమైన తల్లి! బాబూజీని మీరు నాకు ఇది కావాలి, అది కావాలి అని చాలా చిన్న చిన్నవే కోరుతారు. ఆ విధంగా కాకుండా, "బాబూజీ! నేను మీ వాడిని, మీరు ఏ విధంగా అనుకుంటే నన్ను ఆ విధంగా తయారుచేయండి" అని 'వారి'ని ప్రార్థించాలి.

"ఆధ్యాత్మికంగా నేను బిచ్చగాళ్ళను తయారు చేయటం లేదు. నేను మాస్టర్స్‌ను తయారు చేస్తున్నాను" అని బాబూజీ అనేవారు. మాస్టర్ అంటే మీరు ఆఫీస్‌కు వెళ్ళినా, మార్కెట్‌కు వెళ్ళినా, ఎక్కడికి వెళ్ళినా సరే 24 గంటలూ మీ నుండి ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) శక్తి వాతావరణంలోకి ప్రవహిస్తూనే ఉంటుంది. మాస్టరీ (ఆధిపత్యం) అంటే అదే.

**అభ్యాసీ: అభ్యాసీ కానివారు, ఇంటిలో ఏదైనా వ్రతం లేదా పూజను చేస్తే మేమూ ఆ పూజలో పాల్గొనాలా? లేక ఆ పూజ, వ్రతాన్ని విడిచిపెట్టాలా?**

**బాబూజీ:** నీవు విడిచిపెట్టవలసింది ఏదీలేదు. మీ ఇంటిలోని వారు పూజ లేదా వ్రతం చేస్తారు కదా! దాన్ని కూడా ఒక సరియైన పద్ధతిలో చేయాలి. ఈ రోజు వ్రతం కాబట్టి ఈ రోజు ఉపవాసం పాటించాలి అంటారు. నిజంగా ఉపవాసం ఎందుకు? ఆ రోజు మీరు చాలాసార్లు (ప్రతి క్షణం) ప్రార్థన చేయడానికి! కాని ప్రజలు ఆ రోజు పాయసం, పిండివంటలు తయారుచేయడంలో నిమగ్నమైపోతారు. ఉదాహరణకు చంద్రుని పూజ చేస్తున్నారు అనుకోండి! ఈ విధంగా ప్రార్థన చేయాలి–నీవు ఏ విధంగానైతే దినదిన ప్రవర్థమానమై లోకానికి వెలుగును ఇస్తున్నావో, అదే విధంగా నా భర్త, పుత్రులు, ఇంటిలోని వారందరూ కూడా దినదినభావృద్ధి చెందాలి. అందరిలో దైవీయ ప్రకాశం ప్రకాశించాలి అని ప్రార్థించాలి. మీరు వినాయకుని పూజ చేస్తారు. వినాయకుని వాహనం ఎలుక. ఎలుక అనేది చంచల స్వభావానికి చిహ్నం. అంత లావుగా ఉండే వినాయకుడు, చిన్న ఎలుక మీద కూర్చుని ఉన్నాడు. అంటే వినాయకునికి తన చంచలమైన ఇంద్రియాలపై ఆధిపత్యం ఉందని దాని అర్థం. మీకు కూడా చంచలమైన ఇంద్రియాలపై స్వాధీనం రావాలని వినాయకుని పూజించాలి. మీరు లక్ష్మీపూజ చేస్తారు. లక్ష్మీదేవి వాహనం గుడ్లగూబ. లక్ష్మీ వస్తుంది, కాని మిమ్మల్ని గుడ్లగూబ (మూర్ఖుడి)గా చేస్తుంది. ఎందుకంటే, లక్ష్మీ వస్తుంది, కాని ఆ ధనం వైపే చూస్తూ ఉంటే గర్వమే వస్తుంది. బుద్ధి (విచక్షణా జ్ఞానం) నశిస్తుంది. కనుక మీరు ఏ వ్రతం చేసినా– మా కుటుంబంలోని వారందరూ కూడా మంచి స్వభావంతో ఉండాలి. అందరికి శాంతి లభించాలి. మా అందరి అవసరాలు పూర్తి అయ్యేట్లుగా – అనుగ్రహించమని ప్రార్థించాలి. కాని లక్ష్మీపూజ, గణేష్‌పూజ, ఇవి అన్నీ కూడా నిజమైన వ్రతాలు కావు. "ఎప్పటివరకైతే ఈశ్వర దర్శనం కాదో, అప్పటివరకు విశ్రాంతి లేదు" అనే ఆ సంకాల్పాన్ని పూర్తి చేయడమే నిజమైన వ్రతం.

మనం శ్రీరాముని తలచుకున్నప్పుడు ఎవరో చిత్రించిన రాముని చిత్రంగాని, ఫోటోగాని గుర్తుకొస్తుంది. కాని బాబూజీని తలచుకున్నప్పుడు 'వారి' చిత్రమో, ఫోటోనో కాకుండా 'వారే' మనముందు ఉన్న అనుభూతితో ప్రేమ, ఆనందం పొందుతాం. **బాబూజీ మహరాజ్ ప్రేమ స్వరూపులు, 'వారు' మామూలు మనిషి కారు. 'వారి'ని పొందడం ఎంత తేలికంటే, 'వారు' లేనిదే మనం లేమని అనుకున్నట్లయితే అన్నీ వారే అయి మనకు అన్నివేళలా దారి చూపుతుంటారు. 'వారు' మన అంతరంగంలో ఎలా కనిపిస్తున్నారో, దాన్ని బయటికి స్పష్టం చేయాలన్నా కూడా 'వారి' యొక్క కృప కావాల్సిందే.**

**ప్రశ్న: బెహెన్‌జీ! అభ్యాసీ తను ప్రోగ్రెస్ అవుతున్నట్లు ఎలా తెలుసుకుంటాడు?**

**జవాబు:** మీరు మీలో ఎంత స్పష్టంగా, ఎంత సామీప్యంగా 'వారి'ని దర్శించుకుంటారో, ఎంతటి నియర్‌నెస్‌ని ఫీలవుతారో అంతగా ప్రోగ్రెస్ అయినట్లు.

బాబూజీ మహరాజ్ ఏమని చెప్పేవారంటే, ప్రేమించడం చాలా కష్టం. ఒక నల్లని పురుగు తెల్లగా మారడానికి ఎంతగానో అభిలాషపడేది. ఎందుకంటే, తెలుపు ప్రేమకు చిహ్నం. అది ఎంతగా తెల్లగా మారాలని కోరుకుందంటే, ఎల్లప్పుడూ, ప్రతిక్షణమూ తను తెల్లగా మారాలనే తపించిపోయేది. దాని తపనవలన ఒకానొక సమయానికి అది నిజంగా తెల్లగా మారిపోయింది. కొన్ని పురుగులు కావాల్సిన రంగుకు మారడం సృష్టిలోనే ఉంది. మరి ఒక నల్లని పురుగు ప్రేమతో తపించి తపించి తెల్లగా మారగాలేనిది మనిషి తన హృదయంలో ఈశ్వర దర్శనం కోసం తపించి ఆ దర్శన భాగ్యం పొందలేడా! కనుక తపన కావాలి, తపించాలి.

బాబూజీ మహరాజ్ 'తవజ్య, తవజ్యూత్'కు గల తేడా చెప్పారు. 'తవజ్య' అంటే ట్రాన్స్‌మిషన్, ప్రాణాహుతి. 'తవజ్యూత్' అంటే, 'వారి' నీడలో మనం ఉండటం. 'వారి' రక్షణలో ఉండటం. ఒక తల్లి తన నీడలో, రక్షణలో బిడ్డను ఎలా సాకుతుందో, బాబూజీ తన యొక్క నీడలో మనల్ని ముందుకు అలానే తీసుకొని వెళ్ళుతున్నారు. **సాధన యొక్క ఫలితం ఏమిటంటే, మనం ఎల్లప్పుడూ 'వారి' ప్రత్యక్షత, 'వారి' సామీప్యతను ఫీల్ అవుతూ, అనుభవిస్తూ ఉంటాము.** ఇలా ఫీల్ అవుతూ ఉంటే, మన సాధన మొదలైనట్లే. 'సాధన'ను విడదీస్తే సాధ్ + న అవుతుంది. 'సాధ్' అంటే కోరిక, 'న' అంటే లేదు అని అర్థం. 'సాధన' అంటే కోరిక లేకపోవడం. కోరిక అనేది ఎప్పుడు లేకపోతుందో, అప్పుడు సాధన మొదలైనట్లు. "నిన్ను చూడ్డంకన్నా, ఫీల్ అవడం కన్నా (అనుభూతిలో ఉండడంలో కన్నా) నీ ప్రేమను పొందడం కన్నా నాకు ఏదీ ముఖ్యం కాదు. అది కాకుండా నాకు ఏ కోరికా లేదు" –ఇదే సాధన చేయడం అంటే. భరతుడు రాముని భక్తిలో ఎంతగా మునిగిపోయాడంటే, రాముడు వనవాసానికి వెళ్ళాడన్నది కూడా మరచిపోయి రాముడు తనలోనే ఉన్నాడన్న దివ్య భావనలోనే మునిగి ఉండేవాడు. రాముడు వనవాసం ముగించుకుని తిరిగి అయోధ్యకు వచ్చేప్పటికి హఠాత్తుగా భరతునికి అది గుర్తుకు వచ్చి, "అయ్యో! రాముడు వనవాసానికి వెళ్ళేడే!" అన్నాడు. భరతుడు అంతగా రామభక్తిలో మునిగిపోయాడు. అలా ఉండాలి భక్తి అంటే.

సిట్టింగ్ ఇవ్వడం తేలికే. కాని ప్రిసెప్టర్ యొక్క పని చాలా కష్టమైంది. ప్రిసెప్టర్ ఎప్పుడూ తాను సిట్టింగ్ ఇస్తున్నాననే భావనను రానివ్వకూడదు. తనను ఎవరైతే ప్రిసెప్టర్‌గా కూర్చోపెట్టారో 'వారి' యొక్క కృపతోనే సిట్టింగ్ ఇస్తున్నాననుకుని, 'వారి' కృపతోనే అభ్యాసీ ముందుకు సాగిపోతున్నాడని కోరుకోవాలి.

ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీ మహరాజ్‌కు తన కష్టాలన్నీ ఒక లేఖలో వ్రాశాడు. రాయ్‌జాదాగారు అది చదివి, **"బాబూజీ! చూడండి. ఈ అభ్యాసీ తన కష్టాలన్నీ ఎలా వ్రాశాడో!" అని అనగానే బాబూజీ ఆయనతో "అవును మరి! బిడ్డ తల్లికి కాకుండా తన కష్టాలను ఎవరితో చెప్పుకుంటాడు" అని అన్నారు. ఆ తర్వాత బాబూజీ ఆ అభ్యాసీకి జవాబు వ్రాశారు కదా, "నీ కష్టాలు త్వరలో దూరం అవుతాయి. నీ ఒక్కరి కష్టాలే కాదు, అందరి కష్టాలు కూడా దూరం చేస్తాను. నా ఆశీర్వాదం మీకు ఎప్పుడూ ఉంటుంది"** అని.

మనం ఈ సహజమార్గ విధానంలోకి వచ్చాం. కనుక ఈ సంస్థ పద్ధతుల్ని మనం అనుసరించాలి. మెడిటేషన్ చేయడం, ప్రేయర్, క్లీనింగ్ చేసుకోవడం, నిరంతర స్మరణలో ఉండటం. ఈ పద్ధతుల్ని మనం అనుసరించాలి. ఈ పద్ధతులు అన్నింటిని మనకు నేర్పడానికి బాబూజీ మన కోసం వచ్చారు. 'వారి' ప్రేమను మనందరికి పంచుతున్నారు. అభ్యాసీకి సాధన చేసే సమయం వచ్చింది. అతడి జీవనంలో సాధన ఒక భాగం కావాలి.

మా పెద్దక్క శకుంతల, ఒక సమయంలో సిట్టింగ్‌లో కూర్చోలేకపోయేది. చాలా గాభరాగా ఉండేది. ఆమె చేతులు కూడా బాగా వణికిపోయేవి. బాబూజీకి ఆమె విషయం వ్రాస్తే జవాబుగా, "శకుంతలా! నీకు ట్రాన్స్‌మిషన్ వస్తుండగా, దాన్ని నీవు అనుభూతి చెందుతూ ఉన్న సమయంలో, నీ చేతుల్ని చూసి భయపడుతున్నప్పుడు ఆ చేతులు నీవికావు అనుకో (ఆ చేతులు బాబూజీవి అనుకో), నీ భయం తగ్గిపోతుంది" అని వ్రాశారు.

మనం ఏమి చేస్తున్నా, ఆ దివ్యం పైననే –బాబూజీ పైననే మన దృష్టి ఉంచడమే ముఖ్యం.

"బాబూజీ! మీ కృపను గురించి మేము వర్ణించలేము. కాని నేను మీకు ఒక ఫిర్యాదు కూడా చేస్తున్నాను. మీరు నాకు ఈశ్వరప్రాప్తిని కలిగించి, సత్యపథ్ వద్దకు తీసుకొని వెళ్ళి 'పార్షద్' స్థితిని ప్రసాదించి, సెంట్రల్ రీజియన్‌లో స్విమ్మింగ్ చేయిస్తూ, 'భూమా' ద్వారం వద్దకు తీసుకొని వెళ్ళి 'మహా పార్షద్' స్థితిని ప్రసాదించారు. ఆ తర్వాత భూమా యొక్క సప్త వలయాల గుండా నన్ను అంతిమసత్యం (అల్టిమేట్, రియాలిటీ) వద్దకు చేర్చి, అక్కడ 'మీ' యొక్క సాక్షత్కారాన్ని కూడా ప్రసాదించారు. అయినప్పటికీ మీకు, నాకు మధ్యన పారదర్శకమైన సన్నని మేలిముసుగు వంటిది ఎందుకు ఉంచారు? అటువైపు బాబూజీ ఉన్నారు, ఇటువైపున కస్తూరీ ఉంది. మీరు, నన్ను ఈ స్వల్పమాత్రపు దూరంలో ఎందుకు ఉంచారు?" అని సంధ్య (కస్తూరీ బెహెన్ యొక్క కలం పేరు. దీనికి బాబూజీనే 'సంధ్య' అని పేరు పెట్టారు) మీతో ఫిర్యాదు చేస్తున్నది.

"ఆ స్థాయికి చేరుకున్నటువంటి పర్సనాలిటీ (మూర్తిమత్వం) కేవలం ఒక్కరు మాత్రమే ఉంటారు. అటువంటివారు ఈ భూమి మీద ఇద్దరు ఉండటానికి వీలులేదు. అందువలన నీ ప్రార్థన ప్రకారమే నేను ఆ స్వల్ప దూరం ఉంచాను" అని బాబూజీ చెప్పారు. నిజమే! ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ నాతో "అత్యున్నత స్థితికి చేరినటువంటి వారు ఎవరో ఒక్కరే ఉండాలి. ప్రకృతి నియమం ప్రకారం అటువంటి పర్సనాలిటీలు (మూర్తిమత్వం) ఇద్దరు ఉండటానికి వీలులేదు, అని లాలాజీ సాహెబ్ బాబూజీతో చెప్పారు" అని అన్నారు.

ఎప్పుడైతే నాకు ఈ స్థితి కలిగిందో, అప్పుడు సంపూర్ణంగా బాబూజీ యొక్క సాక్షాత్కారం అయింది. కాని ఒక్కసారిగా 'వారి'కి నాకు మధ్య గ్లాసువంటి పారదర్శకమైన మేలిముసుగు వంటిది అడ్డంగా ఉన్నట్లుగా అనిపించింది. ఆ పారదర్శకం గుండా బాబూజీ యొక్క డివైన్ బ్యూటీని (దివ్య సౌందర్యాన్ని) చూడవచ్చు. కాని నేను 'వారి'లో లయంకాలేను. ఎందుకంటే, వారు 'మాస్టర్' కాబట్టి. అత్యున్నతమైన స్థితికి చేరుకున్న తర్వాత కూడా అభ్యాసీకి మాస్టర్‌కు మధ్యన నామమాత్రపు భేదం ఉండాలని నేను వారిని ప్రార్థించాను. "నీ కోరిక ప్రకారమే ఆ స్వల్పమైన దూరాన్ని ఉంచాను" అని 'వారు' అన్నారు. ఇటువంటి అత్యున్నత స్థితికి చేరినటువంటి వ్యక్తులు ఒకే సమయంలో ఇద్దరు ఉండటానికి వీలులేదు" అని లాలాజీ సాహెబ్ ఒకసారి బాబూజీతో అన్నారని మాకు ఈశ్వర్ సహాయ్‌గారు తెలిపారు.

బాబూజీ! నేను ఈ స్థితిలో ఏదైతే మీ యొక్క డివైన్ బ్యూటీను (దివ్య సౌందర్యాన్ని) చూస్తూ ఉన్నానో, దానిని నేను నా నేత్రాలతో చూడటం లేదు. మీ దివ్య దర్శనాన్ని నేను నా నేత్రాలలో ఉంచుకోలేదు. నాకు ఏ విధంగా అనిపిస్తూ ఉన్నదంటే, మీ యొక్క దృష్టితోనే, నేను మిమ్మల్ని చూస్తున్నట్లుగా అనిపించింది. నేను 'వారి' నేత్రాల ద్వారానే వారిని దర్శిస్తున్నాను. అనగా భేదం అనేది ఏర్పడింది కదా! 'వారి' దృష్టియే

సన్నని పారదర్శకంలాగా అడ్డంగా నిలిచి ఉన్నది. దాని ద్వారా 'వారి' దివ్య సౌందర్యం చూడవచ్చు. కాని వారిలో లయం కాలేము. నిజానికి 'వారి'ని ఎదురెదురుగా ఎవరు చూడగలరు? ఒకవేళ 'వారి' దృష్టి అనే పారదర్శకత అడ్డంగా లేకపోతే, మీరు 'వారి'ని చూడగానే ఒక్కసారిగా మీరు 'వారి'లోనే కలసిపోతారు. ఎందుకంటే, ఆ స్థాయిలో ఇద్దరు ఉండటానికి వీలులేదు కనుక!

సంత్ కబీర్, మీరాబాయి మొదలగు భక్తులందరు కూడా ఈశ్వర సాక్షాత్కారాన్ని పొంది ఆ స్థితి వద్దనే ఆగిపోయారు. ఎందుకంటే, వారి లక్ష్యం అనేది ఈశ్వర సాక్షాత్కారం మాత్రమే. కాని బాబూజీ మనలను అందరిని కూడా దీనికంటే అతీతంగా ఉన్నటువంటి అంతిమసత్యం అనగా అల్టిమేట్ వద్దకు తీసుకొని వెళ్ళాలని సంకల్పించారు. అందువల్లనే 'వారు' అభ్యాసీని 'అంతిమం' వద్దకు తక్కువ సమయంలో ఎలా తీసుకొని వెళ్ళాలి అని రీసెర్చ్ (పరిశోధన) చేశారు. 'వారు' ఏం చేస్తారంటే, ఎప్పుడైతే సాక్షాత్కార సమయం వస్తుందో, అప్పుడు అది ఈశ్వర సాక్షాత్కారం అని నాకు ఒక్క క్షణం మాత్రమే అనిపించింది. ఆ తర్వాత మరో క్షణంలోనే వారు, నన్ను తమ హృదయంలోకి తీసుకొని ఈశ్వరీయ శక్తి కేంద్రంలో ఒక మునక వేయించి బయటకు తీసి, సత్యపథ్ వద్ద స్థిరపరిచారు. బాబూజీ అభ్యాసీని ఈశ్వరీయ శక్తి కేంద్రంలో మునక వేయించి వెంటనే మరల బయటకు తీయకపోతే అభ్యాసీ శాశ్వతంగా ఈశ్వరుని హృదయంలోనే కలసిపోతాడు. ఆ విధంగా జరుగకుండా ఉండటానికే బాబూజీ ఒక్క క్షణం మాత్రమే అభ్యాసీని ఈశ్వరీయ శక్తి కేంద్రంలో మునక వేయించి, మరల బయటకు తీసి అభ్యాసీని సురక్షితంగా కాపాడి సత్యపథ్ వద్ద స్థిరపరచి, పార్షద్ స్థితిని ప్రసాదిస్తారు. సత్యపథ్ అనేది సెంట్రల్ రీజియన్ (కేంద్ర మండలం) యొక్క ప్రవేశ ద్వారం. బాబూజీ అభ్యాసీని ఈశ్వరీయ శక్తి కేంద్రంలో మునక వేయించడంలో ఒక గొప్ప మహత్త్యం ఉన్నది. 'వారు' ఆ విధంగా చేయడంవలన అభ్యాసీలో ఈశ్వరీయ శక్తి అనేది సంపూర్ణంగా లయమవుతుంది. అనగా అభ్యాసీ ఈశ్వరీయ సౌందర్యంతో అలంకరించబడతాడు. అప్పుడే అతడు సత్యపథ్‌ను చేరుకోగలడు. ఆ విధంగా ఈశ్వరీయ శక్తి అభ్యాసీలో లయం కాకపోతే, అతడు ముందుకు పురోగమించలేడు. ఇది అంతా బాబూజీ యొక్క రీసెర్చ్ (పరిశోధన) ఫలితం. దీనిని మాటలలో వ్రాయడం చాలా కష్టం, అయినప్పటికీ 'వారు' నాతో వ్రాయించారు. కబీర్ ఈశ్వరప్రాప్తిని పొందిన తర్వాత, సత్యపథ్ (సెంట్రల్ రీజియన్ ప్రవేశ ద్వారం) వద్ద ఆగిపోయాడు. ఇంకా ముందు ఏదో ఉందని తెలుసు. కాని ముందుకు వెళ్ళలేక అక్కడే ఉండిపోయాడు. "ఈశ్వరప్రాప్తి మరియు అనంతానికి మధ్యలో నేను నిద్రలో ఉండిపోయాను" అని కబీర్ అన్నాడు. బాబూజీ రీసెర్చ్ (పరిశోధన) చేసి అంతిమం (అల్టిమేట్) వరకు ఉన్నటువంటి అడ్డంకులను, బంధనాలనన్నింటిని తొలగించి, దారిని సులభం చేశారు. అందువల్లనే, "నేను ఈశ్వరప్రాప్తి మరియు అనంతానికి మధ్య నిద్రలో ఉన్నాను" అని ఇప్పుడు ఇంకొక కబీర్ అనలేడు, అని బాబూజీ అన్నారు.

ఒకవేళ బాబూజీ మహరాజ్ కస్తూరీని ఈ విధంగా తయారు చేయకపోతే 'వారు' ఎవరు? 'వారు' ఏ స్థితివరకు మిమ్మల్ని తీసుకొని వెళ్ళారు అనేది మీకు ఎలా తెలుస్తుంది? కనీసం ఈ మాత్రమైనా తెలిసింది ఇప్పుడు. ఇంకా ముందు ముందు ప్రపంచంలో దివ్య వాతావరణం నెమ్మది నెమ్మదిగా ఏర్పడినప్పుడు ప్రజలు బాబూజీని గురించి ఇంకా ఎక్కువగా తెలుసుకుంటారు. మీరు ఒక సత్యాన్ని తప్పకుండా అంగీకరించ వలసిందే! అది ఏమిటంటే, బాబూజీ చేసిన రీసెర్చ్ (పరిశోధన) గురించి ఎవరైనా తెలియజేయకపోయి నట్లయితే, అటువంటి డివైన్ పర్సనాలిటీ ఇక్కడ అవతరించారు అనేది ప్రజలకు ఎలా తెలుస్తుంది?

**అభ్యాసీ: ఇప్పుడు ఎవరికైనా బాబూజీతో ఇంటర్ కమ్యూనికేషన్ అనేది ఉన్నదా?**

**బెహెన్‌జీ:** ఎవ్వరూ కూడా బాబూజీతో ఇంటర్ కమ్యూనికేషన్ చెయ్యలేరు. దీనిని తప్పుగా అర్థం చేసుకున్నారు. బాబూజీయే, శ్రీకృష్ణునితోను, స్వామి వివేకానందతోను ఇంటర్ కమ్యూనికేషన్‌చేసి మాట్లాడారని అభ్యాసీలు అర్థం చేసుకున్నారు. కాని బాబూజీ ఎవరితో కూడా ఇంటర్ కమ్యూనికేషన్ చేసి మాట్లాడలేదు. ఎప్పుడైనా ఒక అవతార పురుషుడు భూమి మీద అవతరించినపుడు, వారు చేసే దైవలీల లేదా పనిలో తమ సహకారం, సహాయం అందించటానికి, మునులు, ఋషులు కూడా అవతార పురుషునితోపాటుగా భూమిమీద జన్మిస్తారు. కాని ఇక్కడ, వాళ్ళే ఆ మహానుభావులు, బాబూజీతో ఇంటర్ కమ్యూనికేషన్ చేసి, తమకు ఏదైనా పని ఇవ్వమని కోరారు. "మీ ఇంట్లో వెనకాల దొంగలు ఉన్నారు. వాళ్ళను పారద్రోలు, నీవు ఈ సత్రంలో బస చేయవద్దు, వేరేచోట ఉండు" అని లాలాజీ సాహెబ్ వారితో ఇంటర్ కమ్యూనికేషన్ చేసి చెప్పారు. బాబూజీ తన పనిలోనే లీనమై ఉండేవారు. కాబట్టి 'వారి' రక్షణ కొరకు వాళ్ళే బాబూజీతో ఇంటర్ కమ్యూనికేషన్‌చేసి మాట్లాడారు. కాని బాబూజీయే వాళ్ళతో ఇంటర్ కమ్యూనికేషన్ చేసి మాట్లాడారు అనేది తప్పు. నిజానికి వాళ్ళే బాబూజీతో ఇంటర్ కమ్యూనికేషన్ చేసి, తమ సేవను అంగీకరించమని 'వారి'ని కోరేవారు. శ్రీకృష్ణుడు, స్వామి వివేకానంద మొదలగువారు బాబూజీతో ఇంటర్ కమ్యూనికేషన్ చేసి నీవు ఈ పని చేయాలి అని తెలిపేవారు. అంతేకాని బాబూజీ ఎప్పుడూ కూడా, నేను పని ఏమి చేయాలి అని వాళ్ళను అడగలేదు. పని పూర్తి చేసిన తర్వాత, వాళ్ళు బాబూజీని ప్రశంసించేవారు.

**అభ్యాసీ: బెహెన్‌జీ! మీకు ఇంటర్ కమ్యూనికేషన్ ఉందా?**

**బెహెన్‌జీ:** పుస్తకాల ద్వారా ఉంది. ఏ ఒక్క పుస్తకంలోనూ ఒక్క వాక్యం కూడా నావైపు నుండి లేదు. మొదట బాబూజీ నాకు పుస్తకం పేరు చెప్పుతారు. అప్పుడు పుస్తకం పేరును వ్రాసుకుంటాను. చేతిలో కలం, కాగితం పట్టుకొని 'వారు' ఆ పుస్తకం గురించి ఎప్పుడు, ఏమి చెప్పుతారా అని ఎదురుచూస్తూ ఉంటాను. 'వారు' ఆ పుస్తకంలోని విషయం గురించి చెప్పుతారు అనేది నాకు తెలుసు. కాని 'వారు' ఎప్పుడు చెప్పుతారు అనేది నాకు తెలియదు. కొంత సేపటివరకు కలం వ్రాస్తూనే ఉంటుంది. మరల ఆగిపోతుంది. వంట చేస్తున్నప్పుడో లేదా వేరే ఏదైనా పనిలో ఉన్నప్పుడో, ఆ పుస్తకానికి సంబంధించిన ప్రవాహం, 'వారి' నుండి రావడం మొదలుకాగానే వెంటనే చేస్తున్న పని ఆపివేసి, అప్పుడు వ్రాయడం ప్రారంభిస్తాను. వ్రాసేది ఎవరు? ఒక్క వాక్యం, ఒక్క పదం, ఒక్క అక్షరం కూడా నాది కాదు. ఒక్కొక్కసారి వ్రాస్తున్నప్పుడు ఏ విధంగా అనిపిస్తుందంటే, చేతివ్రేళ్ళు కదులుతూనే ఉంటాయి, కాని కలం యొక్క స్పర్శ ఉండదు. ఈ రోజున కూడా, నేను వ్రాసిన పుస్తకాలను, ఎవరైనా నా ఎదుట చదివినప్పుడు –"ఎంత చక్కగా వ్రాశారు! ఈ పుస్తకాన్ని ఎవరు వ్రాశారు?" –అనే మాటలు నా నోటి నుండి అకస్మాత్తుగా వెలువడతాయి. ఎందుకంటే, ఒక్క అక్షరం కూడా నాది కాదు. బాబూజీయే ఈ విధంగా పుస్తకాల ద్వారా తనను గురించి తెలుపకపోయి నట్లయితే, మానవులమైన మనం 'వారి'ని గురించి ఎలా తెలుసుకోగలం. ఇది కేవలం 'వారి' దివ్యకృప మాత్రమే. అందువల్లనే వారు, "నేను నీకు ఏదైతే చెప్పానో, దానిని నీ అనుభవ రూపంలో వ్రాయి" అని నన్ను కోరారు.

లాలాజీ సాహెబ్ మహాసమాధి అనంతరం, 12 సంవత్సరాల తర్వాతనే బాబూజీ పని చేయడం ప్రారంభించారు. నా మనస్సులో ఒక ఆలోచన వచ్చింది. ఈ 12 సంవత్సరాలు కూడా నేను సాధన చేసాను అని బాబూజీ ఎక్కడ కూడా వ్రాయలేదు. సాధన పూర్తి అయిన తర్వాత, 12 సంవత్సరాలు వారు ఏమి చేశారు? ఒకరోజు మేమందరం షాజహాన్‌పూర్‌లో బాబూజీ దగ్గర కూర్చొని ఉన్నాం. అప్పుడు వారు "బిటియా! ఎప్పుడైతే నా ఆధ్యాత్మిక స్థితి ఓపెన్ (వికసించడం) అయిందో, దాని కంటే కొన్ని రోజుల ముందు, నా దగ్గరికి ఒక సూఫీ–మహాత్ముని యొక్క శిష్యుడు వచ్చాడు. 'త్వరలోనే మీ ఆధ్యాత్మిక స్థితి ఓపెన్ (వికసించడం) అవుతుంది' అని నా గురువు మీతో చెప్పమన్నారు, అని అతడు నాతో అన్నాడు. అప్పుడు నాకు కొద్దిగా అర్థమైంది. స్థితి ఓపెన్ కావడం (విప్పుకోవడం) అంటే, ఇప్పుడు ఆ శక్తిమీద నాకు ఆధిపత్యం ఏర్పడింది" అని.

మన శ్రీరామచంద్ర మిషన్‌లో ఏదైనా సమస్య, కలత (డిస్టర్బెన్స్) వస్తే మన అభ్యాసులందరం కూడా ప్రార్థన చేయాలి– "బాబూజీ మహరాజ్! ఇది చాలా ఉన్నతమైన సంస్థ. మీ దివ్యప్రేమ అందరికీ లభించాలి. అందరికి కూడా మీ ఆశీస్సులు లభించాలి" –అని ఈ విధంగా ప్రార్థన చేయాలి. ఇది ప్రతి ఒక్క అభ్యాసీ యొక్క కర్తవ్యం. అంతేకాని, మిషన్‌లో ఏదో డిస్టర్బెన్స్, సమస్యలు ఉన్నాయని అభ్యాసీ ధ్యానాన్ని విడిచిపెట్టితే ఎలా? ఆ అభ్యాసీ మెడిటేషన్ (ధ్యానం)ను విడిచిపెట్టాడు అంటే, అతడు బాబూజీ మహరాజ్‌ను పట్టుకోలేదని అర్థం.

అవతారాలు బాణం లేదా చక్రాన్ని ధరించి తమ పని పూర్తి చేసుకొని అనగా దుష్ట సంహారం చేసి వెంటనే వెళ్ళిపోయారు. కాని బాబూజీ యొక్క పని ఆ విధంగా కాదు. బాబూజీ కేవలం తమ విల్‌పవర్ (సంకల్ప శక్తి)తోనే పనిచేస్తారు. 'వారు' తమ సంకల్ప శక్తితో సమస్త విశ్వంలోని వాతావరణంలోను, ప్రకృతిలోను నెమ్మది నెమ్మదిగా మార్పును తీసుకొని వస్తారు. యుగ పరివర్తన అనేది ఒక్క రోజులో అయ్యేపని కాదు.

మనం ఈ మిషన్‌లో ఎవరికోసం, ఎందుకు చేరాము? ఏ లక్ష్యాన్ని పొందాలని చేరామో దానిని గుర్తుపెట్టుకోవాలి. మన హృదయం బాబూజీ ప్రేమలో పూర్తిగా మునిగిపోవాలి. అప్పుడు ఈ ప్రాపంచిక జీవితంలో మునిగిపోవాలని ఎప్పుడైనా మనస్సు కోరుకున్నా, మనం ఈ భౌతిక జీవితంవైపే చూస్తూనే ఉన్నప్పటికీ కూడా మనలను ఈ భౌతిక ప్రపంచం ఆకర్షించలేదు. డివోషన్ (భక్తి) అంటే ఇదే. బాబూజీ మహరాజ్ సమస్త మానవాళి మీద వారి దివ్య ప్రేమను, దివ్య కృపను వర్షింపజేస్తూనే ఉన్నారు. 'వారు' అభ్యాసులపట్ల ఎంతో సమర్పితులై ఉన్నారు. మన హృదయాన్ని వారితో కనెక్ట్ చేసినట్లయితే, మన దృష్టిని వారి మీదనే నిలిపినట్లయితే, భక్తి (డివోషన్) అనేది సులభంగా సాధ్యమవుతుంది.

"బాబూజీ! ఈ సృష్టి ప్రారంభమై కొన్ని లక్షల సంవత్సరాలు అయింది. కాని ఇప్పటివరకు కూడా నేను మిమ్మల్ని తెలుసుకోలేక పోయాను. ఇప్పటివరకు మీ దర్శనాన్ని పొందలేక పోయాను" అని ఒకరోజున బాధపడ్డాను. వెంటనే, ఒక్క నిమిషంలోనే దానికి ఈ విధంగా జవాబు లభించింది –ఎప్పుడైతే ఈ సృష్టి ప్రారంభమైందో అప్పటి నుండి కూడా అంటే అప్పుడు, ఇప్పుడు, ఎల్లప్పుడు కూడా నేను వారితోనే ఉన్నాను. నేను వారికి చెందినదానను, అని. అంటే మన అందరికీ సృష్టి ప్రారంభం నుండి శ్రీ బాబూజీ

మహరాజ్‌తో సంబంధం (కనెక్షన్) ఉంది. అయితే ఈ సృష్టి యొక్క దాత ఎవరు? ఈ సృష్టి యొక్క మాస్టర్ ఎవరు? ఎవరి శక్తి వలన ఈ సృష్టి నడుస్తూ ఉన్నది? మీరే చెప్పండి. సమయం వచ్చినప్పుడు ఈ విషయాలన్నీ వాటంతట అవే వెల్లడవుతాయి. బాబూజీ అనేవారు –"నీవు స్వయంగా సాధన చేసి అనుభవం ద్వారా తెలుసుకో లేదా ఇతరులు తమ అనుభవంతో చెప్పినదాన్ని ఒప్పుకోవాలి" అని. ఈ సృష్టి ప్రారంభమైనప్పటి నుండి మనకు బాబూజీతోనే కనెక్షన్ ఉంది, అని ఆలోచించినపుడు మనకు ఒక సత్యం స్పష్టంగా తెలుస్తుంది. అది ఏమిటంటే, మనకు శ్రీ బాబూజీ మహరాజ్‌తప్ప, వేరెవ్వరు కూడా ఇప్పటివరకు సద్గురువుగా రాలేదు అని. ఇంకొక విషయం ఏమిటంటే, సమస్త మానవాళి శ్రేయస్సు కొరకు అవతరించినటువంటి మొదటి డివైన్ పర్సనాలిటీ (దివ్య పురుషుడు) వీరే! రాక్షసులను సంహరించడానికి అవతార పురుషులు వచ్చారు. కాని, మానవులను ఉద్ధరించడానికి, మానవాళికి ఈశ్వరీయ మార్గాన్ని చూపించడానికి, ఈశ్వరీయ జ్ఞానాన్ని ప్రసాదించడానికి కేవలం శ్రీ బాబూజీ మహరాజ్ మాత్రమే స్పెషల్ పర్సనాలిటీ (విశిష్ట మూర్తిమత్వంగా) ఈ ఒకే ఒక్కరు అవతరించారు. 10,000 సంవత్సరాల తర్వాత ఇంకొక పర్సనాలిటీ (మూర్తిమత్వం) ఈ భూమి మీద అవతరిస్తారు అని కొంతమంది అంటారు. కాని ఇది సరైనది కాదు. ఎందుకంటే, ఆ నాటికి శ్రీ బాబూజీ యొక్క దివ్య సంకల్పం నెరవేరి సత్యయుగం అనగా ఈశ్వరీయ యుగం ఏర్పడుతుంది. సత్యయుగంలో ప్రతి ఒక్కరికి ప్రతి అణువులో కూడా రియాలిటీ (వాస్తవికత)యే కనపడుతుంది. మనలాగా వారిలో ఆత్మ అనేది ఉండదు. వాళ్ళలో ఆత్మకు బదులుగా దాని స్థానంలో ఈశ్వరుడే నివాసం ఉంటాడు. ఆత్మను గురించి, ఆత్మోద్ధరణను గురించి ఈశ్వరీయ యుగంలో ఎవ్వరూ మాట్లాడరు. ఆత్మ అనేది పరమాత్మలో లయమైపోయి ఉంటుంది కనుక, వారిలో ఆత్మకు బదులుగా కేవలం దైవం మాత్రమే ఉంటుంది.

మనం ఆధ్యాత్మికంగా ప్రోగ్రెస్ అయినకొద్దీ సూక్ష్మ శరీరం మరియు అహం అనేవి శ్రీ బాబూజీలో లయమైపోతాయి. అనగా ఆత్మ పరమాత్మలో విలీనమైపోతుంది. ఆత్మ పరమాత్మలో లయమైపోయినప్పుడు ఆత్మ ఇంక ఎక్కడ ఉంటుంది! అందువలన సత్యయగంలో మానవులకు కేవలం ఈశ్వరుడు (దైవం)తప్ప వారికి ఏమీ కనిపించదు. ఆత్మ పరమాత్మలో లయమైపోయినా, మానవుడు జీవించే ఉంటాడు. అతడు ఇప్పుడు ఏమి అనుభూతి చెందుతాడు అంటే, కేవలం బాబూజీ మహరాజ్ సన్నిధి (ప్రజెన్స్)తప్ప అతనికి ఏమీ కనిపించదు. మనం కూడా శ్రీ బాబూజీపట్ల ప్రేమను పెంచుకొని, వారి దివ్య ప్రేమలో మునిగిపోయి నట్లయితే సత్యయుగంలోని ఆ స్థితిని మనం ఇప్పుడే, ఇక్కడే పొందవచ్చు.

ఒకసారి నేను బాబూజీకి, "బాబూజీ! ఈ సహజమార్గంలో ఈశ్వరప్రాప్తి అనేది అభ్యాసీ యొక్క లక్ష్యం అని, ఈ సాధన ప్రారంభించేముందు, మీరు నాతో చెప్పారు. కాని ఇప్పుడు నాకు ఏ విధంగా అనిపిస్తున్నది అంటే, ఎవరైనా ఈశ్వరుని గురించి మాట్లాడుతున్నప్పుడు లేదా ఈశ్వరుని పేరును పలికినప్పుడు ఈ మాట నేను ఎక్కడో విన్నట్లుగా ఉంది. కాని ఇతనిని (ఈశ్వరుని) గురించి నాకు అస్సలు ఏమీ తెలియదు అని అనిపిస్తోంది. కాని ఎవరైనా 'బాబూజీ' అని మీ గురించి పలికినపుడు లేదా మాట్లాడినపుడు –మీరు నా వారు, మీరు నా ఎదుటనే ఉన్నారు అనే ఫీలింగ్ (అనుభూతి) నాలో కలుగుతోంది" అని వ్రాశాను. అపుడు బాబూజీ, "ఈశ్వరీయ క్షేత్రం (గాడ్లీ రీజియన్)ను దాటి వెళ్ళిపోయినప్పుడు, ఎవరైనా ఈశ్వరుని గురించి ప్రస్తావించినప్పుడు, ఈశ్వరుడు ఎవరో వేరే లోకానికి సంబంధించిన వారు కావచ్చు, వారిని గురించి మనకు ఏమీ తెలియదే, అని మనకు ఆ విధంగా అనిపిస్తుంది" అని జవాబు వ్రాశారు.

**అభ్యాసీ: హార్ట్ రీజియన్ (హృదయ మండలం)ను దాటామా, లేదా? అనేది ఏ విధంగా తెలుసుకోగలం?**

**బెహెన్‌జీ:** హార్ట్ రీజియన్, మైండ్ రీజియన్, సెంట్రల్ రీజియన్ ఇవి అన్నీ శ్రీ బాబూజీగారి రీసెర్చ్ (పరిశోధన) మాత్రమే. నేను నాకు కలిగిన అనుభవాలను గురించి వారికి వ్రాసినప్పుడు, వారు నా మీద రీసెర్చ్ చేసి, ఇప్పుడు నీవు ఫలానా స్థితిని పొందావు, ఫలానా రీజియన్ దాటావు అని తెలిపేవారు. మానవుడు ఎంత బలహీనంగా అయ్యాడు అంటే అతడు తనంతట తానుగా కనీసం ఒక్క బిందవును కూడా దాటలేడు. అందువల్లనే బాబూజీ తమ సంకల్ప శక్తితో మానవుని ఏ విధంగా అంతిమసత్యం వద్దకు తీసుకొని వెళ్ళాలో రీసెర్చ్ (పరిశోధన) చేసి వారి సౌలభ్యం కొరకు ఈ హార్ట్ రీజియన్, మైండ్ రీజియన్, సెంట్రల్ రీజియన్ మొదలగు వాటిని కనుగొన్నారు.

మనం చేసే ధ్యానం మనలను విడిచిపెట్టి బాబూజీ మహరాజ్ యొక్క విరాట్ హృదయంలో ప్రవేశించగానే అనగా మన ఎదుటనే బాబూజీ యొక్క హృదయం వ్యాపించి ఉన్నట్లుగా లేదా మన ధ్యానం (దృష్టి) అనేది తన పరిమితులను త్రెంచుకొని బాబూజీ మహరాజ్ యొక్క హృదయంలోనే ధ్యానం చేస్తున్నట్లుగా అనుభూతి చెందినప్పుడు మనం హార్ట్ రీజియన్ (హృదయ మండలం)లో పురోగమిస్తున్నామని అర్థం. హార్ట్ రీజియన్‌లో 'వారి'ని గురించి మనకు స్మరణ, తపన (క్రేవింగ్) అనేది తీవ్రంగా ఉంటుంది. 'వారి'కి మనను గురించి క్రేవింగ్ (తపన) ఏర్పడినప్పుడు మనం 'వారి' మనస్సులో అనగా మైండ్ రీజియన్‌లో ప్రవేశించామని గుర్తు. ఎప్పుడైతే బాబూజీ మహరాజ్ అభ్యాసీని తమ 'సంకల్పం' అనే నావలో ప్రవేశపెట్టి, స్విమ్మింగ్ చేయిస్తారో, అదే సెంట్రల్ రీజియన్.

**అభ్యాసీ: ధ్యానం, క్లీనింగ్ ప్రతి పని కూడా బాబూజీయే చేస్తున్నారని అనుకోవచ్చా?**

**బెహెన్‌జీ:** అది ఒక స్థితి. ఆ స్థితిలో మీ హృదయం బాబూజీ యొక్క ధ్యానంలో ఎంతగా మునిగిపోతుంది అంటే, మీరు ఎవరిని చూసినా మీకు కేవలం బాబూజీయే కనిపిస్తారు. మిమ్మల్ని మీరు స్పర్శించుకొన్నా, బాబూజీనే స్పర్శించినట్లుగా మీకు అనిపిస్తుంది. మీరు మాట్లాడుతున్నప్పటికీ మీకు మీ స్వరం వినపడదు. కేవలం బాబూజీ యొక్క మధుర స్వరం మాత్రమే వినపడుతుంది. ఇది సారూప్యతా స్థితి. ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నేను ధ్యానం చేస్తున్నప్పుడు మీరే ధ్యానం చేస్తున్నారని అనుకుంటాను" అని అనగానే వెంటనే వారు, "నేను మీ అందరినీ గుర్తుపెట్టుకోవడానికి ఇక్కడికి వచ్చాను. బాబూజీయే ధ్యానం చేస్తున్నారని నీవు అనుకుంటే, మీ అందరినీ ఎవరు గుర్తుపెట్టుకోవాలి?" అని అన్నారు.

**అభ్యాసీ: బాబూజీ మహరాజ్ అప్పుడప్పుడు నాకు కలలో కనపడతారు. ఇది నిజమేనా లేక ఊహనా?**

**బెహెన్‌జీ:** మీరు ఎప్పుడూ కూడా అనుమానం లేదా ఇమాజినేషన్ (ఊహించుకోవడం) అనే పదం నుండి దూరంగా ఉండండి. మీకు ఏదైతే బాబూజీ గురించి అనుభూతి కలిగిందో, స్వప్నంలో కనిపించిందో అది ఊహించుకొన్నది కాదు. నీ హృదయంలో అనుమానం అనేది ఎప్పుడూ కూడా రానివ్వకూడదు అని బాబూజీ అనేవారు.

**అభ్యాసీ: క్లీనింగ్ (నిర్మలీకరణ)లో విల్-పవర్ (సంకల్ప శక్తి)ని ఉపయోగించవచ్చా?**

**బెహెన్‌జీ:** అసలు మీలో విల్-పవర్ (సంకల్ప శక్తి) అనేది ఉంటే ఇప్పటికే మీలోని సంస్కారాలన్నీ దగ్ధమై పోయేవి. మానవునిలో అనంతమైన కోరికలు ఉండటంవలన అతని ఆలోచనా శక్తి (థాట్ పవర్) అనేది

పూర్తిగా బలహీనమయ్యింది. అతనిలో కాన్ఫిడెన్స్ (విశ్వాసం) అనేది లేదు. మానవుని యొక్క మనస్సు ఎంతగా బలహీనమైంది అంటే, తన విల్-పవర్ (సంకల్ప శక్తి)తో మానవుడు కనీసం ఒక్క బిందువును కూడా దాటలేడు. అందువల్లనే బాబూజీ మహరాజ్ మనల్ని తమ విల్-పవర్ (సంకల్ప శక్తి)తో ఉద్ధరించడానికి అవతరించారు.

"బాబూజీ మహరాజ్ నా ఎదురుగా కూర్చొని ఉన్నారు. వారి హృదయంలో నుండి ఈశ్వరీయ ధార నాలోకి ప్రవహిస్తున్నది. శ్రీ బాబూజీని చేరుకోవడానికి ప్రతిబంధకాలుగా ఉన్న అనవసరమైన విషయాలన్నింటినీ 'వారి' దివ్యశక్తి తుడిచి అవతలికి పారవేస్తున్నది" అని క్లీనింగ్ చేసుకోవాలి.

**అభ్యాసీ: మరణంతో సమానమైన జీవితాన్ని ప్రసాదించుము, అని బాబూజీ ఒకచోట వ్రాశారు కదా! దయచేసి వివరించండి.**

**బెహెన్‌జీ:** అది 'లివింగ్-డెడ్' (జీవన్ మృతుడు) స్థితికి సంబంధించింది. ఈ స్థితిలో మనం మరణించి ఉన్నామా లేక జీవించి ఉన్నామా అనేది మనకు తెలియదు. ఒకసారి, "బాబూజీ! నేను ఇంటి పనులు అన్నీ యధావిధిగా చేసుకుంటాను. కాని ఎప్పుడైతే మీ పనిని అనగా ఆధ్యాత్మిక పని చేస్తానో అప్పుడే ఎవరో ఇంకో కస్తూరీ పని చేస్తున్నట్లుగా అనిపిస్తుంది. నేను మాత్రం కాదు" అని వారికి వ్రాశాను. ఈ 'లివింగ్-డెడ్' స్థితిలో ఈ శరీరంలో ఏదైతే ముఖ్యమైనది ఉన్నదో, ఏదైతే జీవిస్తూ ఉన్నదో, ఆ 'ఐడింటిటీ'ని బాబూజీ శరీరంలో నుండి తీసి, ఆ ఐడెంటిటీని లక్ష్యం వద్దకు తీసుకొని వెళ్ళతారు. ఇప్పుడు ఈ శరీరం, ఇక్కడ జీవించడానికి అవసరమైన జీవన శక్తిని మాత్రమే వారు మనలో ఉంచుతారు. ఈ స్థితిలో మీరు దేనిని చూసినా, ఇది చాలా బాగుంది అని మీరు ఇష్టపడినప్పటికీ ఎటువంటి కోరిక కూడా మీ హృదయంలో ఉత్పన్నం కాదు. అసలు ఎటువంటి కోరిక కూడా మీ హృదయం లోనికి ప్రవేశించదు. అనగా జీవితం అనేది మరణించింది. ఏ విధంగా అంటే ఒక శవం మీద పట్టు శాలువా కప్పినప్పటికిని, దానికి ఎటువంటి ప్రత్యేకత, జ్ఞానం ఉండదు. లివింగ్-డెడ్ అనగా మరణం యొక్క స్థితిలో జీవించటం. 'నేను' అనే జ్ఞానం, ఎరుక పూర్తిగా చనిపోయి ఉంటుంది. ఈ స్థితిలో, అవసరం అయినప్పుడు బాబూజీ అభ్యాసీకి ఈ భౌతిక ప్రపంచం యొక్క స్పృహను కలిగిస్తారు. 'లివింగ్-డెడ్' స్థితిలో శరీరం అనేది ఇక్కడ (భూమిమీద) ఉంటుంది. కాని అభ్యాసీ (స్థితి) అక్కడ పైన (అనగా బాబూజీవద్ద) ఉంటాడు. ఈ స్థితి అభ్యాసం వలన రాదు. వారిపట్లగల అపారమైన ప్రేమ వలననే ఈ స్థితి దానంతట అదే లభిస్తుంది. వారిని ఎంత గాఢంగా ప్రేమించాలంటే ఈ శరీరం, రూపం, పేరు అన్నీ మర్చిపోవాలి. అన్ని పనులు అప్రయత్నంగానే జరిగిపోవాలి. కేవలం 'వారు'తప్ప మీ కన్నులకు ఎవరూ కూడా కనపడకూడదు. మిమ్మల్ని మీరు చూసుకొన్నా కూడా, మీ రూపం మీకు కనపడదు. కేవలం బాబూజీయే కనపడతారు.

ఒకసారి, "బాబూజీ నేను తల దువ్వుకొని 3 రోజులు అయింది. తల దువ్వుకుందామని అద్దంలోకి చూస్తే, అందులో నాకు మీ ముఖమే కనపడుతన్నది" అని వారికి ఈ స్థితిని గురించి వ్రాశాను. అదే రోజున వారు, "బిటియా! నా ఈ స్థితి ఏమిటో నాకు అర్థం కావడం లేదు. గడ్డం కత్తిరించడానికి వచ్చిన మంగలివానిని, అవసరం లేదు అని చెప్పి అతనిని వెనుకకు పంపించి, ఇప్పటికి 3 రోజులు అయింది. ఎందుకంటే, అద్దంలోకి ఎప్పుడు చూసినా సరే, నా ముఖానికి బదులుగా నీ ముఖమే నాకు కనిపిస్తున్నది" అని నాకు

వ్రాశారు. ఇది సారూప్యతా స్థితి. ఈ స్థితి అందరికీ వస్తుందని బాబూజీ చెప్పారు. ఈ విధంగా 'వారు' ప్రతి స్థితిని గురించి కూడా ఋజువు చేశారు. 'వారి' రీసెర్చి (పరిశోధన) యొక్క అర్థం ఏమిటంటే, ప్రతి స్థితి యొక్క నిరూపణ, ఋజువును 'వారు' మనకు చూపించారు.

ఈశ్వరుడు, సర్వవ్యాపి అని అంటారు. కాని మానవుడు సర్వవాపి కాదు. సర్వవ్యాపి స్థితి ఏ విధంగా ఉంటుంది? 'వారు' అభ్యాసీని ఏ విధంగా అక్కడికి తీసుకొని వెళ్ళతారు, అనేది ఈ ఉదాహరణ వలన అర్థమవుతుంది. ఒకసారి, "బాబూజీ! నేను మిమ్మల్ని తలచుకోగానే, నేను షాజహాన్‌పూర్‌లో ఉన్నట్లుగా అనిపిస్తుంది" అని నేను వారికి వ్రాశాను. "బిటియా! నేను నిన్ను ఎప్పుడు జ్ఞాపకం చేసుకున్నా కూడా నేను మోడీనగర్‌లోనే నీ వద్ద ఉన్నట్లుగా అనిపిస్తుంది" అని జవాబు వ్రాశారు. 'వారు' మనకు సర్వవ్యాపక శక్తి యొక్క స్థితిని ఏ విధంగా ప్రసాదిస్తారో ఈ సంఘటన వలన తెలుస్తుంది. 'వారు' అల్టిమేట్ అనగా అంతిమ శక్తి యొక్క మాస్టర్. 'వారి' గౌరవాన్ని, గుణగణాలను మనం ఎంతగా కీర్తించగలము!

"నేను సమస్త మానవాళిని నా ఒడిలోకి తీసుకోవడానికి చేతులు చాపాను" అని బాబూజీ అనేవారు. మీరు చేయవలసింది ఏమీలేదు. కేవలం 'వారి' చేయిని పట్టుకోవడం మాత్రమే! మన చేతిని 'వారు' పట్టుకొన్నట్లుగా మనం అనుభూతి చెందాలి. దీని కొరకే మన సాధన అంతా కూడా.

బాబూజీ మహరాజ్ కుమారులు బాబూజీని సరిగ్గా అర్థం చేసుకోలేదని, 'వారి'ని గురించి 'వాస్తవం' తెలుసుకోలేదని అప్పుడప్పుడు నేను అనుకునేదాన్ని. ఇది బాబూజీగారి పొరపాటు కాదు. ఎందుకంటే, 'వారు' ఇంటి పనులు, వ్యవహారం, సంభాషణ అంతా కూడా పూర్తిగా మీరు లేదా నేను చేస్తున్న విధంగానే ఒక సామాన్య మానవునిలాగా చేసేవారు. కాని 'వారు' దైవీయ కార్యాన్ని నిర్వహించేప్పుడు లేదా మీరు వారిని స్మరించినప్పుడు "వారు ఎవరు? వారి శక్తి ఏమిటి?" అనేది మనకు చూపించేవారు.

మొట్టమొదటిసారిగా నేను షాజహాన్‌పూర్‌కు వెళ్ళి, బాబూజీ వద్ద కొన్ని రోజులు ఉన్న తర్వాత, తిరిగి లఖింపూర్‌కు వెళ్ళడానికి సిద్ధమైనపుడు –"బాబూజీ లేకుండా నేను జీవించలేను" –అని అనిపించింది. వియోగం యొక్క వ్యధను హృదయం భరించలేకపోయింది. వియోగ బాధ చాలా తీవ్రంగా ఉంది. 'వారి' వద్ద శెలవు తీసుకొని, ఇంటి ముందరి గేటు వరకు వెళ్ళి, మరల ఆగి, వెనుకకు తిరిగి, వరండాలో కూర్చొని ఉన్న బాబూజీ వైపుకు చూశాను. "బిటియా! ఇంకొక రెండు రోజులు ఇక్కడే ఉండిపో" అని అంటారేమోనని. 'వారు' ఏమీ అనలేదు సరికదా, రిక్షావానిని పిలవండి. బిటియాకు ట్రైన్ టైం అయింది అని అన్నారు. ఇంక నేను లఖింపూర్ మా ఇంటికి వెళ్ళక తప్పలేదు. రెండవసారి షాజహాన్‌పూర్‌కు వచ్చి వెళ్ళేప్పుడూ ఇదే విధంగా జరిగింది. కాని మూడవసారి మాత్రం షాజహాన్‌పూర్‌కు వచ్చి మరల తిరిగి ఇంటికి వెళ్ళే సమయంలో ఈసారి ఆ వియోగ బాధలేదు. బాబూజీ నా ఎదురుగానే ఉన్నట్లుగా, నాతోపాటు ఉన్నట్లుగా ఫీలింగ్ కలిగింది. నేను వెళ్ళిపోవడానికి గేటు దగ్గరకి నడవగానే, వెంటనే బాబూజీ "బిటియా! ఇంకా రెండు రోజులు ఉండి వెళ్ళవచ్చు కదా!" అని అన్నారు. నేను ఇంకో రెండు రోజులు ఉందామని అనుకున్నప్పుడు నన్ను ఉండమని ఒక్కసారి కూడా అనలేదు 'వారు'. ఇప్పుడు వియోగం అనే ఫీలింగ్ లేదు, కాని ఇప్పుడేమో ఇంకో రెండు రోజులు ఉండమంటున్నారు. ఎంత కఠినమైన వ్యక్తి అని మనస్సులో అనుకొన్నాను. మీరు సాధన చేస్తూ, ఏ ఏ విధంగా అయితే పురోగమిస్తారో అప్పుడే ఈ సెపరేషన్ (వియోగం) అనేది అదృశ్యమై 'వారు' మీ ఎదుటనే ఉన్నట్లుగా అనుభూతి చెందుతారు.

పిల్లవానికి జ్వరం వచ్చినప్పుడు, పిల్లవాడు ఏడుస్తున్నా కూడా గట్టిగా పట్టుకొని తల్లి ఇంజక్షన్‌ను చేయిస్తుంది. అప్పుడు ఆ తల్లి కొద్దిగా కఠినంగానే ప్రవర్తిస్తుంది. అయినా తల్లి హృదయం ఎంతో మృదువైంది. పిల్లవానిని తన ఒడిలోనే ఉంచుకొని, అతడు క్రింద పడిపోకుండా, తన దృష్టిని పిల్లవాని మీదే ఉంచుతుంది. అదే విధంగా బాబూజీ కూడా మనల్ని పైకి తీసుకొని వెళ్ళడానికి కొన్నిసార్లు కఠినంగా వ్యవహరిస్తారు. అదే సమయంలో మనల్ని తల్లిలాగా ప్రేమతో కాపాడుతూ లక్ష్యం వద్దకు చేర్చుతారు.

ఒకసారి ఒక వేద పండితుడు, ముగ్గురు నలుగురు తన స్నేహితులతో కలసి బాబూజీవద్దకు వచ్చారు. పండితుడు వేదాల గురించి, ఉపనిషత్తుల గురించి చాలా గొప్పగా చెప్పారు. కాసేపు అయ్యాక "వేదాల గురించి మీకు ఏం తెలుసు?" అని అతడు బాబూజీని ప్రశ్నించాడు. బాబూజీ "భాయీ! నీవు వేదాల గురించి, ఉపనిషత్తుల గురించి చాలా గొప్పగా పొగడుతున్నావు. కాని ఆ గ్రంథాల్లో, ఆ వేదాలలో చెప్పినదాన్ని నీవు అర్థం చేసుకోలేదు. వేదాలు "నేతి –నేతి" అని అంటున్నాయి. 'నేతి–నేతి' అనగా 'ఇది కాదు, ఇది కాదు' అని అర్థం. అంటే దీని తర్వాత, ఆ తర్వాత ఇంకా ముందు ఏదో ఉన్నది అని దాని అర్థం. ఎక్కడైతే వేదాలు 'నేతి–నేతి' (ఇది కాదు, ఇది కాదు) అని అంటాయో, అక్కడి నుండే నేను నా పనిని ప్రారంభిస్తాను. నీవు ఇప్పుడు వేద గ్రంథాలను చదువుతున్నావు. కాని నేను వ్రాసినటువంటి ఆధ్యాత్మిక స్థితులు ఆ వేదాలలో లేవు. ఎక్కడైతే వేదాలు అంతమవుతాయో అక్కడి నుండే నా పనిని ప్రారంభిస్తాను" అన్నారు.

**అభ్యాసీ: 15 రోజులకు ఒకసారి ప్రిసెప్టర్ దగ్గర సిట్టింగ్ తీసుకోవాలి అని అంటారు. కాని మాకు ప్రిసెప్టర్ అందుబాటులో లేదు. మీరు లక్నో నుండి మాకు ప్రాణాహుతి ఇవ్వండి.**

**బెహెన్‌జీ:** మీరు మీ ఇంటినే షాజహాన్‌పూర్ ఆశ్రమంగా ఎందుకు మార్చుకోరు! షాజహాన్‌పూర్ బాబూజీని మీ ఇంటిలోనే ఉంచుకోండి. "ఎక్కడైతే ప్రిసెప్టర్ లేడో అక్కడ నేనే ప్రిసెప్టర్‌గా ఉంటాను" అని బాబూజీ అనేవారు. మీరు ధ్యానంలో కూర్చోండి. బాబూజీ మహరాజ్ ఎదురుగా కూర్చొని ఉన్నారు, 'వారి' హృదయం నుండి ఈశ్వరీయ ధార నాలోనికి ప్రవహిస్తున్నది అని భావించండి. హృదయాన్ని పూర్తిగా ఆ ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి శక్తి)లోనే మునిగిపోయి ఉండేటట్లుగా చూడండి. మీలోని అణువణువు కూడా ఈశ్వరీయ ధారలోనే మునిగిపోయిందని భావించండి. ఇప్పుడు మీకు ఏ ప్రిసెప్టర్ యొక్క అవసరం లేదు. ఇక్కడ లక్నోలో ప్రతి శనివారం సాయంత్రం 6 గంటలకు సత్సంగ్ జరుగుతుంది. ఆ సమయంలో మీరందరు ఎక్కడ ఉన్నా సరే, ఇక్కడ పూజలో కూర్చోవచ్చు.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నాకు ఇండివిడ్యువల్ (వ్యక్తిగత) సిట్టింగ్ ఇవ్వండి" అని అడగ్గా వారు "భాయీ! ఒక విషయం చెప్పు. నీవు ఇండివిడ్యువాలిటీ (వ్యక్తిత్వం)ను కోల్పోవడం కొరకు ఇక్కడకు వచ్చి మరల ఇండివిడ్యువల్ సిట్టింగ్‌ను కోరుతున్నావు. దేనినైతే పోగొట్టుకోవాలి అని అనుకుంటున్నావో, తిరిగి దానినే నా నుండి కోరుతున్నావు. నీకు ఏం కావాలో ఇప్పుడు నిర్ణయించుకో" అని అన్నారు.

ఒకసారి ఒక అభ్యాసీ "నా గురువు మద్రాస్‌లో ఉన్నాడు. నేను అక్కడకి వెళ్ళతాను. నా భగవంతుడూ మద్రాస్‌లోనే ఉన్నాడు. అక్కడికే నేను వెళ్ళతాను" అని ఒక ఉపన్యాసంలో అన్నాడు. తర్వాత అతనితో "భాయీ! మీ గురువు మద్రాస్‌లో ఉన్నాడు అని నీవు అంటున్నావు. వారిని నీవు కలుసుకోవడం చాలా సులభం, రైలు టికెట్ కొనుక్కుంటే చాలు. నీవు అక్కడికి వెళ్ళి కలుసుకోగలవు. కాని మా గురువును

కలుసుకోవడం చాలా కష్టం. ఎందుకంటే, 'నేను' అనేది కోల్పోయేవరకు మా గురువును కలుసుకోలేరు" అని అన్నాను.

ఒకసారి ఒక ప్రిసెప్టర్ డబ్బు కొరతవలన అత్యవసరంగా తన స్వంత పనికి మిషన్ ధనం ఉపయోగించుకొన్నాడు. అప్పుడు మిషన్ కార్యదర్శి ఆ ప్రిసెప్టర్‌లోని శక్తిని తీసివేయమని బాబూజీకి సూచించారు. బాబూజీ, "భాయీ! నేను ఇవ్వడానికే వచ్చాను. కాని వెనుకకు తిరిగి తీసుకోవడానికి కాదు. నేను ఏదైనా ఇచ్చి, మరల వెనుకకు తీసుకుంటానని కనీసం ఊహించను కూడా ఊహించవద్దు. నిజంగా ఎవరైనా ప్రిసెప్టర్ ఏదైనా పొరపాటు చేస్తే, ఆ పవర్ (శక్తి) ఫెయిల్ అవుతుంది. ఆ శక్తి పని చేయదు" అన్నారు బాబూజీ. బాబూజీ మహరాజ్ శక్తికి మాస్టర్. 'వారు' మహారాజు. ఒకసారి ప్రసాదించిన తర్వాత మరల వెనుకకు తీసుకోరు. మీరు తప్పు పని చేస్తే ఆ శక్తి పనిచేయదు.

అభ్యాసీని సరియైన మార్గంలోకి తీసుకొని రావడానికి మూడు జన్మల వరకు కూడా నా ప్రాణాహుతి శక్తి అభ్యాసీలో పనిచేస్తూనే ఉంటుంది, అని బాబూజీ అనేవారు.

ఒకసారి సోదరుడు చారీజీ నా వద్దకు వచ్చి, "అందరూ బాబూజీ సమాధి చూడటానికి షాజహాన్‌పూర్‌కు వచ్చారు. మీరు ఒక్కరే ఇంతవరకు షాజహాన్‌పూర్ రాలేదు" అని నాతో అనగానే "ఎవరి తండ్రి అయితే మరణించారో, వారి కుమారులు వారి సమాధి వద్దకు వెళ్ళతారు. ఎవరి గురువు అయితే మరణించారో, వారి శిష్యులు, వారి సమాధి వద్దకు వెళ్ళతారు. నా మాస్టర్, నా ఎదుటనే కూర్చొని ఉన్నారు. కాబట్టి నేను షాజహాన్‌పూర్‌కు వెళ్ళవలసిన అవసరం నాకు లేదు. నా గురువు జీవించియే ఉన్నారు" అని నేను అన్నాను.

**అభ్యాసీ: విరాట్ దర్శనం అంటే ఏమిటి?**

**జవాబు:** మనం హృదయంలో ధ్యానం చేస్తాం. కొంత పురోగతి చెందిన తర్వాత మన ధ్యానం (దృష్టి) అనేది మన హృదయంలో కాకుండా 'వారి' విరాట్ హృదయంలో వ్యాపిస్తున్నట్లుగా అనిపిస్తుంది. మన ధ్యానం అప్పుడు బంధనాలను త్రెంచుకొని, వారితోపాటుగా 'వారి' విరాట్ హృదయంలో అపరిమితంగా వ్యాపిస్తుంది. అనగా అప్పుడు ఎటువైపు చూసినా మనకు ధ్యాన స్థితియే కనపడుతుంది. **అభ్యాసీ: (కాన్‌స్టంట్ రిమెంబ్రన్స్) నిరంతర స్మరణను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి?**

**జవాబు:** నిరంతర స్మరణ అనే దానిలోనే స్వయంగా దాని అర్థం ఉంది. నిరంతర స్మరణలో నిరంతరం (కాన్‌స్టంట్) అనేది తెగిపోకుండా చూడాలి. ధ్యానం నుండి లేవగానే, ధ్యానం అయిపోయింది అని అనుకోవద్దని బాబూజీ అనేవారు. మనం బాబూజీని పొందటం కోసం ధ్యానాన్ని ప్రారంభించాము. కాని 'వారు' మనకు లభించలేదు. సమయం అయిపోయింది. ఇంటి పని, ఆఫీస్ పని చేసుకోవాలి కాబట్టి మనం ధ్యానంలో నుండి లేచాము. కాని ధ్యానం అయిపోయింది అని అనుకోకుండా, ఆ ధ్యానం యొక్క మూడ్‌లోనే, ధ్యానం యొక్క స్థితిలోనే, ఆ ధ్యానం యొక్క ధ్యాసలోనే ఉండి అన్ని పనులు చేసుకోవాలి. ఉదాహరణకు 2,3 గంటల వరకు మీ మనస్సు ఏదైనా పనిలో లీనమైపోయి ఉండటం వలన 'వారి' స్మరణను మరచిపోయినా, అయ్యో! బాబూజీని ఇప్పటివరకు మరచిపోయామే అనే ఆలోచన రానివ్వకూడదు. ఒకవేళ మరచిపోయాము అనే ఆలోచన వచ్చిందంటే, మీకు మీరే నిరంతర స్మరణ అనే గొలుసును త్రెంచివేసినట్లు అవుతుంది. మీరు 2,3 గంటలు మరచిపోయినా సరే, మరల జ్ఞాపకం రాగానే, "బాబూజీ! ఇప్పటివరకు నా హృదయం

మీ స్మరణలోనే మునిగిపోయి ఉన్నది. ఇప్పటివరకు నేను మీతోనే ఉన్నాను" అని భావించాలి. మీరు అలసిపోవటం వలన శరీరం నిద్రపోవాలని అనుకంటుంది. నేను బాగా అలసిపోయాను, నిద్రపోవాలి అని అనుకుంటే అది మీ కోసం మీరే నిద్రపోతున్నట్లుగా అవుతుంది. కాని వారికి శరణాగతియై, 'వారి' పాదాలవద్ద ఉన్నట్లుగా భావించితే, మనం నిద్రపోతాము కాని అది మన కోసం కాదు. ఈ విధంగా చేయటంవలన నిరంతర స్మరణలోని నిరంతరం అనేది తెగిపోదు. శరీరం తన ధర్మాన్ని నిర్వర్తిస్తుంది. మనస్సులో స్మరణ అనేది నిరంతరం కొనసాగుతుంది.

24 గంటలూ మీరు ధ్యానం చేయలేరు. మనస్సు అలసిపోతుంది. కాని బాబూజీ మహరాజ్ చెప్పినట్లు మీరు 24 గంటలూ ధ్యానం యొక్క ధ్యాసలో ఉండవచ్చు. ఒక రోజున మీ మనస్సు వారితో ఎంతగా కనెక్ట్ అవుతుందంటే, మీరు ఏదైనా పనిలో పూర్తిగా లీనమై ఉండగా, అకస్మాత్తుగా బాబూజీ మహరాజ్ యొక్క స్మరణ జ్ఞాపకం రాగానే, మీ హృదయం ధ్యానస్థితిలోనే ఉన్నట్లుగా మీకు అనిపిస్తుంది. ఒకసారి నేను, "బాబూజీ! ధ్యానం చేయాలి అని కండ్లు మూసుకోగానే, ఎవరో ఇదివరకే హృదయంలో ధ్యానావస్థలో ఉన్నట్లుగా అనిపిస్తోంది" అని వ్రాశాను. అప్పుడు మనం ఆ హృదయంలోని ఆ ధ్యాన స్థితిని చూస్తూ దానిలోనే మునిగిపోవడానికి ప్రయత్నించాలి. మనం కండ్లు మూసుకోగానే, బాబూజీ మనలోపలే ఉన్నట్లుగా అనిపించి, ధ్యానానికి కూర్చోగానే, ఇదివరకే మన హృదయం ధ్యానావస్థలో ఉన్నదని అనిపిస్తే, అప్పుడు అభ్యాసీ మీరు కాదు –మీ హృదయమే అభ్యాసీ అవుతుంది. బాబూజీ, "బిటియా! ఇప్పుడు నీకు అర్థం అయ్యింది అనుకుంటాను. మనస్సు మాత్రమే 'యోగి' అవుతుంది. శరీరం కాదు. యోగం (కనెక్షన్) అనేది మనస్సువలన ఏర్పడుతుంది. శరీరంతో కాదు" అని నాకు వ్రాశారు.

ధ్యానంలో మనస్సు లగ్నం కావడం లేదు. మనస్సు స్థిరంగా ఉండడం లేదు అని ప్రజలు మనస్సును నిందిస్తారు. కాని మనస్సు దోషి కాదు. అసలు దోషి నీలో వచ్చే ఆలోచనలు మాత్రమే. ఎందుకంటే, ఆలోచనల వెంబడి పరుగెత్తే అలవాటును నీవు పెంపొందించుకొన్నావు అని బాబూజీ అనేవారు. ధ్యానంలో ఆలోచనలు వస్తే, బాబూజీ మహరాజ్ నా హృదయంలోనే ఉన్నారు, అని భావించాలి. ఈ విధంగా చేయటం వలన నెమ్మది నెమ్మదిగా ఆలోచనలు రావడం తగ్గిపోతుంది. మనం మనస్సును దోషి అని నిందిస్తాం. కాని నిజానికి మనస్సు అనేది 'వారి' స్మరణలో పరుగెత్తుతుంది. ఒకసారి కనెక్షన్ ఏర్పడితే, మనస్సు ఎప్పుడూ 'వారి'ని మరచిపోదు. 'వారి'ని మరచిపోవడానికి ఇష్టపడదు కూడా.

**అభ్యాసీ: ధ్యానంలో నాకు తెలియకుండానే 'వారి'కి సాష్టాంగ నమస్కారం చేసినట్లుగా అనిపించింది.**

**బెహెన్‌జీ:** మీలో ఆత్మ నివేదన (సబ్‌మిషన్) అనేది ప్రారంభమైంది అని ఇది తెలుపుతోంది. ఆత్మ నివేదన (సబ్‌మిషన్) అంటే "బాబూజీ! నేను ఎలా ఉన్నాకాని, నేను మీ వాడినే" అని అర్థం. 'ఎలా ఉన్నా' అని అంటే మనలోని అహం కొద్దిగా తొలగిపోయిందని అర్థం.

**అభ్యాసీ: మీరందరు బాబూజీని చూసారు. నేను చూడలేదు అని ఒక అభ్యాసీ కొడుకు పదకొండు సం॥ల బాలుడు ఎప్పుడూ అనేవాడు. ఒక రోజున ఆ బాలుడు గదిలో చదువుకొంటున్నప్పుడు అతనికి బాబూజీ కనపడ్డారు.**

**బెహెన్‌జీ:** బాబూజీ అంతటా వ్యాపించి ఉన్నారు అనే దానికి ఈ సంఘటన ఒక ఋజువు. అంతఃకరణలో క్రేవింగ్ (తపన) అనేది ఏర్పడినప్పుడు, 'వారి'ని యదార్థంగా తెలుసుకోవడానికి ఒక కిటుకు లభిస్తుంది. అప్పుడు ఆ జిజ్ఞాస సమస్తం వ్యాపించి ఉన్న 'వారి'ని స్పర్శించటం వలన ఈ విధంగా జరుగుతుంది.

బాబూజీ లేరు అని కొందరు అంటారు. మనం ఇంటిలో కూర్చొని ధ్యానం చేస్తున్నప్పుడు మనకు ప్రాణాహుతి లభిస్తుంది. మనం ఎప్పుడు కూర్చున్నా, ఎక్కడ కూర్చొని 'వారి'ని స్మరించినా వెంటనే ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) ప్రవాహం మొదలవుతుంది. మరి ఆ ప్రాణాహుతి శక్తిని ఎవరు ఇస్తున్నారు? ఎక్కడ నుంచి వస్తుంది? అది (ప్రాణాహుతి శక్తి) 'శ్రీ బాబూజీ' నుండే వస్తుంది కాని వేరెవరు నుంచి కాదు.

**అభ్యాసీ: "బాబూజీ! ఈశ్వరుడు సర్వవ్యాపి అని అంటారు. కాని మేము ఈశ్వరుని (గాడ్‌ను) స్మరించినప్పుడు ఆ ఈశ్వరుని యొక్క స్పర్శను (స్పందన) పొందటం లేదు. ఈశ్వరుని ప్రజెన్స్ యొక్క ఫీలింగ్ (అనుభూతి) కలగటం లేదు. కాని మిమ్మల్ని తలచుకోగానే వెంటనే మీ ప్రజెన్స్ యొక్క ఫీలింగ్ (అనుభూతి) కలుగుతుంది. మరి ఇదేమిటి?**

**బాబూజీ:** "ఈశ్వరుడు సర్వవ్యాపి. ఈశ్వరీయ శక్తి అందరిలోను ఉంది. కాని ఈశ్వరుడు తనంతట తానుగా పరుగెత్తి మిమ్మల్ని పట్టుకోడు. కాని డివైన్ పర్సనాలిటీ (దివ్య మూర్తిమత్వం) దైవీయ కార్యం కొరకు ఈ భూమి మీద అవతరించినప్పుడు 'వారు' మిమ్మల్ని పట్టుకుంటారు. అందువలన నీవు 'వారి' ప్రజెన్స్‌ను అనుభూతి చెందుతావు. నీవు కూడా సర్వవ్యాపి స్థితిని పొందినపుడు నీవూ ఈశ్వరుని యొక్క స్పర్శను పొందగలవు. కాని ఎప్పుడైతే డివైన్ పర్సనాలిటీ ఈ ధరణి మీద అవతరించారో, అప్పుడు వెంటనే మానవుల యొక్క హృదయాలను తమ దివ్యశక్తితో పట్టుకొని, తన దైవీయ కార్యాన్ని ప్రారంభిస్తారు. అందువల్లనే నీవు 'వారి'ని అనుభూతి పొందుతావు.

**అభ్యాసీ: బెహెన్‌జీ! 'తురియా' స్థితి అంటే ఏమిటి?**

**బెహెన్‌జీ:** ఈశ్వరప్రాప్తి తర్వాత బాబూజీ అభ్యాసీని సత్యపద్‌వద్దకు తీసుకొని వెళ్ళతారు. ఈ సత్యపద్ వద్దగల స్థితియే 'తురీయా స్థితి'. అభ్యాసీ సత్యపద్ వద్దకు చేరుకోగానే, అప్పటివరకు మనతోనే ఉన్నటువంటి బాబూజీ మహరాజ్ ఒక్కసారిగా (అకస్మాత్తుగా) అదృశ్యమైపోతారు. ఇంకా ముందుకు వెళ్ళాలని మనకు తెలుసు. కాని అది సెంట్రల్ రీజియన్ అని మనకు తెలియదు. మనం ముందుకు వెళ్ళాలి. కాని బాబూజీ మహరాజ్ మనకు కనిపించడం లేదు. బాబూజీ మహరాజ్ ఎక్కడికి వెళ్ళారు? ఎప్పుడు వస్తారు? అని 'వారి' రాకకొరకు తపనతో ప్రతిక్షణం ఎదురుచూస్తూ 'వారి' నిరీక్షణలోనే సంపూర్ణంగా విలీనమై ఉంటాము. 'తురియా స్థితి' అంటే ఇదే. ఈ స్థితిని పొందిన తర్వాతనే, "ఇప్పుడు నీవు అహం యొక్క 16 వలయాలను దాటావు" అని బాబూజీ నాకు లేఖలో వ్రాశారు. తురియా స్థితిని చేరుకోవడానికి ముందుగానే మనస్సు అనేది పూర్తిగా వారిలో లయమైపోతుంది. 'నేను' అనేది సమాప్తమైపోతుంది. సత్యపద్‌వద్దగల ఈ తురియా అవస్థలో ఈ ప్రపంచం అంతా కూడా ఒక స్వప్నంలాగా కనిపిస్తుంది. మనం ఒక స్వప్నాన్ని చూస్తున్నట్లుగా ఉంటుంది. మనలను ఇంకా ముందుకు తీసుకొని వెళ్ళడానికి ఎవరికోసమో ఎదురుచూస్తూ ఉంటాము. అప్పుడు మరల ఒక్కసారిగా 'వారి' చిరునవ్వు యొక్క దర్శనం పొంది, ముందుకు సాగిపోతాము. సంస్కృతంలో 'పార్షద్' అంటే తురియాస్థితి, 'మహాపార్షద్' అంటే 'తురీయాతీత స్థితి' అని బాబూజీ

చెప్పారు. సత్యపథ్ అనేది సెంట్రల్ రీజియన్ యొక్క ప్రవేశ ద్వారం. ఇది తురియా స్థితి. దీనినే పార్షద్ అని అంటారు. మహాపార్షద్ అంటే సెవెన్ రింగ్స్ (భూమా యొక్క సప్త వలయాల) యొక్క ప్రవేశ ద్వారం ఇది, తురియాతీత స్థితి.

ఒకసారి ఒక సంఘ సేవకుడు బాబూజీవద్దకు వచ్చి, "మీరు ధ్యానం అని ఊరకనే కండ్లు మూసుకొని కూర్చొంటారు. మీరు సమాజానికి ఎటువంటి సేవ కూడా చేయటం లేదు. నేను చాలా సంఘసేవ చేస్తున్నాను" అని తనను గురించి గొప్పగా చెప్పుకున్నాడు. అప్పుడు బాబూజీ అతనితో, "భాయీ! నీవు చేసేది ఉత్తుత్తి మామూలు సేవ మాత్రమే. కాని నేను చేసేది నిజమైన సంఘసేవ. ఎందుకంటే, ప్రతి మానవుడు ఒక నిజమైన మానవునిలాగా, సత్యయుగంలో ఉండే దివ్య మానవునిలాగా మార్పు చెందటానికి నేను కృషి చేస్తున్నాను" అని అన్నారు.

ఒకసారి బాబూజీ "బిటియా! ఇది ఎటువంటి ప్రపంచం, అన్ని వస్తువుల ధరలు పెరిగాయి. అందరి జీతాలు పెరిగాయి. అన్నీ పెరిగిపోయాయి, కాని నా జీతం పెంచాలని మాత్రం ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. నా జీతం ఏమిటో తెలుసా? మీరందరు నిరంతర స్మరణలో ఉండి అతితక్కువ సమయంలో లక్ష్యాన్ని చేరుకోవాలి. ఆ సహకారమే నా జీతం" అని నాకు వ్రాశారు.

**అభ్యాసీ: భూమా అధిపతి అయిన శ్రీ బాబూజీ మహరాజ్ మీ ద్వారా పనిచేస్తున్నారు కదా!**

**బెహెన్‌జీ:** భూమా అధిపతి అయిన శ్రీ బాబూజీ మహరాజ్ నా ద్వారా పనిచేయడం లేదు. పనిని ఏ విధంగా చేయాలని నాకు భూమా అధిపతి నేర్పిస్తున్నారు. నేను స్టూడెంట్‌ను. ఇప్పటికి కూడా నేను విద్యార్థినే.

ప్రకృతి దివ్య శిశువును లాలాజీ సాహెబ్ ఒడిలో ఉంచింది. తన శక్తి రూపంలో అవతరించిన ఆ దివ్య శిశువు ఎవరో, అతనిని దర్శించాలని ఆ అల్టిమేట్ (అంతిమసత్యం) కూడా అనుకొన్నది. కాని ఆ దివ్య శిశువు యొక్క ముఖారవిందాన్ని దర్శించడానికి ఎవరికీ కూడా ధైర్యం చాలడం లేదు. అప్పుడు స్వయంగా ఆది-ఛవి అనగా ఆది-సౌందర్యమే ఆ పరదాను తొలగించి ఇతడే ఆ దివ్య శిశువు (బాబూజీ) అని లోకానికి తెలియజేసింది.

"బాబూజీ! మీరు మీ అవతరణ యొక్క దివ్య దర్శనాన్ని నాకు చూపించారు. నా ప్రార్థన ఏమిటంటే, ఎక్కడ మీ జన్మదినోత్సవం జరిగినా కూడా, మీ చిరునవ్వుల దివ్య సుగంధం అక్కడి వాతావరణం అంతటా నిండిపోయి, అందరూ మీ దివ్యమైన చిరునవ్వు దర్శనాన్ని పొందాలి!" ఇదే నా ప్రార్థన.

శ్రీ బాబూజీగారు మాస్టర్ కనుక, 'వారి' రచనలు చాలా ఉన్నతమైన స్థాయిలో ఉంటాయి. 'వారు' ఆ అల్టిమేట్ (అంతిమం) స్థాయిలో ఉండి పుస్తకాలను వ్రాశారు. వాటిని అర్థం చేసుకోవడం చాలా కష్టం. కాని ఒక అభ్యాసీ తన అనుభవరూపంలో బాబూజీ చెప్పిన స్థితులను గురించి వ్రాసినపుడు, వాటిని అభ్యాసులందరు కూడా సులభంగా అర్థం చేసుకొని, వాటి ఆనందాన్ని పొందగలరు. బాబూజీ నుండి నాకు ఉత్తరం వచ్చినప్పుడు, దాన్ని మరల మరల చదువుకొనేదాన్ని, ఇది నా బాబూజీ వ్రాసిన లేఖ అని. దానిని నా గుండెలకు హత్తుకొని ఆనందపడేదాన్ని. పగలు, రాత్రి ఆ ఉత్తరాన్ని ఎన్నోసార్లు చదివి సంతృప్తి పడేదాన్ని.

50,55 సం॥ల తర్వాత బాబూజీ వ్రాసిన లేఖలలోని విషయాలు ఇప్పుడు నాకు 'నిజం'గా అర్థమవుతున్నాయి. "నేను ఏ పరిశోధన అయితే నీ మీద చేశానో దానిని గురించి, ప్రతిస్థితిని గురించి అనుభవపూర్వకంగా అందరికి నీవు తెలపాలి" అని బాబూజీ నాతో అన్నారు.

శ్రీరామచంద్ర మిషన్ అనేది ఒక సంస్థ. బాబూజీ, లాలాజీ సాహెబ్ పేరు మీద ఈ సంస్థను స్థాపించారు. ఈ సంస్థలో ధ్యానం, క్లీనింగ్, రాత్రి –ప్రార్థన, దశ నియమాలు మొదలైనవి ఉన్నాయి. మూడు పరిచయ సిట్టింగ్‌లు తీసుకోగానే ఈ సంస్థలో చేరడానికి అనుమతి లభిస్తుంది. కాని శ్రీరామచంద్ర మిషన్ అంటే నిజమైన అర్థం ఏమిటి? వాస్తవానికి శ్రీరామచంద్ర మిషన్ యొక్క అర్థం చాలా లోతైనది. "సమస్త మానవాళిలో ఈశ్వరప్రాప్తి అనే తపనను మేల్కొలపాలి అనేది బాబూజీ యొక్క మిషన్ (సంకల్పం). ఇదే శ్రీరామచంద్ర మిషన్. ఎప్పుడైతే మనం ప్రోగ్రెస్ (పురోగతి) అవుతూ, మనకు లభించిన ఈ ఆనందం, అనుభవం అందరికీ లభించాలని మనలో ఆ ఫీలింగ్ కలుగుతుందో, అప్పుడే మనం శ్రీరామచంద్ర మిషన్‌లో చేరినట్లు గుర్తు. ఎందుకంటే, ఇప్పుడు 'వారి' మిషన్ (సంకల్పం) మన సంకల్పంగా మారింది కాబట్టి. 'వారి' మిషన్ (సంకల్పం) సమస్త మానవాళి కొరకు.

'అభ్యాసీ' అనే పదం యొక్క అర్థం 50 ఏళ్ళ తర్వాత ఇప్పుడు అర్థమయింది. బాబూజీ నా హృదయంలో ఉన్నారు అని మనం ధ్యానం చేస్తాం. ఆలోచనల వలన ఇబ్బంది కలిగినపుడు, "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు, 'వారు' నాకు చాలా ఇష్టమైనవారు, నన్ను చాలా బాగా ప్రేమిస్తారు"– అని అనుకోవడం వలన 'వారి'తో ఒక కనెక్షన్‌ను ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తాం. ఇప్పటివరకు అభ్యాసీగా మారడం కొరకే మనం అభ్యాసం చేస్తున్నాం. అభ్యాస్ అనగా అబ్ + భ్యాస్; అనగా ఈశ్వరుడు నీ హృదయంలోనే ఉన్నాడు అని ఏ సంకల్పం అయితే ఇవ్వబడిందో, అది ఇప్పుడు నీలో ప్రకాశిస్తోంది. అనగా ఇప్పుడు ఈశ్వరుడు నీలో ప్రకాశిస్తున్నాడు, అని అర్థం. అందువలన ఇప్పుడు నీవు ధ్యానంలో ఆలోచనలతో పెనుగులాడవలసిన అవసరం లేదు. కండ్లు మూసుకోగానే 'వారు' మన హృదయంలో ఉన్నట్లుగా ఫీలింగ్ (అనుభూతి) పొందుతాం. ఇప్పుడు నీవు అభ్యాసీగా మారినట్లు గుర్తు.

ఒకసారి 'వారి'ని ఇలా అడిగాను: "బాబూజీ! వీళ్ళు అందరు అభ్యాసులే. మీరు అందరిని ప్రేమిస్తారు. కొంతమంది అభ్యాసులతో మీరు చాలా ప్రేమతో మాట్లాడుతారు. కొంతమంది అభ్యాసులతో మీరు మాట్లాడినప్పుడు, ఆ ప్రేమ, ఆ మాధుర్యం మీ స్వరంలో నాకు కనపడదు. ఎందుకని?"

బాబూజీ అన్నారు, "నీవు నిజం తెలుసుకోవాలని అనుకుంటున్నావు కదా! ఇదిగో వీరు 'అభ్యాసీ'లుగా మారారు. ఇంక వాళ్ళూ సాధన చేస్తున్నారు. కాని వారు ఇంకా అభ్యాసీలుగా తయారవ్వలేదు. ఒక ఉదాహరణ చెబుతాను. పరుగు పందెంలో ఒక గీతను గీశాం. పిల్లలందరూ ఆ గీతవద్ద నిలబడి, పరుగెత్తడానికి సిద్ధంగా ఉన్నారు. 1,2,3 స్టార్ట్ అనగానే పిల్లలందరూ పరుగెత్తడం ప్రారంభించారు. అదే విధంగా మొదటి సిట్టింగ్, రెండవ సిట్టింగ్, మూడవ సిట్టింగ్..... ఎప్పుడైతే 3 సిట్టింగ్‌లు పూర్తి కాగానే, ఎవరైతే పరుగెత్తుతారో (అనగా ప్రోగ్రెస్ అవుతారో) అతడే అభ్యాసీ. కాని ఎవరైతే ఏదో ఆలోచనలో పడిపోయి అటు ఇటు దిక్కులు చూస్తూ పరుగెత్తడం మరచిపోయి, ఆ గీత దగ్గరే ఆగిపోయి ఉంటాడో అతడు అభ్యాసీ ఎలా అవుతాడు?"

చిన్నపిల్లలు జిలేబీ–పరుగు–పందెంలో జిలేబీని తింటూ ముందుకు పరుగెత్తి గెలుస్తారు. అదే విధంగా అభ్యాసులు కూడా జిలేబిని తింటూ అంటే బాబూజీ ప్రసాదించిన స్థితులను స్వీకరిస్తూ లక్ష్యంవైపు పురోగమించాలి.

ఒకసారి డా॥ కె.సి. వరదాచారిగారు బాబూజీతో ఇలా అన్నారు:

**వరదాచారిగారు:** బాబూజీ! మీరు కూడా మంచి పండితులు అయి ఉంటే మన మిషన్ కూడా, అరవిందాశ్రమం, రమణ మహర్షి ఆశ్రమంలాగా చాలా బాగా త్వరగా వ్యాప్తి చెందేది.

**బాబూజీ:** నీవు చెప్పేది కరక్టే. పండితుడు అని నీవు ఎవరిని అంటావు.

**వరదాచారిగారు:** నాలాగా వేదాలు అధ్యాయనం చేసినవారిని.

**బాబూజీ:** అయితే ఇప్పుడు నీవు పండితుల శ్రేణిలో ఉన్నావు కదా! ఒక ప్రశ్నకు జవాబు చెప్పు. శాంతి ఎప్పుడు లభిస్తుంది?

**వరదాచారిగారు:** కావలసిన అవసరాలు అన్నీ సమకూరిన తర్వాత శాంతి లభిస్తుంది.

**బాబూజీ:** నీవు పాండిత్యంతో జవాబు చెప్పలేదు. అవసరాలు అన్నీ పూర్తి అయినపుడు కలిగేది సంతృప్తి. అంతేకాని శాంతి కాదు. శాంతి ఎప్పుడు లభిస్తుంది అని నేను అడుగుతున్నాను.

**వరదాచారిగారు:** అన్ని కోరికలు పూర్తి అయిన తర్వాత.

**బాబూజీ:** నీ కోరికలు అన్నీ పూర్తి అయినవా?

**వరదాచారిగారు:** నిశ్శబ్దం.

**బాబూజీ:** నీవు విద్వాన్‌వి, పండితుడివే. కాని పాండిత్యంలో నేను నీ తాతను! శాంతి ఎప్పుడు లభిస్తుందో నేను చెప్తాను. ఎప్పుడైతే మన ప్రియతముడు (ఈశ్వరుడు) మన ఎదుటనే ఉంటాడో, అ సమయంలో అపారమైన శాంతి లభిస్తుంది. ఈశ్వరుడు మన ఎదుటనే ఉన్నాడు. కాని ఇంకా ఈశ్వరుడు మనకు లభించలేదు. ఆయన దర్శనం మాత్రం అయింది. ఈశ్వరుడు శాంతి స్వరూపుడు, కనుక సాక్షాత్కార సమయంలో ఈశ్వరుని ప్రతిబింబం మనలో ప్రవేశించటం వలన మనం కూడా శాంతి స్వరూపంగా మారిపోతాం.

**వరదాచారిగారు:** భక్తునికి శాంతి ఎప్పుడు లభిస్తుంది.

**బాబూజీ:** భగవంతునిలో ఐక్యం కావాలనే క్రేవింగ్ (తీవ్రమైన తపన) చాలా ఎక్కువగా ఎప్పుడు ఉంటుందో, అప్పుడే భక్తునికి శాంతి లభిస్తుంది. కాని పాపం! భక్తుడు తనకు శాంతి లభించిందని ఏ విధంగా గుర్తుపట్టగలడు? ఎందుకంటే, అతడు పూర్తిగా తనను తాను మరచిపోయిన స్థితిలో ఉన్నాడు కదా! అతనికి తన్ను గురించిన ఎరుకనే లేదు కదా!

అలా బాబూజీ వరదాచారిగారితో అన్నారు.

**అభ్యాసీ: నేను ఏదైనా పని చేస్తున్నప్పుడు యాంత్రికంగా చేస్తున్నట్లుగా అనిపిస్తుంది. చాలాసార్లు ధ్యానం కూడా మెకానికల్ (యాంత్రికం)గా చేస్తున్నట్లుగా అనిపిస్తుంది. కాని ఎప్పుడైనా ఖాళీగా కూర్చొని ఉన్నప్పుడు బాబూజీ యొక్క ప్రజెన్స్‌ను, సామీపత్యను అనుభూతి చెందుతున్నాను.**

**బెహెన్‌జీ:** యాంత్రికం (మెకానికల్) అనే పదం నీ మనస్సులో నాటుకొని పోయింది. నీవు ధ్యానం చేయనప్పుడు బాబూజీ సామీప్యతను అనగా రియాలిటీని అర్థం చేసుకుంటున్నావు. అది యాంత్రికం ఎలా అవుతుంది? కాబట్టి నీవు మెకానికల్ (యాంత్రికం) అనే మాటను మరచిపో! నీవు ఈ విధంగా ధ్యానం చేయి: కండ్లు మూసుకొని– "బాబూజీ మహరాజ్ నాకు ఎంతో దగ్గరగా ఉన్నారు. 'వారు' నా ఎదుటనే కూర్చొని ఉన్నారు. 'వారి'ని త్వరగా కలుసుకోవాలి. 'వారు' నా హృదయంలోనే ఉన్నారు. 'వారి' దర్శనం ఎప్పుడు లభిస్తుంది?" ఈ విధంగా 'వారి' మీద దృష్టిపెట్టి 'వారి'నే చూస్తూ ఉండు. అప్పుడు మెకానికల్‌గా (యాంత్రికంగా) అనే పదం అదృశ్యమైపోయి నీకు ధ్యానంలో నిజమైన ఆనందం లభిస్తుంది. కాని నా పరిస్థితి దీనికి పూర్తిగా వ్యతిరేకం. నాకు ఎప్పుడు కూడా మెకానికల్ (యాంత్రికం) అని అనిపించదు. ఫంక్షన్‌లలో, పెండ్లిలో నేను చాలా ఉత్సాహంగా పాటలు పాడతాను. ఎప్పుడూ మెకానికల్ (యాంత్రికం)గా నాకు అనిపించలేదు. నేను పాట పాడుతున్నప్పుడు నా బాబూజీ మహరాజ్ ఆ పాటను విని సంతోషిస్తున్నట్లుగా అనిపించేది. అంతేకాని అక్కడ ప్రజలు, అభ్యాసులు నా పాటను విని సంతోషిస్తున్నట్లుగా నాకు ఎప్పుడూ అనిపించలేదు. బాబూజీయే నా పాట విని ఆనందిస్తున్నట్లుగా అనిపించేది. నన్ను తయారుచేసింది బాబూజీయే కనుక, నాకు అంతా సహజంగానే రియాలిటీ (వాస్తవికత)గానే కనిపిస్తుంది. అందరు అందులో భాగమే కదా!

బాబూజీ మనలను ధ్యానం చేయమని చెప్పలేదు. "ఈశ్వరుడు నీ హృదయంలోనే ఉన్నాడు" అనే దానిని నిరంతరం గుర్తు పెట్టుకోమన్నారు. మీరు ఏదైనా పనిని చేస్తున్నప్పుడు "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అని మీరు భావించి మీ దృష్టిని దానిమీద నిలపాలి. ఎప్పుడైతే మీకు 'వారి' దర్శనం అవుతుందో, అప్పుడే మీరు 'వారి' మీద ధ్యానం చేయగలరు. అందువలన ఇప్పుడు –బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు –అనే దానిని గుర్తుపెట్టుకోవడం వలన కలిగిన ఫీలింగ్ (అనుభూతి)లోనే పూర్తిగా మునిగిపోవాలి.

ఒక సెంటర్‌లో, ఎ–పాయింట్, బి–పాయింట్ మీద ధ్యానం చేస్తున్నాం –అంటున్నారు. ఇది తప్పు. ఎ–పాయింట్, బి–పాయింట్‌ల మెడిటేషన్ అనేది బాబూజీ యొక్క రీసెర్చ్ (పరిశోధన) మాత్రమే. అంతేకాని అది మనకు లక్ష్యం కాదు. 'వారు' మనకు చెప్పింది ఒక్కటే –ఈశ్వరుడు మీ హృదయంలోనే ఉన్నాడు– మనం కేవలం దీనిని మాత్రమే గుర్తు పెట్టుకోవాలి. 'రాజయోగ ప్రభావం' పుస్తకంలో వ్రాసినటువంటి ఎ–పాయింట్, బి–పాయింట్‌ల ధ్యానం మనకు అవసరం లేదు.

"నాకు పుస్తకాలు చదివే అలవాటు పెద్దగా లేదు. **కేవలం ప్రేమ, భక్తిని పెంపొందించునటువంటి పుస్తకాలు మాత్రమే మనం చదవాలి. ఫిలాసఫీ ఎప్పుడూ కూడా చదవకూడదు"** అని బాబూజీ అనేవారు.

నేను 1949వ సం॥లో మిషన్‌లో చేరాను. ఆ రోజులలో సహజమార్గ్ గురించి చాలామందికి తెలియదు. ఆ రోజులలో బాబూజీ, "విశ్వంలోని మానవులందరిలో ఆధ్యాత్మికత యందు కోరిక కలుగుతూ ఉన్నది. మానవాళి అంతా శ్రీరామచంద్ర మిషన్ వైపుకు ఆకర్షింపబడుతున్నారు" అని ప్రార్థన చేయవలసిందిగా మాకు చెప్పారు. నిజానికి 'వారు' మాలో ఉత్సాహాన్ని కలిగించడానికి ఈ విధంగా చెప్పారు. పని అంతా కూడా వారే చేసేవారు. కాని మమ్మల్ని పొగిడేవారు. విశ్వంలోని మానవులందరు కూడా బాబూజీ మహరాజ్ చరణాల వద్దకు వస్తున్నారు, అని మేము ప్రార్థన చేసేవాళ్ళం. దాదాపు 6,7 నెలల తర్వాత ఇంక ఇప్పుడు ప్రార్థన చేయవలసిన అవసరం లేదని చెప్పారు. అందువలన రాత్రి 9 గంటల విశ్వప్రార్థన ఇప్పుడు

అవసరంలేదు. "నేను నా సహజమార్గ్ సిస్టంలో బ్రదర్‌హుడ్ (సోదరభావం) అనే ప్రాణాన్ని నింపాను" అని బాబూజీ అనేవారు. ఇప్పుడు మనం సహజమార్గ్ సాధనలో చేరామా, లేదా? అని ఈ విధంగా తెలుసుకోవచ్చు. మనలో సోదరభావం పెంపొందినట్లయితే మనం మిషన్‌లో చేరినట్లు గుర్తు. సహజమార్గ్ పద్ధతిని సరిగ్గా అనుసరిస్తున్నామని అర్థం. మనలో సోదరభావం అభివృద్ధి కాలేదంటే, మనం సహజమార్గ్‌ను సరిగ్గా అనుసరించటం లేదు అని తెలుస్తుంది.

బాబూజీ యొక్క భాషను అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. చాలా కష్టం. ఒకసారి బాబూజీ మద్రాస్‌లో చారీజీ ఇంటిలో ఉన్నారు. ఒకరోజు ఉదయాన్నే బాబూజీ చారీజీకి సిట్టింగ్ ఇచ్చారు. చారీజీ నా దగ్గరకు వచ్చి "బెహెన్‌జీ! ఈరోజు బాబూజీ నాకు పూజలో స్పెషల్ పవర్ (ప్రత్యేక శక్తి)ని ప్రసాదించారు" అని అన్నారు. చారీజీ ఆఫీస్‌కు వెళ్ళిపోయారు. తర్వాత నేను, "బాబూజీ! మీరు చదువుకున్న వాళ్ళను కూడా తెలివితక్కువ వారిగా చేయకండి. మీరు తనకు స్పెషల్ పవర్ ఇచ్చారని చారీజీ అంటున్నారు. శక్తి అంటే శక్తియే కదా! అందులో ఈ స్పెషల్ (ప్రత్యేకమైనది) అనే మాట ఎక్కడి నుండి వచ్చింది? డివైన్ పవర్ (దివ్యశక్తి) లోని ఒక్క బిందువు అయినా సరే అదే సముద్రంతో సమానం అని మీరే చెప్పారు కదా!" అని అనగానే, అయితే అతనికి "నేను ఏం ఇచ్చానో నీవే చెప్పు" అని బాబూజీ నన్ను అడిగారు. అప్పుడు నేను "బాబూజీ! మీరు అతనికి శక్తిని ప్రసాదించారు. దానితోపాటుగా బంధనాన్ని కూడా ఇచ్చారు. ఎప్పుడైతే చారీజీ స్పెషల్ వర్క్ చేస్తారో, అప్పుడే ఆ శక్తి పనిచేస్తుంది. వర్క్ (పని) అనేది స్పెషల్ (ప్రత్యేకమైనది) కాకపోతే, మీరు ప్రసాదించిన ఆ శక్తి పనిచేయదు. పని మాత్రమే ప్రత్యేకమైనది. కాని శక్తి మాత్రం ఎప్పుడూ కూడా ప్రత్యేకమైనది కాదు" అని అనగానే 'వారు' సంతోషించారు.

లఖింపూర్‌లో ఆ రోజుల్లో గుర్రపుబళ్ళు ఉండేవి కావు. బాబూజీ ఈశ్వర్ సహాయ్‌గారి ఇంటివద్ద నుండి 2 1/2 కి.మీ. నడిచి మా ఇంటికి వచ్చేవారు. బాబూజీ వచ్చారు అనే సంతోషంలో అన్నీ మరచిపోయి వారికి పండ్లు, పలహారం, కనీసం మంచినీళ్ళు కూడా ఇవ్వలేదు. త్వరత్వరగా తయారై వారితోపాటుగా ఈశ్వర్ సహాయ్‌గారి ఇంటికి వెళ్ళాలనే ఒకే ఒక ఆరాటం మాత్రమే ఉండేది. చిన్న పిల్లలందరూ భోజనం చేశాక మేమందరం కలసి బాబూజీ మహరాజ్‌తోపాటుగా నడిచేవాళ్ళం. 'వారు' మాకంటే వేగంగా నడుచుకుంటూ ముందు వెళ్తూ ఉండేవారు. మధ్య మధ్యలో 'వారు' ఆగి చేతికర్రను తన నడుముకు ఆసరాగా ఆనించుకొని మావైపు 2,3 నిమిషాలు చూసేవారు. ఆ విధంగా 'వారు' ఎన్నిసార్లు చూస్తే, అన్నిసార్లు మా అలసట మటుమాయం అయ్యేది. "బాబూజీ ఎందుకు మరల మరల ఆగి మావైపు అలా చూసి, మళ్ళీ వేగంగా నడుచుకుంటూ వెళ్ళిపోతున్నారు? 'వారు' మమ్మల్ని చూడగానే మా అలసట, నీరసం అదృశ్యమైపోతోంది, ఎందుకని?" అని ఒకసారి మేము ఈశ్వర్ సహాయ్‌గారిని అడిగాము. ఒకరోజు ఈశ్వర్ సహాయ్‌గారు, "హుజూర్! ఈ రోజున వీళ్ళు ఒక ప్రశ్న అడగాలని అనుకుంటున్నారు" అని అనగానే, ఆ ప్రశ్న అడుగకముందే, బాబూజీ నవ్వుతూ ఈ విధంగా అన్నారు: "భాయీ! 2 1/2 కి.మీ అంటే చాలా దూరం కదా! ఇందులో కొంతమంది అనారోగ్యంతో కూడా ఉన్నారు. మాతాజీ (కస్తూరీ బెహెన్‌గారి తల్లి) వృద్ధురాలు. అందువలన మీరు ఎంత దూరంలో ఉన్నారని తెలుసుకోవడానికి, నేను మధ్య మధ్యలో ఆగి మీవైపుకు చూడవలసి వస్తుంది. నేను ఈ విధంగా మిమ్మల్ని చూడటం వలన, లాలాజీ సాహెబ్ కృప కూడా

మీ మీద వర్షించి, మిమ్మల్ని త్వరత్వరగా లక్ష్యం వద్దకు లాక్కొని వెళ్ళుతుంది. మీరు వేగంగా నడవడానికి మీకు శక్తి కూడా లభిస్తుంది" అని అన్నారు.

**అభ్యాసీ: బాబూజీ! నేను ప్రోగ్రెస్ (పురోగతి) చెందటం లేదు. మీరు నన్ను లాక్కొని తీసుకొని వెళ్ళవచ్చు కదా!**

**బాబూజీ:** నీవు అడిగిన ప్రశ్న కరక్టే. నీవు కరెంట్ (ఎలక్ట్రిసిటి)కి దూరంగా ఉంటే అది నిన్ను లాక్కోలేదు. నీవు కరెంట్ దగ్గరికి వెళ్ళినప్పుడు మాత్రమే అది నిన్ను లాక్కొంటుంది. షాక్ కొట్టుతుంది. అందువలన నీవు భక్తితో కనీసం అంత దగ్గరికి, ఆ స్థాయి వరకు చేరుకుంటే, నేను నిన్ను లాక్కొని వెళ్ళతాను.

మీరు భక్తితో ఆ స్థాయి వరకు చేరుకోవడానికి చేసే ప్రయత్నమే ఈ సాధన. ఎప్పుడైతే భక్తితో ఆ స్థాయిని చేరుకొంటారో అప్పుడు 'వారి' దృష్టి నిరంతరం మీ మీదనే ఉంటుంది. అప్పుడు మీరు ఇంక చేయవలసింది ఏమీ ఉండదు.

**అభ్యాసీ: కొన్నిసార్లు మనస్సు నెగటివ్‌గా ఆలోచిస్తుంది. ఎందకని అంటారు.**

**బెహెన్‌జీ:** బాబూజీ మీద విశ్వాసం పూర్తిగా ఏర్పడకపోవడం వలన ఆ విధంగా జరుగుతుంది. 'వారు' సహజమార్గ్ డిక్షనరీలో నుండి అసంభవం, నెగటివ్ అనే శబ్దాలను తొలగించేశారు. 'వారు' తీసివేసిన వాటిని మీరు మరల ఎందుకు కలుపుతున్నారు. సహజమార్గ్ యొక్క ఆధారం పాజిటివ్. "ఈశ్వరుడు నీ హృదయంలో ఉన్నాడు" అని బాబూజీ అనేవారు. "అవును! ఈశ్వరుడు నా హృదయంలోనే ఉన్నాడు" –ఇది పాజిటివ్. నీవు నెగటివ్ అవుతావు. సర్వం వారే అవుతారు. సహజమార్గ్ సిస్టంలో అహం (ఇగో) అనేది నెగిటివ్ (మాయం) అవుతుంది. బాబూజీ స్టార్ట్ మెడిటేషన్ (ధ్యానం ప్రారంభించండి) అని అన్నారు. మరి ధ్యానం ఎప్పుడు సమాప్తం అవుతుంది. ఈశ్వరుడు నీలోనే ఉన్నాడు అని బాబూజీ అన్నారు కదా! ఎప్పుడైతే ఆ ఈశ్వరుని యొక్క సాక్షాత్కారం పొందుతామో అప్పుడే ధ్యానం పూర్తి అవుతుంది. ఈశ్వరుని పొందేవరకు హృదయంలో ధ్యానం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. దాని వలన క్రేవింగ్ (తపన) అనేది ఏర్పడుతుంది. నిజమైన అభ్యాసీకి నెగటివ్ అనే పదాన్ని కూడా ఆలోచించడానికి సమయం ఉండదు. ఎవరి ఎదుటనైతే ఎల్లవేళలా బాబూజీయే ఉంటారో, అతడే అభ్యాసీ. ఇంక నెగటివ్ థాట్స్ (వ్యతిరేకమైన –చెడు ఆలోచనల) గురించి ఆలోచించడానికి అతనికి సమయం ఎక్కడ ఉంది? ఎప్పుడైనా నెగటివ్ ఆలోచన వస్తే– "నేను లేను, 'మీరే' ఉన్నారు" అని అనుకోవాలి.

ఏ రోజునైతే దశ నియమాల యొక్క స్థితులు అన్నీ పూర్తిగా అభ్యాసీలో ఏర్పడతాయో అప్పుడే అతనికి ఈశ్వర సాక్షాత్కారం అయ్యే సమయం వచ్చిందని అర్థం.

మీరందరూ ప్రతిరోజూ ప్రోగ్రెస్ అయ్యే విధంగా కృషి చేయాలని కోరుకుంటున్నాను. అభ్యాసీ హృదయమే అభ్యాసీగా అయినట్లయితే, అనగా హృదయానికే నిరంతర స్మరణ అనే అలవాటు ఏర్పడితే, ఉదయం, రాత్రి –24 గంటలూ మీకు బాబూజీ మహరాజ్ యొక్క ట్రాన్స్‌మిషన్ లభిస్తుంది. 24 గంటలూ మీకు వారి శక్తి, వారి ప్రేమ లభించటం వలన అతితక్కువ సమయంలోనే మీరు నిజమైన అభ్యాసీగా మారుతారు. ఆ తర్వాత ఒక రోజున 'వారి' కృపవలన మీరు 'వారి' చరణాలవద్దనే శాశ్వతంగా ఉండిపోతారు.

తన ప్రోగ్రెస్ కొరకు ఎంతైతే సాధన చేశారో అదే విధంగా సోదరుడు డాక్టర్ పార్థసారధిగారు, మీ అందరి ప్రోగ్రెస్ కొరకు కూడా కృషి చేస్తున్నారు. వారు ఎల్లప్పుడు ఎంతో ఆరోగ్యంగా ఉండాలని బాబూజీ మహరాజ్‌ను ప్రార్థిస్తున్నాను. మీరందరు కూడా బాగా ప్రోగ్రెస్ కావాలి. అప్పుడే డాక్టర్ సాహెబ్ చేసిన కృషి ఫలిస్తుంది.

**అభ్యాసీ: బెహెన్‌జీ! విరాట్ అంటే ఏమిటి?**

**బెహెన్‌జీ:** "బాబూజీ నా హృదయంలోనే ఉన్నారు" అని మీరు ద్యానంలో గుర్తు పెట్టుకుంటారు. ఎప్పుడైతే మీరు ధ్యానంలోకి చాలా లోతుగా వెళ్ళతారో, అప్పుడు అక్కడ మీకు బాబూజీ యొక్క ప్రథమ దర్శనం లభిస్తుంది. బాబూజీ యొక్క ఈ దర్శనం ద్వారా, మీరు కూడా 'వారి'తోపాటుగా విరాట్‌లో వ్యాపించటం ప్రారంభం అవుతుంది. ఇక్కడివరకు వ్యాపించాను, ఆ తర్వాత ఇదిగో ఇంకా ఇక్కడివరకు వ్యాపించాను, అని మీకు అనిపిస్తుంది. ఇంక ఆపై మీ ఎక్స్‌పాన్షన్ (వ్యాపించటం) అనేది ఎక్కడివరకు వ్యాపిస్తుందంటే, అక్కడికి మీ ఆలోచన కాని, మీ దృష్టికాని చేరుకోలేవు. ఈశ్వరుడు సర్వవ్యాపి అని అంటారు కదా! అదే విధంగా మీరు కూడా బాబూజీతోపాటుగా అంతటా వ్యాపించినట్లుగా, అనంతంగా వ్యాపించినట్లుగా అనిపిస్తుంది. విరాట్ అంటే ఇదే! విరాట్ అనగా సమస్తం నందు వ్యాపించటం అని అర్థం!

డాక్టర్ కె.సి. వరదాచారిగారు బాబూజీ మహరాజ్‌ను ఇలా అడిగారు.

**వరదాచారిగారు:** "బాబూజీ! ఎంత తక్కువలో తక్కువ సమయంలో మీరు మాకు ఈశ్వర సాక్షాత్కారాన్ని ఇవ్వగలరు?" అని.

**బాబూజీ:** నిజంగా నీవు తెలుసుకోవాలని అనుకుంటున్నావా?

**వరదాచారిగారు:** అవును!

**బాబూజీ:** ఈ కరెంట్ సాకెట్ రంధ్రంలో వేలుపెట్టు. కరెంట్‌ను ముట్టుకుంటే చనిపోవడానికి ఎంత సమయం పడుతుందో అంతకంటే తక్కువ సమయంలోనే నేను నీకు రియలైజేషన్ (సాక్షత్కారం)ను ఇవ్వగలను.

ఈ డివైన్ కరంట్‌ను స్పర్శించి తట్టుకునే శక్తి మీకు లేదు. ఆ డివైన్ కరెంట్‌ను మీరు ఎప్పుడు ముట్టుకోగలరు అంటే, బాబూజీ చెప్పినట్లుగా– మీరు ఆ దివ్య సాగరంలో పూర్తిగా మునిగిపోయి, క్రమంగా వారి సామీప్యతను పొందుతూ ఉన్నకొద్దీ, దాని ప్రభావం వలన మీలోని అహం కరిగిపోతూ ఉంటుంది. అనగా మీరు ఆ డివైన్ కరెంట్ (దివ్యశక్తి)కి దగ్గరగా వెళ్ళినకొద్దీ, దాని వెచ్చదనం ఫోమెంటేషన్ వలన మీలోని అహం కరిగిపోతుంటుంది. ఆ డివైన్ కరెంట్ దగ్గరి దగ్గరికి చేరుకోగానే, దాని ఫోమెంటేషన్ (వెచ్చదనం) బలీయంగా ఉండటం వలన అహం అనేది పూర్తిగా కరిగిపోతుంది. అప్పుడు మీకు తక్షణం జీరో సమయంలోనే సాక్షాత్కారం కలుగుతుంది. ఈ విధంగా చెప్పడానికి సమయం పడుతుంది. కాని సాక్షాత్కారం కలగడానికి ఇంక ఏ మాత్రం సమయం పట్టదు.

ఈ విధంగా సాక్షాత్కారం గురించి మాటలు చెప్పటం వలన మీకు ఆనందం కలగదు. ఆ స్థితిలో మీ హృదయం ఎటువంటి పరమానందంలో మునిగిపోతుందంటే, సమయం ఎప్పుడు అయిపోయిందని చెప్పటానికి వీల్లేకుండా దానికి సమయం యొక్క ఎరుకనే ఉండదు. అందువల్లనే బాబూజీ, "నీవు ఆ దివ్య

సాగరంలోనే మునిగిపోవడానికి ప్రయత్నించు" అని అనేవారు. ఏ పనిని చేస్తున్నా కూడ మీ అంతర్ దృష్టి ఎల్లవేళలా 'వారి' మీదనే ఉండాలి. ఇందులో కష్టమైనది ఏదీ లేదు. బాబూజీ నన్ను ఈ రకంగా ముందుకు తీసుకొని వెళ్ళారు. ఈ విధంగా వెళ్ళితే త్వరగా చేరుకోగలమని నా అనుభవం వలన తెలిసింది. బాబూజీ అంటే బాబూజీయే! మనలను లక్ష్యం వద్దకు తీసుకొని వెళ్ళేది 'వారు' మాత్రమే. కాని మీరు చేయవలసినది ఏమిటి? మీరు ఎంత అతితక్కువ సమయంలో 'వారి' సామీప్యతను పొందగలరు అనేది మీ అహాన్ని ఎంత తక్కువ సమయంలో కరిగిపోవునట్లుగా చేసుకోగలరు అనే దాని మీద ఆధారపడి ఉంటుంది.

బాబూజీ మహరాజ్ యొక్క దివ్య ప్రేమ ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నది. మీరు 'వారి' ప్రేమలో ఎంతగా మునిగిపోవడానికి ప్రయత్నిస్తే, మీకు అంతగా 'వారి' ప్రేమ యొక్క అనుభూతి కలుగుతుంది. మీకు వారిపట్ల రోజు రోజుకు ప్రేమ పెరుగుతున్నట్లుగా అనిపిస్తుంది. కాని నిజానికి జరిగేది ఏమిటి? సమస్తంలో వ్యాపించి ఉన్న 'వారి' దివ్య ప్రేమతో మీరు కనెక్ట్ అయినకొద్దీ, మీలో ప్రేమ అధికం అయినట్లుగా మీకు అనిపిస్తుంది. వారి దివ్య ప్రేమకు మరింత దగ్గరగా వెళ్ళినకొద్దీ, బాబూజీ మీద మీకు ఎంతైతే ప్రేమ ఉంటుందో, అంత ప్రేమ మీకు అందరిమీద కలుగుతుంది.

అందువలన ఒక అభ్యాసీ అనుభవపూర్వకంగా ఈ విషయాలు అన్నీ చెప్పినట్లయితే, మీకు సులభంగా అర్థమవుతాయి. బాబూజీ ఈ అభ్యాసీ (కస్తూరీ)కి ఏమి నేర్పించారంటే, "ఈ విధంగా వెళ్ళు, ఇలా వెళ్ళితే దారి దగ్గరగా ఉంటుంది. త్వరగా అక్కడికి చేరుకోవచ్చు" అని. వీటన్నింటినీ అందరికొరకు వెల్లడిచేశారు.

**అభ్యాసీ: బెహెన్‌జీ! ఇతడు పూర్వజన్మ సంస్కారాలవలన త్వరగా అభ్యాసీ అయ్యాడని కొందరు అంటారు.**

**బెహెన్‌జీ:** పూర్వజన్మ సంస్కారాలవలన, అటువంటి వాతావరణం, పరిస్థితులు ఏర్పడతాయి. కాని సద్గురువు లేదా డివైన్ పర్సనాలిటీ (దివ్య పురుషుడు) కేవలం 'వారి' కృపవల్లనే మనకు లభిస్తారు. 'వారు' తమ కృపను మనకు ప్రసాదించినప్పుడే 'వారు' మనకు లభిస్తారు. బాబూజీ మనకు ఏదో సంస్కారం వలన లభించరు. ఎందుకంటే, 'వారు' సంస్కారాలకు అతీతులు. బాబూజీ ఎవరో ఒక్కరికోసం ఈ భూమి మీద అవతరించలేదు. 'వారు' సమస్త మానవాళి కొరకు అవతరించారు. అందువలన ప్రతి మానవునికి కూడా వారు ఎంతో ప్రియమైన వారు. ప్రతి మనిషి 'వారి'కి ప్రియమైనవాడే. ప్రతి మనిషి హృదయంలోను 'వారు' ఉన్నారు. అందువలన మనం కూడా ఎంత వీలైతే అంతగా 'వారి'ని ప్రేమించాలి. "నేను నా హృదయాన్ని కృష్ణునికి సమర్పించి, కృష్ణుని నా వానిగా చేసుకున్నాను" అని మీరాబాయి అంది. అదే విధంగా మీ హృదయాన్ని 'వారి' ప్రేమలో మునిగిపోయి ఉండేట్లుగా చేయండి. ప్రేమ అనే స్థానంలో మీ హృదయాన్ని ఉంచండి. ఏ రోజునైతే ఈ విధంగా జరుగుతుందో, ఆ రోజున బాబూజీ తప్పకుండా మీ వానిగా అవుతారు.

**అభ్యాసీ: బెహెన్‌జీ! లాలాజీ సాహెబ్‌కు కూడా ఒక గురువు ఉన్నారు కదా!**

**బెహెన్‌జీ:** గురువు అనే పదం ఉపయోగించబడింది. కాని అతడు లాలాజీ సాహెబ్‌కు ఎటువంటి ఆధ్యాత్మిక శిక్షణ కూడ ఇవ్వలేదు. అంతిమ శక్తితో ఒక డివైన్ పర్సనాలిటీని (దివ్య పురుషుని) అవతరింపజేయవలసిందిగా ప్రకృతి ఒక సూఫీ మహాత్ముని కోరింది. వారు ఆ పనిని తన ప్రియ శిష్యుడైన మౌల్వీ సాహెబ్‌కు అప్పగించారు. నేను ఆ పనిని చేయలేను, అని మౌల్వీ సాహెబ్ అన్నారు. మౌల్వి సాహెబ్ లాలాజీగారిని చూడగానే వారు

లాలాజీతో –"నీవు ఈ పని చేయగలవు. దీనికోసం నీవు ప్రయత్నం చేయి" అని అన్నారు. అందువలన మౌల్వీసాహెబ్ లాలాజీ యొక్క గురవు కాదు. ఎందుకంటే, వారు లాలాజీకి ఎటువంటి ఆధ్యాత్మిక శిక్షణ కూడా ఇవ్వలేదు. లాలాజీ సాహెబ్ 7 నెలలు తీవ్రమైన సాధన చేసి, తన ప్రార్థన అంతిమం (అల్టిమేట్)లో వైబ్రేషన్స్ (స్పందనలు) కలిగించే విధంగా చేశారు. అప్పుడు బాబూజీ మహరాజ్ అవతరించారు. ఈ విధంగా లాలాజీ తనకు అప్పగించిన పనిని కేవలం 7 నెలల్లోనే పూర్తి చేశారు. కాని మనం ఉదయాన్నే ప్రార్థన చేసి, సాయంత్రం కాగానే ఆ పని పూర్తికాలేదు అని ఫిర్యాదు చేస్తాం!

ఒకసారి బాబూజీ ఢిల్లీలోని వారి బంధువుల ఇంటికి గృహప్రవేశానికి వెళ్ళారు. అక్కడికి ఒక బాబా (సన్యాసి) వచ్చి పూజలెన్నో చేశాడు. ఆ ఇంటి యజమాని కోడలు ఆ బాబాకు పాదాభివందనం చేసింది. గృహప్రవేశం అంతా అయిపోయింది. అందరూ వెళ్ళిపోతున్నారు. బాబూజీ వెళ్ళిపోయే ముందు కూడా, ఆ ఇంటి యజమాని కోడలు వచ్చి బాబూజీకి పాదాభివందనం చేసింది. అప్పుడు బాబూజీ ఆ ఇంటి యజమానితో –"భాయీ! నాకు ఒక విషయం అర్థం కావటం లేదు. మొదట నీవు మీ కోడలిని బాబా (సన్యాసి) పాదాలను స్పర్శించమని చెప్పావు. అతడు గృహస్థుడు కాదు. అతనికి కొడుకులు లేరు, కోడలు లేదు. అతనిలో ప్రేమ అనేది లేనేలేదు. అతని పాదాలను స్పర్శిస్తే అతడు ఏమి చేయగలడు? నాలాగే నీవు కూడా కావాలి అని ఒకవేళ అతడు ఆశీర్వదిస్తే, అప్పుడు ఏమవుతుంది? నీ కోడలు ఒక సన్యాసిగా అవుతుంది. అదే గృహస్థుని యొక్క పాదాలను స్పర్శిస్తే –'సౌభాగ్యవతీ భవ!' అని అతడు ఆశీర్వాదం ఇస్తాడు. కాని సన్యాసి ఏమి ఇస్తాడు?" అని అన్నారు.

ఈశ్వరుడు త్రిగుణాతీతుడు అని చెప్పబడింది. మనం కూడా అటువంటి స్థితినే పొందినప్పుడు, మనం ఈ ప్రపంచంలో జీవించడానికి అవసరమైన పనులన్నీ కూడా, వాటంతట అవే మనకు వాటి ఎరుక లేకుండానే, ఆటోమాటిక్‌గా మన ద్వారా జరుగుతాయి. నేను ఈ స్థితిలో ఉన్నప్పుడు –"బాబూజీ! అభ్యాసులతో ఉన్నప్పుడు నేను సంపూర్ణంగా దివ్యత్వంతో, ఆ దివ్య శక్తితో పూర్తిగా ఉన్నట్లుగా అనిపిస్తుంది. కాని ఇంటికి వెళ్ళిన తర్వాత, ఇంటి పనులు, వంట పనులు చేస్తున్నప్పుడు నేను ఒక సామాన్య వ్యక్తిగా నాకు అనిపిస్తుంది. ఎవరైనా సిట్టింగ్ కొరకు రాగానే, మరల ఏదో ఆధ్యాత్మిక శక్తి నాలో మేల్కొని ఆ పని పూర్తి చేస్తుంది. ఎల్లవేళలా, నేను ఎందుకు ఆ దివ్య శక్తి సంపూర్ణంగా నాలో ఉన్నట్లుగా అనుభూతి పొందటం లేదు?" అని వ్రాశాను. అప్పుడు బాబూజీ, "బిటియా! ఇలా ఉండటం చాలా మంచిది. నీవు అనుక్షణం ఆ దివ్య శక్తిని సంపూర్ణంగా నీలో ఉన్నట్లుగా అనుభూతి చెందినట్లయితే, ఒకవేళ నీవు పొరపాటున ఎవరినైనా ఏమైనా అంటే, అది మంచి కాని, చెడుకాని –వెంటనే ఆ విధంగానే జరుగుతుంది. ఆ విధంగా జరుగకుండా ఉండటానికి నా లాలాజీ సాహెబ్ కృప నిన్ను కాపాడుతున్నది" అని జవాబు వ్రాశారు. బాబూజీ దీనిని లాలాజీ సాహెబ్ కృప, అని అన్నారు. కాని నేను అనుకోవడం ఏమిటంటే, ఇది ఈ సహజమార్గ్ సిస్టమ్ యొక్క (బ్యూటీ) రమణీయత. ఆ స్థితిలో ఉండి కూడా, ఈ ప్రపంచంలో జీవిస్తూ, పనులన్నీ సహజంగా, ఆటోమాటిక్‌గా జరిగిపోవడం, ఎవరూ ఇది తప్పు అని అనడానికి వీలు లేకుండా, ఆ పనులన్నీ యధావిధిగా జరిగిపోవడం అనేది ఈ సహజమార్గ్ సిస్టమ్ యొక్క సొగసు (బ్యూటీ) మాత్రమే.

**అభ్యాసీ: ధ్యానంలో కొంత సమయం తర్వాత, లోతుగా వెళ్ళినప్పుడు నాకు కాన్షస్‌నెస్ (ఎరుక) అనేది ఉండటం లేదు. ఇది సరియైనదా, కాదా?**

**బెహెన్‌జీ:** ధ్యానంలోనికి లోతుగా వెళ్ళడం అనేది కరెక్ట్. కాని అక్కడ కాన్షస్‌నెస్ (ఎరుక) అనేది ఉంటుంది. మీరు ధ్యానంలో లోతుగా వెళ్ళినప్పుడు, అక్కడ కలిగిన ఫీలింగ్ ఏమిటి అనేది గమనించాలి. దీనివలన రీడింగ్ కెపాసిటీ అనగా మీ కండిషన్ గురించి మీరు ఎక్కువగా తెలుసుకోగలుగుతారు. అప్పుడు ఇంకా పైకి వెళ్ళాలనే ఎరుక మీలో కలుగుతుంది. ధ్యానంలో లోతుగా వెళ్ళినప్పుడు, అక్కడ మీకు కాన్షస్‌నెస్ (ఎరుక) అనేది లేకపోతే, మీరు ప్రతిసారి ధ్యానంలో లోతుగా వెళ్ళి, అక్కడే ఆ ప్రదేశంలోనే మునిగిపోతారు. అక్కడి ఫీలింగ్ మీకు ఏమీ తెలయదు. అందువలన ధ్యానంలో లోతుగా వెళ్ళుతున్నప్పుడు, చాలా ఎలర్ట్ (అప్రమత్తత)గా ఉండి, కాన్షస్‌నెస్ (ఎరుక) ను కలిగి ఉండి, అక్కడి స్థితి ఏమిటి అనేదాన్ని అనుభూతి చెందాలి.

బాబూజీ మనకు మొదటి 3 సిట్టింగ్‌లు ఇచ్చినప్పుడు మనలోపలి డివైన్ కాన్షస్‌నెస్ మేల్కొల్పబడుతుంది. బాబూజీ నాకు చాలా ప్రియమైనవారు. ఈ ప్రపంచంలో నేను ప్రేమించవలసిన వ్యక్తి ఒక్క బాబూజీయే అని నేను మొదట అనుకునేదాన్ని. కాని ఒక్కొక్కసారి ఎప్పుడైనా ఒక అందమైన వస్తువును లేదా అందమైన పుష్పాన్ని చూడగానే, ఇది చాలా బాగుంది, చాలా చక్కగా ఉంది అనే ఆలోచన రాగానే, వెంటనే నాలో ఒక ఎలర్ట్‌నెస్ (శ్రద్ధ) మేల్కొని, కేవలం బాబూజీయే సౌందర్యరాశి. కేవలం బాబూజీయే ప్రియాతి ప్రియమైవవారు. నేను ప్రేమించవలసినది కేవలం బాబూజీని మాత్రమే-అని ఆ దైవీయ చైతన్యం (డివైన్ కాన్షస్‌నెస్) నన్ను ప్రతిసారీ హెచ్చరించేది.

ంOOOం

## శ్రీరామచంద్ర మిషన్, షాజహాన్‌పూర్, (ఉ.ప్ర)

### అభ్యాసీలకు, ప్రిసెప్టర్లకు ముఖ్యమైన సూచనలు:

**సాధనకు సంబంధించినవి :**

1. ఎవరైనా ఉన్నతోన్నతమైన దానినే ఆపేక్షించాలి. శాంతి, మరేవీ ముఖ్యమైనవి కావు. ఏ అభ్యాసీ ఉన్నతోన్నతమైన దానిని (ఆధ్యాత్మిక స్థితి) కోరుకుంటాడో, ఆ అభ్యాసీయే శ్రీరామచంద్ర మిషన్ యొక్క నిజమైన సభ్యుడు.
2. క్రమం తప్పకుండా అభ్యాసం చేయాలి. ధ్యానంపై ఆసక్తిని పెంపొందించుకొంటే సగం పని పూర్తయినట్లే.
3. పూజ అయిన తర్వాత ప్రతివారు, వారి స్థితిని గురించి ఆలోచించాలి. ఇది సున్నితత్వాన్ని (Sensitivity) అభివృద్ధి చేయటంలో సహకరిస్తుంది.
4. ధ్యాన సమయంలోగాని, ఇతర సమయాలలోగాని వచ్చే ఆలోచనలను గురించి చింతించరాదు. అవి నశించటానికే వస్తున్నాయి. ఆలోచనా రహితంగా ఉండటం అసాధ్యం.

5. సాధారణంగా జరుగుతున్నది ఏమిటంటే, నేను (బాబూజీ) ప్రక్షాళన చేస్తూనే ఉన్నాను. కాని వారు వారి స్థితిని కలుషితం చేసుకుంటూనే ఉన్నారు. అయితే వారు అభివృద్ధి చెందటం ఎలా? వారు నాతో సహకరిస్తే ఎంతో ప్రయోజనం పొందుతారు.
6. సాక్షాత్కారానికై తపనను వృద్ధి చేసుకోవాలి.
7. వివేకంతో మాస్టర్‌ను (బాబూజీని) అనుసరించాలి.
8. కోపం దైవంచేత ప్రసాదించబడినది కనుక, దానిని సమూలంగా తొలగించటం సాధ్యం కాదు. కనుక కోపాన్ని సక్రమమైన రీతిలో ఉపయోగించుకోవాలి. కాని అత్యాశ మన సృష్టియే. దానిని పూర్తిగా నిర్మూలించాలి. ఆధ్యాత్మికతలో కూడా అత్యాశ పనికిరాదు. కొందరు అభ్యాసీలలో, ప్రిసెప్టర్ల నుండి సిట్టింగ్స్ తీసుకోవడంలో ఈ అత్యాశను కలిగి ఉండటాన్ని గమనించవచ్చు.
9. మార్పును రెండు విధాలుగా తీసుకొని రావచ్చు. ఒకటి ఆ మార్పు కొరకు గల కోరిక వలన. రెండవది బలవంతంగాను. కాని రెండవ దానిలో శాశ్వతమైన ప్రభావం కనిపించదు. కనుక ప్రతి అభ్యాసీ మార్పు కొరకు తీవ్రమైన అపేక్షను పెంపొందించుకోవాలి.
10. ప్రతి ఒక్కరు తమ స్వేచ్ఛాపూరితమైన కార్యక్రమాలను అరికట్టుకోవాలి.
11. అభ్యాసీ తన దైనందిన జీవితంలో చిన్న చిన్న విషయాలను అదుపులో ఉంచుకోవాలి. అలా కాకపోతే పెద్ద విషయాలపై ఆధిపత్యం ఎలా పొందగలరు?
12. పవిత్ర జీవితాన్నే అభిలషించాలి. అన్ని విషయాలలో మితత్వం ఉండాలి. పవిత్రత, సరళత్వం అనేవి మనిషి గుణాన్ని తెలుపుతుంది.
13. ప్రతి ఒక్కరు మంచి, చెడులను వివేకంతో గ్రహించాలి. ఈ వివేకం లేనివాడు అల్పుడు.
14. అభ్యాసీ, ప్రిసెప్టర్ కావాలనే భావం పెంపొందించుకోరాదు. మిషన్‌కు సేవ చేయాలన్న తలంపు ఉంటే, అనేక విధాలుగా తమ సేవలను అందించవచ్చు.
15. సంపూర్ణ సమతా స్థితి పొందటం అసాధ్యం. ఎందుకంటే, సంపూర్ణ సమతాస్థితి పొందితే మరణం సంభవిస్తుంది. అయితే వారు ఆ స్థితికి దరిదాపుల వరకు చేరవచ్చు. అప్పుడు వారు దాదాపు సమతా స్థితిని పొందినట్టే.
16. ఏదో ఒక దానిపై ఇష్టపడటం అనగా అహంకారమే. కనుక ఇష్టాయిష్టాలకు అతీతంగా ఎదగాలి.

**<u>నైతిక శిక్షణకు సంబంధించినవి:</u>**

1. ఎవరైనా వక్రత ఏర్పడకుండా చూసుకోవాలి.
2. ప్రతి అభ్యాసీ నైతికత్వం, క్రమశిక్షణ అభివృద్ధి పరచుకోవాలి.
3. బద్ధకాన్ని (సోమరితనాన్ని) వదలిపెట్టాలి. పూర్వకాలంలో గొప్ప సామ్రాజ్యాలే ఈ సోమరితనం వలన పతనమయ్యాయి.

4. అభ్యాసీ సోదర సోదరీల మధ్య ఎడం పాటించాలి. అభ్యాసీ సోదరులు ఇతర అభ్యాసీ సోదరులతో ఉన్నంత చనువుగా అభ్యాసీ సోదరీలతో ఉండరాదు.

5. మద్యపానం చేయరాదు. మత్తులో ఉన్నప్పుడు దాని ప్రభావం శరీరంపైపడి మెదడులో చీకటి ఏర్పడుతుంది. ఆధ్యాత్మికత నశిస్తుంది.

6. అభ్యాసీ అన్ని విషయాలలో పొదుపు పాటించాలి. 5 రూపాయలు ఖర్చు చేసినా, 5,000 ఖర్చు చేసినా భేదం స్వల్పం. అనవసరంగా ఖర్చు చేయరాదు.

7. నిరాడంబరత ప్రకృతికి ప్రాణం. ప్రతి ఒక్కరు దానిని అనుసరించాలి. ఈ మిషన్‌లో ఉన్న ఆకర్షణ ఏమిటంటే, ఏ ఆకర్షణ లేకపోవటమే. ఇదే ఈ సంస్థ విలక్షణత. ఇది పవిత్రం, నిరాడంబరం.

8. అభ్యాసీ అసంబద్ధమైన (తప్పుడు) ప్రచారంలో నిమగ్నం కారాదు.

9. అణకువ, నమ్రతలలోనే గొప్పదనం ఇమిడి ఉన్నది. ప్రతి అభ్యాసీ ఈ లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలి.

10. ఉత్సవ సమయాలలో అభ్యాసీలు, వారి బంధువులను కాని, స్నేహితులను కాని (అభ్యాసీలు కానివారిని) తీసుకు రాకూడదు.

– **రామచంద్ర** (అధ్యక్షులు)

# బాబూజీ ముత్యాల సరాలు

నిర్మలమైన తలంపే ప్రార్థన. భక్తికి అదే చిహ్నం. అనంతత్వానికి చేర్చడానికి ఆ అనంతునికి చేసేదే ప్రార్థన.

భగవంతుడు తన దగ్గర ఏదైతే ఉన్నదో అది ఒక్కటే మనకు ఇస్తూ ఉంటే, మనమేమో మన కృషితో ఎన్నో సృష్టించుకొని ప్రోగుచేసుకుంటున్నాం, మన లోపలికి. మన హృదయం ఎప్పుడూ భగవంతునికి సంబంధించిన ఆలోచనలతో నిండి ఉంటే, అనవసరమైన విషయాలు మనలో ప్రవేశించడానికి అవకాశమే ఉండదు. పైగా అనాయాసంగా సమర్పణకు, శరణాగతికి దారితీస్తుంది కూడా.

మన ఆధ్యాత్మిక యాత్ర పూర్తి అజ్ఞానం నుండి ప్రారంభమై సంపూర్ణ అజ్ఞానంతో పూర్తవుతుంది. ప్రతిదీ దైవానుగ్రహం మీదే ఆధారపడి ఉంటుంది. నిజమే! కాని, దానికోసం మనలో చోటు తయారుచేయటమే మన పని. మన అభ్యాసం, సాధన –సాధించేది ఇదే. ఇవి చేయడంలో ప్రతిక్షణం అప్రమత్తంగా, మెలకువగా ఉండాలి.

వృద్ధాప్యపు ప్రభావం అసలు ఆధ్యాత్మికతపై ఉండదు. మన జీవితంలోని ప్రతిదశలోనూ కూడా మనిషి ఆధ్యాత్మికంగా యవ్వనంలోనే ఉంటాడు. కనుక ఆధ్యాత్మిక రంగంలో ఆలస్యం అనేది ఎప్పుడూ ఉండదు.


సాధనలో క్రమం తప్పకూడదు. ధ్యానంమీద ఆసక్తి పెంచుకుంటే, సగం పని పూర్తయినట్లే.

వసంతంలోను, ఉద్యానవనంలోను, విహారం అందరికీ ఇష్టంగానే ఉంటుంది, నచ్చుతాయి. కాని ప్రేమికులకు తమ ప్రియతముని ఉనికిని (నివాసం) గురించిన వార్తయే సంతృప్తికరంగా ఉంటుంది.

అవతార పురుషునికి 'మనస్సు' ఉంటుంది. కాని దానికి సంస్కారాలు అంటవు. మనస్సు ఉండటమే గొప్ప విషయం. ఎందుకంటే, 'వారు' ఒక ప్రత్యేకమైన పనికోసం ప్రపంచానికి అరుదెంచారు. వారు "ఫనాయిత్" (పరిపూర్ణత) స్థితి నుండి దిగి వచ్చారు. చివరికి అందులోనే లయమైపోతారు. 'ఫనాయియత్' ఉన్నప్పుడు సంస్కారాలు అంటవు. ఎందుకంటే, 'వారు' ఇక్కడ పని చేస్తున్నప్పటికీ, ఎక్కడి నుండి దిగి వచ్చారో ఆ స్థితిలో లయమయ్యే ఉంటారు.

నాకు సంతోషం కలిగించిగాని లేదా నన్ను దొంగిలించిగాని నా నుండి పొందే గొప్ప అర్హత అభ్యాసీకి మాత్రమే ఉంది. ఎందుకంటే, ఈశ్వర ప్రసాదాన్ని అర్థించి ఆరగించినందువలనగాని, అపహరించి ఆస్వాదించినందువలనగాని లాభించే అవకాశం అతనికే దక్కుతుంది.

oOOOo


"SHAHJAHANPUR" is the birth place of "SAHAJ MARG"